Telugu Classic Popular Edition Series

శ్రీమత్

ఆంధ్రమహాభారతము

ఉద్యోగ పర్వము

(మిక్కిన ప్రతీతము)

పరిష్కర్త:

శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి

294.5923
THI

సాహిత్య అకాడమి

కాచిగూడ - హైదరాబాదు - 4

(1)

శ్రీమత్

ఆంధ్రమహాభారతము

ఉద్యోగ పర్వము

(తిక్కన ప్రణీతము)

పరిష్కర్త:
శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10168

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10,168

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - హైదరాబాదు - 4

[redacted] ముద్రణ
సాధారణ 1971
ప్రతులు 5000

294.5923
THI

వెల. రూ. 2-50

ముద్రణ :
ఐ. వి. ఆర్. పాల్ రెడ్డి అండ్ కం.
సికింద్రాబాదు

7

AOUA102B154

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు శ్రీ యం. ఆర్. అప్పారావు గారు చేసిన సూచన ననుసరించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి తెలుగు భాషలోని ప్రాచీన సాహిత్యము అందరికి అందుబాటులో నుండునట్లుగా ముద్రించి ప్రకటింపవలె నని నిశ్చయించినది. తెలుగుభాషలోని పూర్వ గ్రంథసముదాయము యీనాడు పాఠకునకు సక్రమముగా సరసమైన ధరకు లభ్యమగుటలేదు. ఈ లోటును తీర్చి ప్రాచీన గ్రంథ సంచయమును విడి విడిగా ప్రకటించుటకు సాహిత్య అకాడమి ఒక ప్రణాళికను సిద్ధము చేసి నది. ఈ ప్రణాళిక ప్రకారము యీ కార్యక్రమము మూడు తరగతులుగా విభజించనై నది. మొదటిది ప్రాచీన ప్రబంధాల ప్రకటన; రెండవది మహా భారతము ప్రచురణ; మూడవది హరివంశము, భాస్కరరామాయణము, బసవపురాణము, భోజరాజీయములను సంగ్రహించి ప్రకటించుట; పై ప్రణాళిక ప్రకారము ప్రచురింపబడు ప్రతిగ్రంథములో గ్రంథకర్తను గూర్చి, గ్రంథప్రాశస్త్యమునుగూర్చి వివరించు సుమారు 40 పేజీల పీఠికను చేర్చవలె నని నిశ్చయించనై నది.

ఈ కార్యక్రమములో ప్రాచీన ప్రబంధాల ప్రకటనము పూర్తి యైనది. సంక్షిప్త గ్రంథ ప్రచురణ కార్యక్రమములో బసవపురాణ, భాస్కరరామాయణ, హరివంశ, భోజరాజీయములు ప్రచురింపబడినవి. ప్రస్తుతము ఆంధ్రమహాభారత ప్రకటనము చేపట్టనై నది. ప్రసిద్ధులైన విద్వాంసులచే మహాభారత సంపుటముల పరిష్కారము నిర్వహింపబడు చున్నది.

ఆంధ్రమహాభారత సంపుటములలో అయిదవదైన ఉద్యోగపర్వమును పరిష్కరించి, పీఠిక వెలయించి మాకందజేసిన శ్రీ గడియారం వేంకటశేష శాస్త్రిగారికి అకాడమి పక్షాన కృతజ్ఞతలు.

పై న పేర్కొనబడిన గ్రంథసంపుటాల ప్రాతప్రతులను సిద్ధముచేసి ముద్రించుటకు అవసరమైన డబ్బును పూర్తిగా అకాడమికి యిచ్చుటకు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, వాగ్దానము గావించి అందులో చాలమట్టుకు డబ్బును విడుదలకూడ చేసినవి. అందుకు అకాడమి పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు. సాధ్యమైనంత త్వరలో మహా భారత సంపుటముల నన్నింటిని సిద్ధము చేసి, ఆంధ్రపాఠకలోకానికి అందజేయుట జరుగగలదని విశ్వసించుచున్నాను.

హైదరాబాదు,
26-2-1971.

దేవులపల్లి రామానుజరావు
కార్యదర్శి.

వి ష య సూ చి క

ఉద్యోగపర్వము - ప్రథమాశ్వాసము

సంఖ్య.		పుట.
1.	పాండవులు కృష్ణాదులం గూడి భావికార్యవిధానము నాలో చించుట	1
2.	సాత్యకి దుర్యోధనుకడకు దూతం బంపఁగూడదని చెప్పుట	6
3.	ద్రుపదుఁడు దనపురోహితుని దుర్యోధనుకడకు దూతగాఁ బంపుట	11
4.	దుర్యోధనుండును నర్జునుండును శ్రీకృష్ణుని దర్శింపఁబోవుట	12
5.	అర్జునుఁడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిఁగాఁ గోరికొనుట	14
6.	దుర్యోధనుండు శల్యసహాయంబు గోరుట	17
7.	శల్యుఁడు పాండవులం జూడ నుపప్లావ్యంబునకు వచ్చుట	19
8.	ఇంద్రుఁడు వృత్రాసురునితో యుద్ధంబు సేయుట	22
9.	దేవతలు నహుషుని సురరాజ్యాభిషిక్తునిం జేయుట	26
10.	ఇంద్రుఁడు నహుషు తేజోవిశేషంబు సూచి మఱుఁగుపడుట	29
11.	అగ్నిదేవుఁ డింద్రుని వెదకి బృహస్పతికిం దెలుపుట	32
12.	అగస్త్యుఁడింద్రునకు నహుషు భ్రష్టత దెలుపుట	35
13.	సాత్యకాదులు సేనాసమేతంబుగఁ బాండవులం జేరవచ్చుట	38
14.	ద్రుపదపురోహితుని రాయబారము	40
15.	ధృతరాష్ట్రుఁడు సంజయునిఁ బాండవులయొద్దకుఁ బంపుట	44
16.	సంజయుఁడుపప్లావ్యంబున నున్న పాండవుల యొద్దకు వచ్చుట	46

ద్వి తీ యా శ్వా స ము

17.	సంజయుండు ధర్మజుని సంధిపల్కులను ధృతరాష్ట్రునకుఁ దెల్పుట	67
18.	ధృతరాష్ట్రునకు విదురుఁడు హిత ముపదేశించుట	71
19.	సనత్సుజాతుఁడు ధృతరాష్ట్రునకు నధ్యాత్మతత్త్వంబుఁ జెప్పుట	83

సంఖ్య.		పుట.
20.	ప్రాతఃకాల వర్ణనము	84
21.	సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ బాండవుల తెఱంగు సెప్పుట	87
22.	సంజయుండు ధృతరాష్ట్రునకుఁ గృష్ణుండు సెప్పినమాట లెఱింగించుట	89
23.	సంజయుఁడు ధృతరాష్ట్రునకు అర్జునుఁడు చెప్పిన మాట లెఱింగించుట	90
24.	భీష్ముఁడు కర్ణుని దుర్ణయంబు ధృతరాష్ట్రునితో జెప్పుట	93
25.	ధృతరాష్ట్రుఁడు భీమసేనాదుల పరాక్రమంబు దలంచి దుఃఖించుట	100
26.	దుర్యోధనుఁడు దండ్రితో స్వపక్షవీరుల సామర్థ్యంబు సెప్పుట	104
27.	సంజయుఁడు దుర్యోధనునకు ధర్మరాజు నిశ్చయం బెఱిం గించుట	107
28.	ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునితో సంధిసేయు మని సెప్పుట	111
29.	దుర్యోధనుఁడు తండ్రితోఁ దన బలపరాక్రమంబు సెప్పుట	114
30.	కర్ణుఁడు భీష్మునిపై రోషముచేత నస్త్రసన్యాసంబు సేయుట	118
31.	కృష్ణద్వైపాయనుఁడు ధృతరాష్ట్రుని యొద్దకు వచ్చుట	121

తృతీయాశ్వాసము

32.	శ్రీకృష్ణుని రాయబారము	128
33.	శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్ణయంబు సెప్పుట	133
34.	శ్రీకృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోటి యుద్ధమునకుఁ బురికొల్పుట	137
35.	అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దన యభిప్రాయంబు సెప్పుట	139
36	ద్రౌపది కృష్ణునితోఁ దన మున్నుపడిన భంగపాట్లు సెప్పుట	144
37.	శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట	147
38.	శ్రీకృష్ణుఁడు నారదాది మహామునులం గని సంభాషించుట	151
39.	ధృతరాష్ట్రుండు విదురుతో శ్రీకృష్ణురాక సెప్పి సంతో షించుట	154

సంఖ్య.		పుట.
40.	శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట	158
41.	శ్రీకృష్ణుఁడు గుంతీదేవి నూఱడించుట	163
42.	శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట	165
43.	శ్రీకృష్ణుఁడు విదురుతో సంభాషించుట	170
44.	శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట	174
45.	శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పినమాటలు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట	176
46.	కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతుని వృత్తాంతము సెప్పుట	179
47.	దుర్యోధనుఁడు నారదాదిమునుల మాటల నిరాకరించుట	185
48.	భీష్మద్రోణులు దుర్యోధనునకు హితంబు సెప్పుట	188
49.	శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు సేసిన దుర్ణయంబు సెప్పుట	192
50.	దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱం బెట్టఁ దలంచుట	196

చతుర్థాశ్వాసము

51.	కృష్ణుండు గుంతియింటికిఁ జని యాయమతో మాటలాడుట	201
52.	శ్రీకృష్ణుఁడు కర్ణుని తనరథం బెక్కించుకొని కొన్ని రహస్యోక్తులు పలుకుట	204
53.	కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన యుత్తరంబు లిచ్చుట	206
54.	కుంతీదేవి కర్ణునకు నతండు దనపుత్త్రుం డగుట దెలుపుట	211
55.	శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ గౌరవసభం బుట్టిన విశేషము దెలుపుట	214
56.	ధృష్టద్యుమ్నాదులకు సేనానాయకత్వంబు నిర్ణయించుట	218
57.	పాండవులు గౌరవులతోడి యుద్ధంబునకు వెడలుట	222
58.	దుర్యోధనుఁడు ద్రోణప్రభృతుల సేనాపతులం జేయుట	226
59.	బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్ర వోవుట	230
60.	రుక్మి వృత్తాంతము	232

సంఖ్య.		పుట.
61.	సంజయుఁడు ధృతరాష్ట్రుని కులూకుఁడు పాండవుల నాడిన మాటలు సెప్పుట	234
62.	భీష్ముఁడు గౌరవసేనలో నతిరథమహారథాదుల నిరూపణంబు సేయుట	239
63.	భీష్ముండు గర్ణుని నర్ధరథుం డని చెప్పుట	242
64.	భీష్ముండు పాండవవీరులం దతిరథమహారథాదుల నిరూపించి చెప్పుట	245
65.	భీష్ముఁడు దుర్యోధనున కంబోపాఖ్యానము సెప్పుట	250
66.	పరశురాముఁ డబం దోడుకొని భీష్ముని యొద్దకు వచ్చుట	254
67.	భీష్ముఁడు పరశురామునితో యుద్ధంబు సేయుట	257
68.	భీష్మునకు వసువులు స్వప్నసాక్షాత్కారంబున మోహనాస్త్రం బిచ్చుట	261
69.	నారదుఁడు భీష్మున కంబ వృత్తాంతం బంతయుఁ జెప్పుట	265
70.	శిఖండి యక్షునివలనఁ బురుషత్వంబు పొందిన వృత్తాంతము	269
71.	స్థూలకర్ణునకుఁ గుబేరునివలన స్త్రీత్వము గలుగుట	271

శ్రీ

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉ ద్యో గ ప ర్వ ము

పీ ఠి క

శ్రీ మద్భారతము – "ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గల్గి, యష్టాదశపర్వనిర్వహణసంభృత మై" నెనుపొందినది. అందు– "ఆది దొడంగి మూఁడుకృతు లంధ్రకవిత్వ విశారదుండు, విద్యాదయితుండు, మహితా త్ముఁడు నన్నయభట్ట" తెలుంగు చేసెను. "హృదయాహ్లాది, చతుర్థ, మూర్జిత కథోపేతంబు, నానారసా । భ్యుదయోల్లాసి, విరాటపర్వ – మట యుద్యోగాదులుం గూడగాఁ । బదియేనింటిని" తిక్కన సోమయాజిగారు తెనిఁగించిరి. తత్కృతమగు పదియేనింటిలో మొదటిది విరాటపర్వము. రెండవది యుద్యోగపర్వము. విరాటపర్వ మిట్టి దని తిక్కన సోమయాజి గారు వివరించిరి. ఉద్యోగపర్వ మిట్టి దని మన మిప్పుడు తెలిసికొందుము.

విరాట పర్వమునుగూర్చి "హృదయాహ్లాది, ఊర్జితకథోపేతంబు, వానారసా । భ్యుదయోల్లాసి" ఇత్యాదిగాఁ జెప్పిన తిక్కనగా రుద్యోగ పర్వమును గూర్చి యొక్కమాటైనఁ జెప్పలేదు. 'పదియేనింటి' నన్నపుడు ఆ విశేషణము లన్నియు నన్నిపర్వముల కన్వయింపఁజేసెనా యన్న నట్లు గాదు. 'విరాటపర్వ' మని ఆ యొక్కదానికే యన్వయింపఁజేసెను. అందలి యేకవచన ప్రయోగముగూడ నా భావమునే బలపఱచుచున్నది. కావునఁ 'చతుర్థ' మనునదికూడఁ బై విశేషణములతోఁబాటు విరాటపర్వమునకే యన్వయించును. ఉద్యోగపర్వము భారత పర్వములలో నైదవదియు, తాను రచించువానిలో రెండవదియు నగుట స్పష్టము. ఎటుచూచినను ఉద్యోగపర్వమునుగూర్చి యేమియుఁ జెప్పలే దనుట ఫలితాంశము. ఒకవేళ నిట్లూహించిన సరిపోవునేమో! 'భారతపర్వములలో నైదవదియు, స్వర చిత పర్వములలో రెండవదియు' నగుటచే రెండు నిశ్చలయుక్తిఁ జేర్చి, ఏని

టిని గెల్చి" రచించెనని. ఆ మాట చమత్కారజనకముగా నుండవచ్చును గాని యథార్థము గాదు. ఉద్యోగ పర్వమునుగూర్చి తిక్కనగా రెచ్చటను బేర్కొనలేదు. దానినిగూర్చియే మన మిప్పుడు తెలిసికొందము.

[తిక్కనగారి వంశాదికమునుగూర్చి గూడ నింతయే. విరాట పర్వ మునఁ జెప్పినదానికంటె నెక్కువగా నేమియు లేదు అచ్చటఁగూడ సూచనామాత్రముగనే చెప్పెను. నిర్వచనోత్తర రామాయణమునగూడ నంతయే "గుంటూరు విభుడుఁను, గౌతమగోత్రుండును, అన్నమాంబా కొమ్మనామాత్యుల పుత్రుండును, అగు తిక్కశర్మగా రీ కృతికర్త. యజ్ఞము చేసి సోమయాజి యగుట క్రమవిధిప్రాప్తము! 'కవిబ్రహ్మ" ఉభయ కవిమిత్రుఁ' డగుట యాతని ప్రతిభావిలసితము. "అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునన్ బారగుఁడన్, గథావిదుఁడ" నని చెప్పికొన్నది యాయన యీవనోద్భాసితము. మఱియు, నిర్వచనోత్తర రామాయణము నాఁటిదే గాని భారతమునాఁటిది గాదు. భారతము వాని యన్నిటికంటె నుదాత్తమైనది. కవితాపరిపాకములోఁ గావ్యశిల్పములో ననన్యసామాన్య మైనది. అందును, ఈ యుద్యోగపర్వరచన "పరితో లౌకిక వైదికోన్మథన సంభావానుభావ్య"మైనది. నుక, తెలిసిన వంశాదికముతోఁ దృప్తిపడి, తెలియవలసిన రచనా విధానమున కుపక్రమింతము.]

ఉద్యోగపర్వము సంస్కృత భారతమున నున్నది. తత్కర్త శ్రీ వేద వ్యాసమహర్షి. ఆతఁడు మహామనీషి. సంస్కృతమున నాతఁడు వ్రాసి పెట్టి నన్ని గ్రంథములు మఱెవ్వరును వ్రాయలే దని ప్రతీతి. అష్టాదశ పురాణము లుపపురాణాదికములతో నాతని రచన దిగంతవిశ్రాంతమైనది. "యది హాస్తి - తతదన్యత, యన్నేహాస్తి న తత్క్వచిత్" అని భారతమునుగూర్చి యాభాణకమును వినఁబడును. సంస్కృతభారతమున నుద్యోగపర్వమున కనువాదమే యీ యుద్యోగపర్వము. ఈ పర్వమునఁ గథాప్రస్తక్తి చాలఁ గొంచెముగా గోచరించును. అభిమన్యువివాహానంతరము శ్రీకృష్ణుఁ డాదిగా బంధువు లందఱు కలిసి మాటలాడి, ద్రుపదపురోహితుని హస్తినాపురమున కంపుటయు, దానికిఁ బ్రతిగా ధృతరాష్ట్రుఁడు సంజయుని పాండవులకడ కంపుటయుఁ, దర్వాత శ్రీకృష్ణునిరాయబారము, తర్వాత యుద్ధసన్నాహము - ఇత్యాదిగా సమరోద్యోగసన్నాహమే యిందుఁ జెప్పఁబడినది.

ఇది తెలుఁగున దాదాపుగాఁ బదునైదునూర్ల యఱువది పద్యములు. తిక్కనగారి దృష్టితో - మూలాధారము లేని స్వతంత్రరచన యైనచో - ఈ నిడివి గూడ చాలఁ బొడవైనట్లు తోచును. కాని మూలము పరికించితిమేని తెలుఁగులోఁ గలము నెంతగా బిగఁబట్టి కుదించి నడిపెనో వ్యక్తమగును.

సంస్కృత భారతమున గ్రంథభాగములు పాఠభేదములు మిక్కిలిగా నుండును. అయినను, ఈ యుద్యోగపర్వము రమారమి యాఱువేల యాఱు నూర్ల యరువది శ్లోకములు కలదిగా సంస్కృతమున గనుపట్టును. దీనిని దెలుఁగు చేయుటలోఁ బదునైదునూర్ల యఱువది పద్యములకు దిగినది. అనఁగా మూడువంతులు త్రోసివేసి, నాలుగున కొకటిగా సంతరించునట్లు కనబడును. ఐనను, కథాగమనము కుంటువడకుండ నడచుట యిందలి విశేషము. మూలమున నూట తొంబదియేడు సర్గలతో మహాహారమువలె నున్న యుద్యోగపర్వమును విభాగించి. మొదటినుండి సంజయు రాయబారము ముగియువరకుఁ బ్రథమాశ్వాసము, సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ దన రాయబారమును గూర్చి చెప్పుటయు, ధృతరాష్ట్రుఁడు విదురాదులతో ముచ్చటించుటయు - ద్వితీయాశ్వాసము, కృష్ణుని రాయబారము తృతీయాశ్వాసము,కృష్ణుఁడు రాయబారము ముగించుకొని వచ్చి ధర్మరాజాదులతోఁ జెప్పి యుద్ధసన్నాహములు చేయుట, చతుర్థాశ్వాసము - ఇత్యాదిగా సమకూర్పఁబడినది.

వరుసగా ముప్పది సర్గలతోఁ దొమ్మిదినూర్ల ముప్పై శ్లోకములకుఁ - ప్రథమాశ్వాసము - మూడునూర్ల యెనుబదిరెండు పద్యములుగను - తరువాత నలుబది సర్గలతో - పదునైదునూర్ల తొంబది శ్లోకములకు - ద్వితీయాశ్వాసము - మూడువందల ముప్పైనాల్గు పద్యములుగ, తరువాత నఱువది సర్గలతో - పదునెనిమిదినూర్ల డెబ్బది శ్లోకములకు, తృతీయాశ్వాసము - నాల్గునూర్ల పదునైదు పద్యములుగను, తరువాత అరువదియేడు సర్గలతో రెండువేల రెండునూర్ల డెబ్బది శ్లోకములకు, చతుర్థాశ్వాసము - నాలుగు వందల యిరవై యెనిమిది పద్యములుగను సంతరింపఁ బడినవి.

విరాటపర్వమున డెబ్బదిరెండుసర్గలకు - పదునారునూర్ల యిరువది యారు పద్యములు చెప్పిన తిక్కనగారు - సంస్కృతమున నూటతొంబది

యేడు సర్గలకు - పదునై దువందల యరువది పద్యములు చెప్పి ముగించుట మిక్కిలి యబ్బురము. అనువాదము చేయుటలో ననుభవము పెరుగుట దీనికిఁ గారణము గావచ్చును. అప్రస్తుతములై న యంశములు దీనిలోఁ బెక్కు లుండుటయుఁ గావచ్చును. ఏమైనను, గథాంశములను విశదముగాఁ బ్రస్ఫు టముగా ననపేక్షితవి స్తరముగాఁ జెప్పుట యిందుఁ గొనియాడఁదగినది.

అనువాదప్రారంభమున, మూలమున 'విశ్రమ్య రాత్రా వుషసి ప్రతీతా స్సభాం విరాటస్య తతోఽభిజగ్ముః' అన్నదానికి, "మనుజపతి యన్వయంబు పావనముజేసి దినచతుష్టయానంతరమునఁ బ్రియమున"అని తెలుఁగు జేసెను. తెలుఁగువారి యింటిపెండ్లి నాలుగు దినములు జరుగుట నాఁటియాచారము గదా!'సభాతు సా మత్స్య పతే స్సమృద్ధా...గ్రహై రివద్యౌర్విమలై రుపేతా' అని యాఱేడు శ్లోకములతో నున్నదానిని, - "ధర్మతనయుండు తమ్ములుం బరివేష్టించియుండ, విశాలరమణీయం బగు కొలువుకూటంబున కరిగి" యని యొకవచనముతో దాటించెను. మూలమున "పిత్రాసమం రామజనార్ద నౌ చ, ఉపావిశత్ప్రౌవదేయాః కుమారాః" ఇత్యాదిగా నున్నదానిని వదలి "విరటుఁడును బాంచాలుండును హరియును రాముండు, వారియను జతనూజుల్, పరిణయసమాగతాఖిలధరణీశులు" నని వారినందరి నొక కందమున గట్టివేసెను. అవసరౌచిత్యములఁ బాడించుటలోఁ దిక్కనగారి జాగరూకత యట్టిది.

బలరాముని మాటలను సాత్యకి తిరస్కరించు ఘట్టమున-"యమౌ చ దృఢధన్వానౌ యమకాలోపమద్యుతీ....గదప్రద్యుమ్నసాంబాం శ్చ కాంశ్చ వజ్రానలోపమాఁ" అని అయిదాఱుశ్లోకములతో నిందుగా నున్నదానిని- కవలవారు, కొడుకుగమియుఁ బాంచాలవర్గంబు వృష్ణివరులు కడఁగిరేని" యని నాదునిర్దేశము సాంకేతికముగాఁ జేసి విడిచెను. మూలముననొకసర్గకుఁ బైగా నున్న ద్రుపదుని సన్నాహమంతయు "ద్రుపదవిభుఁడు నాయితం బయ్యె"నని మూడునాల్గు పద్యములతోడను, అట్లే, "పురోధా వృత్తసం పన్నఃఁ.... కారవాన్ ప్రతిజగ్మివాన్"అని యించుమించు సర్గతోఁగూడిన యంశము నేడెనిమిది పద్యములతోడను జెప్పి ముగించెను. శల్యుఁడు ధర్మ రాజుతో ముచ్చటించు సందర్భమున నెన్మిదవ యధ్యాయమునుండి పదు

నేడవ యధ్యాయమువరకు విస్తృతమైన యంశమును మూడువందలయేఁ బదికిఁ బైగా నున్నదానిని తొంబది పద్యములతో ముగించెను. ఈ పద్యములలో 'అప్పుడు' 'అయ్యవసరమున' ఇత్యాదిగాఁ బదివచనములు నక్షత్రముల వలె వెలుఁగొందుట మఱువరానిది. గ్రంథభారము తగ్గించుటలో నిదియొక తీరు.

ఉభయపక్షసేనాసన్నాహము మూలమున ముప్పదిరెండు శ్లోకములు-అనువాదమునఁ బదిపద్యములు. కాని, "సకలారాతిభయంకరుం డగుచు" ఇత్యాదిగా తెలుఁగులోనున్న సాత్యకిప్రవేశము సంస్కృతమున లేదు. కౌరవసభలో భీష్ముఁడు కర్ణు నుద్దేశించి 'నచే దేవం కరిష్యామో యదయం బ్రాహ్మణోఽబ్రవీత్।ధ్రువం యుధి హతా స్తేన భక్షయిష్యామ పాంసుకా'-అన్నమాట లనువాదమునఁ గన్పట్టవు. "అర్జునుం డొక్కఁడె యార్వుర మనలనుగ్రరణంబున గెల్చె మొన్న' అని యథాశ్రుతముగా దర్శన మిచ్చినది. ధృతరాష్ట్రుఁడు సంజయుతో జెప్పుమాటలు మూలమున నున్నవి గాని, తెలుగున నున్నట్లు "సంజయునితో నిట్లనియె" "అనిచెప్పి చుట్టునున్నవారితో నిట్లనియె" "అని పలికి వెండియు" "అని పలికి సంజయునిదిక్కు మొగంబై" ఇత్యాదిగా సంజయునే గాక చుట్టునున్న వారినిగూడఁ జూచి పలుకరించు శిల్పము తిక్కనకే దక్కిన దనవలెను. మూలమున నిది మృగ్యము. కాని, మూలమున నిది మృగ్యము. కాని మూలమున- "జనార్దనం చాపి సమేత్య శాత మనోమాత్రం విర్యవతా ముదారం।.... విద్వాంశ్చైషాం కర్మణి నిత్యయుక్తః" అని విస్తారముగా నున్నదాని ననువాదమునఁ దడవలేదు. తడవకుండుటయే యుక్త మని పాఠకు లనుకోవలెను.

సంజయురాయబారము మూలమునఁ దొమ్మిది సర్గలు – రెండువందలయేబది శ్లోకములు. అనువాదమున నూటపదునాల్గు పద్యములు మూలానువాదములు రెండును సమానముగా నడచినట్లున్నవి. కాని మూలమునఁ జెప్పినవన్నియు శాంతిప్రధానవాక్యములు. రెండు పక్షముల బలములు నజేయములన్నట్లుగా నున్నవి. కాని అనువాదమున నట్లు లేవు. ధర్మరాజు- "మను మమ్ముఁ బొగడి, పదపది। యని వారల గెలుచు టరిది' యని పొత్తునఁ జెప్పిన మాటకు నే నొడఁబడ"-నని కచ్చితముగా నాడిన మాటకు బదులు లేదు. "నన్ను దూరం దలంచితేని నాచేయునది 'ధర్మం-

బధర్మం'బని నిరూపించి మఱి దూరుము" అన్నమాటకుఁ బ్రతి లేదు. కడకు శ్రీకృష్ణుఁ డాడినమాట లన్నిటికిఁ బ్రత్యుత్తరము లేదు. ఇదంతయుఁదిక్కన గారి లోకజ్ఞతా విలసిత మని తోపకమానదు.

సంజయుఁ డుపప్లావ్యమునుండి వచ్చి ధృతరాష్ట్రునితోఁ జెప్పిన మాటలు రెంట సమముగా నున్నట్లు తోఁచును. మూలమున ముప్పదిరెండు శ్లోకములు - అనువాదమునఁ బదుమూడు పద్యములు, కాని, "పరప్రయుక్తః పురుషో విచేష్టతే సూత్రప్రోతా దారుమయీవయోషిత్" అన్న మూలమునకు-'చలమున దుస్సనేనుఁడును సౌబలుఁడున్ మిముఁబట్టి యార్వ బొమ్మలక్రియ నాడుచుండెదరు" అన్న యనువాదమును, మూలమున - "అజాతశత్రు స్తువిహాయ పాపం జీర్ణాంత్వచం సర్ప ఇవావవరుధ్య" అన్న దానికి - మానుషశక్తి యొల్లఁడు, సమంచితదైవము యూదియుండు"- నన్న యనునాదమును, మూలమునఁ -"త్వమేవైకో జాతుపుత్రస్య రాజన్ వశంగత్వా సర్వలోకే నరేంద్ర' ఇత్యాదిగా నున్నదానికి-"....చిచ్చువెట్టి కాల్చినయది నీ యుపేక్షయ, వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మెత్తనిపులి"- యన్న యనువాదము కనఁబడుచున్నది.వీని యౌచిత్యానౌచిత్యములు పెద్ద లెఱుఁగుదురు. ఈప్రకరణమంతయు నిచ్చే యుత్తరముల ననల్పార్థసాధకముగా నున్నది.

విదురోపదేశము అయిదువందల శ్లోకములు. సనత్సుజాతోపదేశము రెండువందల శ్లోకములు. సనత్సుజాతోపదేశమును తాకనే లేదు. ఒక చిన్న వచనములో ముగించెను. ఇది యనవసరభారముగాఁ దోఁచియుండును. విదురోపదేశము నంతటిని తొంబది పద్యములలోనికి దించెను. ఈ యనువాదమే చాల చిత్రమైనది. మూలమున- "హృతస్వం కామినంచోరమావిశంతి ప్రజాగరాః।కచ్చి దేతై ర్మహాదోషై ర్న స్పృష్టోసి నరాధిప' అన్నదానిని, "బలవంతుఁడు - పైనెత్తిన బలహీనుఁడు, ధనము గోలుపడినయతఁడు, ప్రుఁచ్చిల వేచువాఁడు, కామాఁకులచిత్తుఁడు నిద్ర లేక కుందుదు రధిపా" యని యనువదించెను. మూలమున లేనిదానిని 'బలవంతుఁడు పైనెత్తిన బలహీనుఁ'డని తెచ్చిపెట్టుకొనుటయు, "కచ్చి దేతై ర్మహాదోషై ర్నస్పృష్టోసి' అన్నియున్నదానిని, ప్రక్కపద్యమునందు, సుకుమారముగా, 'ఇక్ష్వాఁగామల

లోవల నొక్కటి నీ చిత్తవృత్తినొందెనో'యని వైనమెఱిగి యుపయోగించుట జరిగినది. మహాకవుల విన్యాసము అట్లుండును. మూలమున - "విద్యామదో ధనమద స్తృతీయో2 ఖిజనోమదః । మదా ఏతేవ లిప్తానాం ఏత ఏవ సతాం దమాః"- అని యున్నదానిని "ధనమును విద్యయు వంశంబును దుర్మదు నకు మదంబు వొనరించును - 'ఇత్యాదిగా తెనుఁగుచేసెను. కాని ఉత్తరార్ధ మును తేలఁబలికెను. "మదా ఏతేవలి ప్తానా మేత ఏన సతాం దమాః "అన్న దానిలోని "మదాఃదమాః"అన్న పదవ్యావృత్తి నందుకొనలేదు. ఇట్లే యించు మించుగా దొర్లించుచు, మూలమున "ఏకయా ద్వే వినిశ్చిత్య" అను అనుదానికి-"ఒకటి గొని రెంటి నిశ్చలయు క్తిఁ జేర్చి" అనియు, మూలమున "స్త్రియోఽజ్ఞా, మృగయాపానం" అని యున్నదానికి "వెలది జూదంబు పానంబు వేరు" అనియు నన్యూనాతిరిక్తముగాఁ బొందుపఱచెను.

ఇదియొకచిత్రము: మూలమున-"యోనోద్ధతం కురుతే జాతువేషం" "నపౌరుణేఽపి వికత్థతేఽనాన్" "నమూర్చితః కటుకాన్యాహ కించిత్॥ "నదుర్గతోస్మీతి కరోత్యకార్యం" "దత్వానవశ్చాత్ కురుతేనుతాపం" ఇత్యాదిగా నచ్చటచ్చటఁ బడియున్న వాని నేర్పరించి "తగిన వేషంబు, తను దాన పొగడుకొనమి, నొచ్చియును గీడు పలుకమి, యిచ్చి వగవకునికిఁ, దన కెంత నడవకయున్నఁ బథముఁ దప్పకుండుట నడవడి కొప్పుసేయు"-నని యొక దండగాఁ గూర్చెను.మూలమున 'వనస్పతే రపక్వాని' 'యస్తుపక్వము పాదత్తే' అను రెండు శ్లోకములఁ జేర్చి, అనువాదమున "తనియఁ బండ కుండమును గోసికొనఁ,జవిచేఁ గాదు విత్తు చేటు గలుగు। పక్వ మైనఁ గొనిక, ఫలమించుఁ, జెడదు బీజంబు, కార్యసిద్ధి చంద మిట్లు" అని సున్నితముగా సంధించెను. అట్లే, మూలమున "యథా మధుసమాదత్తే" 'పుష్పం పుష్పం విచిన్విత" అన్న రెండు శ్లోకములు తీసికొని "మాలకరి పుష్పములఁ గోయు మాడ్కిఁ, దేటి । పువ్వుదేనియఁ గ్రోలెడు పోల్కి, నెదురు । కందకుండంగఁ గొనునది కార్యఫలము । బొగ్గులకుబోలె మొదలంటఁ బొడువఁజనదు," అని యనువాదమున విషయ విశేషవిన్యాసముగ నొక పద్యమున ననుసంధించెను.

ఇది మరియొక విన్యాసము :- మూలమున "సులభాః పురుషాలోకే సతతం ప్రియవాదినః । అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః"-

ఇత్యాదిగా నున్న కొన్ని శ్లోకములగుంపు తీసికొని, వానిని యథేష్టముగా విదిలించి యభిమతముల నేరికొని, ఒక వచనముతో "ప్రియవాదు లెందును గరు. అప్రియం బగుఁగా కేమి యని పథ్యంబు పలుకువారులేదు. జూదంబు సప్పుడే నడ్డపడి యప్రియంబులకు శంకింపక పథ్యంబు పలికితి. రోగికిఁ బథ్యాహారంబు తలకంటగించునట్ల య్యె. ఐన నిప్పుడుం జెప్పెద వినుము: కాకంబులం గైకొని మయూరంబులన్ బరిహరించు విధంబున.....సుయోధనాదుల బట్టి యుధిష్ఠిరప్రముఖుల విడిచితిని. నేఁడు కార్యంబు ముట్టవచ్చినం దోపక మిడుంగురు సోకినట్లు తల్లడించెదవు?" అని యథేష్ట వ్యాపారము నడపెను. మఱియు "త్యజేదేకంకులస్యార్థే, గ్రామస్యార్థే కులం త్యజేత్ । గ్రామం జనపదస్యార్థే, హ్యాత్మార్థం పృథివీం త్యజేత్" అని మూలమున ధర్మపాఠ మాత్రముగా నున్నదానిని తీసికొని "కులంబు నట్టి యొకని దొఱంగుటయ నీతి యని పెద్దలు సెప్పుదురు. దుర్నయపరుం డై సద్బుద్ధి వినండేని మనము దుర్యోధనుఁ దొఱంగిన నేమగు? నది యట్లుండె" నని ప్రశ్నార్థకంబుగా విడిచి—"ఇది యెంత యొప్పునో విచారించు" మని ధృతరాష్ట్రుని మోమువైవు ఎగాదిగ చూచుచున్నట్లుగా చెప్పెను. ఈ విన్యాసము మిక్కిలి అపురూపమైనది.

సంవిధానవైచిత్రి గల మఱియొక సన్నివేశ మిది: ఉపప్లావ్యము నుంచి వచ్చిన సంజయుఁడు కౌరవసభలోఁ దనమాటలు వివరించునపుడు మూలమున మొదట నర్జునుఁడు, తర్వాతఁ దక్కినవారును పలికినట్లుగాఁ పండ్రెండు సర్గలు అయిదువందల శ్లోకములు కడచినవి. తర్వాత ధృతరాష్ట్రుఁడు "యదబ్రూతాం మహాత్మానౌ వాసుదేవ ధనంజయౌ" అని యడుగగా, సంజయుఁడు—"ధనుర్గుణ కిణాంగేన పాణినా శుభలక్షణం । పాదమాన మయత పార్థః కేశవం సమచోదయత్ । ఇంద్రకేతు నివోత్థాయ సర్వాభరణభూషితః । ఇంద్రవీర్యోపమః కృష్ణ స్సంవిష్టో మా మభాషత" అని చెప్పినట్లున్నది. ఇది మూలము. అనువాదమున నిట్లు లేదు. సంజయుఁడు కౌరవసభలో తాను పోయివచ్చిన కథ యంతయు సంగ్రహముగా నొకచిన్న వచనమునఁ జెప్పి, "ఉపప్లావ్యపురమున కేగి తొలుత వాసుదేవార్జునులం గంటి" నని చెప్పెను. ధృతరాష్ట్రుఁడు "అవ్వాసుదేవు చిత్తం బెట్లు? ఏమనియె" నని యడుగగా సంజయుఁడు—"సత్యభామయు ద్రౌపదియు

సరుఁడు చేరియుండఁగాఁ, గుమారు లెవ్వరు లేనిచోటఁ దన్నుం బిలిపింపఁగాఁ దాను బోయి చూచితి ననియు, "ఈ యిరువురు వంచినపని చేయుదురఁట ! ధర్మజునకుఁ జేయరాని తలం పెయ్యది?" అని యనుకొనుచుఁ బోయిన కార్యము విన్నవించితి ననియు, "విజయుండు బలుమొగంబుతో దానికి నుత్తరంబు చెప్పం దొడంగిన వారించి వారిజోదరుం డిట్లనియె" ననియు ననువాదము చెప్పును. మూలమునఁ బండ్రెండు సర్గలతరువాత వచ్చినకథను, కొందఱు పాత్రలు మాటలాడినతర్వాత వచ్చినదానిని అనువాదమున మొదటనే చెప్పుటయు, అర్జునుఁడు క్రోధగాఁ గృష్ణుఁడు మాటలాడుటను మార్చి, అర్జునుని వారించి కృష్ణుఁడు పలికెనని చెప్పుటయు ఇచ్చటఁ బరమస్వతంత్రముగా నగుపడును. ఇది సందర్భసవ్నివేశౌచిత్యములతో తిక్కనతీర్చినతీరు. ఇంత చెప్పినతరువాతఁగూడ, మూలమున నున్న "గాండీవ ధన్వాలోహితః పద్మనేత్రః" అన్నదానిని మఱచిపోక, "కెందామరలఁ దెగడెడుకన్నుల నరుణచ్ఛవి నెఱయ నిట్టులనె"నని యర్జునునికోపారుణారవిందపత్రనేత్రముల నక్షౌ యుల్లే ఖించుట విశేషములలో విశేషము.

మూలము నన్యథాకరించు వేరొక సన్నివేశ మిదిः ధృతరాష్ట్రుఁడు "..కిమసౌ రాజా ధర్మపుత్రోఽభ్యభాషత"అని సంజయునడిగెను. అపుడు– "తత్రానిమిత్తతో దైవాత్సూతం కశ్మల మావిశత్।తదా చచక్షే విదురఃసభాయాం కురు సంసది।సంజయోయం మహారాజ మూర్ఛితఃపతితో భువి। వాచం నసృజతే కాంచి ద్దీనప్రజ్ఞోల్పచేతనఃʼʼ అని, మాటలులేక క్రిందపడిపోయె నని విదురుఁడు చెప్పెను. మూల మిట్లు చెప్పఁగా, ననువాదమున– "సంజయుండు వెచ్చనూర్చి వీచ్చవడి మూర్ఛవోయిన చందంబున డెందంబు మగుడఁ జేష్టలు దక్కయుండి, కొండొకసేవునకుఁ జిత్తం బొక్కింతచేసికొని"అక్కటా! యీ భూపాలకుం డింత బేల యగునే" ఇత్యాదిగాఁ దలపోసినట్లు చెప్పఁబడినది. ఒకవేళ నిజముగా నట్లుమూర్ఛవోయినను, ఆస్థితిని మార్చి, సంజయునిపాత్రకున్మేషముగా ధృతరాష్ట్రునిబేలతనము సూచించునీ సన్నివేశము తిక్కనగారు తీర్చినదే యనవలెను. ఇట్లే విదురుఁడు చెప్పుఘట్టమున, మూలమున"ఇహ నిశ్రేయసం ప్రాహు ర్వృద్ధా నిశ్చిత దర్శినఃl ....అంకే కురుష్వ రాజానం ధృతరాష్ట్ర!ʼ యుధిష్ఠిరం" ఇత్యాదిగా నలువది రెండు శ్లోకములు చెప్పినవిషయమును, శాకునికాదిప్రస్తావన మంతయు విది

లించి, 'విదురుం డిట్లనియె, మనవారు మున్న దుర్బలులు. పాండవులఁ బిలువఁబంచి తగవునడపుటదక్క మనకుం జేయందగుపని వేఱొండు గలుగునే' యని యొక చిన్నవచనముతో ననువదించి వన్నె వెలమించెను.

మూలము నతిక్రమించి చెప్పిన మఱియొకఘట్ట మిదిః మూలమున - 'మమాపి చ మతి స్సామ్య భవత్యేవం యదాత్థమాం॥సాతుబుద్ధిః కృతాస్యేదం పాండవాన్ ప్రతి మే సదాఁదుర్యోధనం సమాసాద్య పునర్వివర్తతే। ....దిష్ట మేవ ధ్రువం మన్యే పౌరుషం తు నిరర్థకం' - అని యున్నది. అనువాదమున - "ఆంబికేయుం డిట్లను - నీదు పలుకులఁ, గలఁకదేఱి బుద్ధి తెలివినొందె, ఇట్లు చేయువాఁడ, నిదియ కర్జము, ధర్మమును, యశంబు, లాభమును దలంప" అని ధృతరాష్ట్రుఁడు చెప్పఁగా, విదురుఁడు 'అనుఁడు, ముదంబు - నమ్మమియు నాత్మఁ బెనంగొన, నన్నతోడ నిట్లను విదురుండు: పెద్దవడికక్కడ! నీమది కార్యవృత్తి నూల్కొనియె; సుయోధనుం గని యకుంఠిత నిశ్చయమై, యతండు వ్రాలినదెస వ్రాలకుండిన, బలే! మముబోటులకుం బ్రియం బగున్" అని పలికి, నిట్టూర్పు నిగిడించి, 'దైవంబు నేర్చుగా, కిటుపోవఁగ నే నేర్తు - నేరఁబొమ్మనిపలుకంగా వశమే నరునకు' - అని చెప్పినట్లున్నది. ఆ మూలమున కిది వ్యాఖ్యానము. మహాకవులగంటము లప్రతిహతములై నవి గదా!

ఇంతేగాదు. "తస్యాం రజన్యాం వ్యుష్టాయాం" అన్న మూలమునకు "ఎట్ట కేలకుఁ బ్రభాతం బగుటయు"నని వ్యాఖ్యానము చేయుటయు, రెండు వందలశ్లోకముల సనత్సుజాతీయము నొక చిన్నవచనముతో దాటించుటయు, మూలమున సరాసరి సంజయుఁడు రాజభవనములకుఁ బోఁగా, ననువాదమున పదిపద్యములతో చంద్రాస్తమయ - సూర్యోదయాది వర్ణనముచేయుటయు జరిగినది. ఇట్లుచేయుట ఆంధ్రభారతమునకుఁ గావ్యత్వము సంపాదించుటకై యుండును. ఏమైనను, 'యథాస్మై రోచతే విశ్వం తదేవం పరివర్తతే' అనుట యథార్థము.

కృష్ణుఁడు కౌరవసభకుఁ బోవునపుడు ధర్మరాజాదులు చెప్పినమాటలు మూలమునఁ గొంచెము తక్కువగా మూడువందల శ్లోకములు. అనువాదమునఁ దొంబది తొమ్మిది పద్యములు. 'అస్మాన్ వేద్ధపరాన్ వేత్థ' అనుశ్లోకము

నకు'మ మ్మెఱుఁగు—దెదిరి నెరుగుదు'నన్న పద్య మున్నది. కాని'పొ మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పున్' అను ఎత్తుగడ లేదు. అదియే ఆ పద్యమున కాయువుపట్టు! అంతేగాదు. 'ఆపద గడవం బెట్టఁగ" అను పద్యమునకుఁ గూడ మూలము కనఁబడదు. సహదేవునిమాటలతో మూలమున – 'కథంను దృష్ట్వా పాంచాలీం తథా కృష్ణ సభాగతాం। అయుద్ధేన ప్రశామ్యేత మమ మున్యు స్సుయోధనే' అన్నదానికి, అనువాదమున 'రక్కెస మాడలాడెదరు' 'తలఁపంగూడునె' 'వీరలు ధర్మమార్గము' 'తుదిరాజ్యంబు సగంబు గొమ్ము' ఇత్యాదిగా నాల్గుపద్యములు చెప్పె. ఇవి తిక్కనగారి ప్రతిభోద్ధాపితములు. ద్రౌపది శ్రీకృష్ణునితోఁ జెప్పుటయు, నతఁ డామె నూఱడించుటయు మూల మున నేఁబది శ్లోకములు – అనువాదమున నిరువదియైదుపద్యములు. ఇరు వదియైదైనను అన్నియు నమూల్యములు అనల్పకల్పనావిలసితములు.

కుంతీదేవిని కృష్ణుఁడు చూచుఘట్టము మూలమున నూటయేడు శ్లోక ములు. అనువాదమున నిరువదియేడు పద్యములు. కాని, "ఇది యెల్లను నొక తల" "తన్ను దన దమ్ములను" అనుపద్యముల కాకరము కన బడదు. భోజనానంతరము విదురుఁడు చెప్పిన మాటలు – మూలమున ముప్పది శ్లోక ములు–అనువాదమున రెండు పద్యము లొకవచనము. కొంచెమే చెప్పినను ప్రత్యక్షదర్శనము చేసిన ట్లున్నవి. పైఁగా, మూలములోని "బధిరే ష్వివ గా యనః" "చండాలేషు ద్విజో యథా" యన్న యుపమానస్పర్శ లేని అచ్చపు హృదయావిష్కారములు. కృష్ణుఁడు కౌరవసభలో నాడినమాటలు మూలమునందు ననువాదమునందు సమముగనే యున్నవి. కాని "సతా మవస్థాం సంప్రాప్య కృష్ణాం ప్రేక్ష్య సభాగతాం। ఋత్రధర్మా దమేయా త్మా నా కంప్యత యుధిష్ఠిరః" అన్నిదానిని దీసికొని, "సభ ద్రుపదాత్మ్మజ ళంగపెట్టరే" అని యుగ్గడించి, "దానికి నీ వొడంబడితి" వసి యాతని తప్పు నెత్తిచూపి, తర్వాత ధర్మఁజశాంతిశీలముల ప్రశంసించుచు రెండు పద్యములు చెప్పెను. దీనికి మూలము లేదు. ఇవి తిక్కనగారి యౌచిత్య విచారక్షేత్రములోఁ బుట్టి పెరిగినవి.

దంభోద్భవుచరిత్ర మూలమున నేఁబది శ్లోకములు – అనువాదమున నొక్క సీసము. జామదగ్న్య కణ్వ నారద గాలవాదుల యుపదేశములు

మూలమున నేడువందల శ్లోకములు అనువాదమున నలువదియేడు పద్యములు. మునుల ప్రసంగమున వ్యాసులకుఁ బ్రీతి మెండని తోచును. ఇంత చెప్పినను, మూలమున మునుల మాటలకు దుర్యోధనుని ప్రతివచనము లేదు. ధృతరాష్ట్రుఁడే – "భగవన్నేవ మే వైతత్ యథా వదసి నారద" అని బదులిచ్చెను. అనువాదమున నట్లు గాక, "దుర్యోధనుండు రాధేయుం గనుంగొని, చేయప్పళించి నవ్వి, 'వీరలింత వెఱ్ఱి లగుదురే' యని పలికి, మునుల నవలోకించి, "మునులార! నన్ను విధి యేమని మును పుట్టించె నట్టులయ్యెడు"నని పరిహాసవాక్యములు పలికెను. ఆ మహాసభలో మునులయెదుట వారినిగూర్చి దుర్యోధనుఁ డిట్లు పరిహాసముచేయుట సంస్కృతాంధ్ర కవుల తములు పుట్టినకాలమహత్త్వమని తోచును. లేక, తిక్కనగారి యౌచిత్య విచారచర్చ యైనను గావచ్చును.

భీష్మ ద్రోణు లొత్తిచెప్పిన మాటలు మూలమున "తావచ్ఛామ్యతు వైశసం" అన్న శీర్షికతో దాదాపు ఇరువది శ్లోకములు. గాంధారి హితము పల్కిన మాటలు నలువదియైదు శ్లోకములు. అన్నియు వదలి యనువాదమున గాంధారి హితముగా నొక చిన్నవచనము వ్రాసి ముగించెను. విదురుని మాటలు పదుమూడు శ్లోకములకు ఒక పద్యము చెప్పెను. విశ్వరూప ప్రదర్శనమున కృష్ణుని యాఱుశ్లోకములకు అనువాదమున "ఏనొక్కరుండని తలంచియే దుర్మదంబునం బొదివిపట్ట నుత్సాహంబు చేసి "తనియొక వాక్యము – ఇత్యాదిగా సంగ్రహించి తిక్కనగారు – కృష్ణానుగ్రహముచే లబ్ధచక్షువైన ధృతరాష్ట్రుని "అనిన పలుకులకు నచ్చట జనులెల్ల నృపాలు సితవిశాలాక్షుఁ గనుం । గొనుచుండిరి" అని హృదయము విచ్చి పొగడెను. మూలము "లబ్ధచక్షుష మాసీనం ధృతరాష్ట్రం నరాధిపాఃఁ" అని రాజులు చూచినట్లు చెప్పఁగా, తిక్కనగారు జనులెల్ల చూచినట్లును "సితవిశాలాక్షుఁ" జూచినట్లును చెప్పి తన యామోదముద్ర వైచెను.

కృష్ణుఁడు కుంతితో సెలవు గైకొను సమయమున నామె చెప్పిన గ్రంథ మెంతో యున్నది. అంతటికి ననువాదమున – "విక్రమోపజీవులయిన మునిసుందుండును సంజయుండు" ననువారి కథలు చెప్పి "చేతుల లాపునం గలిగిన జీవనంబునం బ్రదుకుం"డనుమని చెప్పి ముగించెను. భీష్మ ద్రోణులు చెప్పిన మాటలు నలువదిశ్లోకము లుండగా, మూడు పద్యములు చెప్పెను.

కృష్ణ కర్ణుల సమావేశము మూలమున సూటయరువది శ్లోకము లుండఁగా ననువాదమున నిరువదియాఱు పద్యములు చెప్పెను. ఈ చెప్పుటలో కర్ణుని మాటలు "ప్రాప్యచాపి మహద్రాజ్యం తదహం మధుసూదన । స్పృహం దుర్యోధనా యేవ సంప్రదద్యా మరిందమ" "నతదా భవితా ద్వైతా నకృతం ద్వాపరంవచ" "పరాజయం ధార్తరాష్ట్రే జయం చ యుధిష్ఠిరే" ఇత్యాదిగా నున్న పెక్కుశ్లోకములు గూడ ననువాదమునఁ గనఁబడవు. కావునవే మూల మంతగాఁ బెరుగుటయు, ననువాదము కురుమట్టముగా దిగుటయు సంభవించినది.

శ్రీకృష్ణుఁడు కౌరవసభలోఁ బల్కిన మాటలన్నియు ధర్మరాజాలకుఁ జెప్పెమ. ఇచ్చట నూట ముప్పైయెనిమిది శ్లోకములు మూలమునను ఇరువదియాఱు పద్యము లనువాదమునను గలవు. కాని, భీష్మ ద్రోణ విదుర గాంధారీ ధృతరాష్ట్రుల మాటలుగా నున్నవానినిగూడ ననువదించలేదు. ఇవి ప్రత్యేక గమనార్హములు. భీష్ముఁడు "మాతాత! కలహం కార్షీ: రాజ్యస్యార్ధం ప్రదీయతాం । మయిజీవతి రాజ్యం క స్సంప్రకాశే త్తుమా నిహ" అనియు, ద్రోణుఁడు-"భీష్మేణ దత్త మిచ్ఛామి నత్వయా రాజ సత్తమ । వాహం త్వత్తోఽభికాంక్షేయ వృత్త్యుపాయం జనాధిప । యతో భీష్మ స్తతో ద్రోణో యదీష్మ స్త్వాహ తత్కురు, దీయతాం పాండు పుత్రేభ్యో రాజ్యార్ధ మరికర్షణ" అనియు, విదురుఁడు, "బధ్వావా నికృతి ప్రజ్ఞం ధార్తరాష్ట్రం సుదుర్మతిం । రాధీదం రాజ్యమద్యాళు పాండవై రభిరక్షితం" అనియు, గాంధారి-"న్యాయాగతం రాజ్య మిదం కురూణాం యుధిష్ఠిర శ్శాస్తు వై ధర్మపుత్రః । ప్రచోదితో ధృతరాష్ట్రేణ రాజ్ఞా పుర స్కృత శ్శాంతనవేన చైవ"-అనియు, ధృతరాష్ట్రుఁడు "ప్రయచ్ఛ రాజ్యార్ధ మపేతమోహ స్సవాహనం త్వం సపరిచ్ఛదం చ । తతోఽవశేషం తవ జీవి తస్య సహానుజస్యైవ భవేన్నరేంద్ర" అనియుఁ జెప్పినట్లున్నది. రాజ్యభాగ నిర్ణయ చర్చలో నీ మాటలకుఁ ప్రాముఖ్యము రావచ్చును. ప్రతి యొకరి మాటలకుఁ గూడ వెనుక నేదో బలము నిచ్చు చరిత్రయు గోచరించును. ఇట్టివాని నెందుకు వదలెనో తెలియదు.

యుద్ధ నన్నాహ మంతయు శ్రీకృష్ణుఁడే చేసినట్లు మూలమున 'అకృ తే వైవ కార్యేణ గతః పార్థా నధోక్షజః । స ఏనా న్మన్యునావిష్టో ధ్రువం

ధత్య త్యసంశయం । ఇంష్టోహి వాసుదేవస్య పాండవై ర్మమవిగ్రహా ।
భీమసేనార్జునౌ చైవ దాశార్హస్య మతే స్థితౌ'-అని యున్నది. అనువాద
మున నటుగాక 'హరి యలుకమెయిన్ జని యప్పాండుతనూజుల । మన
మునఁ గినుకూనునట్టి మాటల సెప్పున్' అని సూచనాప్రాయముగాఁ జెప్పి
నట్లు తోచును. కాని యతఁ డే కారణమని చెప్పలేదు. ఉలోకోపాఖ్యానము
మూలమున దాదాపు మూడువందల శ్లోకములు. అనువాదమున నిరువది
యైదు పద్యములు. అంబోపాఖ్యానము మూలమున దాదా పేడువందల
శ్లోకములు. అనువాదమున నూటముప్పది పద్యములు. ఈ విధముగా మూల
మన్యాహతముగాఁ బెరిగినది. దీనిని సరిదిద్దుకొని యనువదించుటలో నుద్యోగ
పర్వ మింతమాత్రము దిగినది. సనత్సు జాతీయాదులవలె, వృత్రాసురాదుల
కథ, ఉలోకోపాఖ్యానము, అంబో పాఖ్యానము మున్నుగాఁ గథలు మఱి
కొంత బిగపట్టి వ్రాసినచో మఱికొంత తగ్గియుండ వచ్చును. ఈ కొలత
లన్నియు పాఠకులకు వదలుదము. ఉద్యోగపర్వము నెట్లు తీర్చెనో యిపుడు
కనుగొందము.

అభిమన్యుని వివాహానంతరము పెండ్లికి వచ్చిన బంధువులందఱు చేరి
కార్యనిశ్చయము చేయఁబూనిరి. మూలమున లేకున్నను, 'దిన చతుష్టయా
నంతరమున' ఈ సభ జరిగినది. లోకాభిరామాయణమునంతయు వారించి
శ్రీకృష్ణుఁడు బంధుప్రీతిఁ బురస్కరించుకొని, పాండవుల యరణ్యాజ్ఞాత
వాసక్లేశాదుల నుగ్గడించి 'ఏనును నాకన్నంత చెప్పెద' నని యుపన్యసించి,
'బలము లేక దోర్గర్వముమై గెలువంగ వశమే' యని సహాయసంపదావశ్య
కతను చెప్పి, 'కావున నియ్యవసరంబునఁ దగిన మానిసి నందులకుం బుచ్చ
వలయు' నని వాక్రుచ్చెను. ఇది ప్రకృతోపయోగిగా నున్నది. బలరాముఁ
డామాటల నందికొని ప్రశంసించి, 'ఇత్తెఱంగున వార లధర్మపరు లని నిందిం
పరాకునికి కారణంబుగా నయంబుతోన యిక్కార్యంబు దీర్చికొని రావ
లయు నని మూఁదలించెను. దీనికిఁ దగిన కారణముగూడఁ జూపెను. 'సంరం
భమాణో విజితః ప్రసహ్య తత్రాపకార శ్శకునే ర్న కశ్చిత్ । తస్మాత్ప్రణ
మ్యైవ వచోబ్రవీతు వై చిత్రవీర్యం బహుసామ యుక్తం' అని. అది ఆయన
యభిప్రాయము.

పై మాటలకుఁ గోపించి సాత్యకి 'ఇట్లాడఁదగువె - ఇది నీక పోలు
"వేడుక పుట్టిన జూదంబాడెనె? ధర్మజుఁడు?" 'ధర్మతనూభవుడెస దుష్క
ర్మముఁజూపించి' 'ఉక్కువుండగు ధార్తరాష్ట్రుఁ । గ్రూరశరముల నే నియ్య

కొలుపువాఁడ' ఇత్యాదిగా నాగ్రహము వెడలఁగ్రక్కెను. ద్రుపదుఁడు - 'ఇది వోలు, బలరాముని మాట మాటగా'దని దానిని బలకొట్టెను. శ్రీకృష్ణుఁడు 'పాంచాలపతి వచనంబు లుచితంబులై యున్నవి. ఇభ్భంగిన చేయవలయు' నని పలుకుచుఁ, జివరకుఁ 'బొందైన లెస్స, విరసపుఁ ! గ్రంద యెయ్యదుచందమైన. రాజుల నెల్లన్ ! ముందఱ రావించి, క్రమం ! బొందఁగ మముఁ బిలువఁ బంపుఁ డొయ్యన పిదపన్' అని ద్రుపదునితోఁ జెప్పి, తాను బలదేవసహితంబుగా వెడలిపోయెను. తక్కినరాజులును బోయిరి. ద్రుపదుఁడు తన పురోహితునిఁ గౌరవులకడకుఁ బంప నిశ్చయించెను. ఇంతవరకు బంధువుల ప్రయత్నమే జరిగినది. రాజ్యముఁ బొందవలసినవారు పాండవులే యీట వారు ప్రయత్నించినను దప్పు గాదు కాని యిచట బంధుబలము పెచ్చినది. ఇది భవిష్యత్కార్య సూచనము. బలరాముఁడుమాత్ర మొక్కడొంటరివాఁ డయిపోయెను. ధర్మరాజాదుల ప్రస్తి యిందు రాకుండుట జ్ఞప్తియం దుంచుకోవలెను.

యుద్ధసహాయముకొఱకు దుర్యోధనార్జునులు శ్రీకృష్ణుని దర్శించిరి. ఆగమన దర్శనముల సామ్యముఁ జూపి శ్రీకృష్ణుఁడు, తన్ను - నారాయణ గోపాలు రను రెండు పక్షములుగాఁ బెట్టి, బాలుఁడు ముందు కోరుకోవలయు ననెను. అర్జునుఁడు శ్రీకృష్ణుని కోరుకొనఁగా దుర్యోధనుఁడు సంతసించి తక్కినవారిని గైకొని బలరామునొద్దకుఁ బోయెను. అతఁడు ముందు జరిగిన సంఘటన చెప్పి, తా నెవ్వరికి సాయపడక యుందు నని చెప్పెను. దుర్యోధనుఁడు దానికి సమ్మతించి కృతవర్మసహాయముఁ దీసికొని వెడలిపోయెను. శ్రీకృష్ణుఁడు తాను యుద్ధము చేయకపోయినను, నీరథసారథ్యము చేయుదునని చెప్పి, 'కార్యాలోచనము సేయుబుద్ధి'తో అర్జునుని వెంట ధర్మరాజుకడకు వచ్చెను. ఈ విధముగాఁ పాండవపక్షమునఁ గొంత బంధుబలము పెచ్చినది. బలరాముని కౌరవపక్షపాతము మఱింత వ్యక్తమైనది. కాని, ఇప్పటికిని ధర్మరాజునకు యుద్ధమును గూర్చి స్పష్టమైన యాలోచన యేమియు లేదని తెలియుచున్నది.

శల్యుఁడు పాండవులకడకు వచ్చుచుండఁగాఁ ద్రోవలో దుర్యోధనుఁడాయన కుపచారములు చేసి మెచ్చించి, తన కమాత్యుఁడుగా సైన్యము నడుపునట్లు వరముఁ బొందెను. శల్యుఁ డంగీకరించి, ధర్మజుఁ జూచి వచ్చెద

నని చెప్పి యాతనికడకుఁ బోయెను. వారి సంభాషణములలో ''సమరస మయంబున నిరాకరించి పలికి, కర్ణునిచిత్తంబునకుఁ గలఁకపుట్టించి, పార్థు రక్షింపవలయు' నని ధర్మరాజు ప్రార్థించుటయు, శల్యుఁడు 'అగు, నిదివో వోలును, నాకుం దగ నిట్టిద' 'కర్ణుని సారథినై నను, నిర్ణయమున కేను బార్థునిం గాచెద'నని బదులు సెప్పుటయు జరిగినది. ఈ శల్యుని చరిత్ర చాల చిత్రముగా నగుపడును. ఉభయపక్షముల కాతఁ డెట్లు సాయముచేయఁగలడు? 'శల్యసారథ్యము' చేయుట యనఁగా నిట్టిదే కాఁబోలు ముందుముందుగనే 'తనకు కర్ణసారథ్యము వచ్చు'నని యెట్టు తెలిసికొనెను? ఇదంతయు నగోచర మైనది. ఏమైనను యుద్ధములోఁ గర్ణసారథ్యము వచ్చినపుడు, అతఁడు మాట తప్పనివాడైనపుడు, కొంతసాయము ధర్మపక్షమునకు రాఁగలదు. కాని పూర్ణసహాయము పొందువాఁడు దుర్యోధనుఁడే కావలయును. ఎట్లైనను శల్యుఁ 'డెత్తువారి చేతిబిడ్డ'గా నిందుఁ గనబడుచున్నాఁడు. శల్యుఁడు చెప్పిన మాటలఁబట్టి 'కారవనాథుఁ డానహుషుకైవడి నాశముఁ బొందు, వాసవ శ్రీరమణీయుఁడై జయము చేకొను ధర్మజుఁ''డన్నమాటలు యథా రములుగా నగుపడును. ఇంతవరకు నుభయపక్షములఁజేరు బలములఁబట్టి యుద్ధము జరుగు సన్నాహము మాత్రము ధర్మరాజునకుఁ దెలిసియుండు నని మనము తలంపవలెను.

రెండుపక్షములసేనలు నిండుకొనుచున్నవి. ద్రుపదపురోహితుఁ డాడిన మాటలు మెచ్చుకొని భీష్ముఁడు– 'నీవాక్యము విప్రస్వాభావికమై యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్ భావింపఁ గార్యమునయం । దేవిధమున సభకు నింత యిష్టంబగునే' యని ప్రశంసించెను. ధృతరాష్ట్రుఁడు పెద్దల విచారించి సౌమ్యునొక్కరిని పాండవులయొద్దకుఁ బంపెద'నని చెప్పి పురోహితుని సాగ నంపి, సంజయునకుఁ దగినబోధ చేసి అతనిని పాండవులయొద్దకుఁ బంపెను. సంజయరాయబారముగూడ శమప్రధానముగనే నడచినది. కాని, ధర్మ రాజు–'రెండుపక్షములు సమానబలంబు లనుటకు నే నొడంబడ' ననియు, 'నన్నుఁ దూఱుం దలంచితేని నా చేయునది 'ఇది ధర్మం–బిది యధర్మం' బని నిరూపించి మఱి దూఱు' మనియు, ''రాజులకు 'సంగ్రామంబు ధర్మంబవుం–గా'వని నీవచెప్పు''మనియు నిగ్గదీసి యడిగినప్పుడు మాత్రము బదులు పలుకఁ తేదు. శ్రీకృష్ణుఁడు తగిన మాటలాడుచుఁ, గడకు – 'ఏ నీ పని కై వచ్చెద'

నని సమాధానము చెప్పెను. దానితోఁ దృప్తిపడి సంజయుఁడు వెడలిపో యెను. ఈ విధముగా, ద్రుపద పురోహిత - సంజయుల రాయబారములు 'మెట్టియలచప్పుడే గాని ప్రయాణము సాగలే' దన్నట్లు కడచినవి. 'పాండ వేయులఁ దగఁ బ్రార్థించి, యందుల కక్కట! యేనైన నరుగుదెంచి' యని చెప్పుటయే గాక, 'దానన నెగడెదమే, మ । మ్మానవనాథునకుఁ జెప్పు మా మత మెల్లన్' అనియు కృష్ణుఁ డన్న మాటలలో 'ఏము నెగడెద' మను మాట పులకలు పుట్టించినది. యుద్ధము లేక బంధుక్షయము లేక సంధి కుదు రునని ధర్మరా జెంతో యాసపడినాఁడు. శ్రీకృష్ణునిఁ బ్రోత్సహించినాఁడు.

'ఆపద గడవం బెట్టఁగ । నోపి శుభంబైన దాని నొడగూర్పఁగ'నని ప్రారంభించి, పొ మ్మెవ్వడ నేను నీకు బుద్ధులు సెప్పఁ' అనునంతవరకు, నీ యవినయ సౌశీల్యములు శోభిల్లఁ, 'గౌరవసభకు పోయి ర' మ్మని ధర్మ రాజు శ్రీకృష్ణునిఁ బ్రార్థించెను. 'మోదంబందుట గల్గుఁ గౌరవులు నేముం బొంది శ్రీ నొందినఁ' 'ఐదూళ్లను మా కిచ్చినను జాలు' నని హృదయపూర్వ కముగనే చెప్పెను. అది సరియే. భీముఁడు కౌరవ నికారదంద్యమాన మానసుం డయ్యు ఆపొంగు నాపుకొని తనమాటనే యనువదించెను. అర్జు నుఁడుకూడ, 'ధర్మంబుఁ విచారించి చూచి 'తగుంబొ'మ్మని యేది పంచి- తది నిశ్చింతంబునం జేసి యు । న్నతిఁ బొందంగలవార' మని కాయఁకొడవలి కృష్ణుచేతఁ బెట్టెను. నకులుఁడు 'కడవఁగ నొకళ్లు పసరము । నడఁచిన, నొక్కఁకులు వెయ్య నడపవలయునే' 'నీవు పోయినపుడ యిక్కార్యంబు సక్కనగు'నని సంధినే బలపఱచెను. పై మాటలలో 'పాళ్లు' భేద మెట్లున్నను అందఱు తన మాటనే తథాస్తనిరి. ఇది కృష్ణున కెట్లున్నను, తక్కినవారికి సవ్యముగనే కనఁబడినది.

సహదేవుఁడు మాత్ర మట్లు చెప్పలేదు. తనకుఁ దోచిన ధర్మముగా, నిర్భయముగా 'తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్ము' ఇత్యాదిగాఁ గట్టె విటి చినట్లు మాట్లాడెను. సాత్యకి మొదలుగా నందఱును 'సహదేవుఁ డింత యెప్పఁ బలుకునే' యని ప్రశంసించిరి. సంఖ్యకుఁ జూడ నాపఱమే యెక్కువగాఁ దోచెను. ద్రౌపదివాటఁ జెప్పఁబనిలేదు. ఆవేదన పట్టలేక, 'బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మన విచ్చి'వలకేలఁ బూని 'ఈ వెండ్రుకలఁ బట్టి యీడ్చిన యాచేయి' ఇత్యాదిగా నక్కసునంతయు వెడలగ్రక్కి, 'నేను

రాజరాజుపీనుంగు గన్నార । గానబడయమేని' యని వలవల నేడ్చినది. ఆ యుద్రిక్త వాతావరణములోఁ గృష్ణుఁడు 'నీ మెచ్చుగ శత్రుసంహ యము మేకొని చేసెదఁగాక' యని యామె వీపుదట్టి యభయ మిచ్చెను. వై పరిస్థితులలోఁ దనధారణ తల్లక్రిందు లైనట్లైనది. కృష్ణుఁడే నిబ్బరించు కొని, 'మీ । కును హితము ప్రియంబు చేయగోరియ, కుంతీతనయాగ్రజు పని ధృతరాష్ట్రునికడకుం బోయెద' నని సంధి సమాధానము చేసెను. అదియే సమయ మని 'అట్లుచేయుము. మన నిశ్చయ మదియ' యని ధర్మరా జూది పలికెను. కొంతవఱ కట్టి నిశ్చయముతోనే పలికెను. కృష్ణుఁడు కౌరవ సభకుఁ బ్రయాణమ యెన్యను. జరిగినదానిలో రెండువంతులు యుద్ధము – ఒకవంతు సంధిగా నున్నట్లు అప్పటికిఁ గనఁబడినది !

కౌరవసభలో హితబంధుసమ్మతముగా, రాజనీతి సమ్మతముగా, సామదానభేదాదులు ప్రయోగించి శ్రీకృష్ణుఁడు మాటలాడెను. నారద జామదగ్న్యాదులతో మాటలాడించెను. భీష్మ ద్రోణ విదురాదులు కూడఁ గట్టుకొని గట్టిగా మాటలాడిరి. కాని లాభము లేదు. దుర్యోధనుఁడు 'వాడి సూదిమొన యించుక మోపిన యంతమాత్రమున । భూమి యొసర్చి పాండు నృపపుత్రుల కిత్తునె ? యెవ్వరైన సం । గ్రామమునన్ జయంబు గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్' అని మొగమోటవిడిచి మాట్లాడెను. ఇక్కడికి సంధి సగము విరిగిపోయినది. దుశ్శాసను ప్రేరణతో దుర్యోధ నుఁడు సభనుండి లేచిపోయి శ్రీకృష్ణుని కట్టివేయు ప్రయత్నములు గూడ చేసెను. సంధి పూర్తిగా భగ్నమైనది. శ్రీకృష్ణుఁడు విశ్వరూప ప్రదర్శన ముతో బయటికి వచ్చి భీష్మాదులతో 'అంతయు మీ రెఱుఁగుదురు. ఈ రాజు తప్పు తనది లేదని చెప్పెను. ఇఁక నేఁ బోయివచ్చెద నని మొగము గంటు వెట్టుకొని కుంతికడకుఁ బోయెను. ఆమెయు 'దైవము మేలు చేసె, చేతుల లావునన్ గనిన జీవనంబున బ్రతుకుండను' మని హితము చెప్పెను. తర్వాతఁ గృష్ణుఁడు 'నన్ననిచి వత్తువుగాక ర'మ్మని, కర్ణుని రథ మెక్కించుకొనిపోయి, ఏకాంతముగా నేమియో మాటలాడెనఁట. కర్ణుఁ డన్నింటికి సమాధానము చెప్పెనఁట. ఆ వివరములు తెలియకున్నను సంధి కుదురలే దనుట స్పష్టము. ఇట్లు అందరితో మాటలాడి, అన్నిపనులు ముగించుకొని హుటాహుటి పయ నంబై కరినగరంబునకు వచ్చి కృష్ణుఁడు పాండవులకు యథాతథముగ వివ

రించెను. సంధి మఱువవలసినదిగా యుద్ధము జరుగవలసినదిగా ఆలోచన ప్రారంభమయ్యెను.

కృష్ణుఁడు కౌరవ సభనుండి వచ్చి 'కౌరవులయెడ దండంబుదక్క నొండుపాయంబు లేదు. మీకుం బోలిన తెఱంగు సేయుం'డని చెప్పెను. పాండవదూతగా నతఁడు చేయవలసినపని యంతయే గదా! ఇక నిర్ణయించు బాధ్యత యుధిష్ఠిరునిది. యుద్ధ మనఁగా బదునెనిమిది యక్షౌహిణుల సైన్యము - కొంచెము తక్కువగా నైన - నాశము చేయు కార్యము. అంతులేని జగత్సంహారము. అంతపని చేయలేకయే ధర్మరా జింతవరకు నారాటపడెను. చివర కామాటయుఁ దానే చెప్పవలసివచ్చినది. భీభత్సాకారమైన యాదృశ్యము తన కన్నులయెదుట ప్రేలుచున్నపు డామాట యెట్లు చెప్పఁగలఁడు? చెప్పకున్న వేఱుమార్గ మేమి? ఇది ధర్మరాజునకుఁ గలిగినసమస్య. కురుక్షేత్రసంగ్రామమునకు ముఖ్యకారకు లెవ్వ రనునది పాఠకులసమస్య! ధృతరాష్ట్రుఁడు మూలకారణము, దుర్యోధనుఁడు ముఖ్యకారణము, కర్ణుని తలపై భారతము, - ఇత్యాదిగా వారు వా రనుకొనుటయు గలదు. 'భీష్ముఁ డొక్కఁడు చక్కఁగ నిలచిన నీక యుద్ధమేమున్న' దనుటయు సంగతముగనే తోఁచును. ఇదంతయు రాజ్యభాగ మీయక యుద్ధము జరుగునప్పటి మాట; భాగ మిత్తురో - యుద్ధమునకు వత్తురో తేల్చుకొని వచ్చినవాఁడు కృష్ణుఁడు. చేయవలసినవాఁడు ధర్మరాజు. ఇది యిప్పటి పరిస్థితి. యుద్ధమే చేయుదమన్న, నాతనికి ధర్మ మొకవైపు, వంశనాశన మొకవైపు, మరల నరణ్యములకే పోవుదమన్న - నసమర్థత యొకవైపు. 'సిరి నా కేలందునే - గ్రాసవాసో దైన్యంబులు వచ్చునా యరయు నీచుట్టాల' కన్నది యొకవైపు, తప్పనిసరిగా నెదుఁటబడి తారసిల్లుచున్నవి. ఈ సందడిలో - ఈ పరిస్థితిలో ధర్మరా జితికర్తవ్యతా మూఢుఁ డయ్యెను.

నిజమే! బంధునాశము గాకుండ, దానికై తన్ను నెప పెట్టకుండ సంధి కుదిరినచో సరిపోవును. కాని, దానికి ప్రతికూలురు దుర్యోధన దుశ్శాసన కర్ణులు - అనుయాయులు నట్టివారే! కాని, ధృతరాష్ట్రుఁడు మారిపోవుట కేమి? 'కొడుకా! నే నెటు లట్లు బాహ్లీకుఁడు, నీకుం గూర్చు భీష్ముండు నీ। యెడ సస్నేహుఁడు;....ధర్మజున్। విడువంగాఁ దగ, దిమ్ము

వారలకు నుర్విం భాలు నెమ్మిన్' ఇత్యాదిగాఁ జెప్పినవాఁ డా మాటపై నిలువకపోవు టేమి? 'నా తెఱఁగు నీ వెఱుంగుట నాకుఁ జాలు'నని శ్రీకృష్ణు నితోఁ జెప్పుటేమి? ఇదంతయుఁ గృత్రిమముగదా! కృత్రిమ మని శ్రీకృష్ణుఁడే 'ఈ మేదీనీవి । భుండు తా నేమిటికిని ముఖ్యుండ గాను । తప్పు తనవై పు లేదని చెప్పి విడిచె'నని చెప్పలేదా? ఏమో! ధృతరాష్ట్రుని హృదయ మిట్లు చీకటికోన యైనది. కాని, భీష్ముఁడైన నిక్కచ్చిగా మాటలాడు నను కొంటిమి - మాటలాడెనుగూడ. కాని లాభము లేదు. 'మాకుం జూడఁగ బోలు కార్య మిది; ధర్మప్రీతి నీ వేగి, సు । శ్లోకుం డైన యుధిష్ఠిరుం గని, జనస్తుత్యంబుగా శాంతివై । నీ కారవ్యుల నెల్లఁ గాచికొనవే' అని ప్రార్థిం చియు, వినకపోగాఁ, దన జీవితముపైనే విసుగుదోచి, శాంతి నావహించి కొని 'కురున్నప! విను, సంసారము । దరి ద్రొక్కినవార - మింకఁ దరలె దమే సం । గరమునకు? నేము నీకై పొరలితి' మని చివరిమాట మాట్లాడి వెళ్ళిపోయెనఁట! అంతటివాఁ డట్లైనపు డిక మరలించువాఁ డెవ్వఁడు? ద్రోణ కృపాశ్వత్థామాదు లాయన యనుచరులేగదా; భీష్మునివంటివాఁ డిట్లగుట కాలమహిమ! లేక దైవమును శ్రీకృష్ణునిలోఁ జూడఁగల యాతని సమాధినిష్ఠ యనవలెను. సరియే! కృష్ణుఁడైన స్పష్టముగాఁ జెప్పకపోయెనే!

తనవై పున భీమార్జుననకులులు తనవారే: అర్జునుఁడు తనమాట కాదన లేదు. కృష్ణునిమాట చూదవలెనన్న ఒకవిధముగా సరిపెట్టుకొన వచ్చును. సహదేవుఁడు పైకి యథార్థవాదిగాఁ గనఁబడినను లోపలనార్ద్రత యున్నది. మార్దవ మున్నది. ద్రౌపది చివరకు మనమాటకు రాకపోదని నమ్మకము. కాని, యిపుడు మిగిలినది శ్రీ కృష్ణుఁడు. 'అంద ఱొక యెత్తైన నగస్త్యుఁ డొకయెత్తు'వలె నున్నాఁడు. బలపఱచినచో నిటు సంధికాని యటు విజయ ముకాని చేకూరుట కనఁబడుచున్నది. కాని, అతఁ డలౌకికపురుషునివలెఁ గనఁబడును, జగమంతయు నాతని నలౌకికపురుషునిగనే భావించును. అతఁడు నాదగ్గర నా మాటలకు సమ్మతించును గాని యాచరణమున నన్యథా ప్రవృ త్తి గనఁబడును. ఇట్లగుటకుఁ గారణమేమి? "మీకుఁ బోలిన తెఱంగు సేయుం" డనెను గదా? దీని కర్థ మేమై యుండును?

శ్రీకృష్ణునిగూర్చి మరియు నిట్లాలోచించెను, అభిమన్యు వివాహానంత రము జరిగిన సభలో నన్ని సంగతులు మాట్లాడినవాఁడు- చివరకు అందఱు

వచ్చిన పిమ్మట మాకుఁ జెప్పి పంపుఁ డనుచేల? అతఁ డట్లే యుండక శ్రీ కృష్ణుఁడు ఆ 'చెప్పిపంపుఁడన్నవాఁడు సహాయముచేయుటకై వచ్చి కార్యా లోచనమునకు దిగుచేల? దిగినతర్వాత నూరకుండెనా? సంజయునితో మాట లాడునపుడు- "ఎట్లయినను వీరికి పోటు మేలు నాకుం జూడఁ" అనియు, "వారెట్టితులువలో - ద్రౌపది నట్టులు పటీచెడిదే" "అయ్యెడరు రాచకుమా రకు లోర్చుసట్టిదే" ఇత్యాదిగా చొచ్చుకొని మాటలాడనేల? "రోషమయ మహాతరువు సుయోధనుఁడు" "ధర్మజుండు ధర్మతరువు" అని నన్నెత్తిచూపి బలకొట్టనేల? "ధార్తరాష్ట్రులు సడికి నధర్మమునకు నలుక రెప్పుడు: విడువు దైన్యంబు: పొడువు కయ్య" మని నాకుఁ దటిమి చెప్పనేల? దీనినిఁబట్టి యుద్ధము సేయు టతని కిష్ట మని స్పష్టము కదా? అయినప్పుడా మాటయే యేల చెప్పరాదు. అర్జునుఁడు "మాకిట్లు సేయు మని యాజ్ఞ యిమ్మనఁగా "సంధికిం బురుషకార మొనర్చెద నోపినంతయుఁ, దైవముచేత యెట్లగునో" యని యోసరిల్లు చెందుకు? భీముఁడు సంధిచేయు మనిచెప్పఁగా "వెఱపెట్టి దియో యెన్నఁడు నెఱుగని నీయట్టివాని కెవ్వరొకో యీ, పిటికితన మింత యలవడం,గఱపినవా" రని కలకల నవ్వు చేల? సహదేవుఁడు 'సుయోధనుఁ డెక్కడ - భూమిలోన సగ మిచ్చుట యెక్కడ" నని యొమ్మ్మి విఱుచుకొన్న కొన్నపుడు కొలువెల్లఁ బ్రశంసింపఁగా, దా నందులో నుండియు లేనట్లు నడ చుకొనుచేల, సరే-ద్రౌపది నూరడించుచు "శత్రుసంక్షయము చేసెద,ఏమది చూచి చెప్పినను దపుదుమేరుపు దిరగెనేని" యది కన్నులార చూచిచెప్పిన యట్లుగా మాట్లాడెనే' దీనికర్థ మేమి! కరిపురికిఁ బోయెద నని నాతోఁ జెప్పు టలో నాంతర్య మేమి? ఇవన్నియు నొకదానితో నొకటి పడక తాఱుమాఱు లగుచున్నవి.

ప్రత్యక్షానుభూతము లిట్లుండగాఁ, బరోక్షము లింతకంఱెఁ బదిమడుం గులు. భీష్ముఁడు ధృతరాష్ట్రునితో "ఆతఁడు సేయఁబూనినపని తప్పింపఁగ రాదు, ఆ పురుషుపనుపు సేయు" మనెనఁట! దుర్యోధనుఁడు తండ్రితో కృష్ణు బంధించు ప్రయత్నము సెప్పఁగా ధృతరాష్ట్రుడదరిపడి "ఓహో! యిట్లనుట జగద్ద్రోహం"బని యాతని నదలించెనఁట! కుంతి కృష్ణునిఁ బ్రశం సింపుచు "జగంబులకెల్ల, జేరుగడ నీవ, నీపలు,కారయ వేదంబకాదె"యని పొగడెనఁట! దుర్యోధనుఁడు "మేము పగతులమా? మాయింట నేల భుజింప"

నన నతఁడు నవ్వుచు "అలుగుదు పాండవులకు, వా।రలు నాకుం బ్రాణములు, ధరావల్లభ! యి।ట్టలముగ దమ బ్రాణములకు।నలుగు జనులు పగతు రగుట యనుమానంబే"యని ప్రత్యుత్తరించెనఁట! విదురుఁడు శ్రీకృష్ణునితో "నీవా తులువలకడ కేల పోయెద"వనఁగా, బిగువు మొగముఁబెట్టి శ్రీకృష్ణుఁడు, "నీ తలంచిన చందంబునం దులువలై కలఁగంబాఱిన - వారు నాయెదుట నిలుతురే" యని తునియఁబలికెనఁట! ఇట్టి మహామహిమ లెన్ని యో గలవు. అన్నిటికంఁటె నీయొక్కటి పర్ణనాతీతమైనది. దుర్యోధనునితో మాటలాడుచు శ్రీకృష్ణుఁడు– "ఒక కార్యము సెప్పెద, మీసకలబలములందు సవ్యసాచి కెదురుగా। నొకరుఁడు గల్గినఁగయ్యము।నకుఁ బూనుఁడు, రిత్తబహుజనత్రయ మేలా?" "తోడు దొనలేని యప్పటి। క్రీడికొలదియట్టి–దధిప! కినియక విను, మేఁ।దోడై రా నెదుట కడుఁ।గీడు, వలవ దుడుగవయ్య! గెలు పరిదిసుమీ!" యని ఘంటాఘోషముగాఁ జాటి చెప్పెనఁట. ఇది యనన్యసామాన్య విషయము. అర్జునుని బలమున నాతని విశ్వాస మట్టిది! తనరూపాంతరమే యర్జునుడుగా భాసించునట్టిది! ధర్మముపైఁ గురువంశముపై నాతని హృదయ మట్టిది. అందుకనియే "నేఁ దోడై రా నెదురుటకడుఁగీడుసుమీ"యని యొత్తి చెప్పెను. అన్నియు సరియేకాని యీ 'మీకుం బోలిన తెఱంగు సేయుం' డన నేల?

ఇచ్చట ధర్మరాజునకుఁగాని మఱియెవ్వరికిఁగాని తెలియనియంశము, కుంతికిని సూర్యునకును వేదవ్యాసులకును అట్టివారికి మాత్రమే తెలిసిన యంశము, కృష్ణునకుమాత్ర మెట్లు తెలిసెనో తెలియఁదగిన యంశమొకటి యున్నది. అది కర్ణ జనన వృత్తాంతము. దానిని కర్ణునకుఁ దెలుపుటకే యాతనిని రథ మెక్కించుకొని కృష్ణుఁడు దూరముగాఁ గొనిపోయెను. దానినుద్యోగపర్వమునఁ జదివితిమిగదా! శ్రీకృష్ణుఁడు కర్ణున కాసలుచూపి భాసలు చేసి, నయభయముల బెదరు పుట్టించి చెప్పుటయు, కర్ణుఁడప్రధృష్యుఁడై యన్నింటికి బదులిచ్చుటయు జరిగినది. అంతకంఁటె నెక్కువగా ధర్మరాజున కేమియు దెలియదు. తెలియవలసిన సందేహముకూడఁ గలుగలేదు. కాని యా ఘట్టములో జరిగిన ఫలితాంశ మేమైన కృష్ణుని ప్రవృత్తికిఁ గారణమైయుండునేమో! అది యూహింపరానిది:

కృష్ణుఁడు మాత్రమే యెఱిగిన యింకొక విశేషమున్నది. విశ్వరూప ప్రదర్శనానంతరము భీష్మద్రోణబాహ్లికాదులవైపుచూచి శ్రీకృష్ణుడు. "ఇప్పుడీసభఁబుట్టిన యింతవట్టు।మీకుఁతెల్లంబగాదె! యీమేదినీవి।భుండు తా నేమిటికిని ముఖ్యుండఁగాను।దప్పు దనదెస లేదని చెప్పివిడిచె." "కావుననియ్యెడనాకుం దడయం బనిలేదు-ధర్మపుత్రుని కింతవృత్తాంతముఎఱింగింపవలయు" నని చెప్పెను. ఇవి సెలవుతీసికొనునప్పటిమాటలుగా గోచరించినను, ఇందులో మహార్థ మొకటి యిమిడియున్నది. 'ఈరాజు తానేమిటికి ముఖ్యుండఁ గా' దనుచున్నాఁడు. ఇది తప్పు. ఒకరిరాజ్యము మరొకరు దౌర్జన్యముతో నాక్రమించుకొనుట, ఒక పతివ్రతను నిండుసభలోఁ గట్టుపుట్టము లొలిపించుకొనుట- ఇవి మహాపరాధములు. ప్రత్యక్షపరోక్షకారణములతో వీనికి బాధ్యులైన వారందఱు నిందులకు బాధ్యులు. అందరికి శిక్ష జరుగవలెను. ఎవరి విషయమున వీ రీతప్పు చేసిరో-వారే-ఆధర్మరాజే శిక్షింపవలెను. అతనిచేతనే శిక్ష చేయింపవలెను. కావుననే 'ధర్మపుత్రున కింతయు నెరిగింపవలె'నని శ్రీకృష్ణుఁడు చెప్పెను. అనర్థకరమైన మహానర్థ మిది. దానికి శిక్ష జరిపించుటయే శ్రీకృష్ణుని ప్రయత్నము. ఇది సరియే కాని 'ఆశిక్షనుగూడ దానే జరిపింపవచ్చునుగదా!' యని తోచుట సహజము. అచ్చటనే శ్రీకృష్ణునియలౌకికవ్యక్తిత్వ మిమిడియున్నది. అది సామాన్యుల కర్థముగానిది.

ఈసంగతిని మఱొకరీతిగాఁ దెలిసికొనవచ్చును. దానిని సంజయుఁడు గాంధారీవేదవ్యాసులయెదుట ధృతరాష్ట్రునితో నిట్లు చెప్పెను. సంజయుఁడు "ఆసేనకు నీసేనకు।వాసియడిగె దీవు నన్ను, వసుదేవసుతుం।డాసేనఁగలఁడు, తత్సము నీసేనఁ జూపుము" "అతండు పార్థునెనసి యేకార్థుఁడై యుండు-పూర్వశపసఖుండు గాన" "అట్టి వాసుదేవుని చక్రంబు నిజమాయాబలంబుగఁ బాండవుల సర్వసమరసాధనంబులయందును సూక్ష్మరూప వ్యాపియై నిలిచి వారికి విజయంబు నొసంగుచుండు." "వారికి, బలమును సత్త్వంబు హరియె" "తలఁపునన వాసుదేవుఁడు।కలిగింపను నిలుప నడఁపఁగా నోపు జగంబుల" "నీతనూజుల నిక్కమ నిగ్రహింపఁ।దలఁచినాఁ డమ్మహాత్ముఁడు." ఇత్యాదిగా వివరించెను. ఇంతగాఁ జెప్పినను వినని మహామౌర్ఖ్యమునకుఁ బ్రతిక్రియ యేముండును? సకలజగన్నియామకుఁ డయిన భగవంతుఁడే అట్టి ప్రతిక్రియను జెప్పి చేయించవలెను. ఎట్లును జేయువాఁడు లేనప్పుడే భగవం

తుఁ డాపనిని దాను జేయును. ఇప్పుడు ధర్మరాజుతోఁ జెప్పి చేయించుటకే నిశ్చయించి తాను ధర్మజుకడకుఁ బోయెద ననెను. శ్రీకృష్ణుఁ డూహించిన మహోర్థ మిది :

ఇపుడు ధర్మరా జిట్లు నిశ్చయించెను. "కృష్ణుఁడు లోకో త్తరపురు షుఁడు. ఆయనసంకల్ప మమోఘము, జగము తలక్రిందై నను అది జరుగవలసి నదే "ధర్మనిస్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవ ముండెడిఁ" అనుట ఆయననిశ్చయము. కావున యుద్ధ మగుట తప్పదు అందుకు వలసిన సన్నాహమంతయుఁ దానే సమకూర్చినాఁడు. 'కౌరవులయెడ దండంబు దక్కనొండుపాయంబులే దనుటకు, మీకుం బోలినతెఱంగుసేయుం' డనుటకు నిశ్చితపరమార్థ మిదియని తేలినది. కురుక్షేత్రసంగ్రామ నిర్వాహకుఁడు ధర్మ జుఁడుగాదు. నిర్వాహకుఁడు గానప్పు డందలిపుణ్యపాపములతోఁదనకు సంబం ధము లేదు.ఇది అసందిగ్ధవిషయము. ఇది సరియే.బంధునాశముఁగూర్చిమనస్సు క్రొక్కట పడుచున్నది. దీని కిప్పు డేమి చేయవలెను ? చేయవలసిన దంతయు నెదుట నున్నపు డింకేమి యడుగవలెను? ఇట్లనుకొనుచునే తమ్ములఁ జూచి" కురుసభఁ బుట్టినచందము।హరి యంతయుఁ జెప్పె; నింకననుమానములే;।దరి మర్దనమున కయ్యెడు।వెరవుం జేవయును మెఱయ వెడలుఁడు గడకన్' అని హెచ్చరించెను. ఆహెచ్చరింపులో లోపలి యాందోళన వ్యక్తమగుచునే యున్నది. అజాతశత్రుండు కరుణాయత్తచిత్తుండై యచ్యుతు నాలోకించి, కురువంశముఁ ద్రుంచుటకై ।చొరఁజాలక నామనంబు సుడివడియెడు; నే।వెర వుం దొరకొనదుగదే।సరసీరుహనాభ! పొందు సంపాదింపఁ"అనిప్రార్థించెను. ఈప్రార్థనలో నాతనిమోమున హృదయమంతయు నచ్చొత్తినయట్లుముద్రిత మైనది. "సరసీరుహనాభ" అన్నమాట ధ్వనించుచున్నది. ఇప్పుడు కృష్ణ పర్యాయపదముగాఁ గాక పరమార్థప్రతిపాదకముగనే యాతఁడు 'సరసీరుహ నాభ' యని యుచ్చరించెను.

కృష్ణునిహృదయ మార్ద్ర మైనదేమో! ఱుణ మాలోచించి ధర్మజుని జూచుచు. "ధర్మరాజా! ఇంక నయ్యసం।బద్ధునితోడ సంధికి నుపాయము నామదిఁ దోఁప దెమ్మెయిఁ"అని పలికి, "విదురు నేకాంతవచనంబులు, భీష్మ ద్రోణాదుల మనఃక్షోభంబుఁ, గుంతి కౌరవులు వినం బలికిన పలుకులుం బ్రశం శించి, 'ధర్మపుత్రుపైఁ బాపంబు లేకునికిం' దెలిపి, సమరం బవశ్యక ర్తవ్యంబుగా

నిశ్చయించెను. ఇప్పటికి ధర్మపుత్రునకుఁ జాలబరుపు తగ్గినట్లె తేలికపడి తమ్ము లవైపు చూచెను. వారు నన్నను జూచుచుండిరే గాని బదులు పలుకలేదు. ధర్మరా జూరకుండలేదు. "మీరు నిర్ధారణసేయుఁడా - హితము ధర్మము నయ్యెడు వృత్తమెట్టిదో" అని తమ్ములఁ బ్రశ్నించెను. అంత నర్జునుఁడు లేచి "హితమును ధర్మముం దగవు 'నిట్టిది' నా మన మేమినేర్తు; మఁచ్యుతుఁడు సమస్త ధర్మపరిశోధకుఁ; డా విదురుండు సమస్త ధర్మపరిశోధకుఁ; డా విదురుండు,పాండుభూఁపతి సతియుం దగం బలుకు పల్కులసందియ మెల్లఁ బాసె; నిట్లితఁడు రణంబుసేయుఁడన, నింక విచారములెల్ల నేటికిఁ" అని తేగవేసి పల్కెను. దానితో నన్నిసంశయములు తీఱినవి. ధర్మజుఁడు జాగరూకుఁడై లేచి, "అట్లకాక! అఖిల ధర్మజ్ఞానఘనుఁడు, మనకు నేడుగడయుఁ దానఁ బోరి నిశ్చయింప సంశయం బేటికిఁ,సంఘటింపుఁ డుగ్రసమర విధము" అని చేయెత్తి చాఁచెను.ఆతనికంఠము ఖంగున మారుమ్రోగెను, వెనుకటియాందోళన పటాపంచలయ్యెను. మునుపటి జంకుగొంకు లప్పుడు లేవు. దీనికి కారణ మున్నది. ఈ చేయుకార్యమున ధర్మచ్యుతి లేదు; పాపములేదు. దీనిని సర్వజ్ఞుఁడైన శ్రీకృష్ణుఁడే నిశ్చయించెను. అర్జునుఁడు బలపఱచెను. ఆతఁ డాయనలోనివాఁడే. ఆయుధహస్తులై యరుల దునుమాడుటే తమపని. కరచరణాదులు చేయుపని. అట్టిపనికి ధర్మరాజు నాయకుఁడు - నిర్వాహకుఁడు శ్రీకృష్ణుఁడు. ఈ నిశ్చయముతో ధర్మరా జపుడు ముమ్మరముగా మోహరము మొనకట్టెను.

ఇచ్చట నింకొక విషయము చెప్పవలెను. బలరాముఁడు పాండవ శిబిరమునకు వచ్చి సత్కృతుఁడై "కౌరవపాండవులు ఘోరసమరంబు చేయనుద్యుక్తులైరి. దీని మాన్పింపు మని నే నెన్నిమారులో కృష్ణునికిఁ జెప్పితిఁ గానిచేయఁడయ్యె; "ఏమనియలుకమెయిన్ సంధి చెఱిచి హరి యేతెంచెఁ?" 'కావున వీరికిఁ జయము గల్గుట నిశ్చయ,మెల్లభంగులఁజావు నిజంబువారికి' 'హరి యెఱుఁగని చక్కటియును పురుషార్థము నా కెరుంగఁబోలునె? 'ఇత్యాదిగా నుపన్యసించి,వాసుదేవధర్మపుత్రు లొడఁబడియనుప సరస్వతీతీర్థమునకుఁ బోయెను. బలరాముని రాకపోకలతో కడకు సాక్షాత్సంబంధము లేదు గాని ఆతఁడు చెప్పినమాటలతోఁ గొంతసంబంధమున్నది. బలరాముఁ డీ యుద్ధ కార్యములో ప్రవేలుపెట్టుట శ్రీ కృష్ణున కిష్టములేదు. దానిని తొలుత నభిమన్యునివివాహమున జరిగిన సభయందే కొంత యస్పష్టముగ వ్యక్తము

చేసెను. తరువాతగూడఁ జెప్పియుండును. కనుకనే బలరాము డిప్పు డాసంగతి నెత్తి తన్ను నెపపెట్టి మాటలాడినను జంకుగొనలేదు. నెమ్మదిగా సరస్వతీ తీర్థమునకు సాగనంపెను. ధర్మరాజుసంగతి యదికాదు. బలరాముఁడేపతుము వాడగు సంగతియు ముఖ్యము కాదు. యుద్ధమున కనుమతించుటలోఁ దాను తొందరపడెనా యనుటయే యింకను బాధించుచున్నది. కాని బలరాముని మాటలవలన నా సందేహము పూర్తిగాఁ దీఱినది. సంధి కాకుండఁజేసిన వాఁడు శ్రీకృష్ణుఁడే యనుటయు వ్యక్తమైనది. పైగా, "హరి యెఱుఁగని చక్కటియును,పుషార్థము గలదె"యనుటలో సర్వసందేహములు దీఱినవి. కనుకనే అతఁడును సత్కరించి సాగనంపెను. తననిశ్చయము సరియైన దన్న యుత్సాహముతో ముందడుగు వేసెను.

ఇంకొకవిషయ మున్నది. ఉభయపక్ష సైన్యముల నతిరథమహారథాది నిర్ణయము భీష్ముఁడు చెప్పఁగా దుర్యోధనుఁడు వినె నని తెలిసి, ధర్మరాజర్జు నుని జూచి, "నీచేతం గౌరవబలంబు లెంతతడవునకుం దెగు" నని యడిగెను. అర్జునుఁడు చిఱునగవుతో - "ఏఁ గడఁగినన్ జూర్ణంబు గావింతు నొఁక్కొని మేషంబున దేవదానవులతోగూడ త్రిలోకంబునుఁ"అని చెప్పి,పాశుపాస్త్ర ప్రభావం బుగ్గడించి,- "దీనిని భీష్మాదు లెరుఁగ'రని పొగడి,"అట్టిఘోరసాధ నంబున సమస్తంబు సమయించుట యుక్తంబు గాదు,తక్కినయాయుధంబులన పోరి వైరులం బరిమార్చినం బౌరుషంబు దీపించు"ననిపలికి, భీమసేనాదుల బల పరాక్రమాదులం బ్రస్తావించి, "అందఱం జెప్పనేల - నీయొక్కనికిం ద్రిభువనంబు లెదురే? నీవు నిక్కం బలుగవు గాక-నీ వలిగిన నెవ్వ రెట్లయ్యెదరో యటుసూడుము" ఇత్యాదిగాఁ బ్రస్తుతించెను. ఇది యొకకార్యకర్త యడుగుటయుఁ జెప్పుటవలెఁ గాక యంతకంచె విశిష్టమైనదిగా నెంచి ధర్మరాజు మూపురము లుప్పొంగెను. కృష్ణునితో దైవబలము, పార్థునితోఁ బౌరుషము భీమసేనాదులతో నంగబల సర్వస్వము-ఇట్లు బహిరంతరావేశిత సర్వబలసన్న ద్ధుఁడై ధర్మరాజు విజయశంఖము పూరించెను.

ప్రకృతములై ప్రాస్తావికములైన యొకటి రెండంశముల నిపుడు ముచ్చటింతును. శ్రీకృష్ణుఁడు కర్ణునితో నెల్లసంగతులు ముచ్చటించిన తరు వాత యుద్ధము నిశ్చయింపుచు, "ఎల్లభంగులఁ బాండవులు గెల్తు-రది యట్లుండె. మీకుం దోడువచ్చిన రాజుల కందఱకుం జెప్పుము. ఇమ్మాసంబు

సౌమ్యంబై శీతోష్ణంబులు లేక, పుష్పఫలోపేతంబును, సమస్తధాన్యంబును, సులభయవసైంధవంబును నగుచు నొప్పియున్నయది. ఏడెనిమిది దివసంబులకు నమావాస్య వచ్చు నది పుణ్యదినంబు, నాఁడు భండనంబు గావలయు"నని చెప్పెను. ఏడెనిమిదిదివసములకమావాస్య వచ్చుననఁగా-నామాట లాడుదిన ము బహుళసప్తమి కావలయును. యుద్ధ మమావాస్యనాడు జరిగినచో అప్ప టినుండి పదిదినములు భీష్ముని యుద్ధము, తర్వాత ద్రోణయుద్ధమున నాలవ నాఁటి రాత్రి చీకటిలో దివ్వటీలుపట్టి యుద్ధము చేసిరనియు, నాతర్వాత చంద్రోదయ మెప్పుడో యయ్యెననియు గ్రంథము చెప్పుచున్నది. గ్రంథోదా హృతము సత్యమే కావలయును.అయినప్పుడు. చీకటిలో దివ్వటీలుపట్టి యుద్ధ ముచేయుటయు, ఎప్పుడో చంద్రోదయ మగుటయు బహుళచతుర్దశీ ప్రాంత మున జరుగుటచే, ఆ యుద్ధము బహుళ ప్రతిపత్తున సంగతమై యుండును. కృష్ణుఁడు చెప్పినరీతిగా శుక్లప్రతిపత్తునఁగాని బహుళఅమావాస్యయందుగాని జరిగియుండదు. పరస్పరవిరుద్ధమయిన యీ యంశము నెట్లు చెప్పెననునది ప్రశ్న:గ్రంథోదాహృతమును సత్యముగనే భావింపవలయుననియు, కృష్ణుఁడు చెప్పినమాటలలో, అప్పటికి యుద్ధము జరుగలేదు గనుక, అదిజరుగుటనూహిం చి, అందాజుగా 'ఫలానా'నాడు యుద్ధము జరుగునని చెప్పెననియు భావింప వలయును. కృష్ణుఁడు హస్తినాపురమునుండి యుపప్లావ్యమునకు వచ్చి ధర్మ రాజాదులతోఁజెప్పి యుద్ధము నిశ్చయించుటయు సైన్యాధిప, సర్వసైన్యాధి పాది నిర్ణయము చేయుటయు మొదలుగా నెన్నో కార్యకలాపములు జరుగ వలయును. అన్నిసన్నాహములు తీర్చుకొని ఎదురెదురుగా మోహరించుటకుఁ గనీసము పదుము దినములై నను బట్టవచ్చును. కావునఁ గృష్ణుఁడు చెప్పిన అమావాస్యాయుద్ధ మూహించినదే గాని యథార్థముగా జరిగినది కాదు. ఇఁక గృష్ణకర్ణుల రహస్య సంభాషణముగూర్చి యొక్కమాట. ఆనాఁటికది రహస్యసంభాషణమే. యుద్ధము ముగిసి ధర్మరాజు నివాపాంజలి యిచ్చువరకు రహస్యముగనే యున్నది. తర్వాత నది బహిరంగ విషయమైనది.తర్వాతగ్రంథ ములో నుదాహరింపబడి లోకమునకు వెల్లడియైనది. కర్ణుఁడు పెరిగి పెద్ద వాఁడై, కడపటి యుద్ధమున మరణించినంతవరకు కర్ణజననవృత్తాంతము రహస్యముగనే యుండుటయు, కృష్ణుఁడు దాని నట్లే యుంచుటయు- నది దేవరహస్య మని తెలియుచున్నది.

ధర్మరాజు శంఖము పూరించుటతోఁ బాండవోద్యోగము చివరిదశకు వచ్చినది. ఉద్యోగమనఁగాఁ బ్రయత్నము. ఏపని చేయునపుడైనను, దత్పరియత్న ముద్యోగమనఁబడును, పర్వమనఁగా విభాగము. రాజ్యభాగము సాధించుటకై చేయుప్రయత్నము నుద్యోగపర్వ మని చెప్పుట యుక్తము. పాండవుల రాజ్యభాగలాభమునకై చేయుప్రయత్నము పాండవోద్యోగపర్వ మని తేలినది. 'ఆది - సభా-ఆరణ్య-విరాటపర్వము'లనునప్పుడుకూడ నీయర్థమే సరిపోవును. కాని, రాజ్యభాగలాభమునకై ప్రయత్నింపవలసినవారు పాండవులే యైనను, ఈ యుద్యోగమున నంతట నిలువు నేకదా పరిమళించినది శ్రీకృష్ణప్రభావము. ద్రుపదపురోహితునిఁ బంపుటమొదలుకొని-యుద్ధము నిశ్చయించి నంతవరకు సర్వాంతరముల శ్రీకృష్ణుఁడే విరాజిల్లు చున్నాఁడు కనుకఁ బాండవులరాజ్య లాభమునకై శ్రీకృష్ణుని ప్రయత్నముగాఁ దోఁచుట సహజము. కాని తావన్మాత్రమున నిది విశ్రాంతముగా లేదు. భూభారము తగ్గించి ధర్మము నుద్ధరించుటకై భగవంతుఁడు చేయుమహాప్రయత్నముగా నిది రూపొందినది. తప్పులు ఒప్పులు-నన్నియుఁ దనవిగాఁ-గానివిగా నటించి,చివరకు శ్రీకృష్ణుఁడు "నిమిత్తమాత్రం భవ సవ్యసాచి"అన్నట్లుగా రథమునడిపించినాఁడు,"గాండివంబు దీప్తులు మిఱుమిట్లుగొన్న కనుదోయి-గుణధ్వని ప్రయ్యలై నవీనులు" గా నరుఁ డాతేరిపై నరుగుచున్నాఁడుఆ. సంరంభము జూచుటకై యందఱు సందుచేసికోవలెను గదా!

ఈ యుద్యోగపర్వానువాదమునఁ దిక్కనగారితీర్పు చాలచిత్రమైనది. తక్కిన పర్వములయనువాదముకంటె విశిష్టమైనది. మూలమున నాధ్యాత్మికములు, నీతిబోధకములు, పూర్వకథా ప్రస్తావనలుగా నున్నవాని ననువాదమున నంటలేదు. అందుకొన్నను నామనిర్దేశమాత్రములుగా నుట్టంకించెను. కొన్ని శ్లోకములతో నున్నదాని నొకటిరెండు పద్యములుగా, కొన్నియథాతథముగా, అచ్చటచ్చటఁ బడియున్నవాని నేర్చి యొక పద్యముగా ననుసంధించెను. కొన్నిచోట్ల మూలమును పెంచి మెఱుగుపెట్టిన ఘట్టములు గలవు. ఆ విషయవివేచన మంతయుఁ బీఠికలో సూచింపఁబడినది. ఇప్పు డాయన సాహిత్యమునఁ గొన్ని మెఱుఁగులు చూపుట యుక్తము.

కావ్యతాత్పర్యకముగనే గాక, సందర్భాలంకారముల కై కూర్చినవర్ణనలు పెక్కులు. అవి యిట్లుండును. "తనకులంబునఁ బుట్టినధార్తరాష్ట్రులు

లన్నదమ్ములతో నిగ్రహంబు గొనుట।కుమ్మలించి వివర్ణతఁ నొంది నట్లు।గంది, యెంతయుఁ జెలువేదెఁ జందురుండు"-ఇత్యాదిగాఁ, జంద్రాస్తమయ,తార కోదయములు. చక్రవాక, శుకకోకిలభృంగవిహారములు, మలయానిలసంచా రములు సూర్యోదయ సూర్యాతపప్రసారములు వర్ణించెను. "కలయట్టి వివి ధార్థములు విశేషంబుగఁ। దగ నొసంగుండు సత్పాత్రములకు"అనిశ్రీకృష్ణుఁడు కారవుల నుద్బోధించి పలికినమాటలు, "కోల్పులివీకమై గొదగొని లేళ్ళకు నుఱుకు తెఱంగున దజియఁజొచ్చి"ఇత్యాదిగా భీమసేనాదుల భుజాటోపవిజృం భణములు,"గాండీవగుణరవం బొండొండఁ జెలగంగ,శరపరంపర లాకసంబు గప్ప"నని యర్జునునియస్త్రపాండిత్యప్రాభవము, "అగ్నికుండమున ద్రోణా చార్యునకు నాశమొనరించు దానికై యుద్భవించె"నని ధృష్టద్యుమ్ను దొడ్డ తనము; 'వటుస్థ్సలంబున వనమాల గ్రాలంగవెలిమావు గెడలవాగెలు ధరించి' అని అర్జున సారథియగుకృష్ణవర్ణనము,"ప్రాణంబుతో గూడ రక్కసిచన్నుల పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె"యని పురస్త్రీలు గోపాలువర్ణించినఘట్ట ము- ఇట్టి వెన్ని యో యందు నచ్చటచ్చటఁ దమయున్కి జ్ఞప్తి చేయుచుం డును. శ్రీకృష్ణుఁడు ప్రాకృతమూర్తిగా మొదలై పరమార్థతత్త్వమువరకు వ్యాపించిన వివిధరంగవిన్యాసములును యథాశక్తి సంవేద్యములుగాఁ జెప్పుట యిందులో గొప్పలో గొప్ప. తెలుగుభాసకు నిండుదనము గండతనము కర గించి పోతపోయుటలో నితఁడు సిద్ధహస్తుఁడు. మహాకవియైనవాఁడు మహా మంత్రిగా మనసుపండినలోకజ్ఞుఁడుగా నుండిన 'నిట్లుండు' ననుట యిందు ప్రతిపద్యమునఁ బ్రత్యక్షమగును. ఇంతయు తెలుగువారు చేసిన పుణ్యఫల మనుటలో నతిశయోక్తి లేదు.

తిక్కనగారి భాషాప్రాభవ మపూర్వమైనది. ఆంధ్రవిద్వల్లోకము వేవిధ ముల ముక్తకంఠముగాఁ గొనియాడినది. కొంచెముగానైన దానిని రుచిచూ చుట యుచితము. తిక్కనగారి పదకోశమునఁ జేరి ప్రజావదనములఁ బారాడు పదప్రయోగము లిట్టివి:- వెసగలకాలరులు, వెలివీడు, కొట్టినతిండికాఁడు, పవడించు, కొండుక, పల్లాయనంబువారు, ఒత్తొరువు, హోరాటము,అడియా సలు, కొఱతనుఱుకులు, పొంతువ, బెండు. వెడవెడయలుక, వాయోడు, కూటువమూఁక, ఏలిమాటలు, ముక్కుననావి, చావడము,వేరిమి, క్రొత్తది, కోరడము, వేసరి, వాయపురజ్జులు, గూఢచర్య, కడవఁబడు, ఉవ్వెత్తుకొను,

కవణము, లఘుసంచరణము, అడియరితనము, చక్కసగము, ఒట్టినమంటలు, నమ్మిగ, చిడిముడిపడు, చిదురుపాలు, వీరమదము, పొనుపడు, ఆతల-ఇత్యాదులు:

తిక్కనగారి పదబంధవిన్యాసము లిట్టివి:- వారొకతల-నేనొకతల, నేలయొత్తికొన, పెట్టనికోట నీకు హరి, గొడ్డువోయినవారు, కుదుటఁగూడువెట్టి కుడుచువారు, చెవులు చీములుకట్టు, ధర్మసూతి మెత్తనిపులి, ఎరవయి నిల్చు, పటివోదురు, చిచ్చయినఁ బిడికిలింతము, అరచేతికిఁ దేరఁజాలు, ముక్కారి వగచు, కడకోఅవులట్లు, ముకుఁద్రాటఁ గాలు గ్రుచ్చు, పుడమియెల్ల నొడ్డ గెడనయి, తోడు దొనలేని, బఱపికొనిపోయి, నీకై పొరలితిమి, ఒకచాలు వానిబలుతీర్పు, వెఱగునఁ బుల్లవడు, ఒంటర మింటరములు, చీదకనుపడు, మీకభరము, విడిదలపయనములు, వెలలి బలరిపుఁడు, చిక్కనిపోటుమానిసివి, అరవాయిగొను, సరివింటివాఁడు, అది ప్రాప్తకాలంబు, ఉక్కుఁగలఁడు, గదనేర్చు ముసురుకవిసి, తిట్టుపాట్లు, పాములనెట్లట్ల, తూలపుచ్చు,అడుగు మాలిపోవు - ఇత్యాదులు.

తిక్కనగారి వాక్యరచనాచాతురి యిట్టిది:-మిముఁ జేరి నెగడువాడఁ, కారుణ్యమున నిట నరసియుండుఁడు, తానైన నపుడు నీతిపథము విడిచె - మమ్మెననిపుడు చక్కని పథమున నడవుఁ డనె, పిల్లిపట్టిన యీరువు సేసియున్న, పీపు చక్కనయి నిల్చుఁగాక, నామోమున ప్రేలెదుఁ, విరిగిన బారసాపవచ్చునే। వారు బ్రాహ్మణులె యేకీడైన సైరింపఁగఁ,రథమురథము కదియరానిచ్చి,దుఃఖములై నవి తెగుసమయము,మీమేనత్త నూఅడింపుము,పాలకడలికడలిపాటయైయెప్పు, మొనతలఁబడు, భూమి యొనర్చి పాండున్నపపుత్త్రులకిత్తునె, ధర్మజవారిరాశిఁ జెలియలికట్ట వాసె, పొట్టుపొరలయ్యుఁ గయ్యంబునాడుచు, ఉఱుకడకేగి తోడుపడు, ఇంతలేక యాడు మెల్ల వినఁగ, తిగిచికొనివచ్చునెడ, అభిమతం బిదికాకయుఁ గల్గెనేనియుఁ బూని యెనర్తు, నెత్తురు నీరఁదేల్చు, కురుఱితీళుఁ డను బ్రహ్మకు వేయును నిండు, సర్వాకురుసంతతిన్ గలవాఁడుకాఁడె, నామోమునన్ ప్రేలెడున్, విచ్చుఁడు వెసవచ్చు గాండివంబును దానుఁ,ఆర్చిన మూరెడు నేర్చు, చేతులతీటం బుత్తుము, విచారవివేకంబుల నాయెత్తు వత్తురె, గాలియును జిట్టాడంగనీను, ఇది యిట్ల

యెయ్యఁ–దక్కినది యట్లుండె, మనఁబోవకపోవఁగరాదు, కై పెక్కినట్టితలఁపు, మాఱటనోరిచానను, ఒద్ది యేఱు విడిసి, – ఇత్యాదులు పరశ్శతములు:

తిక్కనగారి యుపమాసము–లర్థాంతరన్యాసము లిట్టివి:–మడుగుఁ జీర యందు మసిచాకినట్లు, మాకుం గుడు మిండు–మీరు వ్రక్క గొనుఁడు, రోష మయమహాతరువు–ధర్మతరువు, సాదు రేగెనేనింబొలతలమునఁ గాని నిలువఁ బోఁడు, పాలలోఁ బడిన బల్లివిధంబున,నిప్పులు వేడిమి సెడినట్లు, వింజం బాకి డినకరణి,విధిసేసినగతిఁ బడకయుండ శివునకువళమే, కొడం గనితగరు చాఁకఁ గోరుటఁగాదే, నిప్పులన్ బొరలినయట్లు, విసంబుచవిఁగాలము మ్రింగినయట్లు, నీళుల నగ్ని పుట్టినయట్టిది, అట మిన్నందినవానిపొడ వెంతన్నట్లు, మంటలో మిడుత లుదగ్రవృత్తి నుఱుకదలచినట్లు, నేవోసినయగ్నిభంగి, కావిసెలయేఱుల తోడి నగంబులట్లు,పామున్నయింటిలో నున్నయట్లు, చిచ్చొడింగట్టినయట్లు, గజంబు గజంబు పల్లవం బల్లన తెమల్చులీల, శ్రీ రా మోకా లొడ్డినవాని విధము,–ఇత్యాదులు పెక్కులు.

తిక్కనగారి వ్యాకరణవిశేషము లిట్టివి:– సురరాజ్యశ్రీ వాలింపఁగ, యోగక్షేమంబున తెఱఁగు, కాన తగంబొందుట, (ఇచ్చటకాన–కళ) కాన నవశ్యము(ఇచ్చట కాన్తద్రుతప్రకృతికమువేగ తెగంబాఱకు(ఇచ్చట వేగకళ) జగంబులన్నిని, పోవఁగఁద్రోతున్. (త్రోయుధాతువు) అట్టిదింగలదె,ప్రాణా నం గలుగంగ, సంధియ కావింపంబడిరి, మఱాకుమన్న, ఎన్నడేని కృష్ణుని తోడనే జెప్పితి, భూరిశ్రమండతిరథంబులమొదలి, జెట్టానజెట్లు, సుఖమున్న వారె, ఎల్లవెంట, సంభావింపుము విదురునితో.ప్రాణగొడ్డము,కూడదునార, బోనాలు వేర్పింప, చంపుదమ యిర్వురము. ఇత్యాదులు మఱియుంగొన్ని.

తిక్కగారి రచనలో రెండుమూడుప్రౌఢరచనావిన్యాసములు గూడ గనఁబడును. చూడుఁడు:– "ఒకటి గొని, రెండు నిశ్చలయుక్తిఁ జేర్చి, మూఁటినాల్గింటఁ గడువశ్యములుగఁ జేసి." "జ్ఞాతులపోరితమును, గోత్రాత మునాక్రమము,విప్రవర్ణముచనవున్" "తుది రాజ్యమ్ము సగమ్ము గొ–మ్మద వియందున్ పేరు వంచించియున్, పదుమూడేడులు నీవునుం దిరిగి రా; పాలీ కపోవచ్చునే" ఇత్యాదులు దిక్సూచికాప్రాయములు.

తిక్కనగారి ప్రతిభాపాండిత్యములును, లోకశాస్త్ర పరిశోధనాపాటవములును, లలితమధురముగా వింగడించు వైదుష్యమును మున్నగాఁగావ్య నిబంధనానుబంధము లపారములై నవి. ఒకదానినిమించి మరియొకటి మనోవినోదజనకములై నవి. "అల మిన్నందిన యట్టి వానిపొడవెం" తన్నట్లు భావనా సుభగముగా వివేకించి తెలిసికోఁదగినవి. అన్నియు వివరించుట సాధ్యముగాదు. అన్నింటి కుదాహరణముగా, నుద్యోగపర్వమేగాక ఆంధ్రమహాభారతమే మిముం దున్నది. దానిని దీరికతోఁ జదివి యానందింపుఁడని మిమ్ముఁ గోరుచున్నాను.

"కవిః కరోతి కావ్యాని లాలయ తుత్తమోజనః ।
తరుః ప్రసూతే పుష్పాణి వాయు ర్వహతి సౌరభమ్"

సాధారణ-కార్తికిక,
శుద్ధదశమి.

గడియారము వేంకటశేషశాస్త్రి

శ్రీమదాంధ్ర మహాభారతము

ఉ ద్యో గ ప ర్వ ము

39. 1

24

శ్రీ మ దా ం ధ్ర మ హా భా ర త ము

ఉద్యోగపర్వము - ప్రథమాశ్వాసము

క. శ్రీ గౌరీ పల్లవపుట
యోగాశ్రయ మంజరీ సముజ్జ్వలమూ ర్తీ !
యోగీంద్ర సంతశాంత
ర్యాగపరిపాకరూప ! హరిహరనాథా ! 1

వ. దేవా ! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

-: పాండవులు కృష్ణాదులం గూడి భావికార్యావిధానము నాలోచించుట :-

సం. 5-1-1.

తే. ఎలమి నభిమన్యుపెండిలి యివ్విధమునఁ
జేసి, యుల్లాసలక్ష్మి కై సేసి, మత్స్య
మనుజపతియన్వయంబు పావనము సేసి,
దినచతుష్టయానంతరమునఁ, బ్రియమున. 3

వ. ధర్మతనయుండు దమ్ములుం గొడుకులుం బరివేష్టించి యుండ, విశాల
రమణీయం బగు విరాటుకొలువుకూటంబున కరిగి యందు. 4

క. విరటుఁడుఁ, బాంచాలుండును,
హరియును, రాముండు, వారి యనుజతనూజుల్
పరిణయసమాగతాఖిల
ధరణీశులు బలసియుండఁ దద్దయు నెమ్మిన్, 5

వ. ఉన్న సమయంబున, సభాసదులైన మానవేంద్రులు నానావిధంబులఁ
గృష్ణయుధిష్ఠిరులతో సంభాషణంబులు సేయుచుండఁ, బాండవ కార్యా
ర్థియై కృష్ణుండు తదీయవచనంబులు వారించి, వారలఁ గలయం గనుం
గొని యిట్లనియె. 6

మ. కపటద్యూతమునందు సౌబలునిచేఁ గౌంతేయు లాత్మీయరా
జ్యపదభ్రంశముఁ బొంది, సత్యనిరతిన్ శక్తాత్ములై యుండియుం
గుపితస్వాంతులు గాక, తత్సమయసంక్షోభంబు గాకుండఁగా
విపినావాసము గూఢచర్యయును గావింపం దలం పొప్పదే! 7

ఆ. తలఁచినట్ల వ్రతము సలిపి, యమ్మాడ్కిఁ బం,
డ్రెండు వత్సరములు పాండవేయు
లకట! క్రూరసత్వ యాతుధానావలి,
తోడఁ గాననమునఁ గూడి మనరె! 8

క. పదపడి దుస్తరమగు నీ
పదుమూఁడగు నేఁడు గడవఁబడుట యరిది; త
మ్మెదు రెఱుఁగమికై యాపద
లొదవిన సైరించి; రిట్టి యునికియుఁ గలదే! 9

క. మీరలు ధర్మజువర్తన
గౌరవ మెఱుఁగుదుర కాదె; కావున నా గాం
ధారీతనూభవులకును
వీరలకును హితము కా వివేకభ్రౌఢిన్. 10

తే. ధర్మమార్గంబు దప్పక తలఁపుఁ డొక్క
తెఱఁగు; ధర్మువు దప్పి యుధిష్ఠిరుండు
వడయ నొడఁబడఁ డయ్యింద్రపదవి యైన,
నుచితగతి నెంత వడిసిన నుల్లసిల్లు. 11

వ. కావునఁ బాండవులకుఁ బితృధనం బగు రాజ్యంబు గపటద్యూతంబున దుర్యోధనుం డపహరించుటయు, నది వీరలు దిగ్విజయంబుఁ జేసి యలవరించుకొన్న పదం బగుటయు, ధర్మసూను మహానుభావంబు విచారింపక ధార్తరాష్ట్రులు పరిభవించినం దెగి యితండు వారలకుం గీడు రోయమియు, నీరెండు దెఱంగులవారికిం బంచి కుడువం దగుటయుం దలపోసి తగినకార్యంబు సెప్ప నర్హుల; రేనును నా కన్నంత సెప్పెద వినుండు. 12

క. కుంతీతనయులు సమయము
శాంతతమై నడపి, 'తమ భుజాబలమును దు
ర్దాంతోద్యమశౌర్యము నెటి
గింతు' మనుచు నున్నవారు గిను కెదఁ గదురన్. 13

క. వీరి తలం పెఱిఁగిన గాం
ధారీతనయుఁడు సుహృద్వితానముఁ గూర్చుం
'బోరఁ బరిమార్తుఁ గొంచెపు
వారై యున్నెడన' యని యవశ్యము గడఁకన్. 14

క. అలఘుబలవిక్రమోదా
త్తుల కైనను బలము లేక దోర్గర్వముమై
గెలువఁగ వశమె, సహాయము
కలిమి ననంతంబు లగు పగఱసైన్యములన్. 15

క. కావునఁ బాండవపక్షము
భూవల్లభకోటి యిచటఁ బ్రోవగు; నిమ్మె
నీవీరులు నావీరులు
దేవాసురు లట్ల యనికిఁ దెగుదురు గడిమిన్. 16

వ. ఇది యిక్కడి తెఱంగునకుఁ దోఁచినతలం, పక్కడివారి చిత్తవృత్తి యెట్టి దగుట యెఱుంగ, మెదిరిమతం బెఱుంగక యెట్టి కార్యంబు నిశ్చయింప నెరవగునే! కావున నియ్యవసరంబునఁదగిన మానిసి నందులకుం బుచ్చవలయు; దుర్యోధనుండు వీరికి రాజ్యంబుపా లిచ్చిన మే లగుఁ; గాక తక్కిన నప్పటికిఁ బోలిన పని సూచుకొంద" మని పలికిన విని, బలదేవుం డియ్యకొని రాజలోకంబు నాలోకించి యిట్లనియె. 17

క. "హరివాక్యము వింటిరె యిది
యిరుదెఱఁగుల జనములకును హితమును ధర్మో
త్తరమును నై యున్నది; యీ
వెరవున శక్యంబు మనకు వీరలఁ దీర్పన్. 18

చ. తమసగపాలు గోలుపడి దానిన యిప్పుడు గోరువీరికిన్
సముచితవృత్తి నిచ్చి తమసామున సంతస మంది యున్కి యు
క్తము ధృతరాష్ట్రసూనునకు; దాన నపాయము లేక యుండుఁ, గో
ప ముడిగి వీరు సేయుదురు బాంధవ; మిజ్జగముం బ్రియంపడున్. 19

వ. కావున నిక్కార్యం బెడసేయక యొక్కరుం బనుపవలయు; వాఁడునుం
జని యభిమతంబు సాధించునప్పుడు. 20

ఆ. మాటపొం దెటింగి యోటమై నల్లన
చేరి కారవేంద్రుచిత్తవృత్తి
కనుగుణంబుగాఁగ నానతుం డగుచుఁ బ్రా
రి ంచి యడుగకున్నఁ దెఱఁగుపడదు; 21

వ. అది యెట్లనిన, ధర్మనందనుం డతని యుద్ధతికిం బయిలోడి మెయివడి
గల నడవడింబ్రవర్తిల్లు చుండియుం, జూదంబువెంట మోసపోయి తొడరి
చిక్కునం బడియె; నదియును, నతం డతివిద్యాపాటవంబు దనకు మిగుల
లేమిం జేసియు,బంధుజనంబులు దన్ను వారించుటయుఁ దా నాడుట మాని
గాంధారరాజు నియమించినం, దత్కళాకౌశలంబునఁ బరిణతుండు
గావున నాశకుని యాడి, యుధిష్ఠిరుం డొడ్డిన యొడ్డిమియు గెలుచుచు
వచ్చె; నట్లగుట నాతనియందును గొఱంత లే; చిత్తెఱంగున వార
లధర్మపరు లని నిందింపరాకునికి కారణంబుగా, వీరలు వుచ్చినమానిసి
వినయంబుతోన యిక్కార్యంబు దీర్చికొని రావలయు" ననిన, సాత్యకి
గోపించి యిట్లనియె. 22

-: సాత్యకి దుర్యోధనుకడకు దూతం బంపఁగూడ దని చెప్పుట :-

సం. 5-3-1.

ఆ. "ఇట్టు లాడఁదగునె? యిది నీక పోలు; ని
న్నేమనంగ నేర్తు, నిత్తెఱంగు
పాడి గాఁగఁ బూని పలుకంగఁ, జెవియొడ్డి
యాదరించువారి నందుఁ గాక! 23

క. వేడుక పుట్టిన జూదం
బాడెనె ధర్మజుఁడు? వార లందఱు దమలోఁ
గూడికొని పిలిచి బలిమిన
యాడి కపటజయము గొనుట యిది దగ వగునే? 24

క. ధర్మతనూభవుడెస దు
ష్కర్మము రూపించి సభ నొకండును మైమైఁ
బెమ్మ సెడక పోనేర్చునె?
ధార్మికు లిం కెట్టివారు తథ్యం బరయన్? 25

చ. పలికినచందముల్ నెఱపి, పైతృక మై చనురాజ్యభాగ మి
మ్ములఁ బడయందలంచి, బలముం జలమున్ నెఱపం గడంగు వి
రలు నొరు వేఁడఁ బోదురె? యరాతులు సాధుల మెత్తురే? రణం
బుల జయలక్ష్మిఁ జేకొనుటఁ బోలునె యొండొక రాజధర్మముల్? 26

తే. సముచితము లగు మాటలఁ జక్కఁబడక
తక్కినే నుక్కువుం డగు ధార్తరాష్ట్రుఁ-
గ్రూరశరముల నే నియ్యకొలుపువాఁడ-
నవని గొంతేయులకు నిచ్చునట్లు గాఁగ; 27

క. భీమార్జునులకు రణమున
నేమగలును బ్రతియె? వీరు నేనును సైన్యో
ద్దామముల మై నడచిన, నే
భూమీశులు నెదిరి బ్రదికి పోవంగలరే? 23

ఆ. కవలవారుఁ గొడుకుగమియుఁ జాంచాలవ
ర్గంబు వృష్ణివరులుఁ గడఁగిరేని,
నొక్కమాత్రలోని నువ్వెత్తు గొనరె దు
ర్యోధనాది శతము నుద్ధవిడిన? 29

క. ఈమత్స్యపతి సహాయము
గా మాకుం దీర్పరాని కార్యము గలదే?

సామాద్యుపాయపరుఁ డు
ద్దామభుజాబలయుతుం డితఁడు కేవలుఁడే? 30

క. నామతమునఁ గార్యము సం
గ్రామము సేయుటయ; యిట్లు గా కీలోనన్
సామవచనంబు లక్కఱ
భూమీశ్వరు తోడ నాడఁ బుచ్చెద రేనిన్. 31

ఉ. చైన్యము దక్కఁ దూత యుచితంబుగఁ 'శాండునృపాలుపాలు రా
జన్యవరుండు ధర్మజుఁడు సమ్మతి వేఁడెడు నన్న, లోకసా
మాన్యవిధిం దగంగ గరిమంబున నిచ్చినఁ బుచ్చికొంద, మ
న్యోన్యవిరుద్ధభాషణము లాడినఁ దత్ఫల మాతఁ డందెడున్." 32

వ. అనిన ద్రుపదుం డిది వోలు, బలదేవుమాట మాట గాదు, బలపరాక్రమ
వంతుండును సహాయసంపన్నుండును దుష్టాత్ముండు నైన దుర్యోధనుండు
ప్రియవచనంబుల రాజ్యంబు పాలిచ్చుట కియ్యకొనమి సిద్ధంబు, యుద్ధంబు
నంగాని చక్కఁబడఁ"డని పలికి మఱియు నిట్లనియె. 33

క. మృదుభాషణముల దుర్జన
హృదయములు ప్రసన్నతామహిమఁ బొందునె? యె
ల్లిదముగఁ గొని యంతంతకు
మద మెక్కుఁగాక దురభిమానము వేర్మిన్. 34

వ. అదియునుంగాక, 35

తే. కూటికై ద్రోణభీష్ములు గుమతి యనక
యనుసరింతురు, ధృతరాష్ట్రుఁడును దనూజ
తృష్ణనూనినవాఁడు, రాధేయుబోఁటి
తులువలెల్లను నతని సద్బుద్ధి యంద్రు; 36

వ. కావున నతండు దుర్వినీతుండై యుండు, నెల్లభంగుల సంగరంబు గాఁగల
యది, యీ సమయంబున బలంబులం గూర్చుకొని పిలువందగురాజులం
బిలిచి పుచ్చవలయు; సుయోధనుండును దోడాసపడి పుచ్చు; నుచితపరు

లగు నరపతులు దొలుతఁ జెప్పినవారిక సహాయత్వంబుఁ జేయంజూతురు; మనము వెసగల కాలరుల వేగంబ పుచ్చి శల్యకేకయ ధృష్టకేతు జరాసంధ తనయ ప్రభృతులయిన భూపతులకును వారివారి బంధుమిత్రజనంబులకును నెఱింగించి పుచ్చుట కార్యం, బిది నాకుం బోలిన తెఱం''గని పలికి తనకెలన సముచితాసనంబున నున్న విప్రవరుం జూపి. 37

క. ''ఇతఁడు మదీయాగ్రపురో
హితుఁ, డితనికి నెల్లపనులు నెఱిఁగించి తగన్
ధృతరాష్ట్రికడకుఁ బనుపుఁడు
చతురవచనరచనఁ గఱపి సంప్రీతిమెయిన్. 38

ఉ. అతని సమ్ముఖంబునఁ దదగ్రతనూజుకడన్ మరున్నదీ
జాతుని సన్నిధిం గలశసంభవు నొద్దఁ గ్రమోచితంబుగా
''నీ వెఱుఁగ గిటులాడు''మని యేర్పడ నంతయుఁ జెప్పిపుచ్చఁగా
నీతిమెయిం దగం బలుక నెయ్యము లాభముఁ బెంపుఁ జొప్పడున్.'' 39

వ. అనిన, వాసుదేవుండు ''పాంచాలపతివచనంబు లుచితంబు లయి యున్నయవి, యిబ్భంగిన చేయవలయు''నని పలికి మఱియు నిట్లనియె. 40

క. కౌరవులకుఁ బాండవులకు
నారయ నే నొక్కరూప, మట్లగుటఁ దగన్
వారును వీరును దమతమ
నేరిమిమెయి ధరణి యేలి నెగఁడఁగఁ జూతున్. 41

తే. పెండ్లి కని పిల్వఁబంచినఁ బ్రియముతోడ
నేగుదెంచితి, మిన్నాళ్లు నెల్ల యొప్పి
దములఁ జూచితి మియ్యెడఁ దడవుగాఁగ
నిలువఁ దీఱదు, పోయిరావలయు మాకు,'' 42

వ. అని పలికి ద్రుపదు నాలోకించి ''మీరు మాకెల్ల వారికి గురుస్థానంబు, మీ మాట యనిన ధృతరాష్ట్రుండు బహుమానంబు సేయు, మిమ్ము శాంతనవుండునుం గొనియాడు, మీయందు ద్రోణకృపాచార్యులు సఖ్యంబు వాటింతు రట్లగుటంజేసి. 43

తే. పాండవార్థమై యొక్కరుఁ బనుప మీక
భరము; మీ పలు కందఱపలుకు; మీరు
తెఱఁగు పఱుపంగ మిగిలి యుద్రేకులైన,
వార చెడువారు విమలవిచారవిభవ! 14

క. పొందైన లెస్స, విరసపుఁ
గ్రందయ్యెడుచంద మైన, రాజుల నెల్లన్
ముందర రావించి, క్రమం
బొందఁగ మముఁ బిలువఁబంపుఁ డొయ్యన పిదపన్. 45

క. మీ పనుపున రాజ్యము పా
లీ పాండుతనూభవులకు నీకున్న, భుజా
టోపభయంకరుఁ డర్జును
కోపానల మడరి ముట్టికొనదే వారిన్? 46

చ. అని గమనోన్ముఖుం డయి మురాంతకుఁ డా ద్రుపదుండు ధర్మనం
దనుఁడు వృకోదరాదులగు తమ్ములు మత్స్యమహీవిభుండుఁ ద
న్ననుప, హలాయుధ ప్రభృతి యాదవలోకము తోడ రా, ముదం
బున నిజపట్టణంబునకుఁ బోయె సముజ్జ్వలవైభవంబునన్. 47

వ. వివాహమహోత్సవంబునకు వచ్చిన తక్కటిరాజులును సంగ్రామసన్నా
హంబునకై తమ తమ పురంబులకుం జనిరి, తదనంతరంబ. 48

క. సమరమునకుఁ దగు నుద్యో
గమునఁ బ్రవర్తిల్లి రెలమిఁ గొంతేయులు; మ
త్స్యమహీనాథుఁడు సన్నా
హము సేసెన్, ద్రుపదవిభుఁడు నాయిత మయ్యెన్. 49

వ. ఇట్లు సన్నద్ధులై వెలివీడు విడిసి తమకు ననురక్తులైన రాజుల పాలికిం
దగుదూతలం బుచ్చి; రట దుర్యోధనుండు వీరలచందంబు విని తానును
దన బంధుమిత్రగణంబైన రాజలోకంబు నెల్ల రావించిన. 50

క. ఇభతురగస్యందనగతి
రభసంబునఁ బృథివి యద్రువ రాఁదొడఁగిరి భూ
విభులు నలుదిక్కులను లోక
భయంకరలీల నుభయ కటకంబులకున్. 51

-: ద్రుపదుఁడు దన పురోహితుని దుర్యోధనుకడకు దూతగాఁ బంపుట :-

సం. 5-5-28.

వ. అట్టి సమయంబున నజాతశత్రుననుమతి వడసి పాంచాలపతి వయో
జ్ఞానవృద్ధుం డైన తన పురోహితుం గురుపతిపాలికిఁ బుచ్చువాఁడై
యతని రావించి. 52

క. "హితుఁడవు మతిమంతుండవు
చతురవచనకోవిదుఁడవు, సమయజ్ఞుఁడ, వు
న్నతవంశవర్ధనుఁడ, విం
గితవేదివి, నెచ్చెలివి, సుకృతి వట్ల గుటన్. 53

తే. నాకుఁ గర్తవ్య మగుపని నీకుఁ జేయఁ
దగవు గావున, నెల్లవిధములఁ బూని
పాండవార్థంబు ధృతరాష్ట్రపాలి కరిగి,
నేర్పు వాటించి కార్యంబు దీర్పవలయు." 54

వ. అని చెప్పి యొడంబఱిచి యతనితో మఱియు నిట్లనియె. 55

క. "విను, కొడుకు గొన్న వేఁదుఱ
కొని కొట్టిన తిండికాఁడు కుటిలుం డతఁ, డా
జనపతిచందము ధర్మ్మజు
ననుపమశీలంబు నెఱుఁగు దది యట్లుండెన్. 56

తే. పుడమిపాలు పాండవులకు నడుగఁబోయి,
నీవు ధృతరాష్ట్రుతో ధర్మనిష్ఠమైన
యుచిత మాడిన, నందుఁ బోటొడ్డియున్న
దొరల భృత్యుల మనములు దిరుగఁబడవె? 57

క. గురుభీష్మాదుల మనములు
దురములకుం జొరకయుండ, దుర్యోధనుఁ డా
తురుఁ డై యొడఁబఱుపఁగ, ని
ష్పురుసున నెరవైన యీచ్చవడు బల మెల్లన్. 58

ఉ. పాండుతనూభవుల్ పడినపాటులు బంధుల కెల్ల దెల్పుచుం
బండిత వృద్ధ సజ్జనుల పాలికిఁ బోయి కులోచితంబు గా
కుండుట సూపి చెప్పుచుఁ, బ్రియోక్తులఁ దక్కటివారి "నిటు మే
లొండొకచంద మెప్ప" దని యుల్లములం దలపోయఁ జేయుచున్. 5

వ. మఱియు సమస్తజనంబుల మనంబులు నిక్కడ వ్రాలునట్టి యుపాయంబు
లెన్ని గల వన్నియు నయ్యోతగవులమై నాచరించుచుఁ జరియించునది;
యిచ్చట విరాటుకొలువుకూటంబునం బుట్టిన కృష్ణాదుల సంవాదంబు
తెఱంగును మన యెఱింగినయదియె; తదమరూపంబుగాఁ బలికి పాండవులకు;
దేజోలాభంబుం గావించుట కర్తవ్యంబు; నీవు కరినరంబున వసియించి
ధృతరాష్ట్రధార్తరాష్ట్రగాంగేయవిదురగురుకృపాదులకడ కరిగి నానాఁటికి
వారివారి చిత్తంబుల తెఱం గెఱింగి ప్రవర్తింపుము; దైవగతిం జేసి
నీయెఱ్ఱిన సూత్రంబునకు సుయోధనుం దొడంబడియెనేనియు, నదియ
సకలజనసమ్మతం బయినవిధం బగు; దాన నజాతశత్రుండును భీతుం డగుఁ
బోయి ర"మ్మని నిశ్చయంబు సేసిన నమ్మహీసురవరుండు. 60

క. మను పాంచాలవిభుని వీ
డ్కొని, ధర్మజు భీము నరు నకులు సహదేవుం
గని యనుమతుఁ డై, యందఱు
ననుపఁగ మన్ననలు వడసి యరిగెం బ్రీతిన్. 61

—: దుర్యోధనుండును నరుమండును శ్రీకృష్ణుని దర్శింపఁబోవుట :—

సం. 5-7-2.

వ. అంత నక్కడ దుర్యోధనుండు సకలరాజన్యసామాన్యంబుగా గోపాలదేవు
పాలికి దూతం బుచ్చుట దగ వగునే యని విచారించి. 62

క. వెరవుమెయిఁ దాన కతిపయ
పరిజనసహితముగ నరిగెఁ-బటుతురగగతి
స్ఫురణానుమోదలీలా
భరితుఁ డగుచు వేగిరంపుఁబయనములఁ దగన్. 63

వ. చని తదీయపురప్రవేశంబు సేసె, నాదివసంబునన ధనంజయుండును గోవిం
దుం గానవచ్చె నట్టియెడ. 64

తే. అతఁడు పవడింప, మును కౌరవాధినాథుఁ
డరిగి తలయంపి దెస నున్నతాసనమున
నుండెఁ; బదపడి కాల్కడయొద్ద కల్లఁ
జని వినమ్రుఁ డై నిలుచుండె సవ్యసాచి. 65

వ. అంత. 66

క. మేలుకని కృష్ణుఁ డర్జును
నాలోకించి, మఱి కౌరవాధిపుఁ గని, త
త్కాలోచిత బహుమతియైఁ
జాలఁ బ్రియం బిరువురకుఁ బ్రసన్నతఁ జేసెన్. 67

వ. తదనంతరంబ. 68

ఉ. వారలఁ జూచి కేశవుఁడు "వచ్చినకార్యము సెప్పుఁ"డన్న, న
క్కౌరవనాథుఁ డిట్లనియెఁ "గయ్యము సేయువగ్గ సహాయముం
గోరి భవత్సకాశమునకుం జనుదెంచితి; మేము వీరు నీ
కారయ నొక్కరూప హృదయంబునఁ జేర్చినబాంధవంబునన్." 69

క. ము న్నేను గానవచ్చితి,
నిన్ను; సుజను లైనవారు నెమ్మిని మునుముఁ
గన్నం దగఁ గైకొంద్రు; స
మున్నతసౌజన్యసారయుతుఁడవు నీవున్. 70

వ. కావున లోకంబు పాడి విచారించి నాకుం దోడు గావలయు" ననిన,
వాసుదేపుం డిట్లనియె. 71

ఉ. "నీ విట మున్న వచ్చి తిది నిక్కము: పార్థునిఁ దొ ట్టఁ గాంచితిం;
గావున మీకు నిద్దఱకు గౌరవ మొప్పఁగఁ దోడుపాటు స
ద్భావము; దీనికిం దెఱఁగు దప్పకయుండఁగ నేర్పరించెద;
న్మీవల పెట్టు లట్ల తగ నీవును నీతఁడుఁ గోరికొం డొగిన్. 72

క. నాపాటియ పదివేవురు
గోపాలురు గలరు—సమరకోవిదబాహా
టోపాభిరామమూర్తులు
చాపాధ్యాయుధకళావిశారదచిత్తుల్. 73

క. నారాయణాభిధానులు;
వారలు గయ్యంబునేయు వా రొక్కొడ; నే
నూరక నిరాయుధవ్యా
పారతమై నుండువాఁడఁ బరమాప్తుఁడ నై. 74

క. వా రొకతల యే నొకతల;
యీరెండుదెఱంగులందు నెయ్యది ప్రియ మె
వ్వారికిఁ జెప్పుడు; దొలితొలి
గోరికొనఁ బాలునికిఁ దగుం బాడిమెయిన్".

-: అర్జునుఁడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిఁగాఁ గోరికొనుట :-

సం. 5-7-18.

క. అని పలికి హరి గిరీటిం
గనుఁగొని "కొండొకవు నీవు గావున, నీకుఁ
మును గోరఁ" బాడి యనవుడు
విని కృష్ణునిఁ గోరికొనియె విజయుం డెలమిన్. 76

ఆ. చాని కాత్మఁ బొంగి ధార్తరాష్ట్రుఁడు వారి
నపహరించికొనినయట్ల కాఁగఁ

దలఁచి, చెన్ను మీఱి బలములఁ గైకొని
చనియెఁ బ్రీతి రాముసదనమునకు. 77

వ. చని యతనిం గని సమ్మానంబు వడసి తనవచ్చినకార్యం బెఱింగించిన దుర్యోధనునకు బలదేవుం డిట్లనియె. 78

క. "అభిమన్యువివాహమునకుఁ
బ్రభువర్గం బెల్ల గూడఁబడియుండఁగ, నా
సభ నీకై యేఁ బలికితి;
నిభపురమున మాటపుట్ట దే యీవు వినన్." 79

వ. దానికిఁ గొంద అసహ్యపడి పాండవపక్షపాతంబునం బ్రతికూలవచనంబులు వలికిన నవి కృష్ణునకుఁ బ్రియంబులై యుండె; నట్లగుటం జేసి. 80

తే. అతనిఁ బాసి యొక్కింత ప్రొద్దైన నిలువఁ
జాలమియు మూలముగ, విరసంపుమాట
లాడ నొల్లమి, నేమియు ననక యంత
నుండి యొకనిశ్చయమ్మునై నున్నవాఁడ. 81

వ. అది యెయ్యది యంచేని. 82

క. మీరును వారును జలమునఁ
బోరెడు నెడ నెద్ది యెట్లు వోయిన నెటి నే
నూరక యుండుదుఁ; దోడె
వ్వారికిఁ బో; నింత నిక్కువం బెఱింగిన్". 83

వ. అనిన విని దుర్యోధనుండు దాని కియ్యకొని సవినయంబుగా బలదేవుని పిడొక్కని, వాసుదేవు నామంత్రణంబు సేసి, కృతవర్మపాలికిం జని యాతండొక్కయక్షోహిణితోడఁ దన్నుం గలయవచ్చువాఁ డయి యూఁబడంబలికినఁ బ్రియంబంది, నిజపురంబున కరిగెఁ; దదనంతరంబు కృష్ణుం డర్జునునకిట్లనియె. 84

క. "నారాయణ గోపాలుర
భూరిపరాక్రములఁ గురువిభుఁడు గొన, సంగ్రా

మారంభరహితు నన్నుం
గోరికొనుట నీకు మేలగునె తలపోయన్". 85

క. అనుటయు నాతఁడు హరి కి
ట్లను "నేను రణంబునకు సహాయం బొల్లన్
విను, సుప్రసిద్ధుఁడవు నీ
వని సేసినఁ బేరు నీక యగు నెప్పాటన్. 86

వ. నీ కెదురై జయంబుగొన రా దట్లగుటం జేసి, విజయమూలం బగు నీతో
డును వలయు; నీవు సమరంబు సేయకునికియుం బ్రియంబు; కావున
నిన్నుం గోరికొంటి" నని చెప్పి మఱియు నిట్లనియె. 87

క. "సారథ్యం బొనరింపు మ
పారకృపాలీల నెల్లభంగుల, నా కీ
గౌరవమును జిరకాలము
గోరినయది, దీని నిమ్ము గుణరత్ననిధీ. 88

క. అనినఁ, గిరీటికి హరి యి
ట్లను "నీదగుకోర్కి దీర్చుటది నాకు వ్రతం
బనఘా! తగ సారథ్యం
బొనరించెద నీకు నసమయుద్ధక్రిడన్". 89

క. అని యూఱడించి, నరుఁ దో
డొక్కని ధర్మతనూజు నొద్దకుం బ్రియ మెసఁగం
జనుదెంచెం గార్యాలో
చనమును దగఁ జేయుబుద్ధి శౌరి గడంకన్. 90

వ. అంత, నట శల్యుపాలికిం బోయినదూత లతనిం గని సముచితాలాపంబుల
సమరసహాయత్వంబునకుఁ గోరి పిలిచినం, బ్రీతుం డై యతండును బు త్త్రి
మి త్త్రిసమేతంబుగా నానాసేనాసంకులంబుగాఁ గదలి, పాండవు లున్న
యెడకు నిత్యప్రయాణంబుల నడచు సమయంబున. 91

-: దుర్యోధనుండు శల్యసహాయంబు గోరుట :-

సం. 5-8-6.

తే. ఇంతయును విని కౌరవాధీశ్వరుండు
దను లగు నాప్తజనములఁ దత్క్షణంబ
మద్రనాథుని చనియెడు మార్గమునకుఁ
బుచ్చి, యెడనెడ నతులవిభూతి మెఱయ. 92

సీ. అరుదారుమేలుక ట్లాయితం బై, చూడ
నొప్పారి తనుపగు చప్పరములఁ,
బరవైన చెలువంబు గరగరికయుఁ దియ్య
తెలినీరుఁ గలిగిన దీర్ఘికలును,
బొడవైన మువ్వంచఁ బొలుచునట్లుగ, నేనుఁ
గులకు గుఱ్ఱములకుఁ గొట్టములును,
ముందర బయలైన చందంబుఁ-జతురాభి
మతమైన యాస్థాన మండపములు,

ఆ. భియ్యములును నేయును బెరుగును గూరఁ గా
యలును వంటకట్టియలును గడ్డి
కవణములును బెల్లుగా నొడఁగూర్చి ని
గూఢవృత్తిఁ దానుఁ గూడ నడచె. 93

వ. ఇవ్విధంబున విడిదల పయనంపు సంపదలు వొంపిరివోవం దనకు సమ
కట్టిన సమస్తవస్తువుల యవైకల్యంబునకు శల్యుండు సంతుష్టాంతరం
గుం డై, నిజపరిజనంబులం జూచి "యిట్లు చతురంబుగా మనకు వలయు
వాని సంపాదించుటకుఁ బ్రవర్తకు లైన యుధిష్ఠిరామాత్య లెవ్వారు?
వారలం దోడ్కొనిరండు; వారలు ప్రసాద దానంబున కర్హు"లని
పలుకునవసరంబున, నటమున్న పలుదెఱంగులఁ బనులు సేయుచున్న
తనపల్లాయనంబువారిలోఁ గలసి మఱువడియున్న కౌరవేశ్వరుం డవ
టలు విని యతనికిఁ బొడసూప నిదియ సమయం బని సముచి
రంబునఁ దన్నెఱింగించుకొని వినయంబునఁ గనిన, నతండును

బునం గాఢాలింగనంబు సేసి కనకాసనంబున నునిచి, "యింతయు నిమ్మహాత్మ్ర నుద్యోగంబున నయ్యెం గావలయు"నని తలంచి విస్మయం బంది, "నీ కెయ్యది యిష్టంబు గోరు మిచ్చెద" ననిన, గాంధారీనంద నుండు పరమానందంబునం బొంది యిట్లనియె. 94

క. "సత్యసరస్వతి వగు; మౌ
చిత్యవిశారదము నీదుచిత్తము, నియమౌ
దాత్త్యంబు మెఱయ నాకు న
మాత్యుఁడవై పూని నడుపు మత్తైన్యంబున్. 95

ఆ. తలఁపఁ బాండవులును ధార్తరాష్ట్రులు నీకు
నొక్కరూప; భక్తి యుక్తిఁ జాల
నీవు నన్ను మాననీయుండు గాఁగ న
నుగ్రహించి తగఁ బరిగ్రహింపు." 96

చ. అనవుడు, శల్యుఁ డియ్యకొని "యట్టిద కాదె, విభేదవృత్తి నా
మనమున లేదు, పాండవసమాజము మీరును నొక్కరూప, కా
వున నిది లెస్సమాట; దగవుం దలపోయఁగ మున్ను ప్రీతిఁ గాం
చిన నిను నెమ్మిఁ గూడుటయ చేయుదు నిట్టుల యెల్లభంగులన్. 97

ఉ. దానఁ గొఱంత లే, దభిమతం; బిది గాకయుఁ గల్గెనేనియుం
బూని యొనర్తు"నన్నఁ, గురుపుంగవుఁ డెంతయుఁ బొంగి, "నీవు స
మ్మానము సేసి నా కిటు లమాత్యుఁడ వైన పదంబుకంటె మే
లై నుతి కెక్కు కోర్కి యెటు లారసి చూచిన నొండు గల్గునే?" 98

వ. అనిన విని వికచవదనుం డగుచు మద్రేశ్వరుండు. 99

క. చను నీవు హస్తినగరం
బున, కేనును బాండుభూపపుత్త్రులఁ బ్రీతిం
యట వత్తు, నవశ్యం
ారలఁ జూడవలయుఁ, బోయెద ననినన్. 100

ఆ. "అట్లు కాక వేగ మటవోయి మరలుండు,
వరము మఱవకుండవలయు ! మిమ్ము
జేరి నెగడువాడఁ, గారుణ్యమున నిట
యరసి యుండుఁ" డనియెఁ గురువిభుండు. 101

వ. అనవుడు. 102

క. దరహాసముతో మ్రొక్కే
శ్వరుఁ డాలింగనము సేసి "సందియపడ కీ
వరుగు" మని యనుప, నాతఁడు
కరిపురికిం జనియె మది వికాసముఁ బొందన్ 103

-: శల్యుఁడు పాండవులం జూడ నువచ్చుట :-

సం. 5-8-15.

వ. అంత శల్యుండు నుపప్లావ్యంబునకుం జని ధౌమ్యాదులం బొంది యం
బొచ్చి ధర్మనందను నివాసంబున కరిగిన, నతండు దమ్ములుం దానును
ద్రౌపదీ సుభద్రలు నభిమన్యు ప్రభృతి పుత్రవర్గంబును నెదురువచ్చి
కృతప్రణాములై తోడ్కొనిపోయి కాంచనాసనంబున నునిచి యర్ఘ్య
పాద్యంబు లిచ్చి కుశలం బడిగిన, "సర్వంబును గుశలసంపన్నంబ" యని
వారల నందఱ నభినందించి, యుధిష్ఠిరుం బునరాలింగనంబు సేసి
యిట్లనియె. 104

క. "జన రహితంబగు వనమున
ననుజన్ములు ద్రుపదభూవరాత్మజయును నీ
వును నింతకాల మలయక
యునికి కడున్ దుష్కరము మహోదాత్తమతీ ! 105

ఆ. దానికంచె నరిది దలపోయ నజ్ఞాత
వాస-ముజ్జ్వలాంగభాసమాను
లైన మీకు; మీదయాసూన్యతాదుల
పెంపు మిమ్ముఁ గడవఁ బెట్టకున్నె ? 106

క. ఇమ్మహియెల్లను నీమది
యుమ్మలికకుఁ జాల నొచ్చె, నుర్వీవర ! నీ
విమ్మెయి నిప్పు డఖిలదురి
తమ్ములుఁ గడచుటకు సమ్మదమ్మునఁ బొదలెన్." 107

వ. అని యుచితసంభాషణంబులు సేసి, ధుర్యోధనుండు దన్నుం గాంచిన విధంబును నతండు ప్రార్థించిన తెఱంగును, దానికిఁ దా నియ్యకొను టయుం జెప్పిన, ధర్మనందనుం డతని కిట్లనియె. 108

తే. మేలు సేసితి; రొక్కరి మెచ్చి వారి
కోర్కి దీర్చుట పెద్దలగుణమ కాదె?
యది మదీయచిత్తమునకు హర్షకరమ;
తివిరి యొక్కటి వేఁడెద నవధరింపు. 109

వ. పార్థునకుఁ గృష్ణుండు సారథ్యంబు సేయువాఁడై యున్నవాఁడు, కర్ణుండు పార్థుతో నెప్పుడు మచ్చరించుచునుండు, వీరిరువురకు సంగ్రామం బై నయప్పుడు కృష్ణునకుఁ బ్రతిసారథ్యం బొనరింప మీరకాని యక్కడం దక్కొరుండు లేఁడు, గావున నవశ్యంబును మీకుం గర్ణసారథ్యంబు గర్తవ్యంబు గాఁగలయది, సమరసమయంబున నిరాకరించి పలికి, కర్ణ చిత్తంబునకుం గలంక పుట్టించి పార్థ రక్షింపవలయు; నకృత్యం బని యనువానింపక మత్ప్రార్థనంబున నెల్లభంగుల నివ్విధం బనుష్ఠింప వలయు" నని యభ్యర్థించిన సమ్మతించి శల్యుం డిట్లనియె. 110

క. "అగు నిది వోలును, నాకుం
దగ వట్టిద, కర్ణునకు రథంబు గడప నీ
వగు దని కోరిన కారవ
జగతీశ్వరుప్రార్థనంబుఁ జలుపఁగ వలయున్. 111

క. కర్ణుని సారథి నైనను,
నిర్ణయమున కేను పార్థునిం గాచెద; నా
దుర్ణయవిచారు నెమ్మెయిఁ
గర్ణకఠోరంబు లాడి కలఁతుం బోరన్. 112

తే. దర్పమును దేజమును మాయఁ దలరఁ బలికి
చిక్కువటిచిన నేయంగఁ జేతులాడ
కునికి, రాధాతనూజు నర్జునుఁడు దీవ్ర
బహుళ బాణపరంపరపాలు పఱచు. 113

చ. ఇది యొకఁడేల? నీవు మది నెయ్యది గోరినఁ జేయువాఁడ, నాఁ
డదయత సూతసూతి సభ నాడిన మాటకుఁ జాల నొచ్చి మా
హృదయము లెల్ల నీవలన నెంతయుఁ బఱుము సేయు; నక్కటా
యదియునుగాక మీ పడిన యాపద లెవ్వరి నొవ్వఁజేయవే? 114

ఆ. 'ఇట్లు వడితి' ననుచు నెద నీవు వగవకు;
గారవమున నీ మనోరథమ్ము
ఫలము వొందు నెల్లభంగుల దేవత
లయినఁ బడుదు రొక్కయవసరమున. 115

క. వాసవుఁడు దొల్లి నిజకాం
తాసహితముగాఁగ నధికదైన్యము వొందెన్;
మీసంపద పెద్దయె! విధి
సేసినగతిఁ బడకయుండ శివునకు వశమే?" 116

వ. అనిన విని ధర్మనందనుం "డింద్రుండు శచీసమేతంబుగా నట్టిదురవస్థ
యేమి కారణంబున నెత్తెఱంగున ననుభవించె" నని యడిగిన, మద్రపతి
'దొల్లింటి యితిహాసంబు నెప్పెద వినుమని యిట్లనియె: "దేవతల
యందు మాన్యుండై త్వష్ట యనుపేరం బరగువాఁడు వాసవునకుం
గీడు దలంచి మూఁడుదలలవాని నొక్కని సృజియించి విశ్వరూప నామ
ధేయుం జేసిన, నతం డింద్రపదవిం గోరి ఘోరతపంబు సేయుచున్న,
దానికి భయంబంది నిలింపపతి యప్సరస్త్రీలఁ దత్తపోభంగంబు సేయుం
డని నియమించి పంచిన. 117

క. వారివిలాసంబులను వి
హారముల విలోకనముల నాలావములన్

మారవికారం బాతని
జేరద; యన్నాకపతియు సి గ్గెదఁ గదురన్. 118

తే. తలరి యమ్మునిఁ దెగఁజూచి ధర్మ్మరహితుఁ
డగుట యెవ్వరు నెఱుఁగని యట్లు గాఁగ
నేఁడు గాలంబు గడపిన, నెఱిఁగి భూత
గణము లాక్రోశ మొనరింపఁగా నతండు. 119

వ. తన [1]దుష్కర్మ్మప్రకటం బగుటకు రోసి యొక్క విషమవ్రతం బాచ
రించి సముద్ర తరు ధరణీ స్త్రీజనంబులయందు బ్రహ్మహత్య విభాగించి
పెట్టి, నిజకల్మషంబుఁ బాపికొని, మునిగణసేవితుం డయి సము
ల్లాసంబునం బొంది యునికికిఁ ద్వష్ట గోపించి. 120

తే. "అనపరాధుఁ దపోనిధి నధికశాంతి
యుక్తుఁ జంపిన పాపాత్ము నుఱక పట్టి
మ్రింగఁజాలెడు వాని నుత్తుంగదేహు
నేను సృజియింతుఁ జూడుఁడీ యీక్షణంబ." 121

చ. అనుచుఁ గడంగి నిష్ఠమెయి నగ్నిముఖం బొనరించి వేలిమిం
దనయు సృజించి లోక విదితంబుగ వృత్ర సమాఖ్య యిచ్చి "మ
ద్వినుతతపోబలంబునఁ బ్రదీపితతేజుఁడ వై జయింపు నీ"
వని నియమించి పంచె నమరాధిపుతో సమరంబు సేయఁగన్. 122

-: ఇంద్రుఁడు వృత్రాసురునితో యుద్ధంబు సేయుట :-
సం. 5-9-45.

చ. పనిచిన నాతఁడుం జనియె, బాహుబలంబున నేచి వాసవుం
డని కెదురేఁగుదెంచె. నిటు లద్భుతసంగర మైనచోట న
య్యనిమిషనాథుఁ బట్టుకొని యంగద వృత్రుఁడు మ్రింగె, దేవత
ల్మనమున బెగ్గలింపఁగఁ జలంబు బలంబును జూపి యుగ్రుఁడై. 123

---

1. దుష్కర్మ్మంబు - మున్నంగి.

వ. ఇట్లు ప్రమింగినం, ప్రిదశగణంబులు దత్క్షణంబ యా దైత్యునకు నావు
లించునట్టి యాలస్యం బావహించిన. 124

తే. అసురనాథుండు నలసత యడర నీల్గి
యావులించిన నత్తజి నమరవిభుఁడు
దనశరీరంబు సంకుచింబు సేసి
కడుజవంబునఁ గుప్పించి వెడల నుజీకె. 125

క. వెలలి బలరిపుఁడు చలమునఁ
గలహామునకుఁ జొచ్చె, వృత్రుఘనబాహుబలం
బలవికి మీఱెను దండ్రివి
మల తపమునఁ జేసి సురలమనములు దలఁకన్. 126

వ. ఇట్లధికబలుండైన వృత్రునాటోపంబు సహింపం జాలక సురపతి దెరలి
మరలి పఱచి మందరగిరి శిఖరంబున కరిగినం, గనుకనిం జని యనిమిషు
లతనిం గూడుకొని వృత్రవధోపాయంబు విచారించునెడ, నవ్వాసవుం
డును దన మనంబున నిశ్చయించి. 127

క. హరిఁ గాంచి యతని చెప్పిన
పరమోపాయంబు సేసి బ్రదుకుద మనినన్
సుర లదియ కర్జ మని య
మ్మురమర్దనుకడకుఁ జనిరి మునులుం దారున్. 128

వ. ఇట్లు దివిజానీకంబును, మునిలోకంబును బాకశాసనుం బురస్కరించు
కొని. 129

మ. చని యాదైత్యతెఱంగు సెప్పి "యతులోత్సాహంబుమై నెప్పుడున్
దనుజవ్రాతముత్రు ళ్ళడంచి దివిజేంద్రశ్రీవిలాసంబు పెం
పున బొందించుట నీకు నైజము గదా, భూతేశ! ఘోరారిమ
ర్దనసంక్రీడ యొనర్పు లోకముల కత్యంతప్రమోదంబుగన్. 130

క. అనిన విని, "యొకటి సెప్పెద
వినుఁ డాతనితోడ నమరవిభునకుఁ దగఁ బొం

దొనరింపుఁ, డొక్కసమయం
బున నడఁకువఁ గులిశధారఁ బొందెద నేనున్. 131

వ. మదీయతేజోవిశేషంబున నప్పురుహూతున కుత్సాహంబు సంభవింపం గలదియు, యప్పు డనాయాసంబునఁ బగతు వధియింప నగు" నని గదా ధరుం డూఱడిలం బలికిన, బలసూదన ప్రముఖ నిఖిలసురలోకంబును సంతసిల్లి మగిడి వచ్చి వృత్రుకడకు మునిజనంబులం బుచ్చిన, వారును జని యతని కిట్లనిరి. 132

క. "భుజబలదుర్జయుఁ డింద్రుం
డజయ్యుఁడవు నీవు, నీకు నతనికి మీలో
విజయము దక్కదు, మీరే
చి జగంబులు నొవ్వ రణము సేయఁగ నేలా ? 133

క. మైత్రీసౌఖ్యముఁ బోలునె
శాత్రవ మెమ్మెయిఁ దలంప, శక్రశ్రీకిం
బాత్రమ వై యింపుగఁ ద
న్మిత్రుఁడ వగు, మిదియ మేలు మీ యిద్దఱకున్." 134

వ, అనవుడు, వృత్రాసురుండు 'తేజంబువాసికి నాసపడియెడు మాయిరువురకు సఖ్యంబు సమకూర నేర్చునే' యనుటయు, నమ్మునులు 'సత్పురుషసాంగత్యంబు సంభవించినం జేయమి నీతి గాదు, మహేంద్రుండు సకలలోకసమ్మతసద్భావుండు గావున నతనితోడి చుట్టఱికంబు మే" లనిన నొడంబడి యతండు వారల కిట్లనియె. 135

క. ఏనొక్కఁ తెఱఁగు సెప్పెద
దానిం గాదనక చేసి తగ మీరలు సం
ధానము దృఢముగఁ జేయుం
డానాకేశునకు నాకు నధికప్రీతిన్. 136

వ. ఆది యెయ్యది యనిన, నార్ద్రం బగుదానను శుష్కం బైన సాధనంబుననుదరువునం బాషాణంబున శస్త్రాస్త్రంబుల దివంబున రాత్రియందును నేను

వధ్యుండఁ గాకుండవలయు" ననిన వారును దానికి నొడంబడి యవ్వ
రంబు లొసంగి వృత్రవజ్రధరులకు మిత్రభావం బొనరించి మగుడంజని
యత్తెఱంగు వాసవున కెఱింగించి నిజనివాసంబుల కరిగిరి. సురనాథుండు
సుఖంబుండి పెద్దకాలంబునకు దనమనంబునఁ బాయనివైరంబు సైరింపం
జాలక దామోదరుని పూనికయు మునిజనంబు చేసిన సంధివిధంబును
నిరూపించి రిపుం బరిభవింప రంధ్రాన్వేషణంబు సేయుచుండి యొక్క
నాఁడు. 137

చ. జలనిధితీరభూమిఁ దనశత్రుఁ గనుంగొని, వీని నిప్డు దో
ర్బల మెసఁగంగ నాదుభిదురంబునఁ ద్రుంచెద, రాత్రి గాదు తాఁ
దలఁప దివంబు గా దిది యుదగ్రపరాక్రమయోగ్య సంధ్య, నా
యలవుఁ జలంబుఁ జూప నెప మై తగుసాధన మెద్ది గల్గునో." 138

క. అని తలఁచుచు నచ్చట నొక
వననిధిఫేనఁ జూచి వాసపుఁ డార్ద్రిం
బును శుష్కంబును గా దిది
యనుచుం గులిశమునఁ గూర్చి యధికరయమునన్. 139

తే. దాన వృత్రుని వ్రేయ, నత్తఱి మురారి
యందుఁ దగ సంక్రమించి యయ్యసురఁ జంపె,
జిష్ణుఁ డతిభక్తి విష్ణుఁ బూజించె, నాత్మ
నఖలలోకంబులకు మోద మావహిల్లె; 140

వ. ఇవ్విధంబునం బగతుం బరిమార్చి వేర్చి యింద్రుఁడు నిజపురంబునకుం
జనియు, మఱియును భూతసంఘం "బిట్లు బ్రహ్మహత్యసేయం దగునే"
యని యతని నిందించినం, బ్రభుత్వసంపద నెడుటయు. 141

ఆ. నీచదశకు వచ్చి నిషధాచలంబున
కరిగి సురవరేణ్యుఁ డడఁగియుండె,
నమరు లెల్లఁ గలఁగి యన్యోన్యపీడన
భయముఁ బొంది కూడఁబాటి తమకు. 142

క. కావలి యై, "సురరాజ్య
శ్రీ వాలింపంగఁ దగువిశేషంబున సం
భావితుఁడు నహుషుఁ" డని చని
యావిభుఁ గని తారు మునులు నతనికి నెమ్మిన్. 143

—: దేవతలు నహుషుని సురరాజ్యాభిషిక్తునిం జేయుట :—

సం. 5-11-21.

వ. పాకశాసనుతెఱుం గెఱింగించి యిట్లనిరి. 144

క. "ర, మ్మింద్రపదవి నేకొని
మమ్మెల్లను నరయు" మనిన, మానవపతి నా
కమ్మహిమకుఁ దగుమాహా
త్మ్యమ్ము గలదె? నన్ను నేల యలఁచెద" రనినన్. 145

వ. అంత నిలువక యత్యంతప్రార్థనంబు సేసి. 146

క. యమవరుణాది త్రిదశులు
దమతమ శక్తిప్రభావదర్పంబులు భూ
రమణునకుఁ బంచియిచ్చిరి
ప్రమోద మెసఁగంగ మునిసభామధ్యమునన్. 147

వ. ఇవ్విధంబున నిచ్చి యధికబలసమన్వితుం గావించి తోడ్కొనిపోయి పూజ్యం బగు దివిజరాజ్యంబున కభిషిక్తుం జేసిన, నతండును బరమధర్మపరుం డై కిన్నర కింపురుష గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరాది సమస్త దేవయోనుల వలనను దేజోభాగంబులు పుచ్చుకొని మహానుభావుండై దివ్యవినోదపాత్రంబులును రంభాద్యప్సరోగణంబులుం గొలువ నభిమత భోగంబు లనుభవించుచు, మదంబు మిగిలి మన్మథాధీనుండై వర్తిల్లు సమయంబున నొక్కనాఁడు. 148

తే. మహితలావణ్యమున నసమాన యనఁగ
జనిన పౌలోమి యానహుషునకు నయన

మార్గగోచర యగుటయు, మదనబాణ
భిన్నహృదయుఁ డై ధృతిఁ బాయఁ బెట్టి యతఁడు. 149

క. సురలోకరాజ్యపదవిఁ
గరిమంబున నున్న నన్నుఁ గవయం బరమా
దరలీలఁ జతుర యగు నీ
సరసిజముఖి రామి యేమి చందమొ తలఁపన్." 150

క. అని యప్పాలఁతిం బిలిపిం
చిన, నదియును భయము నొంది శీఘ్రమ "దేవే
జ్యుని సదనమునకు శరణం"
బనుచుం జనుటయును, వాసవాచార్యుండున్. 151

వ. పరమాదరంబున నద్దేవిని గారవించి "నిన్ను నహుషుదుర్వినయంబుఁ
బొరయకుండ నరయువాఁడ, నాఖండలుండు నా యత్నంబున నవశ్యం
బును బడయక వచ్చు" నని యూఱడించిన. 152

క. అది యెల్ల నెఱిఁగి కోపం
బొదవఁగ నహుషుండు "గురున కుచితమె యే న
మ్మొదితం బిలిపింపఁగఁ దన
సదనంబున నునుచు" టనియె సంక్షుభితుం డై. 153

చ. అనుడు, మునీంద్రులున్ సురలు "నక్కట నీ మహనీయగౌరవం
బునకుం బరాంగనంగవయుబుద్ధి జనించుట యీడు గాదు" నా
విని, "మను పూని యిమ్మెయి వివేకము గౌతముభార్యఁ గాకఁ
నునఁ డెడఁ గోరుచోఁ గఱపఁ జాలరమీ, రది యెట్లు సెప్పుడా?" 154

వ. అనుచు, నతండును గడుఁ గోపించిన భయంబుఁ గొని వార లాపాలోమి
నతని పాలికిం దోడ్కొని వచ్చువా రై పూని బృహస్పతి కడకుం జని
యద్దేవియు వినుచుండ నిట్లనిరి. 155

క. "నహుషుఁడు మహేంద్రపదవీ
సహితుఁడు, శచికిఁ వరింపఁజను నాతని, లో

క హితంబుగాఁగఁ బుచ్చుము
మహాత్మ ! తచ్చిత్తమున యమర్షం బడఁగన్.'' 156

క. అనవుడు శోకం బడరఁగ
ననిమిషగురుఁ జూచి యిట్టులను, శచి ''యటు వు
చ్చిన దూఱు రాదె ! నను శుచి
యని మీ కోనియాడు చెల్ల నన్యతముగాదే ?'' 157

వ. అనిన విని దరహసితవదనుం డగుచుఁ బురుహూతపురోహితుండు. 158

క. నహుషుండు పనుచువాఁ డఁటె !
విహితానుష్ఠానపరులు వీరఁటె ! తా లో
కహితం బఁటె ! మనకుఁ
మహనీయమ కాక యెట్లు మానఁగవచ్చున్ !'' 159

వ. అని యుల్లసం బాడి యనిమిషులను ఋషులను జూచి యిట్లనియె. 160

తే. ''శరణు సొచ్చిన రక్షింపఁ జాలియుండి,
కడపి పుచ్చిన నూర్ధ్వలోకములు దప్పుఁ,
బుణ్య కర్మంబు లఫలతఁ బొందు, ననఁడె
కమలగర్భుండు దొల్లి జగద్ధితముగ.'' 161

వ అని యసురూపాలాపంబుల నిషేధింప, వార 'లట్లేనిఁ గర్తవ్యం బెయ్యది యూహింపు' మనిన ''నద్దేవి నహుషు కడకుం జని సముచితంబుగాఁ దదీయ సాంగత్యంబున కెడి వలికొని వచ్చునది, యటమీఁద మన మందఱమున్ బురందరున కభ్యుదయం బగు తెఱం గాచరించువార'' మనుటయు, వాచస్పతివచనంబులకు సంతసించి సురసంయమి సంఘంబు లరిగిన యనంతరంబ. 162

క. పౌలోమియు నా నహుషుని
పాలిఁ జనుటయు, నతండు భావజవికృతి
వ్యాలోలమానసుం డయి
లీలాసంభావనాలలితముఖుఁ డయ్యెన్. 163

వ. అట్టియెడ. 164

ఉ. అల్లన యింతి యిట్లనియె "నారసి వాసవుకల్మి లేమియుం
దెల్లముగా నెఱింగికొని, తేఁకువ లే కిట వచ్చు టొప్పు, నా
యుల్లము శంకితం బగుచు నుండఁగ వేగిరపాటు మేలె! నీ
వెల్ల నెఱుంగు, దిప్పు డెడ యిచ్చుట యుక్తము నాకుఁ జూడఁగన్."165

వ. అని యెుడంబఱిచి కొండొకకాలం బెడ వలికికొని యింద్రాణియు
మగుడం జనుదెంచె; నమరగణంబును మునిజనసహితంబుగా విష్ణుదేవు
పాలికి రహస్యవృత్తిం బోయి జిష్ణునిదురితంబు వాపుటఁ గోరిన, శౌరి
గరుణాయత్తచిత్తుం డై. 166

క. "హయమేధంబున నాకుం
బ్రియ మొనరింపంగ వృత్రభేదికిఁ బుణ్యో
దయ మగు" నావుడు వార లు
దయమునఁ జని రందఱుం బురందరుకడకున్. 167

-: ఇంద్రుండు నహుషతేజోవిశేషంబు సూచి మఱుఁగువడుట :-

సం. 5-13-16.

క. చని యతని నశ్వమేధం
బునఁ గల్మషరహితుఁ జేయఁ, బురుహూతుండుం
దనపురికి నరిగి నహుషుం
గని తత్తేజోవిశేషకంపితుఁ డయ్యెన్. 168

వ. ఇట్లు వృత్రారి దనబ్రహ్మహత్య వాయుటయే కాని నహుషునంత
బలంబు లేమిం భయాకులితచిత్తుండై. 169

క. ఎందేనిఁ జనియె, నాతని
సుందరియును నెమ్మనమున శోకోద్రేకం
బొంది, పురందరుఁ డరిగిన
కందువ యే నిప్పు డెట్లు గాంతునో" యనుచున్.

వ. నిశాసమయంబున నుపశ్రుతి నారాధించినఁ దదీయాధిదేవత నీసత్యంబు వలన నీమగనిం గను' దని చెప్పి యనంతరంబు సాకారయై పొడమాపినఁ, బౌలోమి నీ వెవ్వ రని యడిగిన నదియును "భవత్పాతివ్రత్య సత్య శౌచంబులకుఁ బ్రియంబంది వచ్చితి నుపశ్రుతి" నని చెప్పి "నీకుం బాక శాసనుం జూపెద" రమ్మని తోడ్కొని హిమవంతంబు నుత్తరంబున మంజుమంతం బను మహాశైలంబున ఁరిగి దానియందు శతయోజన విస్తీర్ణంబైన యొక్క సరోవరంబు సొచ్చి యచ్చట నుల్లసిల్లు పంచ వర్ణ కమనీయంబులగు కమలంబులలో నొక్కనాళంబు భేదించి ముందటఁ బ్రవేశించె; నింద్రాణియుం దోడన చని తంతుమధ్యంబున సూక్ష్మరూపం బున నున్న సురపతిం గన్నంత నయ్యుపశ్రుతి యదృశ్య యగుటయు.171

క. పతిసన్నిధి వడసి మహా
ద్భుత మందెదు శచి తదీయపూర్వ సుకర్మ
స్తుతి సేయుచు నిలిచిన నతఁ
డతివం గని సంభృతాదరాత్ముం డగుచున్. 172

ఉ. "ఇచ్చట నేను నిల్చు టిది యెట్టు లెఱింగితి? నన్నుఁ గాన నీ
వచ్చిన కార్య మేమి? యనవద్యగుణోత్తర చెప్పు" నావుడుం
బొచ్చెము లేక యానహుషు పోయినపోకలు, దానికిం దగం
జెచ్చెరఁ గాలయాపనము సేసినభంగియుఁ జెప్పె దేవియున్. 173

వ. చెప్పి యుపశ్రుతి తెఱంగును నతని కెఱింగించి "దేవా నీ విత్తటిం బ్రకాశుండ వై భవత్ప్రీతాపంబున నహుషునకుఁ బరాభవం బొనరించి నన్ను రక్షింపక తక్కిన, నుక్కువుం డగు నతని పాపనిశ్చయంబున నాపద వచ్చు" ననిన విని వల్లభకు దివిజవల్లభుం డిట్లనియె. 174

[illegible]హుషుబాహుగర్వ మ
[illegible] యున్నయది, సముజ్జ్వల మునిస
[illegible]మగుటను
[illegible]చెదను జయమునకున్. 175

చ. తటి యగునంతకున్ రిపునుదగ్రత సైచుట నీతి, నీవు నా
కఱపినయట్ల చేయుము, తగం జని యాతనిఁ గాంచి "నన్ను
త్తెఱఁగున సైనఁ బొందఁగ మదిం దలపోతయ కల్గెనేనిఁ, గ్ర
చ్చఱ మునివర్గవాహనుఁడ వై చనుదె మ్మను" మంతఁ దీ

ఆ. అనిన నట్లకాక యని పతి వీడ్కొని
యింతి నహుషుపాలి కేఁగుదెంచె,
నతఁడు దమక మడర నద్దేవిఁ బెద్దయు
నాదరించి యిష్ట మడుగుటయును.

వ. ఇంద్రాణియు నిట్లనియె, "మన నిరూపించిన సమయంబునక
తడవు గలదు, కాలం బగుటయు నిన్ను వరియించెద, నీవ
వాహనుండవు గావలయు, నది నాకుఁ బ్రియంబు,
సామాన్యం బైనయానంబు దేజోవిశేషకరం బగు" ననిన
నహుషుండు ప్రహర్షచిత్తుం డై.

ఆ. "ఏను దక్క నొరుల కెవ్వరికైన న
వ్వాహనంబు నెక్కవశ మె? నీకు
నమ్మదంబు గాఁగ సప్తర్షిగణము నా
యందలంబు మోప నరుగుదెంతు."

క. అని వనితఁ బంచి, యప్పుడ
మునులం బిలిపించి మౌర్ఖ్యమునఁ దనకుఁ వా
హనముగఁ జేసి, యొకింతయు
ననుమానము లేక తిరిగె నతఁ డెల్లెడలన్.

క. చని పౌలోమియు సురగురుఁ
గని నహుషుఁడు వేచియున్నకాలం బెడలే,
దనిమిషనాథున కిత్తటి
ననుగ్రహము సేయవలయు నవహితబుద్ధిన్.

వ. శరణాగత నైన నన్ను రక్షింపు" మనిన నతం డిట్లనియె.

యెయ్యఁ–దక్కినది యట్లుండె, మనఁబోవకపోవఁగరాదు, కై పెక్కినట్టితలఁపు, మాఱుటనోరిదానను, ఒద్ది యేఱు విడిసి, – ఇత్యాదులు పరశ్శతములు:

తిక్కనగారి యుపమానము–లర్థాంతరన్యాసము లిట్టివి:–మడుగుఁ జీర యందు మసిచాకినట్లు, మాకుం గుడు మిండు–మీరు వ్రక్క గొనుఁడు, రోష మయమహాతరువు–ధర్మతరువు, సాదు రేగెనేనింబొలతలమునఁ గాని నిలువఁ బోఁడు, పాలలోఁ బడిన బల్లి విధంబున,నిప్పులు వేడిమి సెడినట్లు, వింజం బాకి డినకరణి,విధిసేసినగతిఁ బడకయుండ శివునకువశమే, కొడం గనితగరు చాఁకఁ గోరుటఁగాదే, నిప్పులన్ బొరలినయట్లు, విసంబుచవిఁగాలము వ్రింగినయట్లు, నీళుల నగ్ని పుట్టినయట్టిది, అట మిన్నందినవానిపొడ వెంతన్నట్లు, మంటలో మిడుత లుపగ్రవృత్తి నుఱుకదలచినట్లు, నేవోసినయగ్నిభంగి, కావిసెలయేఱుల తోడి నగంబు లట్లు,పామున్నయింటిలో నున్నయట్లు, చిచ్చొడింగట్టినయట్లు, గజంబు గజంబు పల్లవం బల్లన తెమల్చులీల, శ్రీ రా మోకా లొడ్డినవాని విధము,–ఇత్యాదులు వెక్కులు.

తిక్కనగారి వ్యాకరణవిశేషము లిట్టివి:– సురరాజ్యశ్రీ వాలింపఁగ, యోగక్షేమంబున తెఱఁగు, కాన తగంబొందుట, (ఇచ్చటకాన–కళ) కాన నవశ్యము(ఇచ్చట కాన్తద్రుతప్రకృతికమువేగ తెగంబాఱుకు(ఇచ్చట వేగకళ) జగంబులన్నిని, పోవఁగఁద్రోతున్. (త్రోయుధాతువు) అట్టిదింగలదె,ప్రాణా నం గలుగంగ, సంధియ కావింపంబడిరి, మఱాకుమన్న, ఎన్నడేని కృష్ణుని తోడనే వెప్పితి, భూరిశ్రమండతిరథంబులమొదలి, జెట్టానజెట్లు, సుఖమున్న వారె, ఎల్ల వెంట, సంభావింపుము విదురునితో,ప్రాణగొడ్డము,కూడదునార, బోనాలు వేర్పింప, చంపుదమ యిర్వురము, ఇత్యాదులు మఱియుంగొన్ని.

తిక్కగారి రచనలో రెండుమూడుప్రౌఢరచనావిన్యాసములు గూడ గనఁబడును. చూడుఁడు:– "ఒకటి గొని, రెండు నిశ్చలయుక్తిఁ జేర్చి, మూఁటినాల్గింటఁ గడువశ్యములుగఁ జేసి." "జ్ఞాతులపోరితమును, గోత్రాత మునాక్రమము,విప్రవర్ణముచనవున్" "తుది రాజ్యమ్ము సగమ్ము గొ–మ్మద వియందున్ వేరు వంచించియున్, పదుమూడేడులు నీవునుం దిరిగి రా; పాలీ కపోవచ్చునే" ఇత్యాదులు దిక్సూచికాప్రాయములు.

తిక్కనగారి ప్రతిభాపాండిత్యములును, లోకశాస్త్ర పరిశోధనాపాటవములును, లలితమధురముగా వింగడించు వైదుష్యమును మున్నగాఁగావ్య నిబంధనానుబంధము లపారములైనవి. ఒకదానినిమించి మరియొకటి మనోవినోదజనకములైనవి. "అల మిన్నందిన యట్టివానిపొడవెం" తన్నట్లు భావనాసుభగముగా వివేకించి తెలిసికోఁదగినవి. అన్నియు వివరించుట సాధ్యముగాదు. అన్నింటి కుదాహరణముగా, నుద్యోగపర్వమేగాక ఆంధ్రమహాభారతమే మీముం దున్నది. దానిని దీరికతోఁ జదివి యానందింపుఁడని మిమ్ముఁ గోరుచున్నాను.

"కవిః కరోతి కావ్యాని లాలయ త్యుత్తమోజనః।
తరుః ప్రసూతే పుష్పాణి వాయు ర్వహతి సౌరభమ్"

సాధారణ-కార్తికిక,
శుద్ధదశమి.

గడియారము వేంకటశేషశాస్త్రి

ుషువలన నాపద
ాతనికి నాతురత గావింపం
ునర్చెద వేలిమి;
మునివాహనత గతస్థైర్యుఁ డగున్. 183

ని పతియునికియు
నని యూఱడించి, యప్పుడ వైశ్వా
తుఁ జేసి, పురం
గుం జెప్పి యతనిఁ దడవం బనిచెన్. 184

గ్నిదేవుఁ డింద్రుని వెదకి బృహస్పతికిం దెలుపుట :-

సం. 5-15-27.

వహ్నియు వనితారూపంబునం జని, మనోగతి యగుటం జేసి
ను భూమ్యంతరిక్షంబులును గిరివిపినంబులును గొండొకనేపు
భయం జూచి, సంక్రందను నెందునుం గానక మగిడి వచ్చి,
కి నత్తెఱం గెఱింగించి, "నాకు జలంబులు ప్రవేశింపరామి
రికింపనేరనైతి, నప్పులవలన నగ్నియు బ్రాహ్మణులవలన
తియు నశ్మంబులవలన లోహంబును నుద్భవించె, వాని
యెల్ల యెడలనుం జెల్లుఁ, దమ తమ జన్మ స్థానంబులయం
ావున, నీళ్ళు నాకు సంశయంబు సేయుట సుప్రసిద్ధం" బనిన
మనిమిష గురుండు హవ్యవాహను నత్యంత గౌరవంబునం
185

వరజంగమంబులు భవత్సాన్నిధ్యమాత్రంబున
గ్రతువైభవంబులుఁ జతుర్వేదంబులుఁ నీవ, పా
ుంద జలంబులుం గలిగె, విశ్వవ్యాప్తివై నున్న నీ
ట్టు లగమ్య మయ్యె? నిను నీవూహింపు పెం పారఁగన్. 186

బ్రహ్మమంత్రముల నెంతయు నీకభివృద్ధిఁ జేసెదం
కత సలిలగామివి గ"మ్మనినం, గృశానుఁడుం

- మున్నంగి.

బూనిన నేఁగి వారినిధి భూరినదీ సరసీ తటాక సం
తానము రోయుచుం జని, శతక్రతుఁ డున్న సరోవరంబునన్. 187

ఉ. అంబురుహాంబులం గలయ నారసి చొచ్చి, యొకండు నాళసూ
త్రంబున నున్న యింద్రుఁ గని, రాగమునఁ గురునొద్ద కగ్ని శీ
ఘ్రంబున నేఁగుదెంచి, తన కన్న తెఱం గెఱిఁగింప, నాతఁ డు
ల్లంబున నుల్లసిల్లి సురలఁ మునులం దగఁ గూడి గ్రక్కునన్. 188

మ. దివిజాధీశ్వరుపాలికిం జని కృతార్థీభూతచేతస్కుఁ డై
వివిధస్తోత్రపరంపరాచతురవాగ్విన్యాసతం బ్రీతుఁ జే
సి, వరిష్ఠం బగు నీదు కృత్యము ననుష్ఠింపంగ నీ వుత్సహిం
పవు, నీకేమి కొఱంత, వృత్రవధ యే పాపంబు రూపింపుమా!" 189

క. శరనిధిఫేనంబున నా
హరి వొంది జగద్విరోధియగు వృత్రునిఁ దాఁ
బరిమార్చి, నీకు విజయము
దొరకొనియెం గాక దీన దోసము గలదే." 190

వ. అని సముచితంబుగా సంబోధించిన గురుని సంభాషితంబుల నిర్దోషితుం
డయి నిజరూపంబు వహించి సకలసుమనోమునిసహితంబుగా నతని
సంభావించి, జంభారి 'గర్తవ్యం బెయ్యది' యని యడిగిన నాచార్యుం
"డితం డెఱిఁగినను విస్పష్టంబుగా నహుషవృత్తాంతం బంతయు వివరిం
చెదంగాక" యని తలంచి యిట్లనియె. 191

క. "నాఁ డట్లు నీవు నీ దగు
పోఁడిమిసెడి యడఁగుటయును, భువనంబుల కె
వ్వాఁడును రక్షకుఁ డయ్యెడు
వాఁడిమగఁడు లేమిఁ, ద్రిదశవర్గము మునులున్. 192

ఉ. "ఒండొరుచేతఁ బీడవడ నోపక, రక్షకుఁ డైనవాని నా
ఖండలతుల్యు నేమిగతిఁ గాంతు మొకో!" యనుచున్నచోట ను

ద్దండబలైకరక్ష్యము శతక్రతురాజ్యము దాని నేల న
న్యుండు సమర్థుఁడే'' యనుచు నొల్లరు దివ్యులలోన నెవ్వరున్. 193

వ. అట్టి సమయంబున మునిజన సహితంబుగ ననిమిషులు నహుషు కడకుం
జని మనంబుల మనుజుండను ననుమానంబు దక్కి, యతని నింద్రపదవిఁ
బరిపాలించుటకుం బ్రార్థించిన నతండును ''దాను హీనబలుండ నని
శంకించినం దమ తమ తేజంబులయంశంబు లతని కొసంగి శక్తిమంతుం
గావించి యభిషిక్తుం జేసిన. 194

క. మహనీయ భవత్పదవీ
మహితుం డై నహుషుఁ డేచి మనమున ధర్మ
స్పృహ దక్కి తన్ను నిప్పుడు
వహియింపగ సన్మునీంద్రవర్గముఁ బనిచెన్. 195

ఆ. ఇదియకాదు మఱియు నెన్నియు దుర్వినయములు గలవు వాని కలసి నిన్ను
వెదక వచ్చితిమి, వివేకహీనుం డగు
నతనిఁ జెఱుప నిప్పు డవసరంబు. 196

వ. అది యెట్లంచేని వినుము ''నాఁడు హరిపంపునం జేసిన యశ్వమేధంబున
నీ వపగతకల్మషుండ వైనను నహుషునకుఁ దేజోహాని లేమిం జేసి యతని
నాక్రమింపరాదయ్యె, నిప్పుడు మహామునుల నధఃకరించి యతండు
నిస్తేజుం డై యున్నవాఁడు, గావున నీచేతం జెడునట్లగుటయుం దురగ
మేధఫలపరిపాకంబ, యింక నుత్సాహంబు సేయు'' మనుచున్న
సమయంబున యమవరుణకుబేరులు సోమసహితంబుగా నరుగుదెంచి
పురందరుం గాంచిన నతండు ప్రియంబంది యప్పటికార్యంబు తెఱంగు
వారల కెఱింగించి తగిన సంభాషణంబుల వారలఁ బ్రీతచేతస్కులంజేసి
దృష్టివిషయ దుస్సహుం డైన నహుషు గెలుచునుపాయంబు విచారించు
నవసరంబున. 197

క. "కష్టుం డగు నా నహుషుఁడు
నష్టాత్మకుఁ డయ్యె, దివిజనాయక! నీయు
త్కృష్ట చరితము నసురలకుఁ
దుష్టిగ నిజరాజ్యసంగతుఁడ వగు" మనుచున్. 198

క. మునివరుఁ డైన యగస్త్యుఁడు
సనుదెంచిన, శతమఖుండు సమ్మతి నుచితా
సన మిడి యర్ఘ్యముఁ బాద్యము
నొనరిచి, యిట్లనియె సవినయోక్తి నతనితోన్. 199

ఆ. "అధికవిభవ మెసఁగ నసమానశక్తి స
నాథుఁ డగుచునున్న నహుషుఁ డిప్పు
డేమికతన భాగ్యహీనుఁ డై యుజ్జ్వల
శ్రీ దొఱఁగె-మునివరేణ్య! చెపుమ." 200

-: అగస్త్యుఁ డింద్రునకు నహుష భ్రష్టతఁ దెలుపుట :-

సం. 5-17-7.

వ. అనిన విని యమ్మునీంద్రుం డిట్లనియె; నన్నహుషుని మోచి వేసరుచున్న మును లతనికడ గోష్ఠివినోదంబుల నుండి "బ్రాహ్మణంబులయిన మంత్రంబులు గోసంప్రోక్షణంబునందుఁ జెప్పంబడియుండునవి నీకుఁ బ్రమాణభూతంబు లగునే" యని యడిగినం, బాపనిశ్చయుం డై యతండమ్మంత్రంబులు ప్రమాణంబులు గావనిన, నేనమ్మాట నిషేధించి, "పూర్వాచార్యులచేత నభినందితంబు లగు మంత్రంబులు నిందించుట యజ్ఞానం"బని వివాదంబు సేసిన, నతండు కోపించి మదీయమస్తకంబు దన్నిన, నతనిం గనుంగొని, పుణ్యహీనుండును దేజోహానిదీనుండును నగుట యుపలక్షించి, "నీవు పూజనీయు లయిన మహామునుల, నిన్ను వహింపం బనిచితి, వారలు గొనియాడు మంత్రంబులు గర్హించి, తదియునుంగాక నన్ను నవమానించితి గావున నింద్రపదభ్రష్టుండవై బహు సంవత్సరంబులు భూలోకంబున నురగరూపంబున నుండు"మని శాపం

బిచ్చి, పదంపడి యనుగ్రహించి భవదీయవంశజాతుం డయి యజాత శత్రుండను పెంపుగలిగి యుధిష్ఠిరనామధేయుండైన యొక్క సత్పురు సందర్శనంబున దురితంబులఁ బాసి పుణ్యలోకంబు వడయువాఁడ" వనిఁ దత్క్షణంబ. 201

క. స్వర్గపరిభ్రష్టుం డై
దుర్గతికిం బోయె నతఁడు; దుష్టాత్ములకున్
దౌర్గత్యము-సుజనులకు న
నర్గళసద్గతియు నగుట యరుదే యెందున్." 202

మ. అనిన దేవతలుం దపోధనులు నశ్యానందమున్ బొంది; రా
మునిఁ బూజించె నమర్త్యనాథుఁడు మనోమోదంబు సంధిల్ల; న
య్యనురాగంబు చరాచరంబులకు హృద్యం బయ్యె; సర్వాప్సరో
జనమున్ గొళికుఁ గానవచ్చె సుభగైశ్వర్యంబు శోభిల్లఁగన్." 203

వ. తదనంతరంబ. 204

ఉ. పావకుఁ డాదిగా దిగధిపాలురుఁ, గిన్నరసిద్ధసాధ్యులుఁ
దేవగురుండుఁ దోన చనుదేరఁగ, వైభవ ముల్లసిల్ల, నై
రావణదంతి నెక్కి యమరావతికిం జని, యింద్రుఁ డాశచీ
దేవియుఁ దాను మోదమునఁ దేలి రభీష్టవినోదలీలన్; 205

వ. ఇవ్విధంబున మహానుభావుం డగునమ్మ హేంద్రుండు. 206

క. ఆజ్ఞాభంగం బయినం
బ్రాజ్ఞేతరునట్లు దుఃఖపడియుండఁడె; తా
నజ్ఞాతవాసమును గా
లజ్ఞతఁ జలుపండె! యన్యులకు వగపేలా? 207

క. కావున, మీపడినయర
ణ్యావాసక్లేశమునకు, నజ్ఞాతవిధిన్
సేవకుల నైనదానికి
నోవకుఁడీ-మీరు లఘుమనోవృత్తులనై;" 208

వ. అని యిట్లు సెప్పి శల్యుండు సభాసదులం గలయం గనుంగొని. 209

ఉ. "కారవనాథుఁ డానహుషుకైవడి నాశముఁబొందు, వాసవ
శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశివే
లారశనాసముజ్జ్వలవిలాసమనోహర మేదినీవధూ
సారసమగ్రభోగముల సన్నుతి కెక్కెడుఁ దానుఁ దమ్ములున్." 210

వ. అని పలికి వెండియు నతండు పాండవాగ్రజున కిట్లనియె. 211

క. "సౌఖ్యంబులు వొందు, జగ
త్ప్రఖ్యాతులుఁ జెందుఁ, బురందర విజయో
పాఖ్యానము విన్నను, ద
ద్వ్యాఖ్యానము సేసినన్-జనావలి కనఘా!" 212

క. మోహరము నడచుచుండఁగ
నీహరి విజయంబు విను నరేంద్రుఁడు రిపుసం
దోహంబు గెల్చుటకు సం
దేహం బించుకయు లేదు, ధీరవిచారా!" 213

వ. అనిన విని ధర్మనందనుండు మద్రపతిం బ్రస్తుతించి "మహానుభావా
భవదీయభాషణశ్రవణంబునఁ జిత్తంబు కలంకదేఁ" నని సంభావించి,
యతనికి సముచితంబు లగు మజ్జనభోజనంబు లొనరించి, యనంతరంబ
యతండు పయనంబునకు నుద్యోగించిన, 214

ఆ. అతని ననుప నేఁగి యధికసంప్రీతి నే
తెంచునప్పు, డయ్యుధిష్ఠిరుండు
"రణములోన మీరు రాధేయుఁ బలుకుట
మఱవకుండవలయు మమ్ముఁ దలఁచి." 215

క. అనుటయు, మద్రేశ్వరుఁ డా
తని నూఱడఁ బలికి, గాఢతరముగ నాలిం

గన మొనరించి చనియె హ
స్తినాపురికి బలముతో నతిత్వరితగతిన్. 216

వ. అట్టి యవసరంబున. 217

-: సాత్యక్యాదులు సేనాసమేతంబుగఁ బాండవులం జేరవచ్చుట :-

సం. 5-19-1.

మ. సకలారాతిభయంకరుండగుచు నుత్సాహంబు వాటించి, నే
లకు వ్రేఁ గయ్యెడుభంగి వచ్చె రణలీలాకౌతుకం బొప్పఁ, దా
నొక యక్షోహిణితోడఁ బాండవబలం బుల్లాసముం బొంద సా
త్యకి-బాహాబలగర్వనిర్వహణ విద్యాప్రౌఢి సంరూఢుఁడై." 218

వ. అంతం జేదిపతి యగు ధృష్టకేతుండును, జరాసంధనందనుం డగు సహ
దేవుండును జెఱొక్క యక్షోహిణితోడం జనుదెంచిరి: సహోదరు లేవు
రగు కేకయపతులు నేకాక్షౌహిణీసమేతు లై యేఁగుదెంచిరి, తద
నంతరంబ. 219

క. కొడుకులుఁ దానును, గుట్టపు
దడములఁ గడిఘటుల భటరథవ్రాతములం
బుడమి చలింపఁగ, ద్రుపదుఁడు
గడువేడుకఁ దోడుసూపెఁ గాంతేయులకున్. 220

వ. అదియును నొక యక్షౌహిణికిం గలిగి యొప్పె, నయ్యవసరంబున ననుజ
తనుజ సమేతుండును భార్వతీయ మహీపాల సహితుండును నై, యొక
యక్షోహిణి యొడ్డనంబు దీర్చి. 221

క. చిందముల వ్రేఁతఁ బగతుర
డెందంబులతోడ దిక్తటీసంధులు నం
దంద పగులంగఁ, గుంతీ
నందనులకుఁ దోడు మత్స్యనాథుఁడు సూపెన్. 222

వ. పాండ్యవిభుండు లోనుగాఁ బలుదెసల నుండి వచ్చిన బలం బొక్కయక్షో
హిణికిం గలిగి యొప్పె. 223

క. ఏడక్షౌహిణు లిమ్మెయిఁ
గూడెం బాండునృపసుతులఁ గ్రూరాహవసం
క్రీడా వినోదమునకుం
దోడుపడం బూని యతికుతూహలవృత్తిన్." 224

వ. ఇవ్విధంబునం గూడి పెరిగి యుధిష్ఠిరుసైన్యంబు గయ్యంబునకుం గాలు
ద్రవ్వుచు నుండె; నంత నక్కడం గిరాతకాంచనసైవ్య నిచయంబులం
గూర్చికొని, సమరంబునకు నమరి, యొక్కయక్షోహిణి గల భగదత్తుండు
సుయోధనుం గలసె; భూరిపరాక్రముం డయిన భూరిశ్రవుండును, మహా
బలుండయిన శల్యుండును నేకాక్షౌహిణీసమేతంబుగా నేతెంచిరి;
వారలయట్ల సన్నద్ధుఁడై కాంభోజనాథుం డైన సుదక్షిణుం డను
యవనేశ్వరుండును వచ్చె; నత్తెఱంగున సమకట్టి జయద్రథ ప్రముఖు
లైన సింధు సౌవీరసరపతు లరుగుదెంచిరి; మాహిష్మతీపతి యగు
నీలుండును; యాదవవీరుం డగు కృతవర్మయు. నవంతీశ్వరులు సోదరులు
నగు విందానువిందు లిరువురునుంగా నిన్నలువురు నొక్కొక్క యక్షౌ
హిణితోడఁ జనుదెంచిరి; మఱియునుం బలుదెసలనుండి వచ్చి కూడిన
వాహినులు మూఁడక్షౌహిణులకుం గలిగె; ధార్తరాష్ట్రులకుఁ దోడు
పడుం బూనిన యవి పదునొకండక్షౌణు లయ్యె నట్టియెడ. 225

క. సవరణల నొప్పి యనిఁ బాం
డవబలముల మార్కొనం గడంగుచు నత్యు
త్సవమునఁ బేర్చినసేనల
కవకాశము లేదు విడియ హస్తిపురమునన్. 226

క. నానాముఖముల విడియం
గా నియమించెను బలంబుఁ గౌరవపతి; యా
సేనల దొరలకు నిలువఁగ
నైనను నెడలేమి నధికహర్షం బెసఁగన్. 227

వ. ఇత్తెంగునం గురుజాంగలంబున, రౌహితకారణ్యంబున, మరుదేశంబున నహిచ్ఛత్రంబునఁ, గాలకూటంబున, గంగాకూలంబున, వారణావతంబున, వటస్థానంబున విచ్చలవిడి విడిసి ధనధాన్యాదిసమస్తవస్తువుల కలిమిం జేసి యెలమి మిగిలియున్నంత. 228

-: ద్రుపద పురోహితుని రాయబారము :-

సం. 5-29-1.

క. పాంచాలమహీవల్లభు
పంచిన భూవేవుఁ డుచితభంగి నగరి: కే
తెంచి, ధృతరాష్ట్రుఁ బ్రీతిం
గాంచి, కృపద్రోణ విదురు గంగాసుతులన్. 229

వ. వారివారి మందిరంబులకుం జని కని, సముచితాలాపంబులం బ్రసన్న చిత్తులం జేసి, ధుర్యోధనుసందర్శనంబును నిర్వర్తించి, నిత్యనిపుణారాధనంబున ధృతరాష్ట్రు నభిముఖుం గావించి యొక్కనాఁ డక్కార వేళ్వరుపేరోలగంబున సమస్తసేనాపతులం గలయం గనుంగొని యిట్లనియె. 230

సీ. "ధృతరాష్ట్రపాండుభూపతులు సహోదరు
లగుటయు, వారల యాత్మజులకుఁ
దమతమ తండ్రుల ధనములు గైకొనఁ
దగుటయు మీకు నందఱకుఁ జూడ
నుచితంబ కాదె - యట్లుండెఁ; దొల్లింటి చం
దంబును మనకుఁ దెల్లంబు కాదె;
ప్రాణగొడ్డము లగుపనుల వారలఁ దీర్పఁ
దలఁచినఁ బుణ్యంబు కలిమిఁ జేసి

తే. బాహుబల మొప్ప నిజరాజ్యపదవిఁ బొంది
యున్న, వంచనమెయి మహిఁ గొన్న తెఱఁగు
నెఱుఁగుదుర కాదె; దీనికి నెల్ల నియ్య
కొనియె నీ పెద్దరాజు; నే మనఁగ నేర్తు. 231

శా. నారీరత్నము నట్లు దెచ్చి సభలోన న్వారలుం జూడఁగాఁ
జీరల్ ప్రోవులు గాఁగఁ జేయుటయు, లచ్చిం బుచ్చి కోలున్, మహో
గ్రారణ్యస్థలి నిల్వఁ బంచుటయు. దై న్యవ్యక్తమై పల్కులున్-
సై రింపం జను పాండవేయులకు నీ సంధిక్రమం బొప్పదే. 232

క. వీరలవృత్తముఁ బాండుకు
మారుల వర్తనము తెఱఁగు మాత్సర్యము లే
కారసి, ధృతరాష్ట్రునకున్
గారమున బుద్ధి సెప్పఁగా దగు మీకున్. 233

తే. పాండవులు గౌరవులతోడి పగకు నొల్ల-
రఖిలభూప్రజానాశన మగుటఁ జేసి;
వార లస దని తలఁపంగ వలవ; దధిక
ధర్మపరు లైనకతమునఁ దగవు నడచె. 234

వ. అందుఁ గూడినవి యేడక్షోహిణు లిందుఁ గూడినవి పదునొకండక్షో
హిణు లని తలంతు రేని వినుండు. 235

క. బాహుబలఘనుఁడు భీముఁడు,
సాహసరసికాత్మఁ డయిన సాత్యకియు, మహో
గ్రాహవ భూమి [1]సహస్రా
క్షోహిణు ల ట్లగుట మీరు సూడరె యెందున్. 236

క. గాండీవధన్వనాహవ
పాండిత్యముఁ దలఁప, నతని భండనమున మా
రొక్కండు నని యొకఁడు గడఁగుట
కొండం గని తగరు దాఁకఁగోరుట గాదే! 237

క. ఆబీభత్సుని భూరిభు
జాబలమును, దుర్నివార శౌర్యము, శరవి
ద్యాబహుళతయును-బందికి
నై బవరముఁ జేసినట్టి వారుఁడ యెఱుంగున్. 238

---

1. సహస్రా, క్షోహిణు లట్లగుటఁ గానరె యెందున్ - మున్నంగి శర్మ.

వ. అదియునుం గాక. 239

మ. వివిధోపాయపరాయణుండు, రిపుదోర్వీర్యాపహారక్రియా
ప్రవణోద్యోగుఁడు, మంత్రరక్షణకళాప్రావీణ్యగణ్యుండు, ధై
ర్యవివేకాదిగుణోత్తరుం డఖలవిద్యాజాలసంవేది మా
ధవుఁ డాదిక్కఁ గొ! పాండవేయుల కసాధ్యం బెద్దియుం గల్గునే! 240

ఆ. అదను దప్పకుండ నమ్మనోత్ముల నెమ్మిఁ
బిలువఁ బంచి, హితముఁ బ్రియము రెండు
పక్షములకు నగుట పాటించి, తగపుమైఁ
గొంత భూమి యిచ్చి కూడి మనుఁడు." 241

చ. అనవుడు భీష్ముఁ డిట్లనియె-"నక్కట భాగ్యము గాదె-పాండు నం
దను లొకయాపదం బడక ధర్మగతిం దగ నందఱున్ సుహృ
జ్జనులను గృష్ణునిం గలసి సమ్మద మొందుటయుం, బ్రశాంతిమై
మనముల నీసు దక్కి మృదుమార్గము వట్టుటయుం దలంపఁగన్. 242

క. నీవాక్యము విప్రస్వా
భావిక మై, యిట్లు శ్రుతికిఁ బరుషం బైనన్
భావింపఁ గార్యమునయం
దేవిధమున సభకు నింత యిష్టం బగునే! 243

చ. సమయమ యూఁది పాండవు లశక్తుల చాడ్పున నిందు నాఁడు బ
న్నము వడి చన్న దైన్యము, వనంబునఁ బడ్డ విషాదవేదనా
శ్రమము, విరాటువీట లఘుసంచరణంబున దాఁగి యున్న దుఃఖమును జగం బెఱుంగదె! యకల్మషులం బఱుపంగఁ బాడియే! 244

క. పితృధన మగుపా లుచిత
స్థితి వారల కిచ్చి నిర్విశేషుం డై, యీ
పతి లోకము మెచ్చఁగ, నిజ
సుతనివహము నట్ల వారిఁ జూడఁగవలయున్. 245

వ. అట్లుంగాక. 246

చ. కడవఁగ జూదమాడి, యవుఁగా దన నేరక సత్యభాషణం
బెడలిన వచ్చు ధర్మగతిహీనత కోర్వక, రాజ్యహీనతం
బడుటకు నోర్చి, ధర్మజుఁడు పంచిన సైరణ సేసెఁగాక, క
వ్వడి నెఱిగిన్క కెట్టి మగవారును నోర్తురె యిజ్జగంబులన్." 247

వ. అనిన విని కర్ణుండు గనలి యిట్లనియె. 248

క. జనులెల్ల నెఱింగిన యీ
పని యేటికి నుగ్గడింపఁ బలుమఱు; దుర్యో
ధనునకయి శకుని జూదం
బున మేదిని గెలిచె, ధర్మపుత్రుం డోడెన్. 249

ఆ. దీన నేమి తప్పు; కానకు నేఁగిన
యతఁడు సమయవృత్తి నాక్రమించి,
తండ్రిపాలు మాకుఁ దగునంచు నడియరి
తనముసేసి రాక తప్పుగాక? 250

క. విరటుఁడు ద్రుపదుఁడుఁ దోడుగ,
బరవసమున నెత్తి విడిసి బలిమి నడిగినం,
గురుపతియు వెఱచి యిచ్చునె
ధరలోఁ జక్కసగ; మిట్టితగవులు గలవే?" 251

వ. అనిన గాంగేయుండు గటకటంబడి కర్ణున కిట్లనియె. 252

ఉ. చిక్కనిపోటుమానిసి, విసీ! వినువారలు నవ్వ నేమిగా
నెక్కుడుమాట లాడెద; వహీనపరాక్రమశాలి యర్జునుం
డొక్కడ యార్వురఁ మనల నుగ్రరణంబున గెల్చె నిన్న; నేఁ
డిక్కడఁ బల్కులఁ గెలిచె దీ వతనిన్-మనరాజు కొల్వునన్! 253

క. నరుఁ డాలవెనుక వచ్చినఁ,
గురురా జడుగంగ, నీవు గురుఁడును గృపుడున్
గురుసుతుఁడు వినఁగ, వారల
చిరసమయము దెగుట యేను జెప్పనె తెలియన్!" 254

తే. అనిన ధృతరాష్ట్రుఁ డాపగాతనయు భక్తి
ననునయించి, రాధేయునిఁ గినిసి, ప్రియము
తోఁపఁ దా నిట్టు లనియె నా ద్రుపదమనుజ
పతి పురోహితుతోడ సంభ్రమము లేక. 255

ఉ. "మంచిగ నేను బంధులును మంత్రిజనంబులుఁ బెద్దలున్ విచా
రించి, సమస్తభూప్రజలకుఁ బ్రీతిగ, బిడ్డలపాలి కిప్డు పు
త్తెంచెద సౌమ్యు నొక్కరు; మదీయమనోగతి వారిఁ గూడ వ
ర్తించుతెఱంగు గైకొనుట దెల్లము కారవజాతి కెంతయున్. 256

తే. నీవు మున్నేఁగు"మని యతనికి విభూష
ణాంబరమ్ములతోఁ దమ్ములంబుఁ బెట్టి,
వీడుకో లిచ్చిపుచ్చిన, విప్రవరుఁడు
పాండుజనపాలతనయులపాలి కరిగె. 257

వ. ఇట్లు సని వారలఁ గని యతండు సముచితసంభాషణంబులఁ దనపోయి
వచ్చిన కార్యంబు తెఱం గెఱిఁగించె; నిట ధృతరాష్ట్రుండును బుత్ర
మిత్రపృద్ధామాత్యసహితంబుగా నాస్థానాసీనుం డయి యుండి సంజయు
రావించి యతని కిట్లనియె. 258

తే. "పాండునరపాలసుతు లుపప్లావ్యమునకు
వచ్చియున్నారు, నీ వేఁగి వాసుదేవ
సహితముగ వారిఁ గని, తద్విషాద మేమి
భంగి మాను నమ్మెయిఁ దగఁ బలుకవలయు. 259

-: ధృతరాష్ట్రుఁడు సంజయునిఁ బాండవులయొద్దకుఁ బంపుట -:

సం. 5-22-1.

క. మీయయ్య-మీరు వసం వా
సాయసము నిస్తరించి, యభ్యుదయమునన్
డాయుట విని, ముదితాత్ముం
డై-యిట పుత్తెంచె నన్ను ననుమీ మొదలన్." 260

వ. అని చెప్పి చుట్లనున్న వారలతో నిట్లనియె. 261

క. "దుర్యోధనుండు గార్య్యా
కార్యజ్ఞుఁడు గామి, నిట్టి కలఁక గలిగెఁ గా,
కార్యులు దృఢధైర్యులు రణ
ధుర్యులు నగు పాండుసుతులు దోషాన్వితులే! 262

క. ఔరోదకవృత్తి మనము
వారలునుం గలసి బ్రదుకవలదే నెమ్మిన్!
వా రిడుమలఁ బడఁదగియెడు
వారే! పితృభాగ మేలువారలుగారే! 263

ఆ. మనల నింక నమ్మ-రన్యతాత్మ లన్యాయ
పరులు గర్వులనుచుఁ, బాండుసుతులు
గూడి మనుట కియ్యకొన నేర; రైనను
ధర్మజుండు గలఁడు దగవు నడప." 264

వ. అని పలికి వెండియు. 265

మ. మన కీకుండఁగ వచ్చునే? మనము దుర్మానంబు వాటించి, యొ
ప్పని కార్యంబులు వట్టి, వారికిఁ దగం బాలీక గర్వంబు లా
డిన, నిక్కంబగునల్క నర్జునుఁడు గాండీవంబు మోపెట్టఁ గృ
ష్ణుని సారథ్యము నై, జగత్త్రితయసంక్షోభంబు గాకుండునే! 266

తే. అలఘుగదఁ బూంచికొని భీముఁ డతిరయమునఁ
గురుకుమారులపై దీవ్రకోప మెసఁగఁ
గవియు టాత్మ భావించినఁ-గంప మడరు:
నిక్క మెవ్వరు మార్కొని నిలుచువారు!" 267

సీ. కవ లగ్రజన్ములకంచె నేమిటఁ గీడు,
ద్రుపదుఁ డల్పుండె, తత్సుతులు బాహు
గర్వసమగ్రులు గారె, విరాటుండు
నాతని తమ్ములు నాత్మజులును

నసదు, సాత్యకి యలఁతులఁ బోయెడు
వాఁడె, వృష్ణికుమారవరు లనేకు
లట్టి యోధులు పోర నరవాయి గొందురే,
పాండ్యుండుఁ గేకయపతులు నాది

తే. యైనబంధులు మిత్త్రులు నగ్గలికలఁ
గొఱఁత వడియెడువారె, యందఱను గెల్వ
నోపినను, రుద్రునకు నైన నోర్వరాని
ధర్మపుత్రుకోపమునకుఁ దలఁకవలదె!" 268

వ. అని పలికి సంజయు దిక్కు మొగంబై, యెల్లవారును విన నిట్లనియె.

తే. "నీవు ధర్మజుపాలికి నెమ్మి నరుగు,
మతఁడు పేరోలగం బున్న యవసరమునఁ
గాన్పు, మతనికి ననుజవర్గంబునకును
బంధులకు నింపు వుట్టంగఁ బలుకు మచట. 270

క. నెయ్యము వాటించి, కడుం
దియ్య మెసఁగ, నలుక లెల్లఁ దీఱు నటులుగాఁ,
గయ్య మనుతలఁపులోనుగ,
నయ్యమనందనుఁడు మానునట్టి తెఱఁగుగన్." 271

-: సంజయుఁ డుపప్లావ్యంబున నున్న పాండవుల యొద్దకు వచ్చుట :-

సం. 5-22-39.

వ. శాంతిప్రకారంబునం గార్యంబు నడపి, యొక్కటి యై మనుట యొడఁగూర్చి రమ్ము, రథం బెక్కి పొ" మ్మని తగిన తెఱంగున వీడ్కొలిపిన, సంజయుండునుం జని, యుపప్లావ్యంబు సొచ్చి, మాధవు మందిరంబున కరిగి, యభ్యంతర వినోదంబుల నరసహితుండై యున్న యన్నారాయణునకుం దనరాక యెటింగించి పుచ్చి, తగఁ బ్రవేశించి భయభక్తివినయ సంభ్రమంబులు మెఱయ వారలం గాంచి, యమ్మహాత్ము లిరువుర సంభావనంబులును సంభా[illegible]నుం బడసి సంప్రీతచేతస్కుం డై,

మఱునాఁడు ధర్మతనయు నొడ్డోలగం బున్నసమయంబు వేచి, సముచితంబుగా నతనిం గని సాష్టాంగంబుగాఁ బ్రణమిల్లిన, నతండుం బ్రియపూర్వకంబుగా నాదరించి తన సమీపంబున నునిచికొనినం గొలిచియుండి యతని కిట్లనియె. 272

తే. "భాగ్యమున నిన్నుఁ గనుఁగొనఁ బడసి, నాదు
చూడ్కి చరితార్థ మయ్యె; నస్తోకపుణ్య
ధనుఁడు మీతండ్రి ధృతరాష్ట్రధరణినాథుఁ
డిందు మీయున్కి విని ప్రియ మెసక మెసఁగ. 273

క. అనుజులు నీపును ద్రోవది
యును బుత్రచయంబు నున్న యోగక్షేమం
బున తెఱఁ గారయఁ బుత్తెం
చె-నితాంతస్నేహపూర్ణచేతోవృత్తిన్." 274

వ. అనిన సూతనందనునకు ధర్మనందనుం డిట్లనియె. 275

క. "ఆరాజు మాదెసం గల
కారుణ్యముకతమునను సుఖంబున నిట్లు
న్నారము; నినుఁ బుత్తెంచిన
గారవమున నాదుమది వికాసముఁ బొందెన్. 276

క. అమ్మనుజేశ్వరునకు నే
మమ్మే! పుత్రకులు సుఖులె! మనములు సమ్మా
దమ్మునఁ బెరిఁగెదరే! నగ
రమ్ముల భూములను శుభపరంపర గలదే! 277

సీ. ద్రోణుండుఁ గృపుఁడును ద్రోణసుతుండును
సుఖ మున్నవారె? సుశ్లోకుఁ డైన
భీష్ముండు గుశలియే! పెద్దతనం బిచ్చి
యాతనిఁ గౌరవు లనుసరించి

మెలఁగుదురే! బ్రాహ్మణులకు మన్నన గల్గి
యుండునే! యే మర్థి నొసఁగినట్టి
వృత్తులు సెల్లునే! యొత్తొరు వొండుల
వలనఁ బుట్టదుగదా! కలఁకులందుఁ

తే. బుట్టినప్పుడు గాండీవిభుజబలంబు
తలఁతురే! భీమసేను గదావిహార
ముగ్గడింతురె! కవలు మహోగ్రరిపుల
భూము లంతంత కొత్తుట పొగడఁ బడునె! 278

మ. ఒకనాఁడా! తమ ముందటం బలుమఱు హోరాటమై నేల యొ
త్తికొనంగా బవరంబులఁ గెలువఁగాఁ దెల్లంబుగాఁ జూచి, పాం
డుకుమారాళి నుతింపకుండుదురె! యాటోపంబునఁ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటిచరిత్రం బాత్మలం బాయునే! 279

క. వినుము, మనము మధ్యస్థుల
మని నర్జును నెదిరి, సంజయా! యిటము న్నె
వ్వానికిని మానముఁ బ్రాణం
బును దగఁ దక్కించుకొనఁగఁ బోలెనె చెపుమా! 280

క. దుర్యోధను నింటం దగు
కార్యమునకు ఖడ్గమునకుఁ గలవాఁడై, చా
తుర్యంబు మెఱయు కర్ణుని
యార్యత్వము సెల్లుచున్న యదియే నెమ్మిన్." 281

వ. అనిన విని సంజయుండు సవినయంబుగా నిట్లనుఁ, "గురురాజు నొద్ద
నవినీతులు నీతిమంతులు సత్త్వసంపన్నులు దురహంకారులు మఱియు
వివిధప్రకారులు నయి బెరసియుండుదురు. వారొకళ్లొకళ్లమాటలం
బోయెడువారు గారు. కావున వారి నంత యనం బనిలేదు. నా విన్న
పంబు చిత్తగింపుము. 282

క. పొం దొందఁగఁ దలఁచితి వీ
విందుశిశిర మైన విమలహృదయంబున, వా

రందఱకును నేమం బిట
ముందర లేకున్న, నేఁడు మొదలుగఁ గలుగున్. 283

క. ధృతరాష్ట్రభూపతికి వృ
ద్ధతకతమునఁ జిత్త మొకవిధము గామి పుతో
ద్ధతి మాన్పఁడ నాఁడు, మనఃక్షితి పిదపం బుట్టి యిపుడు శాంతుం డయ్యెన్. 284

తే. ఇట్టి చందంబు లెల్లను నీవు పుణ్య
చిత్తవృత్తిమై నైఁచినఁ జెల్లివచ్చు,
నీ యజాతశత్రుత్వంబు నిఖిలలోక
విశ్రుతము గాదె ధర్మప్రవీణహృదయ! 285

చ. జగముల నెల్లెడన్ దురితసంతమసంబు జయింపఁగోరి పొ
ల్పుగఁ బరమేష్ఠి నిల్పిన వెలుంగు మహీసురు; లట్టి వారికిం
దగవు ఘటింప సత్పురుషదత్తము లై చను జీవనంబు; లెం
త గుమతు లైన మార్తురె? పదంపడి యాయువు శ్రీయు నొల్లరే? 286

ఉ. ఒక్కొకచోఁ గడంగి ప్రతియోధులు మార్కొనునప్పు, డాత్మలన్
నెక్కొని మోములం బొడము నెవ్వగతోడ జనంబు "లిట్టియం
దక్కట! భీముఁ డైన మన యర్జునుఁ డైనను, మాద్రిపుత్రులం
దొక్కరుఁ డైన నీ పగఱ నుక్కడఁగింపరె యొక్కవేల్మిడిన్. 287

క. వా రొక యాగ్రహవృత్తిం
గూరి యధర్మంబుసేఁతకుం జాలరు; దు
ర్వారబలు లయ్యుఁ బాండుకు
మారులు శాంతాత్ము" లంచ్రు మనుజాధీశా! 288

క. నలువురుదమ్ములు భవదా
ప్తులుఁ గృష్ణుఁడు వినుచునుండ, భూవర! నీ కేఁ
గొలువునను విన్నవింపం
బలుకులు గల వవధరింపు పరిపాటి మెయిన్. 289

చ. అనవుడు, "వీరె తమ్ములును నాప్తులఁ గృష్ణుఁడు, వీరె తక్కఁ కొ
ల్వునఁ గలయట్టి సర్వజనులుఁ వినుచుండెద; రయ్య నిన్ను నే
మను మని పంచేఁ జెప్పు మదియంతయు నేర్పఁడ" నన్న ధర్మనం
దను గరువంపుఁ బల్కుల విధంబునకున్ మదిలోన నుల్కుచున్. 290

ఆ. సంజయుండు గృష్ణు సద్భక్తి నీక్షించి,
పవనపుత్రుఁ పార్థుఁ గవల ద్రుపద
తనయు సవినయమునఁ గనుఁగొని, ప్రీతిఁ పాం
చాలు మత్స్యధరణిపాలుఁ జూచి. 291

వ. సావధానులరై వినుం డని పలికి యుధిష్ఠిరుదెసకు మోడ్పుఁగేలు
నిగిడించి యిట్లనియె. 292

ఉ. "శాంతతఁ బొంది కార్యముదెస ధృతరాష్ట్రమహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేటి నన్నిట ప్రియంబునఁ బంచెడునప్డు, నాకుఁ దే
రెంతయు వేడ్క దాన వెర వేర్పడఁ జెప్పుచు బన్నఁబంచె; ని
ట్లింత ఘటించేఁ బొందు; మన మీపదనం దెలివొందఁగాఁ దగున్. 293

క. చులుకనికార్యము సేయం
దలచుఁట- మీయట్టి సర్వధర్మజ్ఞులు శాం
తులు ననఁ బ్రసిద్ధ లగు పె
ద్దలకుం దగవగునె యెవ్విధంబునఁ జూడన్. 294

ఆ. మడుఁగుఁజీరయందు మసి దాఁకినట్లు మీ
సత్కులమునఁ గల్మషంబు గౌర
వేంద్రుకతనఁ బొందె, నింతయుఁ పాపంగ
నీవ నేర్తు కార్యనిపుణహృదయ! 295

చ. అఖిలజనభయం బయి, జయాపజయంబులు రెండునుం దుదిన్
సుఖములు గాని యీపనికిఁ జొత్తురె యుత్తము లట్లుగాక యీ
నిఖిలసుఖంబు లేమిటికి, నీ వని వృద్ధజనంబు పాలుర
సఖులను బంధులన్ గురులఁ జంపితయేని దయాపయోనిధీ! 296

ఉ. పెట్టనికోట నీకు హరి, భీముఁడు నరునుఁడున్ రణంబునం
దొట్టినమంట; లాకొలఁది యోధుల సాత్యకియున్ విరాటుఁడుం
జుట్టపుమేరు వుగ్రరణశోభితుఁ డీద్రుపదుండు; నిన్ను ని
ట్ట ట్టనవచ్చునే సురలకైనను-నొల్లవు గాక చివ్వకున్. 297

వ. మఱియు నక్కడ. 298

ఉ. ద్రోణుఁడు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణశల్యులుం
బ్రాణము లా సుయోధనుని పాలివ యంద్రు; నిజానుజన్ము ల
క్షీణపరాక్రముల్; సుతు లజేయులు; బాహ్లికసోమదత్తు లా
స్థాణునకైన నోడరు; వళంబె జయింపఁగ వారి నేరికిన్. 299

ఆ. అధిప! యిట్టి మీకు ననోన్యకలహంబు
నాకుఁ జూడ మే లనంగరాదు,
రెండుపక్షములకుఁ బ్రియము హితంబును
నాత్మఁ గోరువారి నడిగి చూడు." 300

వ. అని పలికి సూతనందనుండు గొలువు గలయం గనుంగొని. 301

ఉ. "మొక్కెద వాసుదేవునకు, మోడ్చెదఁ జేతులు సవ్యసాచికిం,
దక్కటి మిత్త్రి బాంధవ హిత ప్రియ మంత్రి వయస్య కోటికిన్
ప్రుక్కుచు విన్నవించెద; నసూయలు దక్కి యనుజ్ఞ సేయుఁడీ
యిక్కురుణాకరున్ శరణ మే నిదె వేఁడెదఁ గ్రోధశాంతికిన్." 302

వ. అనుచుం బ్రణామపూర్వకంబుగాఁ బాండవాగ్రజు వదనంబునం జూడ్కి
నిలిపి "దేవా! యుపశమించుట లెస్స, యిమ్మెయికిం గురుపితా
మహుండును సంతసిల్లు, నాతనికి మతంబయినతెఱంగు సర్వలోకసమ్మతం
బగు" నన, విని ధర్మనందనుం డిట్లనియె. 303

ఉ. "నెయ్యము దప్ప నొండొకటి నీచెవి సోఁకెనె నాదుపల్కులం
దియ్యెడ సంజయా! యనికి నెమ్మెయి నల్కెదు నీవు? మాకుఁ దాఁ
గయ్యము దక్కి మన్కి తగుకార్యము గాదొకొ? పోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధి వెడఁ గైనను నొల్లక యుండు నేయునే! 304

క. జనులకు నెల్లను బథ్యము
లనఁగా, ధర్మానుగతము లగుననఁ బొగడం
జనుపనులు సేయు భీమా
ర్జునులే దుష్కర్మమునకు రోయనివారల్ ! 305

క. మది సుఖము గోరి, దుఃఖం
బొదవం గలకార్యములకు నుత్సాహము సే
యుదు- రొప్పనితృష్ణం బడి,
చదుకేమియు లేనియట్టి జను లాతురు లై. 306

ఆ. యోగ్యతృష్ణ దారు లుచి తంపుఁగొలఁదిమై
నడచినట్టి వారు బెడిదములకు
నంత సొత్తు లెట్లు? సంతాపకారుల
కాక, వెనఁకువలు సుఖంబు లగునె? 307

వ. భోగంబులు వలదా యని తలంతుమేని. 308

తే. వస్త్రమాల్యానులేపనావసరములును
జతురతూర్యత్రయంబుల సమయములును
నేము వెలిగాఁగ మా తండ్రి కించు నెట్లు?
పుత్రు లన వట్టి మమ్మేల పోవఁ ద్రోచు? 309

వ. అయినను నొకమాట నెవ్వెద, సమచిత్తుఁడ వై విను" మని యిట్లనియె.

క. "తానై న నపుడు వక్రుం
డై నీతిపథంబు విడిచె నక్కట పతి; మ
మ్మైనను జక్కని తెరువునఁ
బూని నడవుఁ డనుచు నిపుడు బుద్ధులు సెప్పెన్. 311

క. ఎదిరిం దమయట్టుల కా
మదిఁ దలఁచినఁ బొసఁగుఁ గాక, 'మాకుం గుడు మిం
డిదె మీరె వ్రక్కఁ గొనుఁ' డని
చదు రడిచిన, మనసుపొందు చక్కం బడునే." 312

వ. అని చూపి చెప్పి వెండియు. 313

ఉ. "సంపద దక్కి యుండఁగ నశక్తు లనం జను మమ్మఁ బిల్చి పూ
జింపఁగ నంత బేలె పతి? సెప్పెడువారలబుద్ధి నాఁడ మ
న్నింపఁడ; యింక నేల యగు; నీవడియాసల వచ్చి రిత్త గా
రింపక మాను; మాతనిచరిత్రము నీకును మాకు వింతయే! 314

క. తగుమాట లాంబికేయుం
డగునని కైకొనునె యెన్నఁ డైనను; గొడుకున్
మగఁటిమి గలఁ డనియెడు న
మ్మిగఁ జూచుచు నుండు- విషము మ్రింగినయేనిన్. 315

క. 'జూదపునిరి యాసపడం
గా' దని విదురుండు సెప్పఁగా, నప్పుడు క
ర్ణాదులపలుకులు విని, పతి
యాదరణము సేయకున్న నంతన తీరున్. 316

క. ధృతరాష్ట్రు డిటమీఁదను,
సుతులును శకునియును సూతసుతుఁడును- దను నే
గతి నడపించిరి, వారల
మతమ యనుష్ఠించుఁ గాక, మరలం బడునే. 317

క. కార్యము తెఱఁ గిట్టిది; నీ
వార్యచరితమునకుఁ జొచ్చి యాడెదు; నీ కా
దుర్యోధను నవినయ మని
వార్యం బని యెఱుఁగరామివలనో! వెడఁగో! 318

క. చక్రధరు లెక్కగొనఁడు, ప
రాక్రమనిధి యర్జునునకు రాధేయభుజా
విక్రమ మెదురుగఁ గొని, ని
ర్వక్రముఁ జేసికొనువాఁడు రాజ్యం బెల్లన్." 319

వ. అని పలికి వెడవెడ యలుక వొడమిన మఱియు నిట్లనియె. 320

శా. "చాపాచార్యుఁడు భీష్ముఁడుం గృపుఁడు నశ్వత్థామయుం గర్ణుఁడున్
భూపశ్రేష్ఠుఁడు- దారు ము న్నెరుఁగరే పో, రెట్లుఁ గయ్యంబు? లా
శాపాశంబులు చుట్ట లా వెఱిఁగియుం జావేఁడి మార్కొందు; రిం
తేపో- తమ్ముఁ గపిధ్వజప్రభల యంధీభూతులం జేయవే! 321

క. మును మమ్ముఁ బొగడి పదపడి
యని వారల గెలువ నరిది యని, పొత్తుగఁ జె
ప్పినమాటకు నే నొడఁబడ,
విను సంజయ! పక్షపాతవృత్తి విడువుమీ. 322

స్రగ్ధర. గాండీవజ్యారవం బుత్కట మయి పెలుచం గ్రమ్మినన్, భీముబాహా
దండం బేపారి శుంభద్గద జడియుచు రౌద్రంబుగాఁ దోఁచినన్, వే
దండద్వంద్వంబు మాడ్కిం దఱిమి కవలు మాద్యద్గతిం దాఁకినం, జా
కుండం బోకుండఁ గౌరవ్యులకు వశమె బిట్టుల్కి మూర్ఛిల్లకుండన్!

వ. కావున. 324

చ. రణములవారలన్ గెలువరా దను పల్కి లటుండ నిమ్ము. స
ద్గుణుఁడవు నీవు వచ్చితి, ప్రకోపశమంబుగఁ బల్కి; తింక సై
రణ దగఁ జేయువారము; పరాభవ మొందియు, మున్ను వారిదు
ర్గుణములు సైఁచు టీవు నొకకొంత యెఱుంగుదు వింతయేటికిన్. 325

ఉ. ఇంకను నట్లకాఁ దలఁపు. మే మొకకీడునకుం దొడంగ, మా
శంకలు దక్కుమయ్య! కువిచారము గల్గినయేని, బాంధవం
బంకుర మొత్త, మావలన నక్కటికం బొలయంగ, మమ్ము నే
వంకకుఁ బోవనీక గరువంబు జగంబు ప్రసంశ సేయఁగన్. 326

క. రం డని పిలువఁబనిచి, పా
లిం డని కొడుకులకుఁ జెప్పి, యింద్రప్రస్థం
బొండెను వేఱొకపట్టణ
మొండెను మా కిచ్చి యనుచు టుచితమ కాదే!" 327

ఉ. నావిని సంజయుండు నరనాథున కిట్లను, "నెట్టి తప్పులుం
బోవఁగఁ ద్రోచి తాలిమియ పూనుదు గావున, నిన్ని మాట లి
ట్లీవు వినంగ నాడియును నేఁ దనివోవక విన్నవించెదన్
నీవిభవం బహింసయు ననింద్యచరిత్రమ కాక యన్యమే ! 329

క. పాలిక కారవులు దు
శ్శీలతఁ జెడఁ దలఁచిరేనిఁ, జెప్పెద, రుధిరా
భీలాన్నంబునకంచెను,
మే లగు భిక్షాన్న మైన మీనడవడికిన్ ! 329

వ. అది యెట్లంచేని. 330

సీ. రాజసూయమహాధ్వరం బట్లు నడిపి,
సద్ద్విజులకు సురలకుఁ దృప్తిఁ జేసి,
శాంతియు దాంతియు సకలలోకంబులఁ
బొగడొంద బ్రదికిన పుణ్యమూర్తి;
విట్టి నీచరితంబు హింసాకళంకిత
మగు నెంత యెప్పెడు? నదియుఁగాక,
దుర్ణయవృత్తి దుర్ధ్యాతంబు పుట్టించి
యంతలు సేసినయట్టివారి

తే. నేల గర్వంబు సెల్లంగ నిచ్చి జగము
చేతఁ దిటులు వడునటు సేసి పోయి?
తేల యడవుల నిమ్మెయి నిడుమగుడిచి?
తేల తాల్మియ ధనముగా నింతవడితి? 331

క. తుదిఁ బోయి, క్రూరకర్మా
స్పద మగు తెఱఁగునకుఁ జొచ్చి, బంధుల గురులన్
వెదకి వధియించు సౌఖ్యం
బది యేటికి? నార్యవిద్య మస్థిర మరయన్. 332

తే. అల్పులకు క్రమింగ జేఁదైన హాలహలము
భంగిఁ బొంగెడు కోపంబు క్రమింగికొనఁగ,
నీలగళు నెన్ని ని న్నెన్నఁబోలు, నట్టి
నీవు సాలినఁ గా, కేల నెగడుఁ బేరు?" 333

చ. అనవుడుఁ బాండురాజతనయాగ్రణి సంజయు మోముఁ జూచి యి
ట్లను, "నది యెల్ల నీ వలికినట్టిద, ధర్మ్మవు లట్ల యుండి, బో
ధను లకయంగ వచ్చిన నధర్మ్మము లై చెడుఁ గొన్ని, ధర్మ్మవ
ర్తనములు గాక తోఁచి, తుది ధర్మ్ములై చనుఁ గొన్నికర్మ్ములన్." 334

వ. కావున నన్ను దూఱఁ దలంచితేని నాచేయునది 'ధర్మ్మం బధర్మ్మం' బని నిరూపించి మఱి దూఱుము; కోపంబు నివారింపం దగు, నహింసయ యుత్తమ ధర్మ్మం బగు; నట్లయినను వంశదూషకులును లోకకంటకులును నగు పాపాత్ముల నిర్మ్మూలంబుగాఁ జెఱచుట ధర్మ్మం బని పెద్దలచేత విందు, మది యట్లుండె; 'సంగ్రామంబు రాజులకు ధర్మ్మం బవుగా'దని నీవ చెప్పు; మట్లుంగాక, 'యిది కర్తవ్యం బిది యకర్తవ్యం' బని మనల శాసింప వాసుదేవుండు గలండు, మన కీవితర్క్కం బేటికి? నితండు ధర్మ్మాధర్మ్మ విదులకు గురుండు, గార్య్యాకార్య్యనిరూపకులకు శిక్షకుం, డుచితానుచి తజ్ఞులకుఁ బ్రదర్శకుం; డితనిపంపునం గాదె యదుభోజాంధకవృష్ణి సంజయకేకయ ప్రభృతి భూపతిప్రకరంబు ప్రశస్తపథంబునం బ్రవర్తిల్లు చున్నయది; విశేషించి మాకు నితనిబుద్ధియ సమస్తపురుషార్థమ్ములకు మూలం బగుట నితనివచనం బవశ్యంబు నలంఘనీయం" బనిన విని, జనార్దనుండు సంజయున కిట్లనియె. 335

ఉ. "పాండుతనూజకోటికి శుభం బెడఁగోరుదు నెప్డు, నాంబికే
యుండును బుత్రపౌత్రమహిమోజ్జ్వలుఁ, డక్కట! చేటు మేలె యం
చుండుదు; నట్లుఁ గాక తెలివొంది యతం డిట వీరిఁ దేర్పఁగా
నిండుమనంబుతోఁ బనిచె నిన్నని దీనికిఁ బ్రీతిఁ బొందితిన్. 336

ఆ నీవు నుచితవృత్తి నెయ్యంబు ధర్మ్మంబు
వినయ మొప్పఁ దెలిపి, వీరు శాంతిఁ

బొందునట్టిభంగి పొసఁగఁ బల్కుటయును
నాకు సమ్మదం బొనరెఁ నిపుడు. 337

ఆ. అనఘ ! యిట్టు లంతయును దలఁపం గడు
నెనసినట్టు లుండెనేని, వించె
పాండవాగ్రజన్మపలుకులచందంబు
సూడ సంధిలేనిచొప్పు దోఁచె. 338

క. అది యట్టిద, సంధానము
దుది నెమ్మెయిఁ గల్గు నెట్లు ? దుర్యోధనుఁ డు
న్మదుఁడు; ధృతరాష్ట్రి భూవిభు
హృదయంబు తెఱంగు గొంత యెఱుఁగుదుముగదా ! 339

క. ఆరాజు సేయునెయ్యము
గారామును జెప్పె దీవు, గడుఁ దీపులుగా
నీకు దమపాలు వడయక
నేరిమి మాట లన తీరనేర్తురె చెపుమా ? 340

ఉ. వీరలు పెద్దద్రవ్య, కొకవెంట నొడంబడి, తేటి శాంతు లై
కారవకోటిఁ గూడి మనఁగా మదిఁ గోరుట పెంపుఁ దాల్మియుం
గారుణికత్వముం దగవుగాదె ! జగంబున పాడిఁ దండ్రిపా
లీ రని తెంపు సేసి పయినెత్తిన-నెత్తిరి గాక ద్రోహమే? 341

క. విను, మవమానము పడి యి
ట్లునిఁ బడయు పొగడుకంచె, నుజ్జ్వలు లై మా
ర్కొనిన నది లెస్స; యెట్లయి
నను వీరికిఁ బోటు మేలు నాకుం జూడన్. 342

వ. 'సంగ్రామంబు రాజులకు ధర్మం బవుం గా దని నీవ చెప్పు' మని యుధిష్ఠి
రుండు ని న్నడిగెఁ గదా ! ద్విజాతులకు యజనయాజనాదికర్మకరణ
విభాగంబు ధర్మశాస్త్రాచార్యులు విధించునప్పుడు, రాజు లిచ్చువారు
గాని, వేఁడుకొనువారు గా రని చెప్పుట సకలలోకప్రసిద్ధంబు. సర్వవర్ణా

శ్రమధర్మపరిపాలనంబు సేయునట్టి రాజులు దార నిజధర్మంబు వదలుదురా? యదియునుం గాక, పాడితోడి యార్జనంబునం దమకుఁగల కిలిమి యనుభవించుచు, సత్పథంబున నడచుచుండఁ, ద మ్మొరు లన్యాయంబు సేసిన యప్పటికిఁ గదా యీశస్త్రీస్త్రధర్మంబు లింద్రాదు లగు పెద్దలు గావించిరి; నీచెప్పెడి ధర్మంబులు గౌరవులకుం జెప్పవలదా? వారలు గదా మీఁ దెఱుంగక కొఱఁతనుఱుకులై చెడుతెరువునం బోయెదువా" రని పలికి మఱియు నిట్లనియె. 343

క. నెట్టన సభలో, వేవుర
కట్టెదుర, నరాతితనము గా- కెంతయు వా
రెట్టితులువలో, ద్రౌపది
నట్టుల పటిచెడిదె? జూద మాడరె యెందున్? 344

వ. అనవుడు సంజయుండు "దేవా! నీ చిత్తంబున నిడి దీని నింత గొని యాడినఁ గర్జం బొడగూడునే" యనిన, వాసుదేవుం డిట్లనియె. 345

ఉ. అత్తఱి భీష్ముముఖ్యు లగు నచ్చటి వృద్ధజనంబు లెల్ల నో
రెత్తక యూరకుండిరి మహీశ్వరుచిత్త మెఱుంగకున్కిఁ; దా
నొత్తి కుమారులం గినియ నోపఁడ; యక్కట! మాన్పఁ గన్న, నా
చిత్తమ కాదు, లోకముల చిత్తములెల్లను సంతసింపవే! 346

ఉ. తిట్టులఁబోయి యక్కొలువు తేఁకువవారలలోని, కింతిఁ దా
నట్టులు దుస్ససేనుఁ డదయాకృతి ముందల వట్టియీడ్వఁగా,
నెట్టు సహించె మామ? సతియేడ్పు చెలుంగున కెట్టు లోర్చె? నీ
పట్టున సేమ మారయఁగఁ బంచుట కెట్టులు నేర్చెఁ గ్రమ్మరన్? 347

చ. ఇది దగ దంచు నడ్డపడు నింతకు నేరక, సభ్యు లందఱున్
మది మరగొన్న యట్టియెడ, మానినికిం దనుఁ దాన కాచికో
లొదవిన దానఁ జేసి సభ నొచ్చెము దక్కినఁ, బాండునందనుల్
బ్రదికిరి గాక; యయ్యెడరు రాజకుమారుల కోర్చునట్టిదే? 348

వ. సంజయా ! వినవే యప్పుడు సభాసదులకుఁ గర్ణశూలంబు లగునట్లుగాఁ గర్ణుండు. 349

క. 'లే రిచట మగలు నీకును
వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన ! నీవైఁ
గూరిమి గలమగని వెదకికొను మెురు'- ననఁడే ? 350

క. నరునకు నది వాఙ్మయ మగు
శరమై హృదయంబు నాఁటి చలియింపక దు
ర్భరవేదనఁ జేయంగాఁ,
చిరకాలము దచ్చికిత్స సేసెనె చెపుమా ? 351

వ. మఱియు దుశ్శాసనుండు 'వీర లందఱును గొడ్డువోయిన వారలు, పౌరుషంబు గల మానిసి యిం దెవ్వం' డనియె. నతని చెప్పినట్ల పెద్దగాలంబేని వీరల గొడ్డువోయిరి గాక వీరిదెస వారికి నేమి ఫలించె ? వెండియుఁ దత్సమయంబునఁ బుట్టిన మాట లుగ్గడించునట్టివి గా, వీసంధికార్యం బత్యంతదుర్ఘటంబు. దీని ఘటియింపఁ జేయుట యశక్యం బని తలంచెద. నయినను. 352

సీ. పాండవేయులఁ దగం బ్రార్థించి, యందుల
కక్కట యేనైన నరుగుదెంచి,
కౌరవులకు బుద్ధిగాఁ జెప్పి, రాజ్యంబు
పాలు సేసిన, మృత్యుపాశములకుఁ
దప్పరే వారలు; దగవును నేర్పును
నామీఁద నిలుచుట నాకుఁ గీడె;
నన్ను మన్నింతు, రన్యాయంబు సొరని నా
మాటకుఁ దా రొడఁబాటు లేక

తే. యుండుదురె ? కేరడము లాడుచుండిరేనిఁ
గవియు పాండవబాణాగ్ని గాదు సువ్వె,

తమ్ముఁ దమ లోభ మను చిచ్చు దరికొనంగఁ
దెగినవా రయి పోదు రింతియ తలంప." 353

వ. అని పలికి వెండియు నిట్లనియె. 354

ఆ. "రోషమయ మహాతరువు సుయోధనుఁ, డురు
స్కంధ మందులోనఁ గర్ణుఁ, డలరుఁ
గొమ్మ సౌబలుండు, గుసుమఫలములు దు
శ్శాసనుండు, మూలశక్తి తండ్రి! 355

ఆ. ధర్మజుండు ధర్మతరు, వర్జునుఁడు ఘన
స్కంధ, మనిలసుతుఁడు శాఖ, కవలు
పుష్పఫలము, లేను భూసురులును వేద
ములుఁ దదీయమైన మూలచయము. 356

క. ఈ రెంటియందు నరసి, 'య
సారం బిది, గాఢసారసహితం బిది' నా
నేర వలయు; నదియును గా
కేరూపం బయ్యెనేని నీ సేమిటికిన్. 357

మ. ధృతరాష్ట్రుండును బుత్రులున్ వనము, గుంతీనందనుల్ సింహముల్,
మతి నూహింప నసింహ మైన వనమున్ మర్దింతు రెందున్; వనా
వృతవృత్తంబులు గాని సింహములకున్ వేగంబ చేటొందుఁ; గా
న తగం బొందుట కార్య మీయుభయము న్సంతుష్టమై నున్కికిన్. 358

క. పరిచారకు లై యుండుదు
రరివర్గవ్యతికరమున నగుదురు, వీరిన్
సరిఁ దనకొడుకుల మెలపిన
తెరువున మెలగింప వలదె ధృతరాష్ట్రునకున్? 359

ఏ నీ పనికై వచ్చెఁ
గొప్పఁ దలంచె నొండెఁ దప్పం దలఁచెన్

దానన నెగడెద మే, మ
మ్మానవనాథునకుఁ జెప్పు మామతమెల్లన్."

360

వ. అనిన విని సంజయుండు ధర్మతనయుం గనుంగొని "యట్లయినను గడు లెస్స గదా! దేవా నా వచ్చినకార్యంబు సఫలం బయ్యెఁ, బనివిని యెద" నని వాసుదేవునకు నట్ల విన్నవించి, భీమార్జుననకులసహదేవ సాత్యకి ద్రుపదవిరాటుల నీక్షించి, 'మీ యందఱచేత ననుజ్ఞాతుండన కదా పోయివచ్చెద' నా యాడిన మాటలయం దేమియుం దగనియట్టివి లేవుగదా" యనుటయుఁ, బాండవాగ్రజుం డతని కిట్లనియె. 361

ఆ. పోయివత్తుగాక ! యీ యున్న యందఱు
వినఁగ నాడి తీవు విశదభంగి,
నొక్కమాట యైన నుచితంబు గానిది
గలదె ? యిట్లనంగ వలయు నెట్లు ?

362

క. ఎదు రున్నరూపు వలుకఁగఁ
దుదిఁ గటకటఁ బడవు నీవు, దుర్ణయమును బె
ట్టిదమును బెండును నగు పలు
కొదవదు నీ నాలుకకు- నయోన్నత యెపుడున్ !

363

క. నీ వొండె విదురుఁ డొండెను
గా వలయుంగాక, యిట్టి కార్యంబులకున్
రా వేఱు కలరె తగువా;
రీవినయము నేర్పు గలదె యితరుల కెందున్ ;

364

చ. అరిగిన యప్డు పెద్ద లగు నందలివిప్రుల నెల్లఁ గాంచి యా
దరమున వారి నేమ ముచితంబుగ నారసి, వెండి కాన్పు మీ
గురునిఁ బితామహుం గృపునిఁ; గూర్తురు వారలు నాకు; నా నమ
స్కరణము గాఁగ వారి కధికప్రియభక్తి నమస్కరింపుమీ !

365

సీ. మాతండ్రిఁ గని, యేను ప్రీతి ప్రొక్కుట గాఁగ
దండప్రణామంబు దగ నొనర్పు;

దుర్వృత్తిఁ బొరయు నాదుర్యోధనుని సేమ
మడిగితి నని చెప్పు; మతనితమ్ముఁ
డగుటకుఁ దగియెడు నాదుస్సనేనుని
కుశల మారయుము; దక్కును గుమార
వర్గంబు నెల్లను వనితాజనంబుల
నుచితంపుమై సుఖ మున్కి యడుగు;

ఆ. విదురు శల్యుఁ గాంచి వినయంబు దోఁపంగ
నాడు, ద్రోణతనయు నక్కు సేర్చి
కొంటి ననుము, బాహ్లికుని సోమదత్తు భూ
రిశ్రవసునిఁ దెలఁచి ప్రియము నెఱపు; 366

వ. మఱియు వంశవంతులు వయోవృద్ధులు నగు భూపతులను, గృతవర్మను
గర్ణ శకుని సైంధవ ప్రభృతులను, దక్కటి రాజలోకంబును, గయ్యంబు
నకుఁ దోడు వచ్చిన సకలదేశాధీశులనుం గని, యెవ్వరితోడ నెవ్విధం
బునం బలుకం దగు బ్రణామవినయబాంధవమైత్రీవాత్సల్యంబులకు
నయ్యెయ్యప్రకారంబుల మద్వచనంబులుగాఁ బలికి యుచితంబు మెయి
నుపచరింపుము. 367

క. దాసీదాసజనముల కు
దాసీనము గాకయుండఁ, దడయకయే మి
త్రాసంగ మొంది శత్రుని
రాసం బొనరించి తమ్ము నరసెద ననుమీ! 368

క. పోయిన మొగమున నచ్చటఁ
జేయుతెఱం గెల్ల నీకుఁ జెప్పితిఁ; బిదపన్
మాయయ్య పెద్దకొలువున
వాయోడక యి ట్లనంగవలయుం జుమ్మీ. 369

చ. అనఘ! భవద్బలంబునన యాపద యించుక లేక పాండునం
దనులు నిజాప్తబంధుసహితంబు సుఖస్థితి నున్నవారు; త

జ్జనకుని రాజ్యపీఠమున సమ్మద మొందఁగ నిల్పి శైశవం
బునన ప్రభుత్వ మిచ్చి తగఁ బ్రోచితి వారల విశ్రుతంబుగన్. 370

ఉ. ఇప్పు డుపేక్ష సేసి, కృప యేమియు లేక, విహీనవృత్తి- వా
రొప్పుమిఁ బొందఁ జూచు టిది యొప్పునె! యింతట సంతసింప రా,
దిప్పుడు నంత కంత నట యెక్కుడు గోరినఁ జాలకుండదే!
యొప్పదె కూడి మన్కి- మన కొప్పనివారలయుక్కు దక్కఁగన్." 371

వ. అని, తదవసరంబునం బితామహుతో నిట్లనుము. 372

చ. అడఁగఁగనీక శంతనుని యన్వయముం గలిగించి తీవ; యి
ప్పుడు దగ నీమతంబునన పొం దొడఁగూడఁగఁ జేర్చి, పౌత్రులన్
సడికి నధర్మవృత్తికిని జావునకుం దొలఁగించి మన్చినం,
బుడమి జనంబు రాజులును భూసురులున్ నినుఁ బ్రస్తుతింపరే?" 373

వ. అని పలికి వెండియు. 374

క. "ఇంతలు వుట్టినచోటను,
శంతనునందన! యహీనశాంతిపరుం డై
కాంతేయాగ్రజుఁ డాలము
పొంతం బో నొల్లఁ" డనుము బుధు లియ్యకొనన్. 375

సీ. ఆసమయంబున నచ్చటివారెల్ల
వినునట్లుగా, సుయోధనునితోడ
"బాహుబలాఢ్యుల బలవిహీనులక్రియ
వెడలంగ నడచిన వెఱ్ఱితనము,
నత్యంతచిరకాల మడవులఁ గొండల
బాధలఁ బెట్టిన పరుసఁదనము,
సభలోన నట్లు పాంచాలరాజాత్మజఁ
దలవట్టి యీడ్చిన తులువతనము,

తే. ధర్మపుత్రుండు సైరించెఁ; దథ్య మీవు
కురుకుమారుల నని ప్రమింగికొనకు; మొరుల

సొమ్మునకు నాసపడఁ దగ, దిమ్మి వారి
పాలు; వారలతోఁ గూడి బ్రదుకు"-మనుము. 376

వ. ఏము కలహం బొల్లక పొందు గోరుట తనకు మేలు; దనమనంబున దరి
కొను తృష్ణానలం బార్ప నొరు లడ్డంబు సొరమిం జేసి యేన బు ద్ధి సెప్ప
వలసెఁ; దనయొద్దం గల యోధవీరు లెయ్యెడల లేమి దెల్లంబయినను
మాకుఁ జేదోడు ధర్మంబు గల; దదియునుంగాక, యఖిలలోకసేవితుం
డైన కృష్ణుండు పెనుఁబ్రాపు గావునఁ దమకు మమ్మి గెలువం
గొలఁది గా; దది యట్లుండె: నేను భీమసేనాదులకుం దమకుం బెద్దవాఁడ
నగుట వీరును దారును మదీయప్రార్థనాభంగంబు సేయక నాదగు
శాంతియు దాంతియుఁ జెల్లించి నన్నలజడిఁ బెట్టక పోరితం బుడిగి
తమతమధనంబులు గుడిచి సుఖం బుండుట మనపెద్దలకుం దక్కటి బుద్ధి
మంతులకును సంతోషం బగుఁ; బెద్ద యీనోపఁడయ్యెనేనిఁ, గుశస్థలం
బును వాసంతియు వారణావతంబును జాలుఁ- గాదేని మఱియు నెందేని
నొక్కటి యగునట్లుగా దనతోడఁబుట్టువు లేవురకు నిలువ శావు లయి
దిచ్చిన సర్వశాంతి యగు; నట్లయినను నిందలి యందలి బంధుమిత్ర
సహాయజనంబులు గలసి నవ్వుచుం దెగడుచు, నునికి మనమనంబులకుఁ
బ్రియంబు సేయు; గురుపాంచాలయాదవమాత్స్యులు పరస్పరప్రీతి
సంపాదకత్వసంపన్ను లై బ్రదుకుట నాకుం గోర్కి; యింతయు
నమ్మహాపురుషునకుం దెలియం జెప్పు" మనిన, విని "దేవా! నీయాన
తిచ్చినమార్గం బంతయు నడపెద, మీతండ్రి నీకును దమ్ములకును వాసు
దేవునకును నెట్లు ప్రియం బట్లు సేయువాఁడ కాక" యనుచుం బ్రణా
మంబు సేసిన సంజయునకు ధనంజయుం డిట్లనియె. 377

క. "బాలసఖుండవు నాకును
నీలెస్సఁదనంబు; నేము నీతి విడిచి దు
శ్శీలుర మగుటయు శైశవ
లీల మొదలు గాఁగ మను దెలియదే నీకున్. 378

మ. బలమత్తాకృతి యైన భీముఁడును శుంభత్కుంభిసంరంభమున్
నిలిచెన్ నాఁడును నంకుశం బయి, తుదిన్ శ్రేఁడుం దదుద్రేకమున్
మలుగంజేయ నజాతశత్రుని కృపామౌగ్ధ్యంబు చాలంగ, వా
రల కేలా నయవిక్రమోచితవిచారక్లేశముల్ సంజయా!" 379

వ. అని పలికి ధర్మతనయానుమతంబున సంజయునకు సపరివారంబుగా సముచితప్రకారంబున మజ్జనభోజనంబు లొనరించి, మాల్యానులేపనాద్యుపచారంబులు సేయించి, మణిభూషణచిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన నతండును పాండవులను వాసుదేవుని వీడ్కొని చనియె నని చెప్పిన. 380

క. విని, యత్యంత కుతూహల
మునఁ బొదలుచు, "సంజయుండు మున్నెచ్చటికిం
జనియెను, నెవ్వరితో నే
మనియెను వినవలతు మునిజనాధిప చెపుమా." 381

వ. అని యడిగిన. 382

ఉ. భూరికృపానుషంగ! మునిపుంగవచిత్త సరోజభృంగ! సం
సారదవ ప్రవర్ష! సురసంస్తుత దివ్యగుణ ప్రకర్ష! దో
స్సార నిరస్తదైత్య! శమశాలి మనస్థితనిత్య! లోకని
స్తారకశీల! నిర్వ్యతివిశాల! నిరంజన! పాపభంజనా! 383

క. శ్రుతిమౌళిరత్నమూర్తీ
శతధృతి ముఖపద్మషండ సౌరభకీర్తీ
రతిపతిహితాహితాక్షా
సతతసమాచరితభక్తజనసంరక్షా. 384

మాలిని. సదయవిమలదృష్టీ! సంక్షితాశీఃప్రవృష్టీ!
హృదయకమలవాసా! యిద్ధమాయావిలాసా!

విదితనిఖిలభూతీ ! విశ్వరక్షాత్తహేతీ !
సదసదుపచితాత్మా ! సంభృతానందవర్త్మా ! 385

గద్యము :

ఇది శ్రీమదుభయకవిమిత్త్రి కొమ్మనామాత్యపుత్త్రి
బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి
ప్రణీతంబయిన శ్రీమహాభారతంబున
యుద్యోగపర్వంబునందుఁ
బ్రథమాశ్వాసము.

శ్రీ మ దా ం ధ్ర మ హా భా ర త ము

ఉద్యోగపర్వము - ద్వితీయాశ్వాసము

క. శ్రీ విస్తార కరణ కరు
ణావేశోదార ! శశ్వదమలాకారా !
భావవికారవిదార ! శు
భావహనామప్రకార ! హరిహరనాథా ! 1

-: సంజయుండు ధర్మజుని సంధిపల్కులను ధృతరాష్ట్రునకుఁ దెల్పుట :-

సం. 5-32-1.

వ. దేవా ! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె, నివ్విధంబున వీడ్కొని సూతనందనుండు పవనజవంబు లగు నరదంబుతురంగంబులం దఱిమి ప్రొద్దుగ్రుంకునంతకుం గరిపురి సొచ్చి, నగరి కరిగి యంతఃపురం బున నున్న ధృతరాష్ట్రునకుం దనరాక యెఱింగించి పుచ్చి, యతనిం గాంచి యడుగుల కెఱఁగిన, నమ్మహీవరుండును నత్యాదరంబున నెత్తి సమీపంబున నునిచినం గొలిచియుండి చేతులు మోడ్చి యిట్లనియె. 2

ఉ. "దేవర పంపఁగాఁ జని యుధిష్ఠిరునిం గని వచ్చినాఁడ, నా
భూవిభుఁ డప్రమేయగుణపూజ్యుఁడు- మీకు నమస్కరించె, సం
భావనసేసె నా, కిచటిబంధుల నెల్లఁ దలంచె; మీసుఖ
శ్రీ విభవంబులుఁ సుతులసేమము న న్నడిగెం బ్రసన్నుఁడై." 3

తే. అనుఁడు ధృతరాష్ట్రుఁ డిట్లను, "నయ్యజాత
శత్రునకు సేమమే ! యనుజన్ములెల్ల
సుఖులె ! బంధులు భృత్యులు సఖులు మంత్రి
వరులు సంప్రీతిమెయి నున్నవారె యచట." 4

వ. అనిన సంజయుం డిట్లనియె. 5

క. "వారెల్లను, భవదీయ
స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను
న్నార మని పలుకుదురు; నిజ
మారయఁగా నట్లకాదె యది జననాథా !" 6

క. ధర్మజునకు భోగంబులు
ధర్మవున ట్లింపుగావు; ధర్మంబులలో
నిర్మలబుద్ధి నహింసకుఁ
గూర్మి గడుం గలఁ డతండు, కురువంశనిధీ ! 7

ఉ. మానుషశ క్తి యొల్లఁడు, సమంచిత దైవము యూఁదియుండు, నీ
పైన యతండు పుణ్యమును బాపముఁ బెట్టినవాఁడు; నీవు నీ
సూను వశంబ కాని యొకచొప్పుఁ దలంపవు; కర్ణసౌబలా
ధీనము కార్యనిశ్చయము తెల్లము; నీమత మొప్ప దేమియున్ ! 8

ఆ. ఆలుబిడ్డ లేనియట్టి బ్రిమ్మరి యగు
కొయ్యగాక, కుదుటఁ గూడు వెట్టి
కుడుచువార లిట్టి క్రొవ్విదంబులు సేయఁ
జొచ్చు టిచ్చగించి చూతురయ్య ! 9

చ. కొడుకులఁ గానరే నృపు లకుంఠిత తేజుల నెందు; నిమ్మెయిం
జెడు తెరువైనచోఁ దగవు సెప్పక యొప్పరికించి చూతురే !
పుడమిజనంబులెల్ల నినుఁ బ్రువ్వుగఁ దిట్టఁగ వించునన్కి నొ
చ్చెడు మది యెప్పుడుం; జెవులు చీములు గట్టెడుఁ, గౌరవేశ్వరా ! 10

చ. చలమున దుస్సహేనుఁడును సౌబలుఁడున్ మిముఁ బట్టి యార్వ, బొ
మ్మలక్రియ నాడుచుందురు మానక నీవు సుయోధనుండుఁ, దా
రలసి యొకప్డు పాండుసుత లాగ్రహవృత్తికిఁ జొచ్చిరేని, నీ
చలము బలంబునుం గులముఁ జక్కగఁజేయరె యొక్క బ్రేల్మిడిన్. 11

క. వినుము, యుధిష్ఠిరుపై రణ
మనవారలు వెఱపుగా సమర్థింతురు- డీ

కొనఁగం దగఁ జే కొండం
గని యోటమి వెట్టినట్లు; కారవనాథా ! 12

క. అనుజులకు నడ్డపడి, యే
మిని జేయఁగనీమిఁ జూచి మెచ్చితిగా కీ
వును; సాదు రేఁగెనేని
వ్వీను తలపొలమునన కాని నిలువదు సుమ్మీ ! 13

చ. అనయము వుట్టె జూదమున యప్పుడ; యెంతయుఁ జిచ్చువెట్టి కా
ల్చినయది నీయుపేక్షయ; వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తనిపులి; యెల్ల వారలు నధర్మము నీపయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం; బిదప నీకును నాకు మరల్పవచ్చునే ! 14

చ. అనయము నొచ్చుచున్నయవి యంగము లెల్లను వేగ వచ్చుట;
న్మనము వశంబు గాదు; జననాయక ! ప్రొద్దును బోయె; నిప్పు డేఁ
బనివిని రేపు పుత్రులును బంధులు నాప్తులు నీవు నేర్పడఁ
విన, మన కార్యమంతయు సవిస్తరతం దగ విన్నవించెదన్."
15.

ఆ. అనిన, నట్లకాక యని సంజయుని వీడు
కొలిపి, కొంతప్రొద్దు కురువిభుండు
కార్యచింత మునిఁగి, కంచుకి నొక్కరుఁ
బిలిచి వేగ విదురుఁ బిలువు మనియె; 16

వ. వాఁడును సత్వరంబుగాఁ జని యతనిం దోడ్తెచ్చి కాన్పించిన, నమ్మహీ
వరుం డభ్యాదరంబున దనయొద్ద నునిచికొని, యతని కిట్లనియె. 17

ఆ. "పాండురాజసుతులపాలికిఁ జని, యిప్పు
డ సంజయుండు వచ్చి సమ్ముఖమున
నన్నుఁ జాల దూఱి, నాకు రే పచ్చటి
పనులు సెప్పువాఁడ ననుచుఁ, జనియె. 18

క. అప్పటనుండియు నెవ్వగ
గప్పికొనినఁ, జిత్తవృత్తి గలఁగెడు; మేనున్

నిప్పులఁ బొరలినయట్లయి
చొప్పడ దించుకయు నిద్ర శుద్ధవిచారా !" 19

వ. అనిన విదురుం డిట్లనియె. 20

క. "బలవంతుఁడు పై నెత్తిన
బలహీనుఁడు, ధనము గోలుపడినయతఁడు, ద్రము
చ్చిల వేచువాఁడు, గామా
కులచిత్తుఁడు నిద్ర లేక కుందుదు రధిపా !" 21

క. ఇకొక్కఁ డగామములలోపల
నొక్కటి నీచత్తవృత్తి నొందెనొ ! యెురు సొ
మ్మెక్కటి గుడువఁ దలంచితొ !
నిక్కము గత మేమి సెపుమ నిద్ర చెడుటకున్. 22

తే. అనిన ధృతరాష్ట్రుఁ డిట్లను నతనితోడ
"ధర్మసుతుమాటచొ ప్పెవ్విధంబొ యెఱుఁగ
కునికిఁ జేసి చింతిల్లతి; నోపు దీవు
దెలియఁ జెప్పి నాయలమట మలుగఁజేయ." 23

చ. అనవుడు నిట్లనున్ విదురుఁ, "డక్కట ధర్మసుతుండు బాంధవుం
డును చెలికాఁడునుం దగుభటుండును బ్రెగ్గడయున్ గురుండుఁగాఁ
డె ! నృపవరేణ్య నీకుఁ ! బ్రకటీకృతసత్యుఁడు, శాంతమూర్తి, స
ద్వినయవివేకశీలములవిశ్రుతుఁ- డాతఁడు గీడు వల్కునే ! 24

ఆ. నీవుఁ గొడుకు వారి నెటిలేక పటిచితి,
రదియ చాలు, నుచితమైనపాలు
పంచి యిండు, పిల్లి పట్టిన యీరువు
నేసి యున్న-నేల చెల్ల నేర్చు ? 25

వ. మీరు శకుని కర్ణదుశ్శాసనులమీఁద రాజ్యభారంబు వెట్టుకొని యుండుదు, 26
రిది తుదిముట్ట నేర; దెట్లంచేని.

క. తముఁ దా రెఱుఁగుట, వేగప
డమి, దాలిమి, విడువుగలుగుటయు లేని ప్రభు
త్వము గలదె? వారియం దీ
సుమానుషము లొకఁడుఁ బట్టి చూడంగలఁడే? 27

వ. యుధిష్ఠిరుండు నీవు నిక్కమ తండ్రి వని తగవు నమ్మి చాల సైరించి
యున్నవాఁ, డది నీవ యెఱుంగు" దనిన, విని ధృతరాష్ట్రుం
డిట్లనియె. 28

తే. సంజయునిచేతఁ గార్యంబుచంద మెల్లి
యెటీఁగి, మన కెద్ది సేయంగఁ దెఱుఁగు దానిఁ
బనిచి చేయింపు; మిపుడు నామనము తల్ల
డిలుట హితభాషణంబుల డిందుపఱుపు. 29

వ. నీవు ధర్మాధర్మవిదుండవు, నయానయజ్ఞుండవు; నాకుం బ్రజాగరం
బొనర్చుచున్న సంతాపం బుపశమించునట్లుగా, భవద్వచనామృతంబు
నాయుల్లంబున వెల్లిగొల్పు" మనిన, విదురుం డిట్లనియె. 30

-: ధృతరాష్ట్రునకు విదురుఁడు హిత ముపదేశించుట :-

సం. 5-33-16.

క. "జనులకు నొడఁబా టగు విధ
మున నడచుచు, లోకనింద్యముల నుడుగుచు, మీఁ
దని యొకనికలిమి కులుకక,
మనుజులతోఁ బొంది పొసఁగి మను టొప్పు నృపా! 31

క. కోపము నుబ్బును గర్వము
నాపోవక యునికియును, దురభిమానము, ని
ర్వ్యాపారత్వము నను నివి
కాపురుషగుణంబు లండ్రు కౌరవనాథా! 32

క. ఏలినవానిని, దైవము,
నాలిని, బంధులను, సముచితారాధన సం

శీలతఁ బ్రీతులఁ జేయని
పాలసుఁ డాఫలము లాసపడు మనుజేంద్రా ! 33

క. నెమ్మి గలవారి నొల్లరు,
త మ్మొల్లని వారి వెనుకఁ దగులుదు, రధిక
త్వ మ్మెఱిఁగి యెఱిఁగి తొడరుదు,
రి మ్మెఱుఁగని యట్టివార లిభపురనాథా ! 34

క. ధనమును విద్యయు వంశం
బును దుర్మతులకు మదంబుఁ బొనరించును, స
జ్జనులైనవారి కడఁకువ
యును వినయము నివియ తెచ్చు నుర్వీనాథా ! 35

క. అరిది విలుకాని యుజ్జ్వల
శర మొక్కని నొంచుఁ, దప్పి చనినం జనుఁ; నే
ర్పరి యైన వాని నీతి
స్ఫురణము పగరాజు నతనిభూమిం జెఱుచున్. 36

తే. ఒకటిఁ గొని, రెంటి నిశ్చల యుక్తిఁ జేర్చి,
మూఁటి నాల్గింటఁ గడు వశ్యములుగఁ జేసి,
యేనిటిని గెల్చి, యాటిఁటి నెఱిఁగి, యేడు
విడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు." 37

క. ఏను మధురాహారంబులు
గొనుటయుఁ, బెక్కండ్రు నిద్రగూరినయెడ మే
ల్కొని యునికియుఁ. గార్యాలో
చనముఁ, దెరపు నడుచుటయును జన దొక్కనికిన్. 38

క. నడవడి యను మున్నిటిం
గడవం బెట్టంగ నోడకరణిం దగి, తా
నొడఁగూడు ననిన, సత్యము
గడచిన గుణ మింక నొండు గలదే యురయన్. 39

క. ఱమియించువారిఁ గని చా
లమి వెట్టుదు, రై ననుం దలంప ననూన
ఱమయ కడు మెఱయు తొడ; వు
త్తమరూపము గోరువారు దాల్తురు దానిన్. 40

క. పురుషుండు రెండుఁదెఱఁగుల
ధర నుత్తముఁ డనఁగఁ బరగుఁ: దా నెయ్యెడలం
బరుసములు వలుక కునికిన్,
దురితంబులు వొరయు పనులు దొఱఁగుట కతనన్. 41

తే. చెల్లియుండియు సై రణ సేయు నతఁడుఁ,
బేదవడియును నర్థికిఁ బ్రియముతోడఁ
దనకుఁ గల భంగి నిచ్చు నతండుఁ- బుణ్య
పురుషు లని చెప్పి రార్యులు గురువరేణ్య. 42

ఆ. పాడి దప్పకుండఁ బడయు సొమ్ములకు న
పాత్రములకు నీగి, పాత్రములకుఁ
బెట్టకునికి, యనఁగ నెట్టన రెండు వి
ధములఁ గీడు తొడరు ధరణినాథ ! 43

తే. వెలఁది, జూదంబు, పానంబు, వేఁట, పలుకు
ప్రల్లదంబును, దండంబుఁ బరుసఁదనము,
సొమ్ము నిష్ప్రియోజనముగ వమ్ము సేత
యనెడు సప్తవ్యసనములఁ జనదు తగుల. 44

తే. తగిన వేషంబు, దనుఁ దాన పొగడుకొనమి,
నొచ్చియును గీడు వలుకమి, యిచ్చి వగవ
కునికి, దన కెంత నడవకయున్నఁ బథము
దప్పకుండుట- నడవడి కొప్పు సేయు. 45

క. చెలిమియు, సంభాషణమును,
బలిమి వివాదంబు ద్రోపుఁ బాడియు, దమయం

తలవారి తోన తగు; నధి
కుల హీనులతోడ నైనఁ గొఱగా దధిపా ! 46

తే. కొంచె మైనను దగఁ బంచి కుడువ మేలు,
పనులయెడ దుఃఖ మోర్చి యల్పంబు సుఖము
ననుభవించుట హితము; శత్రునకు నైన
నిచ్చుటయ లెస్స యడిగినయెడ, నృపాల ! 47

క. తను లోకము గొనియాడఁగ,
విని యుబ్బఁడు సజ్జనుండు, వెండియుఁ గడుమే
లొనరించుఁ; గీ డొకించుక
యును దనదెసఁ దోఁపనీక యుడుపుచు వచ్చున్ ! 48

వ. ఇట్టి చందంబులు ధర్మనందుననకుం గల"వని పలికి, విదురుం డది ప్రసం
గంబుగాఁ బాండవులఁ బ్రశంసించి, "నీవు వారలం బెనిచి మానుసులం
జేసి రక్షించి, యిప్పు డుపేక్షించి వారలు వెలినుండ నూరకుండం
దగునే ! తగు పా లిచ్చి, వారి రావించి నీకొడుకులతోడివారింగా నడు
పుట యుచితంబు; మీరును వారును నొక్కటియై యున్న, మీదిక్కు
దేవతలకుం దేటిచూడరా" దనిన, నమ్మాటలు వెడవెడ యూఁకొని
ధృతరాష్ట్రుండు విదురున కిట్లనియె 49

తే. "హితముఁ గర్తవ్యమును నాకు నెఱుఁగు దీవ,
ధర్మసుతచందమును విదితంబు నీకు,
నట్లు గావున నెటిఁగింపు మఖిలకార్య
జాతమును జిత్తతాపోపశమము గాఁగ"— 50

క. అనుడు విదురుఁ డాతని కి
ట్లను, "నిమ్మొయి నన్ను నొత్తి యడిగినఁ జెప్పం
జను; నున్నరూపు నెప్పెద
విను, మవధానంబుతోడ విమలవిచారా ! 51

ఉ. డక్కెను రాజ్యమంచు నకటా యిటు దమ్ముని భాగ మీక నీ
వెక్కటి మ్రింగఁజూచె దది యెట్లరుగున్; విను, మీను లోలతన్
గ్రక్కున నామిషంబు చవి గాలము మ్రింగిన చాడ్పు సూవె; యి
ట్లుక్కివుఁ డైన నీకొడుకు నుల్లము నున్నటు లాడఁగూడునే !" 52

క. అన విని నిరుత్తరుం డయి,
మనుజేంద్రుఁడు గొంతసేపు మ్రాన్పడి, తలఁపుల్
పెనఁగొన, నిద్రాహానిం
దను వలయఁగ, విదురుతోడఁ దా నిట్లనియెన్. 53

క. "ఇందాఁక నీదుపలుకుల
డెందము తాపంబు గొంత డిందుపడియె; నా
కుం దగ నయానయంబుల
చందంబులు సెప్పుచుండు సౌజన్యనిధీ !" 54

వ. అనిన విని విదురుం డిట్లనియె. 55

ఆ. "తనియఁ బండకుండ మును గోసికొనఁ, జవి
చేసె కాదు విత్తుచేటుఁ గలుగుఁ;
బక్వ మైనఁ గొనిన, ఫల మించుఁ- జెడదు బీ
జంబుఁ; గార్యసిద్ధి చంద మిట్లు" 56

తే. మాలకరి పుష్పములు గోయుమాడ్కిఁ, దేఁటి
పువ్వుఁదేనియఁ గొనియెడు పోల్కి, నెదురు
గందకుండఁగఁ గొనునది కార్యఫలము;
బొగ్గులకుఁ బోలె మొదలంటఁ బొడువఁ జనదు ! 57

క. పరులధనమునకు, విద్యా
పరిణతికిం, దేజమునకు, బలమునకు మనం
బెరియఁగ, నసహ్యపడు న
న్నరుఁడు దెవులులేని వేదనం బడు, నధిపా ! 58

క. ఎదిరికి హితమును బ్రియమును
మది కింపును గాఁగఁ బలుకు మాటలు పెక్కై
యొదవినను లెస్స; యటుగా
కిది యది యన కూరకునికి యొంతయు నొప్పున్. 59

క. చెలిమియుఁ, బగయును, దెలివియు,
గలఁకయు, ధర్మంబుఁ శాపగతియును, బెంపుం
దులువతనంబును వచ్చును
బలుకుబడిన; కాన పొసఁగఁ బలుకఁగవలయున్. 60

క. బెడిదముగఁ-గత్తి గొడ్డటఁ
బొడువఁ దెగినభ్రూనఁ జిగురు వొడముఁ; బలుకులం
జెడఁ దునిసిన కార్యంబు ని
గుడ నేరదు పిదప నెట్టుఁ, గురువంశనిధీ ! 61

క. తనువున వెటిగినయలుఁగుల
ననువునఁ బుచ్చంగ వచ్చు, నతినిష్ఠురతఁ
మనమున నాఁటిన మాటలు
విను మెన్నియుపాయములను వెడలునె యధిపా. 62

ఉ. అక్కట ధర్మనందనుని యాస్యమునం దొకనాఁడుఁ గీడుప
ల్కొక్కఁడు లేదు; నీ కొడుకు లొండొరు మీటి నికృష్టవాక్యముల్
పెక్కులు పెక్కుభంగులను బ్రేలుచునుండఁగ, నీవు దానికిఁ
బ్రక్కక వించు నుండెఁ; దనురూపమె నీ కిది కారవేశ్వరా. 63

ఆ. చేటుకాల మైనఁ, జెట్టమాటలు- నెటి
గాని తెరువు వట్టుకర్జములును
దగినయట్ల తోఁచుఁ; దగిపొడునవి యవి
నీతు లని మనంబు నిశ్చయించు. 64

వ. నీబుద్ధి పాండవులతోడి విరోధంబు నెడ మరలంబడమి పాపం; బింతియ
కాక యేమి సేయుదము;! మనకులంబునం దేజోధైర్యధార్మికత్వాది

గుణంబుల గరిష్ఠుం డయిన యుధిష్ఠిరుండు నీసిరికి వెలిమై యట్లుండుట
దగవగునే? నీ పెద్దతనంబు సూచి సైరణ వాటించి యున్నవాఁ"
డనిన, విదురుదిక్కు మొగంబై ధృతరాష్ట్రుండు "నీచెప్పిన నీతివాక్యం
బుల నామనంబు దనివోవ, దింకను జెప్పు మనవుడు నతండు వెండియు
నిట్లనియె. 65

ఆ. సకలపుణ్యకర్మచయమును నొకదెస
వినుము పాడి దప్పకునికి యొక్క
దిక్కు దీని శ్రుతులు తెలిపెడునెడఁ బాడి
కలిమి యెందుఁ బెద్దగా నుతించె. 66

తే. పాడి గలిగిన నిహలోకఫలము లెల్లఁ
జేరుటయ కాదు, కీర్తియుఁ జెందుఁ బురుషు;
ధరణిఁ బొగడిత యెందాఁకఁ బరగు, నంత
కాలమును బుణ్యలోకంబు గల్గునంద్రు. 67

వ. తొల్లి ప్రహ్లాదుండు దైత్యజాతిసంభవుం డయ్యును, దనకొడుకు విరోచ
నుండును నంగీరసుం డనువిప్రుకొడుకు సుధన్వుండును దమతమ
ప్రాణంబు లొడ్డుగా నొడ్డి యొక్క ధర్మసందేహంబునకుఁ బన్నిదంబు
పఱచి వచ్చి తన్నడిగిన, 'నితండు గొడు కితండు లాఁతి' యని తలంపక,
మధ్యస్థుం డై సుధన్వుం గెలిపించి యతనిచేత నిజతనయుని జీవితంబు
దానంబుగాఁ గొని వాని బ్రతికించెం; గావున నీవును ధర్మంబు విడువక,
యధర్మోపేతు లైన నీ కొడుకులవలని పక్షపాతంబు విడిచి, తెఱంగు
నేయుము; వారును నాపద లేక బ్రతుకుదురు, నీకును శోకంబు లేక
తక్కు" నని చెప్పి మఱియును. 68

క. "పాపంబులు గర్జము లని
యేపునఁ జేయంగ, నవియు నింపగు; ధర్మ
వ్యాపారంబు లకార్యము
లై, పరిణతిఁ బొందెనేని నట్టుల చెల్లున్. 69

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

చ. అది సభయే-ప్రియం బెసఁగ నార్యులు నిల్వరయేని, నార్యులే-
మదిఁ దలఁపంగ వారలు సమంచితధర్మము వల్క రేని, న
ట్టిదియును ధర్మ మే-తగ ఘటించిన నిక్కము లేదయేనిఁ, దాఁ
బదిలపు నిక్క మే-యొకనెపం బిడు చొప్పగునేని, భూవరా! 70

ఉ. నీతిపథంబునన్ బ్రదుకనేర్చుట యుత్తమభంగి, శౌర్యసం
జాతము లై కరం బలరుసంపద లొందుట మధ్యవృత్తి, య
స్నేహితము లై న భారవహజీవనముల్ దలఁపం గనిష్ఠముల్,
నీతికి బాహ్యు లై న-ధరణీవర మెత్తురె వారి నుత్తముల్; 71

ఆ. కయ్యమునక యెపుడుఁ గాలుద్రవ్వుదురు నీ
పుత్రు లెల్ల, సూతపుత్రుఁ డాది
యగు తదీయమంత్రు లంతకు ముందర
బిరుదు; లీవు నీతి తెరువు సొరవు. 72

క. పాండవులు శౌర్య మొల్ల; ర
ఖండితనీతిప్రకారకార్యము మెచ్చె
యుండుదు; రెదురేచినఁ- దుది
మండుదు; రార్పంగరాదు మఱి యెవ్వరికిన్. 73

క. తమతండ్రిభంగి నీకును
సముచిత మగు భక్తి సేసి, సజ్జననుతమా
ర్గమున నడచువారల, నీ
వమలమతిం గన్నకొడుకుల ట్లరయఁ దగున్." 74

వ. అని పలికి మఱియు నిట్లనియె. 75

క. కారణము లేకయును, నుప
కారపరత్వమున, నొరులకార్యంబులకున్
వారనియలజడిఁ బడియెడు
వారల చూ యేడుగడయు వారికి నధిపా! 76

చ. ఒకరుని చేతిప్రోవును దదున్నతిప్రాపును గాంచి, యెల్ల వెం
టకును గొఱంత లేక, పొగడం దగుసంపద నొంది. యట్టి దా
తకుఁ దుదిఁ గీడు సేసిన కృతఘ్ననిపీనుఁగు నైన, రోఁత పు
ట్టక కబళింపఁ- గుక్కలు నొడంబడునే? కురువంశవర్ధనా! 77

వ. కావునఁ గృతము దలంపమి గీడు; పాండురాజు నీకుం బరమభక్తుండు,
పాండవులునుం దేజోలాభంబులు గాంచినవారలు, వారల నాదరింపు"
మని చెప్పి వెండియు నిట్లనియె. 78

ఆ. "బ్రదుకు చేటు, పొగడు వడుట దూ ఱొందుట,
యీగి వేఁడుకొనుట, యిట్లు మఱియుఁ
గలుగు సౌఖ్యదుఃఖములు వచ్చు నెడపడి;
వాని కింత యేల వగవ నధిప! 79

క. వగ బలము దఱుఁగు, రూపఱు,
వగచిన మతి దప్పుఁ, దెవులు వచ్చును, దూఱున్
వగచి నలంగినఁ- బ్రియ మగుఁ
బగతురకును; వగచు టుడుగు పార్థివముఖ్యా!" 80

వ. అనిన విని ధృతరాష్ట్రుం డిట్లనియె. 81

క. "రిత్తయుపచారముల- నే
నుత్తముఁ డగు ధర్మతనయు నుడికించితి; దు
ర్వృత్తు లగు మత్సుతులకును
మిత్తి యగుం బోర; వగలు మిగులకయున్నే. 82

వ. నెవ్వగలు నివ్వటిల్లనీక నిలుపు నట్టిది యెయ్యది, దాని నెఱింగింపు"
మనిన విదురుం డిట్లనియె. 83

తే. "నియతతపమును, నింద్రియనిగ్రహంబు,
భూరివిద్యయు శాంతికిఁ గారణములు;
వాని యన్నింటికంచె మేలైన శాంతి
కారణము లోభ ముడుగుట కారవేంద్ర!" 84

వ. అని వెండియు. 85

క. "జ్ఞాతుల పూరితమును, గో
వ్రాతము నాక్రమము, విప్రవర్గము చనవున్
నాతుల కారించుటయును
బ్రీతిం జన నిచ్చు నతని పెం పొప్పు నృపా!" 86

క. అలమికొని, యొండొరుల ప్రో
పులఁ బ్రాపుల నెలమి కలిమిఁ బొంది, బహుజా
తులు నెమ్మిఁ గూడి, తామర
కొలని క్రియన్ సిరికిఁ బట్టగుదు రుజ్జ్వలు లై. 87

చ. కరితురగాదిఘట్టనయు, గాలియు, నొంపదె యొంటి నున్న య
త్తరువు; ననేకభూరుహవితానము గుంపయి పేర్చి, బాధలం
బొరయునె? యన్నదమ్ములును బొందిన నేరి కసాధ్యు; లట్లుగా,
కెర వయి నిల్చినం-గలని కెల్లిద మై, పటివోదు రెంతయున్! 88

వ. కావునఁ గౌరవులుం బాండవులు నొండొరులకుఁ బ్రాపై పొదలిన, నెదిరికి నజయ్యు లగుదురు; పరులయొత్తు లేని రాజ్యంబు పూజ్య మహిమం బరగు; వనవాసంబునం గుందిన కౌంతేయులం దడయక తెచ్చి యుచితపదం బిచ్చి నిలుపుట నీ కొడుకులకు నిలుపు గావించుట యగు" నని చెప్పి, మఱియు నిట్లనుఁ, "బ్రియవాదు లెందును గల, రప్రియం బగుంగా కేమి యని తథ్యంబు వలుకువారు లేరు; జూదంబు నప్పు నడ్డపడి యప్రియం బగుటకు శంకింప తథ్యఁబు వలికితి; నది నీకు రుచియింపక, రోగికిఁ బథ్యాహారం దల కంటగించున ట్లయ్యె; నైన నిప్పుడుం జెప్పెద వినుము; కాకంబులం గైకొని మయూరంబులం బరిహరించు విధంబున, మార్జాలంబులం బాటించి సింహంబులయెడ ననాదరంబు సేయు చందంబున సుయోధనాదులం బట్టి యుధిష్ఠిర ప్రముఖుల విడిచితి; నేఁడు కార్యంబు ముట్టవచ్చినం దోఁపక మిడుం గుఱు సోఁకినట్లు దల్లడించెదవు; కులంబునకై యొకనిం దొఱంగుటయ నీతి యని పెద్దలు సెప్పుదురు; దుర్జనపరుండై సద్బుద్ధి సెప్ప వినండేని

మనము దుర్యోధనుం దొఱంగిన నేమి యగు? నది యట్లుండె. సంపద సహాయంబు నపేక్షించియుండు; సహాయంబు సంపద నుద్వేగించి వర్తిల్లు; నిట్లివి యొకటొకటి పొందునం గాని సిద్ధింపవు; గావున నీ సంపద పాండవులకును, వారి సహాయత్వంబు నీకునుం బ్రియం బొనరింప, నొండొరుల కలయుట మేలుకాక, మనలావు వెలిసేయుట లెస్సయగునే? కురువంశనిస్తారకు లగు భీష్మయుధిష్ఠిరులును, నవక్రవిక్రము లగు కర్ణార్జునులును, బ్రతాపధాములగు భీమదుర్యోధనులును, శస్త్రాస్త్ర పారగులగు నభిమన్యు లఘ్మణ ప్రభృతి కుమారులును, శాపానుగ్రహ సమర్థులగు ద్రోణద్రుపదాది పరమాప్తులును వారివారి బంధుమిత్ర జనంబులును నొక్క-మొగంబై, నీ పనుపు సేయుచు, నయవిక్రమంబు లప్రతిహతంబులై నడవం, బృథివి శాసింప భవదీయవిభవం బుజ్జ్వలంబై, యొరుల కెడలేక చెల్లుచున్న నెంత యొప్పగునో యటు విచారింపుము; పాండవులు ధీరమతులై వైర మెత్తక యూరక తొలంగి యుండి రేనియుఁ, గతిపయదినంబులలోఁ జీకాకుపడి చెడుం గాక గాంధారీ నందనుచేత వసుంధరాపరిపాలనభారంబు నిర్వహింపఁబడునే" యనిన, విని ధృతరాష్ట్రుండు విదురున కిట్లనియె. 89

తే. నీవు చెప్పిన మాటలు నిర్మలములు -
నిపుణసమ్మతములు - రాజనీతిమార్గ
బోధకంబులు నైనను, బుత్రు విడువ
నోప; 'ధర్మో జయతి' యని యుండువాఁడ." 90

వ. అనిన విని విదురుం డతని కిట్లనియె "దేవా! జ్ఞాతులు గుణహీను లైనను విడువం దగ దనిన, సకలగుణసంపన్నులై భవత్ప్రసాదంబు గోరుచున్న కౌంతేయులన్ దిగవిడువం దగునే? యేను నీకు హితంబు గోరెదు వాఁడ నని నిశ్చయించి నా బుద్ధి వినుము; వారల జీవనంబునకుఁ గొన్ని యలంతిపల్లియ లై నను దుర్యోధను నొడంబఱచి యేర్పఱచి తెఱంగు పఱచిన లెస్స యని చూచెద; 'నతని విడువ వలయు' నని చెప్పితినే నీ వెనఁకువం బశ్చాత్తాపంబు వుట్టు; దాని కప్పుడు ప్రతీకారంబు లేదు;

కావున నెల్లభంగుల నియ్యకొని పాండవులతోడ సంధి సేయవలయు;
నట్లుంగాక. 91

క. తమలోని పాళ్ళకుంగా
సమరము సేసినను గాని చాఁజనదె? శరీ
రము లాధివ్యాధిజరా
సమన్వితము లగుటఁ, జేటు సహజం బరయన్; 92

చ. గజతురగాది సంపదలుఁ, గాంతలతోడి విహారలీలలుం
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన సేయు క్రమంబుఁ, బోరులన్
విజయముఁ బొంది పేర్చుటయు, విస్ఫురితాభరణానులేప వ
స్త్రజనిత వైభవంబుఁ గలరాజులుఁ- బోయిర కాక నిల్చిరే? 93

క. కావునఁ, జెవికిం జేఁదగు
నీవాక్యము వినఁగఁ జాలితేని, నిహపర
శ్రీవిభవములకుఁ గీర్తికిఁ
దావలమై, వెలయు టింత తథ్యము సుమ్మీ! 94

క. తగ నీలో నూహింపుము,
దిగవిడువకు ధర్మతనయు; ధృఢమతివై పొం
దగు చందము గొడుకులకుం
బ్రెగడలకుం జెప్పి తీర్పు-పెంపేర్పడఁగన్." 95

ఆ. అనిన నాంబికేయుఁ డను, "నీదుపలుకులఁ
గలఁకదేఱి బుద్ధి దెలివి నొందె;
నిట్ల చేయువాఁడ; నిదియ కర్జము ధర్మ
మును యశంబు లాభమును దలంప." 96

చ. అనుఁడు, ముదంబు నమ్మమియు నాత్మఁ బెనంగొన, నన్నతోడ ని
ట్లను విదురుండు- "పెద్దవడి కక్కట! నీమది కార్యవృత్తి నూ
ల్కొనియెఁ; సుయోధనుం గని యకుంఠిత నిశ్చయమై యతండు వ్రా
లిన దెస వ్రాల కుండిన, బలే! మముబోటులకుం బ్రియం బగున్." 97

వ. అని పలికి నిట్టూర్పు నిగిడించి. 98

క. దైవంబ నేర్చుగా, 'కిటు
వోవఁగ నే నేర్తు-నేరఁ బో'మ్మని పలుకం
గా వశమె; నరున కెక్కుడు
దైవము పోరుషముకంచెు; ధరణీనాథా ! 99

వ. అని విదురునకు వైచిత్రవీర్యం డిట్లనియె. 100

తే. "ధర్మపథమును నీతితత్త్వంబు తెరువు
నిర్మలము లగు పలుకుల నీవు నాకుఁ
దెలియఁజెప్పితి; పరమార్థదృష్టి యెట్టి
వాక్యములఁ గల్గుఁ జెప్పుము వాని ననఘ !" 101

-: సనత్సుజాతుఁడు ధృతరాష్ట్రునకు నధ్యాత్మతత్త్వంబుఁ జెప్పుట :-

సం. 5-41-2.

వ. అని యడిగిన విదురుం డతని కిట్లనియె, నాకుఁ దోఁచిన యన్నియు నానేర్చి నట్లు నీ కెఱింగించితి; నత్యంతగుహ్యంబు లగు నర్థంబులు పురాణుం డయ్యునుం గుమారుం డగు సనత్సుజాతుండు దెలుప నోపుం; గాని యిటమీఁద నాకుం దెలియ" దనిన, ధృతరాష్ట్రుం "డమ్మునీంద్రుండు నా కెంతదవ్వు, నీవ యవియునుం జెప్పు" మనిన, నేను శూద్రయోని జాతుండ, వేదాంతవేద్యంబు లగు నర్థంబులు నా కగోచరంబు, లమ్మ హాత్ముబుద్ధి నే నెఱుంగుదు, దేవతలకుం దెలియనట్టివి యాతనికిం దెలియు, నతండు దెలుపంజాలు ననిన ధృతరాష్ట్రుం డతికుతూ హలుండై. 102

ఆ. "మనకు నిప్పు డతనిఁ గనుతెఱం గెయ్యది
యగుటయును నెఱుంగ" ననిన, విదురుఁ
డధికభక్తిఁ దలఁచె నాత్మలో నాశ్రిత
వత్సలత్వనిధి సనత్సుజాతు." 103

వ. అట్లు దలంచుటయును, దివ్యజ్ఞానమాననీయుం డగు నమ్మునివరేణ్యుం డాతిథ్యంబ పొడసూపిన, విదురుం డతనివచ్చుట యుగ్గడించుచు వినయంబున నతని నెదుర్కొని దండనమస్కారంబు లాచరించి, యున్నతాసనం బిడి యర్ఘ్యపాద్యంబు లిచ్చి, ససంభ్రమంబుగాఁ బ్రత్యుత్థానంబును బ్రణామంబునుం జేసియున్న ధృతరాష్ట్రు నతనికిం జూపి, విదురుం డిట్లనియె. 104

క. "దేవా! దేవరకృప నీ
భూవల్లభుఁ డమలత్త్వబోధకమై సౌ
ఖ్యావహ మగువాక్యచయముఁ
దా వినఁగోరుటయు, మిమ్ముఁ దలఁచితి భక్తిన్!" 105

వ. మీరును గారుణ్యాతిశయంబున విజయంచేసితిరి; గురుసమాశ్రితు లగువార లెద్దానివలన సుఖదుఃఖంబులు, లాభాలాభంబులుఁ, బ్రియద్వేషంబులు నాదిగాఁగల ద్వంద్వంబులం బడక బ్రదుకుదు రట్టి పరమార్థోపదేశంబున నితనిం గృతార్థునిం గావించి రక్షింపవలయు" నని ప్రార్థించినం, బార్థివుండును దదనురూపంబు లగు నాలాపంబుల నారాధించినం, బ్రసన్నుండై సనత్సుజాతుం డధ్యాత్మవిషయంబు లగు వివిధవాక్యంబుల సోపానప్రకారంబున నంతకంతకు సూక్ష్మంబు లగు నర్థంబులు సమర్థించుచు, నందుఁ బ్రజ్ఞాచక్షుం డెయ్యది యేర్పడ నడిగె నది యెల్ల వివరించుచు, హృదయపుష్కర కలితంబగు పరతత్త్వంబు ప్రసాదించునట్టి గూఢోక్తులను గ్రహించుచుండ, నెట్టకేలకుఁ బ్రభాతం బగుటయు, ధృతరాష్ట్ర విదురుల నామంత్రణంబు సేసి యద్దేవముని యంతర్ధానంబు నొందె; నట్టి సమయంబున. 106

—: ప్రాతఃకాల వర్ణనము :—
(అమూలకము)

తే. తన కులంబునఁ బుట్టిన ధార్తరాష్ట్ర-
లన్నదమ్ములతో విగ్రహంబు గొనుట

కుమ్మలించి, వివర్ణత నొందినట్లు
గంది, యెంతయుఁ జెలు వేదెఁ జందురుండు. 107

క. కుముదములుఁ దారు నొక్కటఁ
బ్రమదంబున నుండి, వాని పదవి దొలఁగినం
దమకుఁ నిలువఁగఁ దగ దను
క్రమమునఁ జనునట్లు, తారకంబులు విరిసెన్. 108

ఉ. ఎత్తిన వేడ్కఁ గంధరము లెత్తి మొగంబులు సాఁచి, చూడ్కులం
జిత్తములఁ నిగిడ్చి, తమ చెందెడు నిక్కలు రోసి, యింపు ద
ళ్కొత్తగఁ నొక్కచో నొకటి నొక్కటి గాంచి, యెలర్చు కాయ్యులం
జిత్తజుకేళిఁ దేలె విలసిల్లుచుఁ జక్కవదోయి వేకువన్. 109

మ. మను సౌరభ్యము నివ్వటిల్లఁగ మనోమోదంబునం దేఁటు ల
ల్లన యోలిఁ వెడలంగ, రేకులు సముల్లాసంబునఁ బింకమె
క్క, నయం బెక్కుచు గ్రద్దె పొందెడలి వీఁకం గేసరంబుల్ గడ
ల్కొనఁ, దోడ్తో మధు వుచ్చి పేరెలమిఁ బొల్పుం జెందె నంభోజముల్.

చ. వెడవెడ నిద్ర వొంది, కను విచ్చిన పాంథులమీఁద దాడివోఁ
దడఁబడ నొండొరుం బిలుచు దర్పకు పంపు బలంబులోని య
ల్లుకరణిం, జెలంగె శుకకోకిలభృంగతతుల్ వనంబులం-
దెడనెడఁ బల్కఁ గూయ సొగియింపఁగ మ్రోయఁగఁ- దద్విరావముల్.

సీ. పద్మపరాగంబుఁ బరగించు నరుణోద
యంబుకాంతికిఁ జెలువంబు మిగులఁ,
బరువంబు దప్పిన విరుల రాలుచుఁ దరు
చయము చుక్కలు లేని చదలఁ జెనయ,
నరవిరినెత్తావి నడరించు నున్నిద్ర
విటవీటిసౌరభవితతి వొదల,
నెలఁత చీటీన యెఱుకల నెటిఁ దీర్చు జ
క్కవలు చందోయి కేఁకట యెనర్ప,

ఆ. వెలరువాఁడు దీవియల నల్ల నల్లార్చు
సౌర్ణగండ్లయందుఁ జొచ్చి సుడిసి
తిరిగి వేగుఁబోక తెమ్మెర లెలదీఁగ
కొనలవంక లొత్తు; ననలఁ బ్రోచు. 112

ఆ. అంత నుదయశైల మను నళోకద్రుమ
సమితియందుఁ గాంతి చారుభంగి
నెఱయ విరిసి తొలుత నెగసిన యుజ్జ్వల
స్తబక మనఁగఁ బద్మసఖుఁడు వొడిచె. 113

సీ. ఉర్వీధరంబుల నొప్పెడు జేవుఱుఁ
జఱుల కాంతికి ననుమెఱుఁగు వెట్టి,
ధరణీజగుల్మలతావితానము పల్ల
వములకుఁ గట్టెఱువన్నె యొసఁగి,
యరుణాంబుజంబుల యంతరళంబుల
తళతళలకు జిగిదళము కొల్పి,
చక్రవాకద్వయసంతతి యెఱుకల
గొమరారు కెంజాయఁ గ్రొత్త నేసి,

ఆ. తనదు బాలబింబ మనుపమేయప్రభా
పటలజటిలగగనభాగ మగుచు
నుల్లసిల్లి, జగము లెల్లను విలసిల్లఁ
బూర్వశిఖరిమీఁదఁ బొడిచె నినుఁడు. 114

వ. ఇట్లు సూర్యోదయం బగుటయు, ధృతరాష్ట్రుండు దత్కాలోచితా
చారంబులు నిర్వర్తించి, తగు తెఱంగున నలంకృతుం డయి యాస్థాన
మండపంబున కరిగి పేరోలగం బిచ్చినఁ, గుంభసంభవకృపకృతవర్మా
శ్వత్థామకర్ణాదు లగు దొరలును భీష్మ విదుర శాఫ్లిక సోమదత్త భూరి
శ్రవః ప్రభృతు లగు బంధుజనులును, దుర్యోధన దుశ్శాసన ప్రముఖు
లగు కుమారులును లోనుగాఁ గల సమస్తపరిజనంబులును వచ్చి బలసి
యుండి; రయ్యవసరంబున సంజయుఁడు వచ్చి వాకిట నిలిచి పణిహారుల

వలనఁ దన్నెటింగించి పుచ్చి చొచ్చి సముచితప్రదేశంబునఁ గూర్చుండి, తనమాటలు వినుటకుఁ జిడిముడిపడుచున్న కొలువుఁ గలయం గనుంగొని యిట్లనియె. 115

-: సంజయుఁడు ధృతరాష్ట్రునితోఁ బాండవుల తెఱంగు సెప్పుట :-

సం. 5-46-15. (5-58-3)

తే. "పాండురాజతనూజుల పాలి కర్థి
నిమ్మహారాజు పనుపంగ నేఁగి ధర్మ ·
పుత్రుఁ గాంచితి; నాతండు మైత్రి మెఱయఁ
గారవులసేమ మెల్లఁ బేర్వేర నడిగె. 116

వ. మఱియుం దగువారలనెల్ల నయ్యెయుచితవిధిం బ్రణామంబున వినయం బున బాంధవంబున మిత్రీభావంబున వాత్సల్యంబునఁ బ్రసాదంబున నాదరించె; నేనును భూనాథుండు గఱపిన తెఱంగున గొఱంత లేకుండ బంధుత్వంబునకు వలయు మాటలాడితిఁ; బదంపడి కార్యంబు ప్రసంగించి నాయాడిన మాటలకు నయ్యుధిష్ఠిరుండు పలికిన వచనంబు లింత యెప్పునే" యని యగ్గించిన, ధృతరాష్ట్రుం డవహితుం డై యడుగఁ దా నయ్యుధిష్ఠిరునకుం జెప్పిన భంగులు, నతండు వానికినెల్ల నుత్తరం బిచ్చిన తెఱంగును నెటింగించి, ధృతరాష్ట్రునకుం బితామహునకు దుర్యోధనునకుం గ్రమంబున వారివారితో నాడు మని నియమించిన చందంబులు ధర్మనందను పలుకుల పరిపాటిం దేటపడం జెప్పి, సూత సూనుండు వెండియు నిట్లనియె. 117

తే. "ఏ నుపప్లావ్యపురమున కేఁగి తొలుత
వాసుదేవార్జునులఁ గంటి, వారు నీతి
పథము దప్పనిమాటలు బలిమిఁ దోఁచు
నట్లుగా నాడి- రవి వినుం డాదరించి." 118

వ. అనిన విని ధృతరాష్ట్రుం డవ్వాసుదేవుచిత్తం బె, ట్లనం డేమనియె" నని యడిగిన నతనికి సంజయుం డిట్లనియె. 119

ఉ. "తానును సత్యభామయును ద్రౌపదియున్ నరుఁడున్ రహస్యగో
ష్ఠినిరతాత్మఁ డై, సుతులుఁ జేరని చెందని యట్టిచోటఁ, గాం
తానివహంబు గొల్వఁ బ్రమదస్థితి నుండియుఁ బిల్వఁ బంచె న
న్నానలినోదరుండు; హృదయంబున నీదెస కూర్మి యెట్టిదో!" 120

వ. ఏనును దత్ప్రకారంబు పణిపోరులవలన మున్న యెఱింగిన వాఁడ
నగుటం జేసి, గంచుకంబును శిరోవేష్టనంబును ధరియించి వినీతవేషుండ
నై పోవునప్పుడు, కృష్ణార్జును లనేకమణిమయభూషణప్రభాభాసితు
లై యొక్కసెజ్జన యున్నవారు, కృష్ణుండు పవ్వళించియుండి చాఁచిన
చరణంబులు దొడలపై నిడికొని యర్జునుండు గూర్చున్నవాఁడు, సత్య
భామయుం బాంచాలియు గద్దియలపై నున్నవారు, సవినయంబుగా
నేనును దండప్రణామంబు సేసిన, న న్నాదరించి కృష్ణుని చేసన్న నర్జును
పనుపునం గనకరత్నమయం బగు నతని పాదపీఠం బతండు ప్రేల్చిన
కాళ్ళు దిగిచికొనిన, నిద్దఱు ముద్దియ లెత్తి తెచ్చి నాకుం బెట్టిన, నేనును
దానిం గరతలంబున నంటుచు ధరణీతలంబునఁ గూర్చుండి కేలు మొగిడ్చి
ఫాలతలంబున గదియించి, నీలవర్ణులు బాహుబలమదభరితులును నయి
యేనుఁగుదోయియుం బోలె నున్న యమ్మాధవ ధనంజయులఁ జూచు
నప్పుడు నాకు హర్షాశ్రుపులకలును దదనంతరంబ భయంబునుం బుట్టె;
నట్టియెడ. 121

క. ఈ యిరువురుఁ బంచినపని
సేయుదు రట– ధర్మజునకుఁ జేకుఱునితలం
పేయది! యతనిం దొడరుట
వేయేటికి జమునిశిరము ప్రేయుట గాదే. 122

వ. అని తలంచుచుండ, నమ్మహానుభావులు నన్ను సంభావించి తా రుపయో
గించునట్టి యన్నపానంబులను దమకుఁ గట్టఁ దగినట్టి వస్త్రంబులను
దాము దొడుగునట్టి భూషణంబులను నాకుఁ బ్రియం బొనర్చి గారవిం
చిన, నేనును నా పోయిన కార్యంబు విన్నవించిన, విజయుండు బలు
మొగంబుతో దానికి నుత్తరంబు వలుకం దొడంగిన వారించి వారిచో
దరుం డిట్లనియె. 123

-: సంజయుండు ధృతరాష్ట్రునకుఁ గృష్ణుండు సెపి)న మాట లెఱిఁగించుట :-

సం. 5-58-18.

తే. "వినుము సంజయ! ధృతరాష్ట్రవిభుని పెద్ద
కొలువునందుఁ దత్పుత్రులు గురుఁడు గృపుఁడు
నాపగానందనుఁడు మొదలైన సకల
జనులు వినుచుండఁగా నిట్టు లనుము నీవు. 124

ఆ. అయ్యజాతశత్రుఁ డలుగుట- నీళ్లుల
నగ్ని పుట్టినట్టి దయ్యె; మీకు
నార్వ వెరవు లేదు, నేర్పుమై నింకఁ గా
వింపవలయు పనులు వినుఁడు మీరు. 125

వ. అవి యెవ్వి యంచేని. 126

సీ. కలయట్టి వివిధార్థములు నశేషంబుగఁ
దగ నొసంగుండు సత్పాత్రములకుఁ,
జెలులఁ జుట్టముల నాశ్రితులను రావించి
సత్కరింపుఁడు సంతసం బెలర్ప,
నిచ్ఛానుగుణముల నింద్రియసుఖముల
ననుభవింపుఁడు హృదయంబు లలర,
నాంధ్రను బిడ్డల నయ్యోవిధంబుల
గారవింపుఁడు ప్రియపూరితముగ,

తే. మఱియు నెవ్వరిచిత్త మెత్తెఱఁగునందు
వాటమై యుండు నదియెల్ల వలయునట్లు
సేసి విహరింపుఁ; డిం కెడ సేయ కనికి
నడవుఁ డఱచేతఁ బ్రాణంబు లిడి కడంగి." 127

వ. అని చెప్పు మింత యేమిటికంచేని, 128

ఉ. ఎందును నెవ్వరుం బడని యెంతయుఁ గష్టముపాటు వచ్చినం,
గొందల మంది పాండువిభుకోడలు దవ్వుల నున్న నన్ను 'గో
విందుఁడ కావు' మంచుఁ బలవించుట యీఁగఁగరాని యప్పుఁ బో
లెం దలపోయ వ్రేఁగయి చలింపక యున్నది యెప్పుడున్ మదిన్. 129

తే. ఇట్టి యేఁ దేరు గడపంగ, నెందు నుతికి
నెక్కుగాండీవ మే ట్లెఱు నెక్కువెట్టి,
రెండు దొనలును బూని కిరీటి యనికి
వచ్చు నేఁడెల్లి; యెందుఁ బోవచ్చు మీకు? 130

వ. అని పలుకునప్పటి వారియెత్తుకోలును నీ కొడుకు విడుపోపమియుఁనుం
దలంచి భయంబందితి; నితండు వారల నెఱుంగండు, భీష్మ ద్రోణుల
ప్రాపును గర్ణగర్వంబును దన్ను గెలిపించు నని నచ్చి తొడరెడు" ననిన
విని ధృతరాష్ట్రుం 'డర్జునుం డేమనియె' నని యడిగిన నతనికి సంజయుం
డిట్లనియె. 131

-; సంజయుఁడు ధృతరాష్ట్రునకు అర్జునుఁడు చెప్పిన మాట
లెఱింగించుట :-

సం. 5-47-6.

క. "నరుఁ డలుక వొడమియును సు
స్థిరుఁడై, తన యెట్టిసెరల చెలువునఁ గెందా
మరలం దెగడెడు కన్నుల
నరుణచ్ఛవి నెఱయ, నిట్టు లనియె నరేంద్రా! 132

ఆ. ఆ సుయోధనుండు, నతనికిఁ దోడ్పడ
నరుగుదెంచినట్టి ధరణినాథ
చయము వినుచునుండ సంజయ! నావచ
నములు గాఁగ నీవనంగ వలయు. 133

ఉ. పాండవమనియగ్రనందనుఁడు పా లడుగం దగ నీఁడ యేని, మా
కొం డన్న నేల మే లది; సుయోధనుఁ డింతకు మున్ను పెక్కు లు

ద్దండతఁ దారు జేసినవిధంబుల కెల్ల మెఱుంగు వెట్టిన
ట్లుండెడుఁ గాక- యేనును వృకోదరుఁడుం బ్రియ మందునట్లుగన్. 134

క. మా యిరువురతోఁ గయ్యము
సేయ నతం డియ్యకొనిన, సిద్ధించెన కా
దే యుచితచరితుఁ డగు కౌం
తేయాగ్రజు కార్య; మట్టి తెఱఁ గొప్పుఁ గదా. 135

క. వనవాసంబున భూశ
య్యను ధర్మజుఁ డున్నయట్టి యాయాసము వో
వునె- యంపశయ్య దుర్యో
ధనుఁడు రణక్షోణిఁ బడక తక్కిన యేనిన్? 136

ఉ. సూనృత మూఁది, బన్నములు సూడక లోన నడంచినట్టి కో
పానల- మెండియున్న నిబిడాటవిపైఁ బచరించు తీవ్రదా
వానలుఁ బోలి, శాత్రవచయంబుపయిం గవియించి నిల్చినం
గాని, యుధిష్ఠిరున్ సరకుగాఁ గొన రా ధృతరాష్ట్రనందనుల్! 137

మ. గద సారించుచు, నంత్యకాలవిచలత్కాలాకృతిన్ భీముఁ డు
న్మదమాతంగచయంబు నుగ్గుగ, లసన్నానారథవ్రాతముల్
చదియన్, భూరిహయవ్రజంబు పొడిగా సంరంభతుంగాంగుఁ డై
కదియం జూచి, బలే! సుయోధనుఁడు భాగం బిచ్చు రాజ్యంబునన్.

సీ. కోల్పులి వీఁకమై గొదగొని లేళ్లకు
నటుకు తెఱంగునఁ దటియఁ జొచ్చి,
పెనుగాలి జీమూతబృందంబుపై బెట్టి
దంబుగ వీఁచుచందమున నడరి,
కసిమసంగినమారి గడఁగి జీవ్రలమీఁద
నుగ్రతఁ గవియున ట్లురవడించి,

యాఁకొన్న లయరుద్రుఁ డాగ్రహంబున జగ
త్ప్రిచయంబు ముట్టెడుభంగిఁ బొదివి,

తే. నకులుఁడును, దదనుజుఁడు, సాత్యకియు, నా సు
భద్రకొడుకును- నెదిరిన బలము నెల్ల
బెదరఁ బెదర బడల్పడఁ బెల్లుసావఁ
జేయఁ గని కౌరవులు సంధి సేయువారు. 139

ఉ. చిత్తము లుల్లసిల్ల, నల సింహకిశోరము లొక్కమై మదో
న్మత్తగజావళిం బొదువు మాడ్కి నరాతిబలంబు ముట్టి, యు
ద్వృత్తిఁ గడంగి, యప్రతిమవీరులు ద్రౌపదిపుత్రు లేవురున్
నెత్తురునీరఁ దేల్చిన, ననిం గని మిన్నపుఁ డల్క దీఱెడిన్. 140

మ. చెలులుం జుట్టలు నిష్టభృత్యులు మహాజిం ప్రాణముల్ డాఁప కు
జ్జ్వలులై తో నడవన్, విరాటుఁడును బాంచాలుండు నేపారి సే
నల యుద్రేకము రౌద్రముం బెనుప, నానా హేతిఘోరంబుగాఁ
దలపడ్డం గని గాక, ప్రుక్కుదురె గాంధారీసుతుల్ మాటలన్. 141

చ. తటిమి శిఖండి దన్నొరులు డాఁకఁగ, నెవ్వరి దిక్కుజూడ కే
డ్తెఱఁ దనపూన్కిపై మనము ధీరత నిల్చి, రథంబు బల్వడిం
బఱచి, కురుక్షితీశుఁ డను బ్రహ్మకు వేయును నిండ, భీష్మునిపై
కుఱికినఁ గాక, మాకు సగ మూరక యిత్తురె మీరు మేదినిన్. 142

శా. విద్యుద్దండము నిల్చి పొల్చినగతిఁ బ్రల్లందమై యుండ, న
స్మద్యోధావలిమానసంబున రణోత్సాహంబు రెట్టింప, ధృ
ష్టద్యుమ్నుండు గడంగి ద్రోణుఁ గడిమిన్ డాయంగ వీఱించి కా,
కుద్యోగించుట కేల తక్కుదురు మీ రుగ్రాహవక్రీడకున్. 143

గాండీవగుణరవం బొండొండ చెలఁగంగ,
శరపరంపర లాకసంబు గప్పఁ,
ఖములు ఖండితము లై రాలంగ,
రిసై న్యంబుల మదగజాది

చతురంగములును జర్జరితంబు లై యవ
యవభేద మెఱుఁగని యట్లు గాఁగఁ,
దునిసిన, నెత్తురు నెనడును నెమ్మోలు
నెఱచియుఁ గండలు నెనసి, సమర

తే. తలము ఘోరంబుగాఁ, గపిధ్వజము ధవళ
హారులు శోభిల్ల, నొగలపై హరి యెలర్ప,
దేవదత్తంబు భ్రమోయఁ దోఁతెంచునట్టి
రథముఁ గని కాని కానఁడు రాజరాజు. 144

శా. బాలక్రీడ మహాసురప్రకరముఁ భంజింపఁడే, యెప్పుడుం
వైరిలోక్యంబును భక్తియుక్తిఁ దగ నారాధింపదే, యట్టి శా
ర్ఙ్గాలంకారు మహాత్మఁ దా సరకుసేయం డచ్యుతుఁ; మ మ్మితం
డేలా కైకొను; నాసుయోధనునియం దెగ్గేది యూహింపఁగన్. 145

వ. ఏము పితామహ గురు కృపాచార్యులకు నమస్కరించి యస్మదీయ రాజ్యభాగంబునకై తొడరి కయ్యంబు సేయువారము, కౌరవులకుం బూని యెవ్వరు మాతోఁ బెనంగినను వారి శస్త్రాస్త్రంబులు ధర్మప్రతి హతంబు లగు నని తలంచెదము; పండ్రెండువత్సరంబులు వనంబున నమ్మోయి నిడుములం బడి, జనపదంబునం బదుమూఁడగునేఁ డజ్ఞాతవాసా యాసం బట్లనుభవించి వచ్చి, మా తండ్రి పాలికిఁ బైనంగుమమ్ము నింద్రాదిసురసహాయులయ్యును ధార్తరాష్ట్రులు గెల్చువారై రేని ధర్మంబుకంటె నధర్మము బలవంతం బై నయది యగు; నింతియ కాని మాచేయునట్టిది గీడై నది గా; దేము వాసుదేవుని మున్నిడికొని నడు తుము గావున నీ యుద్ధంబునం జయంబు మాకు సిద్ధంబ; యెల్లభంగులం గర్ణసహితంబుగా గాంధారీనందనులం దునిమి యేము భూమి గొనుట దప్పదు; గాండీవంబు దివియకయును గుడుసువడియెడు బాణంబుల దమయంతన తూణీరంబుల వెడలెడుఁ; దోలూడ్పు మహానాగంబునుం బోలెఁ గరవాలంబు దాన యెఱవెట్టికి నిగుడుచున్నయది; గావున మా కవశ్యంబును సంగరంబు సంభవించుఁ; బాశుపతాది దివ్యశరంబులం గురుపతిప్రజాక్షయంబు సేసి శాంతిం బొందెదము; సూతనందనా !

నీవు స్థిరుండవై యింతయుం దెలియం బలుకవలయు; నిమ్మాటలు విని కురువృద్ధుం డగు శాస్త్రికుండును పితామహుండగు భీష్ముండును గురుండగు కుంభసంభవుండును శిక్షకుండగు కృపాచార్యుండును గురుపుత్రుండగు నశ్వత్థామయు సద్బుద్ధియగు విదురుఁడును ధర్మాచరణకల్యుండగు శల్యుండును నెయ్యది నిశ్చయించి పలికి రది యయ్యెడు; సుయోధనాదు లాయుష్మంతు లగువార కాక" యని పలికె నని చెప్పిన విని మందాకినీనందనుం డందఱు విన దుర్యోధనున కిట్లనియె. 146

సీ, "నలినగర్భుఁడు పెద్ద కొలువున నున్నెడ,
సురపతిప్రముఖుల చూడ్కులెల్ల
మెఱయు తేజంబున మిఱుమిట్లుగొన,
నిద్ద ఱచ్చట నొరసికొం చరుగఁ జూచి
'వీ రెవ్వ, రిమ్మెయి మీ రుండ సరకునే
యని యట్టు వోయెడు నటివార'
లని బృహస్పతి బ్రహ్మ నడిగిన, నతని కి
ట్లనియె నా చతురాస్యుఁ డాదరమునఁ

తే. దపము పెంపును, బలశౌర్యదర్పములును
గలిగి, లోకహితార్థంబుగాఁ జరింతు,
రే యుగంబుల 'నరుఁడు నారాయణుండు'
ననఁ బ్రసిద్ధికి నెక్కిన మునులు సుమ్ము." 147

వ. అని పలికి వెండియు. 148

క. అనిమిషహితము, దనుజనా
శనమును జేయుదు; రధర్మసంగ్రామము గ
ల్గినచోట ధర్మ్మపరు లగు
జనముల గెలిపింతు- రధికసంరంభమునన్. 149

వ. దేవాసురయుద్ధంబు నప్పు డింద్రుండు వోయి వీరి నారాధించి తోడఁడిగినం జనుదెంచి, పౌలోమకాలకేయాదు లగు ననేకదైత్యదానవులం

జంపి యింద్రునకు విజయంబు గావించి; రది మొదలుగా వీరల నెల్ల వారలు నెఱింగి యుండుదు; రిది యొక్కతేజంబ రెండు దెఱంగులై వెలుంగుచుండు'' నని చెప్పె; వినోదార్థంబు జన్మాంతరంబు నొందిన యమ్మహాత్ములు గదా యీ యర్జునుండును వాసుదేవుండును; నర్జునుండు సముద్రతీరంబున హిరణ్యపురంబు వొడిచి నివాతకవచుల నటువది వేవుర నిర్జించి పర్జన్యునకుఁ బ్రియంబు సేసె; వాసుదేవు పరాక్రమంబు గంస నరకాసుర ప్రముఖ నిఖిల దుష్ట నిగ్రహంబునం బ్రసిద్ధంబు గాదె; తెలియ వినుమున్నరూపు సెప్పెద. 150

క. ఆ యిరువురు నొక తలయై
యా యోధనమునకు నడచు నట్టిద యేనిన్,
వేయేల: మనమ కా దెదు
రై యేడ్తెఱఁ దాఁక హరునకైనను వశమే! 151

క. సారథియు రథియు నై, యొక
తేరం గృష్ణు లతిఘోర తేజస్సార
స్ఫారతఁ దోఁచిన నైనను
ధీరత వాటించి చూచి తెలిసెదవు బలే!'' 152

వ. అనుచు నా సుయోధను నుపలక్షించి శాంతనవుండు మఱియు నిట్లనియె.

క. ''మది నా మాట కొకింతయు
బెదర వకార్యంబునందుఁ బ్రియము గలిగి యుం
డుదు; కౌరవులకుఁ గాలము
తుదియో! కా కిట్టి గర్వితుని నేమందున్. 154

తే. హితము లగు నాదువచనంబు లిపుడు వినని
వాఁడ వై తేని, నప్పుడు వారు వడిరి
వీరు వడి రను పలుకులు విందు గాక
శకుని కర్ణ దుశ్శాసనుల్ సమ్మతింప. 155

వ. దుష్ట కష్ట నికృష్టాత్ములగు నిమ్ములవ్వారుఁ జెప్పెదుబుద్ధులు గాని యొండు విన నొల్ల, నేమి సేయవచ్చు" నని పలికినం గానీనుండు గనలి గాంగే యున కిట్లనియె. 153

ఆ. ఇట్ట లాడఁ దగునె, యే నేమి సేసితిఁ;
గొలిచి- కుడుచుపాడి నలవు జలముఁ
బలుకు చెందు నెగ్గె; పతికిఁ బుత్రులకును
మనుమలకు హితంబ యొనర నడతు. 157

క. కానితెఱఁగైన, నింతటి
మానిసిఁ గానేల చేయు మనుజేంద్రుఁడు న;
న్నీ నెటి దప్పిన మాటలు
నీ నోరఁ బెడలఁ దగునె నిండినసభలోన్. 158

వ. అనిన విని భీష్ముఁడు ధృతరాష్ట్రున కిట్లనియె. 159

-: భీష్ముఁడు కర్ణుని దుర్ణయంబు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట :-

సం. 5-48-33.

తే. "ఒకట నైనను వారియం దొకరిలోని
చిదుర పాలును బోలండు, సిగ్గు లేక
పాండవుల గెల్తు నే నని పలుకుచుండు;
వీనిరజ్జులు దులువలు వింద్రు తగిలి." 160

క. మగఁటిమి- వారికి వీఁ డెదు
రుగ నమ్మి సుయోధనుఁడు విరోధము గొని, స
ర్వగుణాఢ్యులు బలవంతులు
నగు పాండున్నృపాలసుతుల నవమానించెన్. 161

ఉ. ఒక్కఁ డొకం డనేకవిధయుద్ధజయంబులు గొన్నవారు వా
రెక్కడ; నేమి సేసె నితఁ; డీతనితమ్మునిఁ గూల నేసి యు

క్కెక్కిన పార్థుపైఁ గవిసెనే? పసు లాతఁడు గ్రమ్మలింపఁగా
నక్కడ లేఁడె వీఁడు? భవదాత్మజుఁ గోల్పడె ఘోషయాత్రలోన్. 162

వ. ఈ దురాత్ముండు గర్జం బెఱుంగక నీతిబాహ్యుండై వలసినట్లు ప్రేలరి
మాటలాడుచుండు; నీవునుం గైకొని వినుచుండుదువు, మేల కాక"
యనిన భీష్మోపలుకులు విని ద్రోణుం డమ్మహారాజుతో నిట్లనియె. 163

ఉ. "శాంతనవుండు సర్వకురుసంతతికిం గలవాఁడు గాఁడె; య
త్యంతహితంబు లీపలుకు, లాహవ మొప్పదు, ధర్మసూతితోఁ
బొంతము మేలు; దేవపతిపుత్త్రుఁడు సంజయుతోడ నాఁడిన
ట్లంతకు నోపు; మీకుఁ దెలియం దగు ఖాండవదాహ మాదిగన్." 164

ఆ. శరశరాననములు ధరియింప రెట్టు లె
వ్వరును, మగతనంబు వలనుఁ గలిగి
కయ్యమున జయంబు గైకొనరే యెరు?
లర్జునుండ విజయుఁ డనఁగ నెగడె. 165

క. మనవీటన కా, దయ్య
ర్జునునకు సరివింటివానిఁ జూడఁగ లోకం
బున నెందు లేమి దెల్లం;
బనుమానము లేదు; తొడర నగునే వానిన్? 166

వ. అని చెప్పి యప్పాటం బరమహితోపదేశంబు సేసిన, భీష్మద్రోణుల పలుకు
లాదరింపక, వారికి సదుత్తరంబు లీక వారలతోడం దదనురూపంబుగా
సంభాషింపక, ధృతరాష్ట్రుండు వెండియుఁ బాండవులవలనివార్త
లడుగుటకు సంజయుదిక్కు మొగం బైనం జూచి, కురుపశువీరు లందఱుఁ
ప్రాణంబుల దెస నిరాశయులై యుండి; రమ్మహీపతి సంజయునితో
నిట్లనియె. 167

తే. "ధర్మపుత్రున కిక్కడి తలఁపుభంగి
యెట్టు లుండు? నీ సైన్యంబు లెల్లఁ గూడి

యునికి వినియెనే? యెవ్వరి గొని యతండు
కౌరవులమీఁద నెత్తిరాఁ గలుగువాఁడు?" 168

వ. అనిన విని సంజయుండు వెచ్చ నూర్చి జీచ్చవడి మూర్ఛవోయిన చందంబున డెందంబు మొగుడం జేష్టలు దక్కియుండి, కొండొకనేపు నకుఁ జిత్తం బొక్కింత నేసికొని "యక్కటా యీ భూపాలుం డింత బేల యగునే, యుధిష్ఠిరుం డెవ్వరిఁ గొని యెత్తివచ్చువాఁ డని యడుగు చున్నవాఁ- డింత యెఱుంగని వాఁ డెంత సెప్పినను దెలియ నేర్చునే? యితనిభంగి యిట్టి దనినఁ గొడుకులతెఱంగు వేఱ యెన్నఁ నేల? యే నింక నే మనువాఁడ! నైనను నన్నడిగిన మాటకుం దగిన మాఱుమాట పలుకవలయున కాదె" యని తలంచి, ధృతరాష్ట్రుని కిట్లనియె. 169

చ. "వినుము నరేంద్ర! పాండుపృథివీపతియగ్రసుతుండు సంధిసే
యన మదిఁ గోరు; మీరు తమయయ్య సగంబును భూమి యీక త
క్కినమఱి కాని, ముంద రొక గీడుఁ దలంపఁడు; మీబలంబు నె
ల్లను మదిఁ జీరికిం గొనఁడు లావున నేలఁ గొనం దలంచినన్. 170

వ. అతం డెవ్వరిం గొని యెత్తి వచ్చువాఁ డని యడిగితివి- నీయెఱుంగని వార లం దెవ్వరు గల, రవధరింపుము. 171

మ. బకవిధ్వంసి, జటాసురాంతకు, హిడింబప్రాణపారీణుఁ, గీ
చకనిర్మూలనకేళిలోలు, సమకోత్సాహైకశీలప్రవ
ర్తకు, నాగాయుతసామ్యకీర్తితబలోదగ్రుం, బ్రతివ్యూహదా
హకు భీముం గొని వచ్చు ధర్మజుఁడు శాహాటోపముం జూపఁగన్! 172

వ. మఱియును. 173

మ. 'అట మి న్నందినయట్టి వానిపొడ వెంత' న్నట్లు, ఫాలాక్షు నె
క్కటి కయ్యంబునఁ గన్నఫల్గును భుజాగర్వంబు లెక్కించు; టం
తటివానిం గొని ధర్మసూతి సమరోత్సాహంబుమై నెత్తివ
చ్చుటకుం గొంకునె- వీఁపు సక్కనయి నిల్చుంగాక మీ సైన్యముల్!

తే. నకులు సహదేవుఁ గొని ధర్మనందనుండు
మొనసి కౌరవబలముల ముట్టికొనఁగఁ,
దలఁచి తఱి వేచి వచ్చుట ధరణినాథ
సింగములఁ బట్టి వేఁటాడుభంగి గాదె! 175

తే. ద్రౌపదేయులు నాసుభద్రాసుతుండు
నుక్కుతునియలు గారె! మి మ్మక్కుమార
వరులఁ గొని యోర్చువాఁ డయి వచ్చు ధర్మ
పుత్రుఁ; డిది నీకుఁ జూడంగఁ బోల దెట్లు? 176

వ. అని చెప్పి వెండియు నిట్లనియె. 177

క. "వృష్ణికుమారోత్తముఁ డా
కృష్ణునితమ్ముండు సాత్యకియు, దవదహనా
తుల్యప్రతాపమూర్తులు
కృష్ణాసోదరులు దలఁపఁ గేవలులె నృపా! 178

సీ. శారోద్యుజ్వలుండు పాంచాలభూనాథుండు,
మహితవిక్రముఁ డగు మత్స్యవిభుఁడు,
నధికధైర్యాన్వితు లతనితమ్ము, లుదగ్ర
తేజస్కు లైన తదీయసుతులు,
నన్నదమ్ములు ప్రతాపోన్నతు లేవురు
కేకయపతులు, నతీణబాహు
శకియుకులు- జరాసంధసూనుఁడు సహ
దేవుండు- నా జయత్సేనవిభుఁడు

తే. వినుము శిశుపాలతనయులు వీరధనులు,
ధృష్టకేతుండు వృషభుండు దీర్ఘవరణవి
నోది యదుభర్త చేకితానుండు దర్వ
ఘనుఁడు శైబ్యనృపాలుండుఁ గలరు గాదె. 179

క. వీ రెల్లఁ బాండురాజుకు
మారులపాటునకుఁ గుందుమనముల తోడ,
వారిపగ దీర్ప్ఁ గడఁగెడు
వారల కా- కందు లాఁతివారుం గలరే ? 180

వ. భీమసేనసూనుండు ఘటోత్కచుండు దంష్ట్రికంకెను లావును బీరంబునుం గలవాఁడు, మాయాబలంబున మనబలంబు నెల్లం గలంచు; మటీయును దూర్పున నుత్తరంబునం గలుగు నరనాయకులు నానాసేనాసమన్వితులయి వచ్చి చిచ్చయిననుం బిడికిలింత మనుచున్నవా; రదియునుంగాక.

క. సకలభువనములు నటుచే
తికిఁ దేరంజాలునట్టి ధీమంతుఁడు దే
వకికొడుకు గలఁడు ధర్మజు
నికి, నాతం డెత్తిరాక నిలుచునె యధిపా ! 182

వ. అని చెప్పిన సూతపుత్రునకు నంబికాపుత్రుం డిట్లనియె. 183

-: ధృతరాష్ట్రుఁడు భీమసేనాదుల పరాక్రమంబు దలంచి దుఃఖించుట:-

సం. 5-50-1.

క. "వారిదెస నీవు సెప్పిన
యారథికులు ప్రబలు లగుదు రందఱుఁ నైనన్
వారెల్లను నొకతల య
మ్మారుతి యొకతల బలప్రమాణము సూడన్." 184

ఉ. భీముఁ దలంచినన్ మనము భీతిఁ గలంగుచు నుండు నాకు; రే
లేమియు నిద్ర రా, దతని నేర్తెఱ మార్కొనఁ జాలునట్టివాఁ
డీమొన లేఁ; డతం డలుక నెత్తిన యాగద కాలదండ; ము
ద్దామవిలాసుఁ డై కురుకదంబములో విహరింపకుండునే ! 185

తే. చిఱుతనాఁడును వాఁడు నాళిఱుఁ బోఁడు,
వీరు చివ్వకుఁ జొత్తురు వైర మెత్తి,

వానిచేఁ బీడవడియును మాన; రదియ
కాదె యీ భేదమున కెల్లఁ గారణంబు. 186

క. సమరమున దైత్యదానవ
సమితియు నాతని కెదుర్వఁ జాలదు; భుజయు
ద్ధమున జరాసంధుని నొక
నిమిషంబునఁ జంపె; నిలుతురె యెదురన్. 187

మ. బొమ లల్కఁ ముడివడ్డ, రౌద్రరస ముప్పొంగం, దనర్వఁ భుజా
గ్రము, లిం దెవ్వఁడు నాకు మా అనుచు శౌర్యస్ఫూర్తి శోభిల్ల, దు
ర్దమలీలం గవియంగ భీముఁ గని ధైర్యం బేది కౌరవ్యసై
న్యము లంతంతఁ గలంగఁ బాటినటులై, నా మోమునఁ బ్రేలెడిన్. 188

క. కరవాలము గద మొదలగు
పరికర మేమియును లేక, బాహుబలమునం
గరిగతి నడరినను, వృకో
దరునకు నొకఁ డెదుర నిలిచి తలపడువాఁడే! 189

తే. ప్రళయకాలసముద్రము భంగిఁ బొంగి,
కడు భయంకరుఁ డగు భీముఁ గడవ నీఁద
వశమె నా పుత్త్రులకు; విధివశము వొంది
యెదిరిఁ దమ్మును నెఱుఁగరు మదము కతన! 190

క. చిచ్చునకుఁ దోడు గరువల
వచ్చుగతిఁ, భీము దుర్నివారవిహారం
బచ్చుపడఁగఁ బ్రాపై, వి
వ్వచ్చుఁడు వెస వచ్చు- గాండివంబును దానున్. 191

వ. సంజయా! వినుము నీ కున్నరూపు సెప్పెద. 192

క. ఆ యర్జునుమగఁటిమి కెన
యేయుగములఁ జూడ వినఁగ నెందును గలదే!

నీ యెదురు నాడినంతయుఁ
జేయుట కతఁ డోపు, రిత్త నెప్పెదువాఁడే ! 193

ఉ. ఎక్కటిగాండివంబు నతి కెక్కి వెలుంగుట- మీఁదఁ గేశవుం
డక్కజ మైనతేజ మది యాసపడందు; దనంత నర్జునుం
డొక్కఁడ వైరిసేనలకు నొట్టినమంట; ప్రతాపమూర్తి లి
ట్లొక్కెడఁ గూడె- నిన్నిటి మహోగ్రపువేఁడిమి కోర్వవచ్చునే ! 194

క. దివిజదనుజసహితము లగు
భువనము లన్నిట మహేంద్రపుత్రుఁడు విజయో
త్సవలీలఁ గ్రీడ సల్పుం;
దవులంబడఁ డెందు నత్యుదగ్రబలమునన్ ! 195

వ. అని పలికి వెండియు. 196

క. "కురుసేనఁ గదా గెలుచుట
కరముభరం బర్జునునకు ! గాండీవమునం
బెరిఁగిన యమ్ములమంట
దరికొని తెగఁ గాల్చునట్టిద యగుం జుమీ !" 197

వ. భీమార్జునుల కొలందులు భీష్మద్రోణు లెఱుంగునంతకంటె నెవ్వ రెఱుం
గుదు, రెఱింగియు మానుషంబు వాటించి సేనమొగంబున నిలుతురు,
కీర్తి వట్టి ప్రాణంబులు విడుతు, రింతయ కాని చేయునది లే; దదియునుం
గాక, పౌత్రు లగుటయు శిష్యు లగుటయు గాంగేయునకు గురునకు
సామాన్యం బగుటంజేసి రెండుదెఱంగులవారికి వీ రొక్కరూప; మన
కడనున్న తప్పునకు మన ముందుట నిలువవలయునను నింతమాత్రకుంగా
వీరల కింతవలసె; నేను దైవాధీనత కతంబున బిడ్డల నొత్తి చెప్పను,
నియమింపనుం జాల; మొదల విదురుం డేమని చాటిచెప్పె నది
యంతయుం బాటిలె; జూదంబు నాఁటనుండియుఁ గురుజాతికిం జేటు
మూఁడుట దోఁచుచుండు; మందబుద్ధియు లోభోపహతుండును నయి
దురభిలాషంబున దుర్యోధనుఁ డింత సేసెఁ; గాలపర్యాయంబునఁ గౌరవు

లకుఁ గడవరానియవస్థ వచ్చె; సంజయా! నే నేమి సేయుదు, నెందుఁ
జొత్తు నెద్ది దెరు, వెవ్వరు శరణంబు; వారిరువురుఁ గల యంతట
పోయెనే విను" మని మఱియు నిట్లనియె. 198

చ. "అనుజులు నట్టివార, ద్రుపదాది సుహృజ్జను లెల్ల నంతకం
టెను బలవంతు, లాహవపటిష్ఠుఁడు రాజు యుధిష్ఠిరుండు స
ద్వినయవివేకశీలముల విశ్రుతుఁ, డాతఁడు బంధుభృత్యులం
దనకు వశంబు సేసికొనుదానికి నేర్చుఁ బ్రభుత్వసంపదన్!" 199

ఆ. సత్యశౌచధర్మశాలి, దయాపరుం;
డట్టిధర్మపుత్రు నాక్రమింప
మనము దలఁచు నెల్ల- మంటలో మిడుత లు
దగ్రవృత్తి నుఱుకఁ దలఁచునట్ల! 200

వ. కావునఁ బాండవులతోడి భండనంబునఁ గులక్షయం బగుట దప్పదు;
శాంతిఁ బొందుటయ మేలు; మనవారల కది ప్రియం బగునేని దానికిఁ
దగిన యత్నంబు సేసెద" ననిన, విని ధృతరాష్ట్రునకు సంజయుం
డిట్లనియె. 201

క. దేవరయానతి యిచ్చిన
యీవాక్యము లెస్స; నాఁడు నీవ యుపేక్షం
బో విడిచితి; వింకను నీ
చే వత్తురు వారు, వీరిచే టొప్పుదురే? 202

వ. అది యెట్లంచేని, 203

క. వారు దెస లొత్తికొనియు, ధ
రారాజ్యం బిచ్చి పోయి రా పోరా? తా
రారణ్య పీడఁ బడియును
రారాజుం జెఱుకుఁ బాపరా మన మెఱుఁగన్? 204

వ. అట్టియెడనై నను. 205

క. రావించి తగవుమై సం
భావింపవ కాక, నాఁడ పాండవు లలుకం
బో విడువరె ? మిగులుదురే
నీవచనంబులకుఁ ? బిలిచి నిలుపుము వారిన్ ! 206

-: దుర్యోధనుఁడు తండ్రితో స్వాపక్షవీరులసామర్థ్యంబు సెప్పుట :-

సం. 5-54-1.

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె. 207

చ. "అడవులఁ గొండలం బడి మహోపద రూపటి చన్నవారి ని
ప్పుడు కొనివచ్చి కృష్ణుఁ డొకప్రోవుగఁ గూటువమూఁకఁ గూర్చినం,
బొడుతురె పాండునందనులు ? భూవర ! యేటికి నింతభీతి ? మా
కడిమియు లావు నీ వసదుగా గణుతింపకు· గెల్తు మెమ్మెయిన్ ! 208

తే. పరశురాముని గెలిచిన బల్లిదుండు
భీష్ముఁ, డవనీశు లీతనిపేరు వినిన
బాఱుచుండుట యెఱుఁగవే ? పాండుపుత్రు
లనఁగ నెంతటివా- రితం డలిగెనేని ? 209

క. కృపుఁడును గురుఁడు నయోనిజు,
లపరిమితభుజాబలాఢ్యు, లాహవ కేళీ
నిపుణు లజేయులు; వీరలు
కుపితాత్మకు లైన మాఱుకొనునే హరుఁడున్ ? 210

క. ఈశ్వరవరజనితుఁడు, హరి
దశ్వప్రతిమానతేజుఁ, డస్త్రకళాని
ష్ణాశ్వర్యధురంధరుఁ, డీ
యశ్వత్థామ గలుఁగ మన కనివెఱ పేలా ? 211

ఆ. సహజకుండలుండు, శౌర్యధుర్యుఁడు సము
ద్దీర్ణబాహుబలుఁడు గర్ణుఁ డిందుఁ

గలడు; వీని కెదురు గలఁ డని యెన్నుమా
ధర్మపుత్రుపాల ధరణినాథ ! 212

క. వినుము నరేశ్వర ! కర్ణుని
పెనుపు: మహేంద్రుండు వచ్చి ప్రియమున శచికై
తను నర్థింపఁగ, నిచ్చెను
గొను మని లోకంబు లెఱుఁగఁ గుండలయుగమున్. 213

వ. వీర లాధర్మపుత్రాదులచేతన కా దెవ్వరిచేతనుం జెడమి దెల్లంబు; బాహ్లికసోమదత్తభూరిశ్రవశ్శల్య సింధురాజగాంధారరాజప్రభృతి మహావీరులు వీరలకంటెను శక్తిసమగ్రులు; దక్కటిరాజలోకంబును, సహాయులై వచ్చిన వివిధదేశాధీశులును నాతోడి సుఖదుఃఖంబుల కియ్యకొని యగ్గలికమై నగ్గి నైన నుఱుకను, సముద్రంబైన నీఁదను, దెంపు సేసి పొంపిరి వోవుచున్నవారు; గావునఁ బాండవులకు మాదిక్కు దేటీచూడనుం గొలంది గా, దనుమానింపకు; మిట్లునుంగాక, మాకు నెవ్వరును లేక, చుట్టంబులును జెలులును విడిచి- తోడువచ్చినవారును విచ్చిపోయి-భృత్యులును విరక్తు లై, వారిక పోటుమానుసులును బంధుమిత్రసహాయులును బ్రజానురంగంబునుం గలిగినట్టి దైన, నది ప్రాప్తకాలం; బింతియకాని యే మింక వారియడుగు లొత్తను బాటిపోవనుం జాల; మెల్లభంగుల సమరంబు సేయుదుము; మాతలం పిట్టిద, నాతలంచిన ట్లొండె వాసుదేవుండు దలంచినట్లొండె నయ్యెడు; నెట్లైన మే. లింతవట్టను నిర్ణయం" బని పలికి, మటీయు నిట్లనియె. 214

తే. కులములోఁ దలవం పగు కూడు గుడువఁ
బంపఁ జూచెద, వొకళులఁ బఱతు రట్టె !
వారు పై నెత్తివచ్చినఁ, బోరి కోప
మనిన ధృతిచేట కాక పొం దగునె చెపుమ ! 215

క. నీవు బతిమాలి, కొడుకుల
చావునకును జేటునకును జాలక యిమ్మై

వావిడిచి యఱచినం, గడు
నేవపడరె జనులు? నిన్ను నేమన నేర్తున్! 216

తే. భీమసేనుని నీ వింత పెద్ద చేసి
పెక్కుభంగులఁ జెప్పితి- యుక్కు గలఁడు,
గదకు నేర్చెనం చెంతయు బెదరె; దతఁడు
ననుఁ బోలమి యెఱుఁగవే నరవరేణ్య! 217

మ. గద నాతో సరి మూఁడులోకముల నేఁ గానం; జలం బెత్తి యు
న్మదుఁ డాభీముఁడు న న్ననిం దొడరిన, న్వజ్రప్రహారంబు బె
ట్టిద మై తాఁకినఁ గూలుపర్వతముమాడ్కిం గుంభినిం గూల వ్రే
సెద; నాకోర్కి గదా గదారణము- వచ్చెం బెద్దకాలంబునన్! 218

ఆ. అతఁడు వడిన, వెండి యాసేనఁ గొల్తల
సేయ నొకఁడు లేమి సిద్ధ; మింత
యెటీఁగి వెఱచి కాదె యేనూళ్లు లైనను
దమకుఁ జాలు ననియె ధర్మసుతుఁడు! 219

వ. అర్జునుండు గలం డని తలంచితివేని, 220

తే. కర్ణు వడసిన యాశక్తి గలుగఁ, బోర
బ్రదుకవచ్చునె నరునకు? నదియుఁ గాక
యతని భీష్మాదిరథికులయతులితాస్ర
మేయదివ్యబాణంబులు వ్రమింగికొనవె? 221

వ. దుశ్శాసనదుష్పగ్రహదుర్ముఖవివింశతివికర్ణచిత్రసేనాదు లగు నీకొడుకు లొకం డొకండ జగంబులెల్ల జయింపఁజాలుదు; రందఱు నొక్క మొగంబై వ్రోచి నడచిన సవ్యసాచి యొక్కరుండ కాఁడు పాండవుల నెల్ల నొక్కెత్తున వైచికొన నోపుదు; రట్లునుం గాక, మాకు నక్షౌహిణులు పదునొకండు, వారికి నేడక్షౌహిణులు; మాసైన్యంబు సారవంతంబు, వారిబలంబు నిస్సారంబు; వారు మ మ్మెవ్విధంబున జయింప నోపుదు? రీయొక్కవదక్కువలు విచారింపక, వలవనివెఱపు గటుకొని

ముక్కూరి వగచుచున్నవాఁడవు; నిన్ను వగవకుండ నుడుపంజాల
మంతియ కాని, తక్కెల్లపనులకుం జాలుదు" మని పలికి సంజయుదెసఁ
గనుంగొని సుయోధనుం డిట్లనియె. 222

క. "నానాదేశంబులబలు
మానుసులం గూర్చికొని సమత్సరబుద్ధిం
దా నేమనియెడు నయ్యమ
సూనుం, డాతనితెఱంగు సూతము చెపుమా". 223

వ. అనిన విని సంజయుం డిట్లనియె. 224

-: *సంజయుఁడు దుర్యోధనునకు ధర్మరాజునిశ్చయం బెఱింగించుట* :-

సం. 5-55-2.

ఉ. అతఁడు భండనం బనిన నార్చిన మూఁకెఁడు వేర్చు; నెంతయుం
భ్రీతి వహించి తమ్ము లొకపెండ్లికిఁ బోయెడునట్ల యున్నవా;
రాతెలి వెందునుం గలదె? యందలి నాయకు లెప్పుడొక్కొ మా
చేతులతీఁట పుత్తు మను చిత్తము కాని చలింప రేమియున్!
225

తే. నరుని పాశుపతాదిబాణములపెంపు
భీముగదసొంపు నమ్మి, యుద్దామలీలఁ
జెలఁగి వెఱపేది యక్కడిబలము ముసురు
గవిసి, యెపుడుఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వ". 226

క. నావుడు "నిది యా సంజయ!
కైవారము సేసె దీవు కాంతేయుల; వా
రేవి రణసాధనమ్ములు
గా వెఱువక నడచువారు కౌరవులపయిన్!" 227

వ. అనిన సుయోధనునకు సూతనందనుఁ డర్జును దివ్యరథశ్వేతాశ్వకపిధ్వజ
దేవదత్తంబుల మహానుభావంబులు వేఱువేఱ వర్ణించి చెప్పి, యుధిష్ఠిర
భీమనకులసహదేవులయరదంబులు దురంగాదిపరికరంబు లిట్టిట్టి వని

యేర్పడం బలికి, విరాటద్రుపదాదులకు వలయు నుపకరణంబులు గొఅంత లేమియు నెఱింగించిన ధృదరాష్ట్రం 'డిందుఁ గల బలుమానుసు లెవ్వరికి నసాధ్యులు, వీరి సాధించుతెఱం గూహించిరే' యని యడిగిన, సంజయుం డిట్లనియె. 228

సీ. గంగాసుతుండు శిఖండిపా, లతనికిఁ
ద్రాపు మత్స్యేశ్వరుబలము; గుంభ
భవుఁడు ధృష్టద్యుమ్నపా, లతనికిఁ దోడు
పడు ద్రౌపదీపుత్రపంచకంబు;
రారాజుఁ దమ్ములు మారుతి పాలు, కు
మారు లందఱు నభిమన్యుపాలు,
శకునిసైంధవులు నశ్వత్థామకర్ణులు
దక్కొరుచేఁ బోని దండిమగలు

ఆ. సవ్యసాచిపాలు, సాత్యకిపా ల్కృత
వర్మ, చేకితానవసుమతీశ్వ
పాలు సోమదత్తుఁ డాబలంబునకు, నిట్లు
నిశ్చయించి రచట నృపవరేణ్య! 229

క. నకులుఁడు సహదేవుండును-
శకుని, నులూకాది సుతుల, సారస్వతులం,
బ్రకటబలు లైన కాళిం
గకులను సమయించువారు కౌరవనాథా! 230

క. కేకయులు మనలఁ గలసిన
కేకయుల జయించువారు; కృతపుణ్యుఁడు సు
శ్లోకుఁడు ధర్మ్మతనూజుఁ డు
లోకోత్తరు శల్యుఁ దా గెలుచువాఁ డధిపా! 231

వ. అట్టి పలుకులసమయంబున నచ్చోటఁ గొందఱు జనంబులు ధర్మ్మనందను నుద్దేశించి. 232

క. "ఇతఁ డెక్కడ? మద్రమహీ
పతి యెక్కడ? నితని కతఁడు పాటియె? యనుడుం,
బ్రతివచనంబుల శల్యుని
యతిబల శౌర్యములు వారి కాతఁడ చెప్పెన్. 233

వ. ఇట్లు గాకయు, నెవ్వరిమొగంబున నెవ్వరు వడిరి వారికి వార చాలి యుండువా రని; రివ్విధంబునఁ గ్రొవ్వు మిగిలి కొఱంతలేని తెగువం దేజరిల్లుచున్నవారు; నీకు నీకొడుకునకు నెయ్యది గర్జంబై తోఁచె నదియ చేయుం" డనిన విని విచిత్రవీర్యతనయుం డిట్లనియె. 234

క. "నాకొడుకుల కెక్కడి బ్రదు?
కేకొలఁది దలంప నిప్పు డెన్నిన వీరా
నీకంబు నోర్వవచ్చునె
యీకూడినసై నికులకు, నే మనువాఁడన్! 235

క. రాజు యుధిష్ఠిరుఁడై, హరి
దా జయ మొడఁగూర్ప నున్నఁ దత్సైన్యము- రా
రా జిట్లు సరకు సేయమి
నాజన్మము దుఃఖభాజనం బగుటఁ జుమీ! 236

క. నాకుడుప నేల వళమగు,
నీకూడినభూపతులకు నింతియ కాలం
బై కడ చన్నది, సంజయ!
నీ కీవగ పేల యింక నిలుపుము పలుకుల్!" 237

వ. అనిన విని దుర్యోధనుండు నిజజనకునితో నిట్లనియె. 238

ఉ. "ఏమును భాండునందనులు నేకకులంబునఁ బుట్టి యొక్కచో
నే మొకఁ డైనఁ జేసి గెడ నెప్డు చరించినయట్టివార, ము
ద్దామబలంబు శౌర్యమును దర్పము వారికి కల్గి, వార సం
గ్రామమునన్ జయింతు రనఁగా నొకనిశ్చయ మెట్లు గల్గెడున్. 239

ఉ. వారిని వారివారి నిటు వర్ణన సేసెదు గాని, మమ్ము మా
వారఁ దలంప; విప్పుడమి వారికిఁ బాయను మాకు నంతయుం
జేరను మున్ సృజించె విధి సిద్ధము; దీని నొకండు మాన్పఁగా
నేరఁ; డకారణంబ మది నెవ్వగ లేటికిఁ బట్టుకొల్పఁగన్ !" 240

వ. అనిన విని సూతనందనునకు నంబికానందనుం డిట్లను, "నాకొడు
కున్మత్తప్రలాపంబులు సేయుచున్నవాఁ, డింతియ కాని సత్యధర్మతనయ
పరాక్రమసహాయసంపన్నులై న పాండవులఁ దనకు గెలువవచ్చునే?
తాను బ్రబలుం డయినను బెనఁకువ గీడ కాక మే లగునే? యది
యట్లుండె, నొక్కటి యడిగెద సంజయా చెప్పుము. 241

క. "సమరమునకుఁ బురికొల్పుచు,
మముఁ దలఁచిన నుల్లికుట్టు మాటలఁ దచ్చి
త్తము లుడికించుచుఁ, బాండవ
సమితిం గడఁగించువా రచట నెవ్వరొకో !" 242

క. నావుడు సంజయుఁ డిట్లను
"దేవా ! పాండవులయలుక ధృష్టద్యుమ్నుం
డేవెరవుమాట నైనను
నేవోసినయగ్నిభంగి నిగుడం జేయున్." 243

వ. అతండు ధర్మతనయుతో నిట్లను "గాంగేయకుంభసంభవాది మహావీర
క్రూరసత్త్వబహుళంబును, గరిఘటాగిరికదంబకలితంబును, దురంగ
నికరతరంగపరంపరాఘోరంబు నగు కౌరవసేనాసముద్రంబునకు నేనొక్క
చెలియలికట్టనై నిలిచెద" నపుడు నయ్యుధిష్ఠిరుండు "నీ వింతకుఁ
జాలుట యెవ్వరు నెఱుంగరే? యెట్లను సంగరంబున మమ్మురక్షింపు'
మనియె, నిట్లు గొనియాడిన నాతండు నాదెసం గనుంగొని 'సంజయా!
మీవారల కెల్లనుం దెలియం జెప్పు, మీశ్వరాదిదేవతలు సమకట్టినసవరణ
గల యర్జునుచేత నిర్జింపఁబడిన యుత్కృష్టజాతు లనేకు లగుట యెఱుంగు
దుర కాదె, మనుష్యు లతని కెంతపెద్ద, యిట్టిజెట్టి వెన్నుఁదన్ని చూడఁ

గలవాఁడు గావున మముబోంట్లెఁ బోక పెనంగినం బోరుభరంబైనం
బ్రాణంబులపై వచ్చు నంతకంటెను బరమదయాపరుండైన పాండవా
గ్రజుమఱువు సొచ్చి బ్రదుకుం డను, మంతలంతలు దప్పులు సేసితి మని
తలంకవలవ, దెంతలు సేసినను గొంతేయపూర్వజుండు శాంతిసుధానిధి
యగుటం జేసి శరణు సొచ్చినం గాచు' నని పల్కె" ననిన, విని ధృత
రాష్ట్రుండు దుర్యోధనున కిట్లనియె. 244

క. "పరిజనులకు నీకును ని
ద్ధరలోన సగంబు సాలుఁ, దక్కటిసగముం
గర ముచితంబుగఁ బాండవ
వరుఁ డగు ధర్మజున కిచ్చి బ్రదుకుము నెమ్మిన్." 245

-: ధృతరాష్ట్రుఁడు దుర్యోధనునితో సంధిసేయు మని సెప్పుట :-

సం. 5-57-4.

చ. పెనఁకువ నాక యేల మనపెద్దల కెవ్వరి కియ్యకోలు గా,
దనుచితవృత్తి గాన గురుఁ డాదిగ నాప్తులు బంధుమిత్రులుఁ
గొనకొని పోరికిం జొర; రకుంఠితతేజుఁడు ధర్మపుత్రుఁ; డా
తనిఁ దగఁ గూడి మన్కి ప్రమదం బగు గౌరవజాతి కెంతయున్. 246

వ. అని వెండియు. 247

క. "కర్ణుండు రేఁచి పెట్టఁగ,
దుర్ణయపరు లైన శకునిదుశ్శాసను లీ
నిర్ణయమె మే లనఁగ, నీ
కర్ణములకు నించు నెట్లు కార్యవచనముల్." 248

వ. అనినఁ గటకటంబడి సుయోధనుం డిట్లనియె. 249

క. "నీచెప్పెడిపెద్దలు ద్రో
ణాచార్యులు మొదలుగాఁగ నని కొల్లనివా

నై, చేరనివారిం గొని
యే చక్కం బెట్టువాఁడ నేఁ బాండవులన్. 250

శా. రాధేయుండును దుస్ససేనుఁడును బోరం బ్రాపుగాఁ, బాండవ
క్రోధజ్వాలల నార్తు, నొండొకఁడు నాకుం దోడె; నీ వింక నఁ
బాధం బెట్టకు, వాఁడిసూదిమొన మోవంజాలునంతైన నే
నీధాత్రీతల మీను వారలకు; నా కేలింత నేగిం బడన్!" 251

వ. అనిన గాంధారీవల్లభుం డతని కిట్లనియె. 252

ఆ. "నీకు నంత వగవ, నీపోవు తెరువునఁ
బోవువారు గాఁగఁ బూనియున్న
వారికెల్ల నేను వగచెదఁ, గయ్యంబు
వలవ, దుడుగుమయ్య చలము గొనక!" 253

చ. ఉభయబలంబులుం బొగడ, నుగ్రత భీముఁడు విస్ఫురద్గదఁ
రభస మెలర్పఁ గుంభములు ప్రయ్యఁగ ప్రేసిన నెత్తు రొల్కఁగా
నిభములపిండు గావిసెలయేఱులతోడి నగంబులట్లు సం
క్షుభితము లై పయింబఱుపఁ జూచి తలంచెదు నాదువాక్యముల్. 254

చ. ఉఱక ధనంజయుండు వివిధోగ్రశరంబుల నొక్కమాత్ర నే
డ్తెఱ నుఱుమాడినం, బుడమిఁ ద్రెళ్ళిన నీదగుసైన్య మంతయున్
నఱకినఁ బడ్డ ఘోరవిపినంబున నున్నఁ జూచి, య
త్తఱి నయినం దలంచె దుచితం బగు నావచనంబుఁ బుత్రకా!" 255

వ. అని పలికి, యతనివలనం బలుకు గానక మనంబు మరలం బెట్టికొని, కొడు
కులు జయింప నోపుదురొకో యనునాస సంజయుదిక్కు మొగంబు నేసి,
పాండవ కౌరవ పటుంబులం గలవారి నడుగుచుం గొలందులు దల
పోయుచు, నాతని వచనంబులను దనవిచారంబులు నిశ్చయించి, పాండ
వేయు లెక్క డవుట యెఱుంగుచుఁ, బ్రమ్మఱ నాసూతపుత్రుతో
లెక్కలు వెట్టుచుం బోలించుచుఁ బెద్దప్రొద్దు వితర్కించి, కౌంతేయుల

శక్తి దేవశక్తియు- గాంధారేయులశక్తి మనుష్యశక్తియుంగాఁ దెలిసిన
వాఁడై, యంబికానందనుండు నిజనందనునితో నిట్లనియె. 256

క. నరుఁ డగ్ని దేవుఁ దనకును
వరదునిఁగాఁ గొలిచినాఁడు, వానికిఁ గేతు
స్ఫురణం బాదిగఁ గలసం
గరపరికర మెల్ల నతఁడు గావించె దయన్. 257

వ. అదియునుంగాక, ధర్మదేవతయు వాయుదేవుండును వాసవుండును
నాశ్వినులును వారలకుఁ బాండురాజుతోడివారలు, వారి నొకకీడునం
బొరయకుండ రక్షింతురు, గాన భీష్మద్రోణప్రముఖులకుఁ బాండవులం
బరిభవింపరామి దెల్లంబు. 258

క. దేవత లేటికిఁ ? బార్థుఁడు
దేవసముఁడు గాఁడె ? వాఁడు దివిజులచేతం
బోవనిదైత్యులఁ జంపఁడె ?
యీవును నీవారు నతని నెఱుఁగరె చెపుమా ? 259

వ. కారపులకు వచ్చిన యిమ్మహాభయంబునకుఁ బ్రతీకారంబు శాంతిం
గడచిన యది లే, దెన్నిభంగులఁ జూచినఁ గయ్యం బుడుగుటయ మనకుం
గర్తవ్యంబై యున్నయది; యుపశమింపవయ్య దీర్ఘవైరంబు వలవ"
దనినఁ, దండ్రికి గొడు కిట్లనియె. 260

క. "దేవత లర్జునునకుఁ దో
డై వత్తు, రనంగ వలవ; దది యెట్లనినన్,
దేవత్వము రాగద్వే
షావేశము లేమిఁ గాదె యైనది మొదలన్ ! 261

వ. కావున వా రొకళ్ళవారుం గా; రట్లుం గాక పక్షపాతు లై ప
వత్తుర యేని నది దేవత్వంబు గా, దట్టిదేవత్వంబున నర్జు
సురక్షితుండు గానేరఁడు; నీకు నాపనికిఁ జింత వలవ"
వెండియు నిట్లనుఁ "బెట్టిగివచ్చు కార్చిచ్చు నుడుపను,

వారింపను, మహావాయువు నిలుపను, నీళ్ళు గట్టిగా నభిమంత్రించి వానిపైఁ గరితురగాదుల నడపింపను, నాసేన నడచునప్పుడు వలసిన చోట జలంబు లుత్పాదింపను, జాలుదు. సింహశరభశార్దూలభూతభేతాళాదిక్రూరసత్త్వసంరంభస్తంభనప్రకారం బెఱుంగుదు; మిత్రశత్రువిషయంబులైన శుభాశుభంబులు వలయుభంగి నావహింప నేర్తు; మఱియు నానావిధసిద్ధిప్రదంబు లగు మంత్రధ్యానాద్యనుష్ఠానంబుల నాకుం గొఱంత లేదు; నీచెప్పిన యగ్నిప్రముఖదేవతలం ప్రపన్ను లగు నట్లుగా నారాధించినవాఁడ; వారికి నాకుంబోలె మహానుభావంబు గలిగినఁ బదుమూఁడువత్సరంబు లబ్భంగి నిడుమలం బడుదురె? వినుము చెప్పెద. 262

-: దుర్యోధనుఁడు తండ్రితోఁ దనబలపరాక్రమంబు సెప్పుట :-

సం. 5-60-20.

క. ఏ నలిగిన, వారిని సుర
లై నను రక్షింప నోప; రమరు లలిగినం
బూని చెడకుండఁ గాతును;
మానవు లొకసరకె నాకు మనుజాధీశా! 263

తే. గర్వమున నాడుమాటలు గాఁ దలంప
వలవ, దిది యెల్ల నిక్కంబు వసుమతీశ!
నన్ను నేఁ జెప్పికొందునే యెన్నఁ డైన,
నాత్మసంస్తుతి పౌరుషం బగునె చెపుమ! 264

వ. ధర్మతనయాది పాండవేయులును, ద్రుపదాది పాంచాలురును, విరాటాది మాత్స్యులును, వాసుదేవాది యాదవులును, మఱియునుం గేకయపాండ్యమాగధచైద్యప్రముఖ నిఖిలదండనాయకులును నాభారిం బడి మున్నీరు సొచ్చిన యేఱుల చందంబున నడంగి పోవుట యవధ రెదు గాక! వా రెల్లఁ దేజోధైర్యపరాక్రమోపాయవిచారవివే నాయెత్తు వత్తురె! పితామహద్రోణకృపాశ్వత్థామలు షయంబుగా నేమేమి యెఱుంగుదు- రెంతెంత నేర్తు రది

యెల్ల నెఱుంగుదు నంతయు నేర్తు" నని పలికి యందఱు వెఱఁగుపడి
యుండఁ, దాను సంజయుతో సంగరంబుతెఱంగు నాలోచనంబుగాఁ
బాండవులదెస మాటలాడుచుండఁ, గర్ణుండు ధృతరాష్ట్రుం గైకొనక
ధార్తరాష్ట్రునకుం బ్రియంబుగా నిట్లనియె. 265

క. "గతనలుక నాకు నస్త్ర
స్ఫురణ మెడలె నంద్రు జనులు; బొం కది, పూజా
పరతమెయి నమ్మునీశ్వరు
కరుణ గొఱలి, మగుడఁ బడయఁ గాంచితిఁ బ్రీతిన్. 266

ఉ. కావున నస్త్రశస్త్రము లఖండితసంపద నొంది యుండు; దే
వావలి కైన నన్నుఁ జెనయన్ భర; మేఁ గలుగంగ నర్జునుం
డే విడిపించు మేదిని? గడిందిమగంటిమి యుల్లసిల్లఁగా
నీవు బలంబు మెచ్చ నని నిల్చెద; గెల్చెదఁ బాండవేయులన్! 267

శా. గాంగేయాదులు నీకడన్ నిలిచి వేడ్కం జూడఁగా, సర్వనే
నాంగాంగంబులమీఁద గాలియును జిట్టాడంగ నీ, కేను వీఁ
కం గొంతేయులఁ దాఁకి తత్తనువు లుగ్రస్ఫారబాణాలిఁ గూ
లం గోదండవిలాసముల్ మెఱయ లీలం బోరఁ గ్రీడించెదన్". 268

వ. అనిన విని యిననందనునకు మందాకినీనందనుం డిట్లనియె. 269

క. "కాలుఁడు ప్రేరేపఁగ నిటు
ప్రేలిన యంతటన నిన్నుఁ బెద్దగఁ దలఁపం
బోలునె మాకును- నుడుగుము;
చాలుదు వీ వెల్ల పనులు సాధింపంగన్. 270

ఉ. కూలెడువారె పాండవులు? ఘోరపుఁబోర నొకం డొకండ యీ
చాలెడు వార లెల్ల మును చావఁ, గ్రమంబున సేన లన్నియుం
గూలఁగఁ, గౌరవుల్ పిదపఁ గూలుదు; రింతియ కాక నోరిచే
చేల? వృథాభిమానమున నిన్నియుఁ బ్రేలెదు సూతనందనా! 271

తే. దివిజపతి నీకు నిచ్చిన తీవ్రశక్తి
చేతఁ గవ్వడి వడు నని చూతువేని,
వాసుదేవునిచే నది వ్రయ్య లయ్యెఁ,
దునియ లయ్యెను, బొడి యయ్యెఁ దొరఁగు ధరణి! 272

క. సర్పముఖశరము గల దను
దర్పంబునఁ గ్రీడిఁ దొడరఁ దలఁపకు; హరి పెం
పేర్పఁడఁ నదియ కాదట
తీర్పవలయు వాని నెల్లఁ దీర్చు నరునకై" 273

వ. అని పలికి ధృతరాష్ట్రునితో నిట్లనియె. 274

క. జ్ఞాతులు దమలోఁ బొలదినఁ,
జేతోమోదమున వెలిఁగి చెలు వొందుదు; ర
స్నీతిం బాసిన, విగతవి
భూతిం గడకొఱవు లట్ల పొగయుదు రధిపా! 275

వ. కావునఁ దమలో విరోధం బొప్పదు; సంభాషణసహభోజనాదిసత్కారం
బులను సవినయవర్తనంబులను బ్రీతులైన జ్ఞాతు లిహపదార్థసాధకు
లగుదు" రని చెప్పి వెండియు. 276

క. "విను మే నొకకైలమునకు
మును భూసురవర్గసహితముగ నొక పనికిం
జనునెడఁ జనరానితటం
బున నొకఁడు న్నుండెఁ; దానిఁ బొగడిరి తజ్జుల్. 277

తే. దీని తేనియఁ ద్రావినమానవులకు
జరయు రుజయును డప్పియుఁ జావుఁ గలుగ
దనఁగఁ, గొందఱు బోయలు విని కడంగి
యుఱక మొఱకు లై చటీఁబడ నుటీకి రపుడు. 278

వ. ఇట్లుఱికి మృతిం బొంది, రట్లపోలె నవినీతు లైన నీకొడుకులు పుడమి
యెల్లను దార యేలుతీపుఁ జూచెదరు గాని, తమపొలిసిపోవుటం
గానరు; వీర లర్జునుతోడం బెనంగి మానప్రాణంబులు దక్కించుకొను
వారె? యట్లుంగాక, సమబలులైననుం గయ్యంబునఁ గదా 'వీ
రొదురు వా రొదు' రనవచ్చు; నది యేల నీలోనికి ధర్మనందనుం
దెచ్చికొనుటయ నీకుఁ గర్తవ్యం" బనిన, బాహ్లీకుండు ధార్తరాష్ట్రుని
కిట్లనియె. 279

క. "కను బ్రమసిన తెరువరి తన
కనపాయం బైనమార్గ మరసి తగ నెఱిం
గినవారు సెప్పఁగాఁ గై
కొనని కరణిఁ, దగిన వెంటకుం జొర వకటా" 280

వ. అనిన వైచిత్రవీర్యుండు దుర్యోధనున కిట్లనియె. 281

మ. "కొడుకా! యే నెటు లట్ల బాహ్లీకుఁడు నీకుం గూర్చు; భీష్ముండు నీ
యెడ సస్నేహుఁడు; వీరిమాట వినుఁ; మే మువ్వురున్ మన్ననల్
వడయంగాఁ దగునట్టివారము; నినుం బ్రార్థించెదఁ; ధర్మజుఁ
విడువంగాఁ దగ; దిమ్ము వారలకు నుర్విం బాలు నెమ్మిం దగన్." 282

క. అనినను, వెండియు నొడఁబా
టునకుఁ జొఱని దానికిం గొడుకుతోడఁ గడుం
గినిసి, ధరణీశ్వరుం డి
ట్లనుఁ గొలువున నున్నవార లందఱు వినఁగన్. 283

తే. "బవరములు గావె విఱిగిన బార సాఁప
వచ్చునే యొక్కరుండ వివ్వచ్చుఁ డడరి
పసులఁ బెట్టించునపుడు నీ బలము విఱుగ
దయ్యెనే? నీవుఁ గర్ణుండు నచట లేరె?" 284

వ. అని రాధేయుదిక్కు మొగంబై మఱియు నిట్లనియె. 285

ఆ. "నాఁటికొలఁది గాదు, నారాయణుఁడు నొక
లెక్కఁ, గెలన భీముఁ డేచి నడవ,
ననుజతనుజసహితుఁ డై వచ్చు వివ్వచ్చు
మార్కొనంగ వశమె- మనకుఁ గర్ణ ! 286

చ. బలమును దర్పముఁ మెఱయ, బంటుతనంబున నీవు పాండవే
యుల నని మార్కొనం గడఁగు టొప్పెడు తెం పగుఁ; జచ్చి శుద్ధుఁ డై
పలుకులు మాన్పు భృత్యుఁ డనుపాటి దలంచెద- విట్లు మేలె? య
చ్చలమున నీ సుయోధనుని చావున కోర్చుట గాదె యెంతయున్." 287

వ. అనిన విని కానీనుండు సంక్షుభితమానసుం డై "యిది యెల్ల నిట్లనియె,
నిట్లుంగాక తక్కినయది యట్లుండె, నదీసూనుండు నన్ను నిరాకరించి
పలికిన పలుకులఫలం బనుభవించుం గాక" యని యతని నుద్దేశించి
యిట్లనియె. 288

-: కర్ణుఁడు భీష్మునిపై రోషముచేత నస్త్రసన్యాసంబు సేయుట :-

సం. 5-61-13.

తే. "నీకు నాలావుతోడ్పాటు లేకయుండ
వలయు; నీతెగునంతకుఁ గలన నిలువ;
నాయుధంబులు విడిచితి; నంతమీఁద
మెఱసి బలవిక్రమంబులు నెఱపువాఁడ," 289

వ. అని శస్త్రసన్యాసంబు చేసి కొలువున నిలువ నొల్లక దిగ్గన లేచి పోయె;
నట్టియెడ, శాంతనవుండు నవ్వుచు దుర్యోధనునితో నిట్లనియె. 290

క. అంతకుఁ జూలఁడె కర్ణుం
డింతకు మును భాస యిచ్చి యెన్నఁడు బొంకం;
డింతటిమానిసి యలిగినఁ
గొంతేయుల కెట్లు బ్రదుకఁగా వచ్చునన్. 291

క. అని వెండియు నిట్లను, "నా
తనివాటల కెట్లు గడఁగి ధర్మతనయుతో
నని సేయక తక్కువు నీ;
వనుమానము వాయఁ జూడు మతనిని నన్నన్. 292

వ. ఏను బాహ్లికద్రోణప్రముఖులు గనుంగొనుచుండఁ బ్రతివీరుల ననేక సహ
స్రంబుల సమయించెదఁ. బిదప రాధేయురణంబునుం జూచెదవు గాక"
యనిన విని దుర్యోధనుండు గర్ణపక్షపాతియు నవినీతుండును నగుటం
జేసి సహింపక పితామహుతో నిట్లనియె. 293

చ. "ఎఱిఁగి యెఱింగి యొండె, మది నేది యెఱుంగక యొండె, నెప్డు నం
దఱు వినఁ 'బాండునందనులు దర్పితు లై యని గెల్తు' రందు; ముం
దఱి నిను బాహ్లికుఁ గురునిఁ దక్కటివారిని నమ్మి యేను నే
ర్తెఱ నని సేయఁ బూతినిఁ; గడిందిమగంటిమి తోడు సాలదే. 294

ఉ. కర్ణుఁడు దుస్ససేనుఁడును గల్గఁగ నా కొరు లేల, సదృఢా
కీర్ణవిరోధిసైన్యముల గెల్వఁగఁజాలుదు మేము; మాకు నీ
యర్ణవవేష్టితక్షితి యనర్గళవిక్రమ మొప్పదక్కు; మా
నిర్ణయ మెల్ల నిట్టి- దవినీతియొ నీతియొ చూడుమీ తుదిన్." 295

క. అనుపలుకులకు విషాదముఁ
దనుకఁగ, ధృతరాష్ట్రవిభుఁడు దననందఁ నే
మనియుం బలుకఁగఁ జాలక,
వెనుఁబాటున నిట్టు లనియె విదురునితోడన్. 296

తే. "మృత్యుపాశోపహతుఁ డయ్యె, మీఁదు లేక
సూతనందనుతోఁ గూడి నాతనూజుఁ,
డకట నాశంబుఁ బొందువాఁ డయ్యె; మనకు
నింకఁ జేయంగ నగుపని యెద్ది చెపుమ?" 297

వ. అనిన విని విదురుం డతని కిట్లను, "మనవారలు మున్న దుర్బలులు, తమలోనం బెనంకువ లయి విరసవచనంబు లాడుచు నింతలు పుట్టించుట యిది యర్జునునకుఁ గార్యసాధనం; బింతియ కాక, యే మనువారము; వారలు బంధుమిత్రసహాయులు చారును నొక్కతలంపువార లయి యున్నవారు; వలవని యీవెంగలిమాటలు విడిచి పాండవులం బిలువం బనిచి తగవు నడపుట దక్క మనకుఁ జేయం దగుపని వేఱొండు గలు గునే" యని చెప్పిన ధృతరాష్ట్రుండు సంజయు చెప్పిన కార్యవచనం బుల కొఱంత వినం గలవాఁడై యతనిదిక్కు మొగంబు సేసి. 298

క. "మును వరుసతోడఁ దనతలఁ
చినయన్నియు నీవు వినఁగఁ జెప్పి, తగవుమై
నిను వీడుకొల్పునెడ, న
ర్జునుఁ డేమని నిశ్చయించెఁ జూతము చెపుమా!" 299.

క. అని యడిగిన సంజయుఁ డి
ట్లనుఁ "దుదిఁ బార్థుండు నిశ్చయము సేసి సుయో
ధనుతో నిందలిపెద్దలు
వినఁగా నను మన్నపలుకు వినుము, నరేంద్రా!" 300

మ. "కురువంశోత్తముఁ డైన ధర్మజుఁడు 'నాకుం దండ్రిపా లీఁదగుఁ
ధరలో సా' మని తాన పల్క వినియుఁ, దర్పంబుమై నీక త
క్కిరయేనిఁ జటులాస్మదీయవిశిఖాగ్నిజ్వాలలం దాహుతుల్
వరుసం బెట్టుదు ధార్తరాష్ట్రితతి నైశ్వర్యం బవార్యంబుగన్." 301

వ. అని పలికి కౌఁగలించుకొని భూషణాంబరాదికమనీయవస్తువు లొసంగిన, నేనును బాండవులను వాసుదేవుని సవినయంబున వీడ్కొని యింత వట్టును దేవరకు నెఱిఁగింప వేగంబ వచ్చితి" ననిన నమ్మాటలు దుర్యో ధనుం డాదరింపక పెడచెవులం బెట్టె; ధృతరాష్ట్రుండును లీచ్చవడి యీరకుండె; నప్పు డయ్యిరువురపాలను సంజయుం డొక్కరుండు దక్క నయ్యాసానంబున నున్న సమస్తజనంబులును దిగ్గన లేచి తమతమనివా సంబులకుం బోయిరి, తదనంతరంబ. 302

క. తనుజ వశవ ర్తి యగు న
మ్మనుజేంద్రుఁడు 'దనసుతుండు మర్దింపఁగ నో
పునో' యనిఁ బాండుతనూజుల
ననుమతి సంజయునితోడ నాడె దురాశన్. 303

సీ. "ఈ రెండువీథుల తారమ్యంబులు
నెఱుఁగుదు, పోరైన నెవ్వ రోర్తు
రిది నిశ్చయింతమే; యెందు నుపాయంబుఁ
బౌరుషంబును గలవారు గలరు
చూతము చెపు" మన్న సూతనందనుఁడు న
న్నడిగెద వే నొంటి యడుగవలదు,
మీయయ్య సాత్యవతేయుఁ డీయెడకు వేం
చేయునట్లుగ భక్తిఁ జేసి తలఁపు,

తే. పిలువఁబంపు గాంధారి; వారలు వినీతి
రతులు, నిశ్చయవిదులు, ధర్మజ్ఞచిత్తు;
లుల్లమున నీ కసూయాదు లొదవెనేని
పూని మాన్పంగ నేర్తురు మానవేంద్ర!" 304

-: కృష్ణద్వైపాయనుఁడు ధృతరాష్ట్రనియొద్దకు వచ్చుట :-
సం. 5-65-8.

వ. అనిన విని యంబికానందనుం 'డట్లకాక' యని యొకకంచుకిం బిలిచి వానిం బుచ్చి గాంధారి రావించి, సద్భక్తితార్పర్యంబునఁ గృష్ణద్వైపా మహామునిం దలంచిన, దివ్యబోధమహనీయుం డైన యమ్మహాత్ముండు విజయంచేయుటయు, నందఱు దండప్రణామంబులు సేసి సమున్నతాస నంబున నునిచి యర్ఘ్యపాద్యాదివిధులం బూజించి యున్నసమయంబున, ధృతరాష్ట్రుండు విన్నపంబు సేయకమున్న యమ్మహాపురుషుండు ధృత రాష్ట్రసంజయుల చిత్తవృత్తులు దాన యెటింగినవాఁ డగుటంజేసి సంజయువలనఁ బ్రసన్నదృష్టి నవలోకించి యతని కిట్లనియె, 305

క. "నీవు సమస్తము నెఱుఁగుదు
గావున నీ కూరకుండఁగాఁ దగదు, ధరి
త్రీవల్లభుఁ డడిగిన పని
'యీవిధ' మని తెలియఁ బలుకు మేను వినంగన్" 306

వ. అనినఁ బ్రసాదం బని సంజయుండు ధృతరాష్ట్రునిన కిట్లనియె. 307

క. "ఆసేనకు నీసేనకు
వాసి యడిగె దీవు నన్ను, వసుదేవసుతుం
డాసేనఁ గలఁడు, తత్సము
నీసేనం జూపుమా నరేశ్వర నాకున్ ? 308

వ. వాసుదేవుం డెట్టివాఁ డని యడిగె దేనిం జెప్పెద. 309

చ. జగముల నన్నిటిం దనవశంబుగఁ జేసిన వీరు భంగమున్
బగయు లలాటలోచనుఁడు వాపఁగఁ జేర్చిన యట్టిబాణు, నొ
క్కగడియలోన గర్వ మడఁగం బఱిమార్చె; సురేంద్రకల్పకం
బు గరము లీల, దెచ్చె; హరిభూరిపరాక్రమ మప్రసిద్ధమే ! 310

ఆ. అధికదుష్కరంబు లైనకార్యంబులు
క్రీడవోలెఁ జేయుఁ గేశవుండు;
విను మతండు పార్థ నెనసి యేకార్థుఁ డై
యుండుఁ- బూర్వభవసఖుండు గాన. 811

వ. అట్టి వాసుదేవుని చక్రంబు నిజమాయాబలంబునఁ బాండవుల సర్వసమర
సాధనంబులయందును సూక్ష్మరూపవ్యాపియై నిలిచి వారికి విజయం
బొసంగుచుండు" నని చెప్పి మఱియు నిట్లనియె. 312

క. "పలుమఱుఁ బాండుతనూజుల
కొలఁది వితర్కించెదవు, నిగూఢం బది; యేఁ
దెలియం బలికెద, వారికి
బలమును సత్త్వంబు హరియ పార్థివముఖ్యా !" 313

వ. హరిమహత్త్వంబు విన్నవించెద నవధరింపుము. 314

క. ఒకతల సమస్తజగములు
నొకఁడ జనార్దనుఁడు నిలిచి యొకతల యైనన్
సకలము నసార; మాతం
డొకరుని సారంబ చాల నుత్కృష్ట మగున్ ! 315

క. తలఁపునన వాసుదేవుఁడు
గలిగింపను నిలువ నడఁపగా నోపు జగం
బుల; మటియునుఁ గ్రీడార్థము
పలువోకలఁ బుచ్చుచుండుఁ బౌరవనాథా ! 316

క. ఎక్కడ నడచును సత్యం
బెక్కడ ధర్మంబు వరగు, నెక్కడఁ గలుగుం
జక్కటి, నిలుచుం గృష్ణుం
డక్కడ; నతఁ డున్నకడన యగు జయ మధిపా ! 317

సీ. పురుషోత్తముం డెల్లభువనంబులును దాన,
యఖిలభూతాత్మకుం డై విహార
లీల విచేష్టించు, నీలోకముల మాయ
దొట్టి యొక్కొకమరి పుట్టి పెరిగి,
కర్మానుచరణముల్ గైకొని వర్తించు;
శిష్టరక్షణమును దుష్టనిగ్ర
హంబును దనపను లగుటఁ, బాండవుల నె
పం బిడుకొని ధర్మబాహ్యులై న

తే. నీతనూజుల నిక్కమ నిగ్రహింపఁ
దలచినాఁ, డమ్మహాత్ముండు దథ్య; మతని
నిట్టిచందంబువాఁ డని యెఱిఁగి యెవ్వ
రాశ్రయింతురు బ్రదుకుదు రట్టివారు; 318

క. అనవుడు ధృతరాష్ట్రుఁడు "వి
ష్ణుని నే నెఱుఁగని విధంబునుం, దెలియఁగ నీ
కనియున్న తెఱఁగుఁ జెప్పుమ"
యనుటయు సూతసుతుఁ డిట్టు లను నాతనితోన్. 319

వ. "విద్యయు నవిద్యయు ననఁగా రెండు గల, వవిద్యాదూషితుం డై తమోగ్రస్తుం డై నవాఁడు విష్ణు నెఱుంగఁడు, విద్యాసంపన్నుఁ డెఱుంగు" ననిన, విద్య యనునది యెట్టిది, యెద్దాన నీ వా సర్వేశ్వరు నెఱింగితి దాని, నవిద్య యెట్టిది దానిని జెప్పు" మనుటయు, నాంబికేయునకు సంజయుం డిట్లనియె "సాత్త్వికరాజసతామసవికారంబుల త్రిప్పులం బడక, ధర్మం బాచరించుచు భావశుద్ధి గలిగి యుండుదు; దీన నే నచ్యుతు నెఱుంగుదు; విద్య యిట్టిది; నీకునుం దక్కొవ్వరికైనను నతని నెఱుంగుటకు నిదియ తెరు; విట్టిది గాని విధం బవిద్య" యని చెప్పిన, నతండు నిజనందనున కిట్లనియె. 320

క. " మన కాప్తుఁడు సంజయుఁ, డీ
తనియుపదేశంబు వట్టి ధర్మమున ముకుం
దుని నాశ్రయింపవయ్య! య
తనిఁ జొచ్చిన బ్రదుకు దీవుఁ దమ్ములు సుతులున్." 321

చ. అనిన సుయోధనుండు దమ యయ్యకు నిట్లను, "నిజ్జగంబు ల
న్నిన నొకవెట్ట బ్రిమింగినను సెట్టన సర్వము గాచె నేనియు,
న్వినుము ముకుందుఁ డర్జునునినెచ్చెలినాఁ జెవులార వించు, నిం
క నతని నొక్కబాహునకుఁ గా ధృతి పెంపఱ నాశ్రయింతునే." 322

తే. అనిన గాంధారి కిట్లను జనవిభుండు,
"నీతనూజుండు దుర్మాని, నీతిబాహ్యుఁ,
డుద్ధతుం, డీసు మాని నాబుద్ధి వినఁడు,
వీఁడు సెడుఁ గాని బ్రదుకంగ లేఁడు సుమ్ము." 323

ఉ. నావుఁడు దల్లి యిట్టులను నందనుతో, "నిది యేల యా
శ్రీవిభవంబులఁ మము నశేషసుహృజ్జనులం దొఱంగ
నీవు గడంగె? దిట్టి యవినీతులునుం గలరే? వ
ర్తి విధి సంపఁగా, నొరుల కాఁగఁగ వచ్చునె

వ. అనియె, నట్టియెడం గృష్ణద్వైపాయన
"గృష్ణుండు నీకుం గూర్చు, నీవుం బరమాప్తుం డైన సంజయు నతని
పాలికిం బుచ్చి తది లెస్స కార్యం బయ్యె; వీఁడును నిమ్మహానుభావు
మహనీయప్రభావం బున్నరూ పెఱుంగు, వీనిబుద్ధి విని యద్దేవు
నాశ్రయింపు. మతం డేకాగ్రచిత్తు లై యారాధించినవారికిఁ జేరువ
యగుఁ, గామక్రోధోపహతు లై తమతమ ధనంబులం దృప్తులు గాక
యన్యాయంబున వర్తించువారలకు దూరం బై యుండు, నెల్లభంగుల
నాతనిఁ జొచ్చి బ్రదుకు" మనినం, 'బ్రసాదం బట్లు సేయుదు' నని
విచిత్రవీర్యనందనుండు సూతనందనునితో "నవ్వాసుదేవు నామనిర్వచ
నంబు నాకుఁ దేటపడం దెలిపి, యతనిం బొందునుపాయం బుపదేశింపవే"
యని యడిగిన. 325

తే. "ఎల్ల యందును దా వసియించు, నెల్ల
యదియుఁ దనయందు వసియించు టంద్రు; వాసు
దేవుఁ డనుపేరి కర్థంబు దెల్ల; మింత
యెఱుఁగు జనులందుఁ దగ వసియించు శుభము. 326

తే. అతనిఁ బొందు నుపాయంబు నంతరంగ
నిగ్రహమ కాఁగ నార్యు లనుగ్రహింతు;
రోపి చిత్తవికారంబు లుడిపి యేక
బుద్ధిఁ గొలువఁ బ్రసన్నతఁ బొందు నతఁడు. 327

వ. నీవును బలుబుద్ధు లుడిగి గోవిందు నాశ్రయింపు" మనినం, బ్రజ్ఞాచక్షుం
డిట్లనియె. 328

క. "నాకు నయనేంద్రియము గతి
లేకుండుట కంతవగపు లే, దఖిలమనో
జ్ఞాకారుఁ డైన హరి నా
లోకింపం గానమికిఁ- గలుగు వగ పెపుడున్. 329

ఉ. ఆతనిఁ గన్నులారఁగ నహర్నిశముం గనుఁగొంచు నుండు వా
రేతప మాచరించిరొ! యుపేంద్రుని నాశ్రితవత్సలున్ విని
ర్ధూతకలంకు ధర్మనిరతుం గరుణాకరు సర్వలోకవి
ఖ్యాతుఁ బవిత్రమూ ర్తి శరణాగతరక్షకు నాశ్రయించెదన్" 330

వ. అని పలికి పరమశాంతుం డై పారాశర్యు నుద్దేశించి, "దేవా! యేను వాసుదేవుని శరణు సొచ్చి బ్రదుకువాఁడ" ననుచుఁ గృతాంజలి యగుటయు, వ్యాసమహాముని యు నాశీర్వాదంబు సేసి యంతర్హితుండయ్యెఁ; గౌరవేశ్వరుండును దుర్యోధనసంజయుల నిజనివాసంబులకుం బోవం బనిచి, తానును గాంధారియు నభ్యంతరమందిరంబున కరిగి యుచితవ్యాపారంబులం బ్రవర్తిల్లుచు నుండె; నని చెప్పిన విని పదంపడి పుట్టిన విశేషంబు లెట్టి వని యడిగిన. 331

శా. నిత్యానిత్యవివేకవైభవసమున్నిద్రాంతరంగస్ఫుట
ప్రత్యక్షా, పరమేశ, విశ్వజగదారాధ్యా, మహానంతచి
త్సత్యానందవిభుస్వభావమహితా, సంవిత్సమాధానదా
ర్గత్యవ్యాహతిసంప్రవర్తనవిదగ్ధశ్రీపదాంభోరుహా! 332

క. వ్యాసాదిమునిప్రోక్తమ
హాసందర్భాప్రమేయతారూఢగుణో
ల్లాసా! నైర్గుణ్యసము
ద్భాసిరహస్యానుభావ! భక్తాధీనా! 333

మాలిని. నమదనిమిషచూడానవ్యరత్నప్రభాసం
గమరుచిరపదాబ్జా! గర్వదుర్వారదైత్యో

ద్యమబహులత మోమార్తాండ దోఃక్రీడనప్ర
క్రమలలితవికాసా! గాఢభక్తిప్రకాశా! 334

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి
ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున
నుద్యోగపర్వంబునందుఁ
ద్వితీయాశ్వాసము.

శ్రీ మ దా ం ధ్ర మ హా భా ర త ము

ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము

క. శ్రీవాగ్విభవారోగ్య
ప్రావీణ్య ప్రాభవానుభావ మహిత సౌ
ఖ్యావహపదస్మరణ ! కరు
ణావాస కటాక్షకిరణ ! హరిహరనాథా. 1

-: శ్రీకృష్ణుని రాయబారము :-

సం. 5-70-1.

వ. దేవా ! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె. 2

తే. సంజయుఁడు దన్ను వీడ్కొని చనిన, ధర్మ
సుతుఁడు మఱునాఁడు దమ్ముల సుతుల నిష్ట
భృత్యవరులఁ గొలువునకుఁ బిలువఁ బనిచి,
యెల్ల వారలు వినుచుండ నిట్టు లనియె. 3

క. "మనము జనార్దనుపాలికిఁ
గౌరవసభకు నతనిఁ జను మని ప్రార్థిం
చిన మేలు, బంధుహితగురు
జనములతో రణము గాక సంప్రీతి యగున్." 4

వ. అని పలికి, వార లందఱు బలసి చనుదేర మాధవుమందిరంబున కరిగి, యతనిచేత సత్కృతుం డయి సమస్తపరిజనంబులుం బరివేష్టింప, నొక్క పార్శ్వంబునం బాంచాలియు సముచితపరివారపరివృత యై యుండ, నతండును దానును సుఖాసీనులై యుండి యతనితో నిట్లనియె. 5

క. "అపదఁ గడవం బెట్టఁగ,
నోపి శుభం బైనదాని నొడఁగూర్పను మా

కీపుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా !" 6

తే. సమయ మిది మిత్త్రికార్యంబు చక్కఁజేయ,
నీకతంబున నే మవినీతుఁ డైన
యాసుయోధనుతోడి పోరాట దక్కి,
యనుభవింతుము మాయంశ మగుధరిత్రి. 7.

వ. నీకు మేము ప్రద్యుమ్నాది కుమారుల తోడివారము, మమ్ము దురితం బులు వొరయకుండ నరసి రక్షింపు" మనవుడు వాసుదేవుండు "నీ పంచినయట్ల చేయంగలవాఁడ, నెయ్యది తలంపు సెప్పు" మనిన నజాత శత్రుండు, "నీవు కరినగరంబున కరిగి కౌరవులతోడం దగిన మాట లాడి తెఱంగు సేయవలయు" నని ప్రార్థించి యతని నియ్యకొలిపి యిట్లనియె. 8

సీ. "మా తండ్రి తలఁపును నాతనినందను
చందంబు నిన్న నా సంజయుండు
పలికిన పలుకులఁ దెలిసెఁగదా నీకు
వారి చిత్తముభంగి వాఁ డెఱుఁగుఁ,
బాలు పంపని యీక మేలిమాటలన మ
మ్మలుక దీర్చెదరు తా, రధిక దుష్క
రంబైన యాసమయం బేము పదుమూఁడు
వత్సరంబులు సల్పి వచ్చియుండఁ,

ఆ. గులముపాడి నడపఁ దలఁపఁడ, పతి సెడఁ
దలఁచెనేనిఁ గొడుకు వలచినట్టి
వాఁడు గాన యతని వక్రత మాన్పలేఁ;
డింతకంఱఁ గలదె యెడరు మాకు. 9

క. జననియు సమస్తబాంధవ
జనములుఁ బ్రియమంద, వారి శాంతులఁగాఁ జే
11

యను, నెమ్మిగ నొక్కటి యై
మనమున్ దెఱఁగేది యునికి మా పౌరుషమే. 10

క. ఇచ్చటి బంధులు నీవును
నచ్చెరువడి వినుచునుండ 'నై దూళ్కును మా
కిచ్చినను జాలు' నంటిని;
బొచ్చెము గా దింతవట్టు పూర్ణము సుమ్మీ ! 11

శా. ఆ దుర్యోధనుఁ డంతమాత్రయును జేయంజాలఁడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు; సిరి నా కేలందునే- గ్రాసవా
సో దైన్యంబులు వచ్చు నా యరయు నీ చుట్టాలకుం; గావునఁ
మోదం బందుట గల్గుఁ- గౌరవులు నేముం బొంది శ్రీ నొందినన్. 12

ఉ. అక్కట ! లాఁతులై నఁ బగ లైనను జంపఁగఁ గోరనేల ! యెం
డొక్కతెఱంగు లేదె ! యది యెప్పుడె ! బంధుసమ్మోజ్జనంబు లా
దిక్కున నున్నవారు గణుతింపక, సంపదకై వధించి దూ
ఱెక్కుట దోష మందుటను, నీ దురవస్థల కోర్వవచ్చునే !" 13

వ. అని పలికి పాండవాగ్రజుండు వెండియు. 14

ఆ. "ఉత్తరిధర్మ మింత కష్ట మగునె ! పర
ధర్మ మాచరింపఁ దగదటండ్రు,
గాన శస్త్రజీవికయ తగి యున్నది;
యైన వంశనాశ మనభిమతము. 15

వ. అదియునుం గాక, 16

ఆ. కలహ మగుడు లక్ష్మిఁ గావించుఁ; బ్రాణ హా
నియును జేయు నింత నిక్కువంబు;
పలువు రొకని కోడి పాఱుట- బల్లిదు
లనదచేతఁ జెడుటయును ఘటించు. 17

క. జయ మగు నోడుదు మను ని
శ్చయ మొక్కఁడు లేదు వినుము సమరమునఁ బరా
జయము మరణంబుకంటె హ్యా
దయపుటభేదనము సేయుఁ, దథ్యం బనఘా ! 18

క. కాన యవశ్యముఁ బెనఁకువ
గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్చి ధృతిం
బూని నడచు నెవ్వఁడు డెం
దానం జెయి వెట్టికొని యతఁడు నిద్రించున్. 19

ఆ. పగయ కలిగెనేనిఁ బా మున్న యింటిలో
నున్న యట్ల కాక, యూఁబడిల్లి
యుండు నెట్లు చిత్త మొక మాటుఁ గావున
వలవ దధిక దీర్ఘవైరవృత్తి. 20

చ. పగ యడఁగించు టెంతయు శుభం బది లెస్స; యడంగునే పగం
బగ ! వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే ! కడుం
దెగ మొదలెత్తి పోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా ! 21

ఉ. కావున శాంతిఁ బొందుటయ కర్జము, దా నది యట్టు లుండె; శ్రీ
గావలె నంచుఁ- బోరితము గామియుఁ గోరెద; మెల్ల సొమ్ములుం
బోవుటయుం గులక్షయము వుట్టుటయున్ వెలిగాఁగ, నొండుమై
నే విధి నైనఁ జక్కఁబడు టెంతయు నొప్పుఁ జుమీ ! జనార్దనా ! 22

చ. మనమునఁ బక్షపాతగతి నూఁదెస మానుము, ధర్మనీతివ
ర్తనములు రెండుదిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున, విదురాదిసజ్జనులబుద్ధికి రా, నుచితంబు తోఁడి మె
ల్పునఁ, బరుసందనంబునను భూపతు లెల్ల నెఱుంగ నాడుమీ. 23

చ. తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కిన యేని సైఁచి యొ
ప్పుగ నిలుమీ! గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
ట గొనమి యాఁసు యోధనుకడ్డ, నిలువన్, మన మెల్ల గారవం
బుగఁ గురువృద్ధుపల్కుఁ దలఁపుం జన నిచ్చిన, మెచ్చరే జనుల్! 24

మ. సుతువాఁడై వినయంబు నే కొనక, యే చొప్పుం దగం జెప్పకా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను, సంధింపంగ రాదంచు వే
గ తెగం బాఱకు; తెంపు సేయునెడ లోకం బెల్ల మెచ్చుం, బ్రకా
శిత ధర్మస్థితి నొంది, మా మనము నిశ్చింతంబు గాఁ జేయుమీ! 25

ఆ. ఇన్ని సంకటముల నిబ్బంగి నెంతయు
నొగులు చిత్తవృత్తి; నొవ్వు దీర్ప
వెజ్జ వీవకావె! వేయేల యేగతి
నడపఁ దలఁచి తదియ నాకుఁ బ్రియము:" 26

వ. అని చెప్పి తలంచికొని వెండియు నిట్లనియె. 27

క. "నీవు సుయోధనుపాలికిఁ
బోవఁగవలదనియు నొక్క బుద్ధి వొడమెడున్;
గోవింద! యతఁడు మంత్రులుఁ
గావరమునఁ జక్క వినరు కార్యవచనముల్. 28

తే. కుటిలమతు, లవినీతులు, క్రూరకర్మ-
లట్టి నీచులకడకు ని న్ననుపఁ జాల;
నీవు సంకటపడియెడు దేవపదవి
యైన నే నొల్ల; నొంటి యం దరుగు టుడుగు." 29

చ. అనవుడుఁ గృష్ణుఁ డిట్లనియె, "నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ, త
త్తనయుఁడ యేల? నీపలుకు పథ్యము, నీ తలఁ పే నెఱింగితి;
న్మానమున శంక దక్కుము, వినన్ వలతే విను- మేను నిక్క మ
ల్లిన, నచటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁడేనియున్?" 30

క. పనుపుము కౌరవసభ, కేఁ
జను చెట్లును మేల, యర్థసంసిద్ధి యగున్;
మన కొకటం బాపము రా
కునికికిఁ గతమైనపలుకు లొండెనుగలుగున్." 31

వ. అని పలికిన యుధిష్ఠిరుం డిట్లనియె. 32

ఆ. "మేలు గాక, నీకుఁ బోలినట్లయిన, నం
దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుండునట్లు గాఁగ నొడఁబాటుఁ గావింపు;
మెల్లభంగి మనకు నిదియ లెస్స. 33

క. మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు,
నెమ్మి యెఱుఁగు, దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు;
పొ- మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్." 34

-: శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్నయంబు సెప్పుట :-

సం. 5-71-1.

సీ. అనిన ముకుందుఁ డిట్లనియె, "సంజయుని మా
టలును నీ వన్న పల్కులును వింటి,
నీమది ధర్మైకనిష్ఠ మై నున్నది,
వైరంబు విడువరు వారు- ద్రోణ
భీష్ములు గల రని బిరుదు లై యున్నవా;
రగునె రాజన్యుల కడఁగి కుడువ!
నక్లేశవృత్తి రాజ్యము చవిగొన్న వా
రేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ!

తే. ధార్తరాష్ట్రులు సడికి నధర్మమునకు
సలుక రెన్నఁడు; విడువు దైన్యంబు, పాడువు

కయ్య; మరివర్గజయమునఁ గలుగు నిహ
రములుఁ జిరకీర్తియును పాండురాజతనయ! 35

మ. గురుభీష్మాదులు సూచుచుండ సభ మీకుం గీడు నాఁ డట్లు ము
ష్కరు లై చేసిరి, యంత సేసియును బశ్చాత్తాపముం బొందనో
వరు వా రెన్నఁడు; నట్టిచోటఁ గృపయున్ బంధుత్వముం దక్కు; మె
వ్వరుఁ గోపింపరె యాదురాత్మకుల గర్వక్రౌర్యముల్ సూచినన్? 36

వ. కపటపునెత్తంబు నెపంబుగా మిమ్ము వెడల నడుచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకునిసూతనందనులు పుయిలోట దక్కఁ కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింప వచ్చునే? వాని విని సమస్తజనంబులు ధృత రాష్ట్రుని నిందించుచు, మీరు బలవంతుల రయి యుండియు సత్యంబు వాటించి యూరకపోక సూచి యచ్చెరువాటుతో నుమ్మలించుచుండిరి; తిట్టు వాట్లం బోయెడువారు దైవోపహతులై మున్న చెడియుండు దురు; గావున వారలం జంపనుం జెఱుపనుం జులకన; క్రూరాత్ము లగు కౌరవు లెల్లవారికి వధ్యులు గాఁదగుదురు- నీకేల యవధ్యు లై రి; పాపాత్ముకు లగు హింసకులం బాముల నెట్లట్ల నిర్విచారంబుగా వధియిం చుట కర్తవ్యంబు; 37

క. మీతండ్రికి భీష్మునకుం
జేతోముద మొదవ భక్తి సేయన తగు నీ;
కా తలకు నేనుఁ జని వి
ఖ్యాతంబుగ నీదు వినయ మభివర్ణింతున్; 38

క. చెలులుం జుటలు దేశం
బులరాజులు వినఁగ, నీదు పుణ్యచరిత్రం
బులు, నీవు ధర్మమార్గము
దలఁచుటయుం దెలియఁ బలికెదం గురుసభలోన్. 39

వ. దానికి దుర్యోధనుం డియ్యకొనక తెఱంగు మాలిన మాటలాడుటయుఁ, దండ్రి యతని వారింప నేరమికిఁ దో డుపేఱుకుం డగుటయుఁ జూచి,

మీ తొల్లింటిపాట్లునుం దలంచి, యెల్లవారును వారిన గర్వ్యాంతు;
రింతియకాక మనకు నొండేమి వలయు, నా యోపినంతయుఁ బెక్కు-
భంగుల సంధియ కావింపం జూచెద; నవ్విధంబు సిద్ధించిన మేలు గాదె!
యట్లు గాక తక్కిన, నచ్చోటియుత్సాహంబు చందంబును, నందుఁ
జేయంగలవారి వర్తనంబులుఁ గొలందులు నెఱింగి, నీకు విజయం బగు
విధంబునం జనుదెంచెద; 40

తే. ఆసుయోధను ముక్కున నావి గలుగఁ
బుడమి నీ కీడుఁ- గావునఁ బోర కలుగు;
నేను కయ్యపు శకునంబు లెన్నియేనిఁ
గంటి, నీ వనుత్సాహివి గాఁగ వలదు : 41

వ. చతురంగబలంబుల నాయితంబు గావించుచు, దొరలం బురికొల్పి
కొనుచు, నాలస్యంబు లేక సమరంబునకు సన్నాహంబు సేయుచుండ
వలయు" నని పలికిన విని, వృకోదరుండు దామోదరున కిట్లనియె. 42

క. "సమరంబు గలుగు ననుచును
మము వెఱపింపంగ వలదు; మాధవ ! నీ వా
కుమతి యగు ధార్తరాష్ట్రుఁడు
శమించు కార్యంబు నడపు సౌజన్యమునన్." 43

వ. అని వెండియు, 44

శా. పాపాత్ముండు మదాంధుఁ డాతులువ నీ పం పెట్టునుం జేయఁగా
నోపం; డడ్డము సెప్ప రెవ్వరును; మానోద్రేకమున్ గర్వముం
గోపంబుం దనుఁ ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పో నిత్తురు; గాన ని న్నతఁడు జాలిం బెట్టెడుం జూడుమీ ! 45

ఉ. చొచ్చిన చోన చొచ్చి తెగఁ జూచెద నంచుఁ గడంగుచుండు; న
న్నెచ్చఁడు బాహుగర్వమున నీచు సుయోధనుఁ; డట్టివానితోఁ
బొచ్చెము లేక కూడి మనఁ బోవక పోవఁగ రాదు నాకు- వి
వ్వచ్చుఁడు రాచవారుఁ గురువంశము చేటున కోప కుండుటన్. 46

ఉ. పాండవకౌరవుల్ గలసి, పాలును నీరును బోలె నెమ్మిమై
నుండఁగ, దుష్టచేష్టల సుయోధనుఁ డింతలు సేసె; నాతఁ డొ
క్కింట కులత్రయంబునకుఁ గారణ మం ద్రడి దప్పఁ; దైన నీ
వొం డన నేల, యీ బిరుదు నోపిన యంతయుఁ దీర్పు నేర్పునన్; 47

చ. తన పొరి పోవునంతకు నుదగ్రతయుం గపటంబు మాన నే
ర్చునె ధృతరాష్ట్రసూనుఁడు ? యశోభరితం బగు భారతాన్వయం
బున కొకనింద వచ్చు ననుబుద్ధి దురాత్మున కేల కల్గు ? నా
యనమెయిఁ బోయి, హీనగతి నైన ఘటించిన నెంత యొప్పునో !" 48

వ. అని పలికి, "మాకును వారికిఁ బితామహుం డగు భీష్ముండు వినుచుండ
సుయోధనుతోడం గురుకులేశ్వరునాస్థానంబున నావచనంబులుగా
నిట్లనుము. 49

తే. అన్నదమ్ముల మై యుండి, యకట మనల
నొరులు దలయెత్తి చూడ, నొండొరుల తోడఁ
బెనఁగ నేటికి ? నీ నేల పెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోల దొక్కొ." 50

క. అని యెవ్విధమున నైనను
వనజోదర ! సంధి సేయ వలయుం దగ; నే
మును వారును గలయుట భూ
జనులకు నెల్లను హితంబు సౌఖ్యకరంబున్. 51

చ. అనుటయుఁ బిన్ననవ్వు నగి, యంబుజనాభుఁడు వల్కఁ, "నెన్నఁడున్
విననివి భీము పాలఁ గడు వింతల వింటిమి మాట; లగ్గి చ
ల్ల నగుట, భూరిభూధరము లాఘవ మొందుట గాదె ! యివ్విధం
బున నితఁ డిప్డు మార్దవముఁ బొందుట; యింకిటఁ జెప్ప నేటికిన్. 52

-: శ్రీకృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోడి యుద్ధమునకుఁ
బురికొల్పుట :-

సం. 5-73-1.

తే. అని సహోదరు లాజి నాయాసపడుట
కోర్వమియుఁ, గౌరవులఁ జంప నొల్లమియును
గలుగు నెయ్యంబుపెంపునఁ గరుణ నార్ద్రుఁ
డైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి. 53

వ. మురమర్దనుం డతనితో నిట్లనియె. 54

ఉ. "యుద్ధముమీఁదివేడ్కయు, మహోగ్రవిరోధుల నల్కఁ జేయుద
ర్వోద్ధతియుఁ, సుయోధనునియున్నతి సైఁపని యేపు, రాజ్య సం
సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం
బద్ధములైన వాక్యములు వల్కుట యొప్పునె కీచకాంతకా!" 55

వ. అని యంత నిలువక. 56

క. "వెఱ పెట్టిదియో యొన్నఁడు
నెఱుఁగని నీ యట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడఁ
గఱపినవా" రనుచు శౌరి గలకల నవ్వెన్. 57

వ. దానికి దరహసితవదనుం డగుచు భీమసేనుండు వసుదేవసూనున
ట్లనియె. 58

ఉ. "బంటుతనంబుమాటలకుఁ బాఱుకు, పాండునృపాలు పాలు గై
కోఁటయ చాలు నన్న నృపకుంజరు పల్కుల కడ్డమాడ రా
కుంట యెఱుంగవే? మను సుయోధనుచందముఁ జూపి 'యప్పు డే
మంటి యుపేంద్ర! న" న్నని రణాగ్రమునఁ నిను మూఁపలించెదన్. 59

•

క. నా కొలఁది విచారింపక
నీ కట్లనఁ దగునె? మిన్ను నేలయు నిమ్మ్రొఁ
గాక తిరుగంగఁ బడినం
బో, కే ముంజేతు లొడ్డి పోవఁగఁ ద్రోతున్." 60

ఉ. నావుడు, "నవ్వుటాల కనినం బవనాత్మ్మజ! యింత యేటికిం;
గేవల యోధవే! పరుల కిల్బిషముల్ దలపోయ కిమ్మ్రొయిన్
జావడ మైనఁ జూచి, యిది చందము గాదని యంటిఁ గాక, నీ
చేవయు లావు నీవు మును చేసిన భంగులు నే నెఱుంగనే;" 61

వ. అని చెప్పి మాధవుండు మఱియును. 62

ఉ. పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్ ననుఁగోరి యెంతయుం
బ్రార్థన సేసె; దాని కనురాగము వొందితి నేను; గాన యు
ద్ధార్థుల మైన మాకు నిను నాసపడం దగదే? యళంబు నా
నార్థములుఁ విరోధివిజయంబునఁ దక్కగ నొంటఁ గల్గునే? 63

వ. అనవుడు. 64

శా. "ఏమీ! పార్థుఁడు నీవు దండిమగ లై, యీవచ్చు కార్యవ్యసం
గ్రామక్షోభము బాహువర్పమునఁ దీర్పం, బెద్ద మిట్టెక్కి మి
మ్మే మెల్లఁ వెఱఁగంది చూచెదము గా, కీసారెకుం బోయి రా;
భీముం డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండు సూ పెం పఱున్" 65

వ. అని పలికి యివ్విధంబున గోపాలదేవు మేలంపు మెయివడి కార్యవచ
నంబులకుం దగం దానును దోడ్తో సరసం బాడుటయ కా మఱుమాట
లాడి, యంతటఁ దనివోవక బకమర్దనుం డతనితో నిట్లనియె. 66

ఉ. "కయ్యము గల్గినట్లయిన, గంధగజప్రకరంబు కుంభముల్
ద్రయ్యఁ, దురంగపంక్తులు ధరంబడఁ, దేరిగముల్ బడల్పడఁ
డయ్యమి కీవు వెక్కసపడఁ గదపండువు సేయఁ గోరునా
దయ్యము నెత్తికోలు దుది దాఁకుట గాదె భుజంగభంజనా!" 67

చ. అన విని దేవకీతనయుఁ డాతని కిట్లనుఁ, "జెప్పినంత కం
జెను మిగులంగఁ జేయుదు, గడిందిమగండవు! నిన్నుఁ దెప్పగాఁ
గొని పలుమాఱు నాపదలకుఁ భయ మొందక దుఃఖవార్ధి లీఁ
దిన మము నెల్ల నిక్కొఁ.అఁత దీర్చి సుఖాత్ములఁ జేయు పావనీ! 68

క. ఇదె పోయెదఁ, గౌరవ్యులఁ,
బదనికి రాఁ బలికి సంధి వాటించెద; నా
కది యొప్పదె! కాని తుదిం
గుదు రింతకు నీవ కావె గుణరత్ననిధీ!" 69

-: అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దన యభిప్రాయంబు సెప్పుట :-

సం. 5-76-1.

వ. అనిన వాసుదేవున కర్జునుం డిట్లనియె. 70

తే. "చెప్పఁగల యంతవట్టును జెప్పె నీ క
జాతశత్రుండు: వింటి వీ వాతెఱంగు;
మాకు నెల్లను బలుకంగ మాట లొండు
గలవె, యైనను జెప్పెదఁ గన్నయంత. 71

మ. 'ధృతరాష్ట్రుం డతిలోభదూషితుఁడు ధాత్రీభాగ మీ నేర్చునే?
సుతుఁడుం గష్టుఁడు సంధి యేల యగు' నంచుఁ మున్న కై వెక్కిన
ట్టితలం పచ్యుత నీకుఁ గల్గినది; గాండీవఁబు దివ్యాస్త్రసం
తతియుం బెట్టినయట్ల యుండ, మముఁ జింతం బాపరాదో కదే! 72

ఉ. నీ వొనరింపఁ బూనినపనిం గమలోదర! కీడు వుట్టునే!
కా వనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్నసం
భావనసేఁత పౌరుషముపద్ధతి; తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడఁ వలయుఁ; దథ్యము రెండును నీవినోదముల్. 78

ఉ. 'వేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యు' లన్న నె
వ్వారికిఁ బోలదే? సుజనవత్సల! నీ విటు లంట- వారు మ
మ్మీరస మెత్తి కీడ్పఁజిచి యింతలు సేసినదాన నీ మదిం
గూరిన నొవ్వుసొంపునను గోపము వెంపునఁ గాదె యారయన్. 74

ఉ. ఐనను జిత్తగింపు; ద్రుపదాత్మజ నా సభ నట్లు సేసినఁ,
దానికి సైఁప లెస్స యని దైన్యముఁ బొందుట కోర్చి, యమ్మెయిం
గాననభూమికిం జనుట కారుణికోత్తమ! నీ వెఱుంగవే!
కాన సహించి పాండవులఁ గౌరవులం దగఁ గూర్పు నేర్పునన్! 75

తే. అలవి యెఱుఁగక ధార్తరాష్ట్రులు గడంగి
మమ్ముఁ బఱిచిన పాటులు మానసమునఁ
జవుటఁ బెట్టిన విత్తుల చంద మొంది
యంకురింపక చెడిపోయె నంబుజాక్ష! 76

వ. అమ్మెఱుకల నెమ్మెయి నయినను. 77

క. ఒడఁబఱచి, మాకు వారికిఁ
బుడమి సగము గాఁగఁ జేసి పొంది పొసఁగి యుం
డెడునట్టి తెఱఁగు సేయుట
కడు మే; లది గౌరవము సుఖంబును జేయున్. 78

క. నీ కిట్టిది చిత్తమునకు
రాకున్నది యేని, 'వలదు రం, డిమ్మెయి మీ
రీ కార్యము సేయుం' డని
మా కానతి యిమ్ము కంసమర్దన! తెలియన్. 79

మ 'హిత మిబ్భంగిది మాకు, ధర్మము తెఱం గిట్లుతడు' నం చేను నీ
మతి బోధింప వలంతినే? హితము ధర్మంబుఁ విచారించి చూ
చి, తగుఁ బొమ్మని యేది పంచి- తది నిశ్చింతంబునం జేసి యు
న్నఁడఁ బొందం గలవారమై యునికిఁ- గృష్ణా! నేడుఁగా వచ్చెనే?" 80

వ. అనిన విని కృష్ణుండు విజయున కిట్లనియె. 81

చ. "వెరపున లావునం గృషికి వేయువిధంబుల మే లొనర్చినం
దొరకొనునే ఫలంబు- దటితోఁ దగువర్షము లేక యున్న; నె
ప్పరుసున లెస్స సేసినను బౌరుషముల్ ఫలియించు నెల్ల నా
దరణమునం బ్రసన్న మగు దైవముచేఁతన చూవె ఫల్గునా! 82

ఉ. కావున సంధికిం. బురుషకార మొనర్చెద నోపినంతయున్,
దైవముచేఁత యెట్లగునొ దాని నెఱుంగ; సుయోధనుండు సం
భావన సేసి పాలొసఁగుపాడియ కల్గిన, బాల్య మాదిగా
నేవిధినైన ననుం జెఱుప నింతలు పాపము లాచరించునే? 83

వ. అది యెల్ల నట్లుండె; నిచ్చట విరాటుపసుల బెట్టింప నీవు వోయిన
యప్పుడు భీష్ముండు దుర్యోధనుతోఁ జెప్పిన తెఱంగు- 84

ఉ. "వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగ రాదు, రా
లచ్చికి నై పెనంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే;
పెచ్చగుఁ గుందగుం, దొడరు నెల్ల విధంబుల కోర్చుటట్లుగా,
కిచ్చ దలంచి యొక్క మెయి నిత్తటిఁ బొందగు చేఁతయుం దగున్."
85

వ. అనియె, దాని కతం డుత్తరం బిచ్చినతెఱంగు- 86

ఆ. "మనకుఁ బాండురాజతనయవర్గమునకు
నెట్లు వొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను, సమరభంగికవిక్రమ
నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు." 87

వ. ఆని పలికె, నది యంతయుఁ బఠంపడి మన మెల్ల వింటిమ కాదె!
యామాటలఫలం బప్పుడ కనియు నా కష్టాత్ముండు వెండియుఁ దెలి
యండు. 83

తే. అతని గుణదోషములచంద మట్ల యుండె;
నాకు ధర్మజుబుద్ధిన నడవవలయు;
నిత్తెఱం గాచరింపంగ నేఁగి యచట
నెల్ల తెఱఁగును నేర్పడ నెఱిఁగి వత్తు." 89

చ. అనిన ముకుందుతో నకులుఁ డల్లన యిట్లను, "నీకు ధర్మజుం
డును బవనాత్మజుండు నరుఁడుం దగఁ జెప్పుట రిత్తగాదు; మా
మనము లరణ్యావాసమున మత్స్యమహీపతిపాల నున్న య
ద్దినములభంగి గావు; కృపఁ దీవ్రతఁ గుందినచంద మయ్యెడున్. 90

క. కడవఁగ నొకళ్లు పసరము
నడిచిన, నొక్కఁళులుఁ బెయ్య నడువ వలయునే?
చెడుతెరు వా కౌరవ్యుల
కడ నిలుచుంగాక, మనకుఁ గ్రౌర్యం బేలా? 91

సీ. గోగ్రహణంబునఁ గోలె నెంతయు మెత్తఁ
బడ కుండుదురె వారు పద్మనాభ!
నీ యనుగ్రహమున నెమ్మిమైఁ గూడిన
బలము లేడఁ జౌహిణులును, దొరలుఁ
బాంచాల యాదవ పాండ్య కేకయ మాత్స్య
లోక తెంపు నెఱుఁగక యున్న వారు,
భీమార్జునుల లావు పెంపును నీ సహా
యంబును గలుగుట కలుక రెట్లు?

ఆ. గురుఁడుఁ గృపుఁడు బాహ్లికుఁడు భీష్ముఁడును బుద్ధి
సెప్పి వారిఁ జక్కఁ జేయ రెట్లు?
కార్య మీవు సెప్పఁగా విదురుండు వి
నంగ, నెట్లు గా దనంగ వచ్చు? 92

వ. అట్లుం గాక, నీవు దమ పాలిం బోవుట ధార్తరాష్ట్రులాదరింపకుండ
వెఱువరే? నీ పోయి నప్పుడ యీ కార్యంబు చక్కనగు" ననిన, విని
సహదేవుండు వాసుదేవున కిట్లనియె. 93

ఉ. రక్కెసమాట లాడెదరు రాజును దమ్ములు, వానిలోన నీ
వొక్కటివైనఁ గా దనక యూఁకొనుచుండుట యంతకంచె మే
లక్కట యిట్లు వేఁడికొన నైనను బోయెదు వో- సుయోధనుం
డెక్కడ ? భూమిలోన సగ మిచ్చుట యెక్కడ ? దానవాంతకా ! 94

మ. తలఁపం గూడునె యింత లేసి దొర- లీదై న్యంబు ? చుట్టంబులుం
జెలులుం దిట్టరె; లాఁతిరాజులకు మెచ్చే యివ్విధం; బిట్టిదిం
గలదే ? వేఁడఁగ ధర్మజుం, డడుగఁ బోఁగాఁ గృష్ణుఁ, డార్తార్తరా
ష్ట్రులు పా లీక చలఁబునం బెనఁగ, నిట్లుం గూడు దీ పయ్యెనే? 95

ఉ. వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగ నాడి రేనియు,
న్వారలు దాని క్రియ్యకొనినఁ, బిను మచ్యుత ! యట్టి సంధి పెం
పారఁగ నేర్చునే ? యుచితమైనది కయ్యము; వంకమాట లే
నేరఁ, గురుప్రవీరుఁ భ నిశ్చయ మిట్టిద కాఁగఁ జెప్పుమీ ! 96

మ. 'తుది రాజ్యమ్ముసగమ్ము గొ- మ్మడవియందుం, బేరు వంచించియుం,
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగి రా పాలీక పోవచ్చునే !
యది గాదేఁ దెగి బంటవై యుఱుము; మాయల్ వన్ను నేర్పింకఁ జె
ల్లదు సూ నీ' కని యాసుయోధనుని యుల్లం బుచ్చిపో నాడుమీ." 97

మ. అనినన్ సాత్యకి ప్రీతుఁడై, "యితఁడు లెస్సై యుండఁ బల్కెం, ప్రయో
జనముం గల్గదు, గౌరవంబుఁ జెడు; దుశ్చారిత్రకుం డాసుయో
ధను బోధింపఁగఁ బోయినఁ; సరభసోత్సాహంబుమై నున్నవీ
రనికాయంబున కెల్లనుం బ్రియము సంగ్రామంబు మే లెమ్మెయిన్." 98

వ. అనిన విని రథికవరు లందఱు "సహదేవుం డింత యొప్ప నాడునే,
సాత్యకిపలుకు లిట్లుండునే తక్కటివి యెక్కడిమాటలు? పగవారి న
కొనం బోవుట యుచితంబఁట, కయ్యంబు కర్జంబు గాదఁట? భ
నీఁగికొనం దగదఁట" యనునిది మొదలుగా ననేకు లనేకప్ర
వీరాలాపంబులం గొలువెల్ల నొక్కప్రోఁతగాఁ జెలంగిన
సింగి ముట్టెఁ దదనంతరంబ.

-: ద్రౌపది గృష్ణునితో ధనమున్న పడిన భంగపాట్లు సెప్పుట :-

సం. 5-80-1.

తే. ధర్మనందను పలుకులు దనకు హృదయ
తాప మొనరింప, మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ
గనలి శౌరితో గద్గదకంఠి యగుచు. 100

ఉ. "అంతలు సేసి పోనడచి యక్కట! సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె? యిట్టి యూఁటఁ మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు; దా
నూతన యూతు లేనరకు నైదు సుయోధనుఁ డిచ్చునొక్కొ! యీ
గనలిల నొంచునెచ్చనెఱుఁతఁడు నొంచునె యన్నదమ్ములన్! 101

ఉ. ? దమ్ములపైఁ గలఁగల కుఁ దమ్ములపైఁ గల కూర్మి పేర్మి నీ
సక్కన! రాజ్యార్థమది సక్కన! రాజ్యముపాలు లేక తి
నుంగమి పెట్టరె? ఱటనెఱుంగమి పెట్టరె? చాల రైరి వీ
యి యాడరె లోఁజేయని యని యాడరె లోకమువారు కేశవా! 102

చి యక్కట! సంజయకులు రూపివలు రురమ్మకవలు రూపింపంగ నేలా? విచా
యూఁటఁ మదిం బ్రియమఁదము వా దము వాంధి; దము వారిం జూచినం దారు సా
గల నైదు సుయోధనుఁ దగ మర్దింపగ మపోరఁ దగ మర్దింపం దలంపేని శం
ఱుఁతఁడు నొంచునె యహ్మణులె హ్మణుని బ్రాహ్మణులె యేకీడైన సైరింపఁగన్? 103

ఉ. ఓట యొకింత యేనియు సుయోధనుచిత్తమునఁదు లేదు; నీ
మాటలఁ బోవునే దురభిమానమ యెక్కుడు పూనుఁగాక; య
చ్చోటున సంగరంబు లగు చొప్పులు వుట్టిన నైనఁ, బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ? పోదురొ కానల నుండ నచ్యుతా! 104

నిటు లంటి నా వలవ; దింకను నీవును రాజుఁ దమ్ములుం
చితంబు చూచి, మనకార్యము మీ సుజనత్వముం జెడం
భంగి సేయక, తగం గురువర్గముతోడి సంధి మీ
గునఁ వలచినట్టుల చేయుఁడు నేర్పు లేర్పడన్!" 105

వ. అని మఱియు నిట్లనియె. 106

ఉ. ఆఱడిఁ బోకయుఁ ఫలము నందుటయుం గని పల్క నేరమిఁ,
మాఱట నోరిదాన నయి, మాటలు చిత్తమునందు నిల్ప, కేఁ
గాఱులు ప్రేలెదఁ: వినుఁడు కర్జము నెగ్గును గాన; నల్క మై
వీఱిఁడి యైన మానిసికి వెండి వివేకము గల్గ నేర్చునే! 107

చ. వరమునఁ బుట్టితిఁ, భరతవంశముఁ జొచ్చితి; నందుఁ బాండుభూ
వరునకుఁ గోడలై తి; జనవంద్యులఁ బొందితి; నీతివిక్రమ
స్థిరు లగు పుత్రులం బడసితిఁ; సహజన్మ్మల ప్రాపు గాంచితిఁ;
సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కిన దాన నెంతయున్; 108

వ. అట్లుంగాక, 109

ఉ. నీవు సుభద్రకంఁ జేఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు; దిట్టి ననుఁ- బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబునందు శుచియై పెనుపొందిన వేణి వట్టి, యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ; గులాంగన నిట్లొనర్తురే? 110

ఉ ఆ సభ కేకవస్త్రయగు నట్టి ననుం గొనివచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం, బతు లసంభ్రములై తగుచేష్ట లేక నా
యాసలు మాని చిత్రముల యాకృతి నున్న యెడఁ, ముకుంద! వి
శ్వాసముతోడ నిఁ గొలువ వచ్చె మనం; బదియునుం దలంపవే! 111

చ. అరయమిఁ జేసి కోడ లన కప్పుడు దాసిగఁ జేసె; నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో? యటుగాక పాడి మై
వరవుడ మోపి చేయుదునొ వారికి? మాధవ! నిశ్చయింపుమా." 112

వ. అని య ట్లుగ్గడించి. 113

ఉ ద్రోవది బంధురం బయిన కొమ్ముడి గ్రమ్మున విడ్చి, వెండ్రుకల్
దా వలచేతఁ బూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాదరోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ, దిగ్గనలేచి యార్తయై. 114

వ గోవిందుముందటం బెట్టి యిట్లనియె, 115

క. "ఇవి దుస్సనేనుప్రేళ్లం
దవిలి, సగము ద్రెవ్విపోయి దక్కినయవి; కా
రవులకడఁ దీఱుమాటల
యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వీనిన్. 116

సీ. ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యా చేయి
దొలుతగాఁ, బోరిలో దుస్సనేను
తను వింత లింతలు దునియలై చెదరి రూ
పటి యున్నఁ గని యుడుకాఱుఁ గాక!
యలుపాలఁ బొనుపడు నట్టి చిచ్చే యిది;
పెనుగద వట్టిన భీమసేను
బాహుబలంబును, బాటించి గాండీవ
మను నొక వి ల్లెప్పుడును వహించు

ఆ కట్టి విక్రమంబుఁ గాల్పనే? యిట్లు బ
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజుపీనుంగుఁ గన్నారఁ
గానఁ బడయమైతిమేనిఁ గృష్ణ! 117

ఉ నెట్టన యిట్టి యల్క మది నిల్పితి- రక్కసతాల్మిఁ జిచ్ఛాడిం
గట్టినయట్లు పెద్దయును గాలము; దీనికి నాఱు పెన్నిడుం
బుట్టదు- దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తోఁ
బుట్టువు, తీవ్రతేజమునఁ బొల్చిన భర్తలుఁ గల్గ, నచ్యుతా!" 118

-: శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట :-

సం. 5-80-43.

వ. అనుచు నెలుంగు రాలుపడ నేడ్చిన యాజ్ఞసేనిం గృపాయత్త చిత్తుం
డయి నారాయణుం డూరార్చి కూర్చుండ నియమించి, కన్నీరు
దుడువను బెన్నెఱివేణి ముడువనుం దగువారి నియోగించి, యమ్మానిని
తో నిట్టనియె. 119

ఉ. "ముచ్చిర నేల నేఁ గలుగ ముద్దియ! నాకు వృకోదరుండు వి
వ్వచ్చుఁడుఁ దోడుగాఁగ, జనవంద్యుఁడు ధర్మసుతుండు పంప, నీ
మెచ్చుగ శత్రుసంఘయము మేకొని చేసెదఁ గాక- వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె? దురాత్ములు గౌరవు లుర్వి యిత్తురే? 120

క. లలనా! యుడుగుము; నీ యే
డ్పుల కొలదియె కురునృపాలపుత్రకళత్రం
బుల యేడ్పుఁ: లింక వానిం
గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్; 121

క. యమమహిషఘంటికానా
దము వినఁ గౌతూహలంబు దళుకొ త్తెడు చి
త్తములు గల కౌరవుల కి
ష్టము లగునే సంధికార్య శాంతవచనముల్! 122

క. మొదల విధినియతియును న
ట్టిద యందురు పెద్ద; లది ఘటింపక పో; దే
మదిఁ జూచి చెప్పినను ద
ప్పదు- మేరువు దిరిగెనేనిఁ శాంచాలసుతా! 123

తే. పూని పలికెద వినుము: రిపుక్షయంబుఁ
జేసి, యుజ్జ్వలపుణ్యలక్ష్మీసమేతు
లై న పాండుకుమారుల యధికవిభవ
మీవు సూచెదు, తడవు లే దిది నిజంబు;" 124

క. అని యూఱడిలఁగఁ బలికిన
వినీ, యంకిలి దేఱుచిత్తవృత్తి గలుగు నం
గన యేడ్పుడిగెం; దగ ఫ
ల్గునుఁ డిట్లని పలికె నపుడు గోవిందునితోన్. 125

తే. "పాండవులు ధార్తరాష్ట్రులుఁ బుండరీక
నేత్ర ! చుట్టరికంబున నీకు నొక్క
రూప; కావునఁ గోరి యే రూపు నందు
నుభయపక్షంబులకుఁ జేయు ముచిత హితము; 126

క. ధర్మార్థ సంగతంబుగ,
ధర్మతనయు చెప్పినట్ల తగఁ బల్కఁగ, నా
దుర్మతులు కౌరవులు స
త్కర్మమునకుఁ జొరక యున్న, దైవమ యెఱుఁగున్." 127

క. అన విని "కౌరవులకు మీ
కును హితముఁ బ్రియంబుఁ జేయఁ గోరియ, కుంతీ
తనయాగ్రజు పని ధృతరా
ష్ట్రుని కడకుం బోయెదను గడుం బ్రీతిమెయిన్." 128

క. అని పలికిన హరిధర్మవ
చనముల తెఱఁగున, కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి "యట్ల చేయుము
మననిశ్చయ మిదియ దీని మఱువకు మనఘా !" 129

వ. అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం జూచి, "నీ నక్షత్రంబు రోహిణిగదా ! యెల్లి రేవతి నీకుఁ జంద్రతారాబలంబులు గలవు; గమనంబునకు రేపకడయ మేలు; పయనం బగుట లెస్స" యని చెప్పిన, నప్పలుకుల కతండు సగౌరవంబుగా నియ్యకొనినం, బాండవాగ్రజుండు గొలువుం గలయం గనుంగొని యెల్లవారును విన 'నది యట్లకాక' యని పలికి, తదనంతరంబ తానును దమ్ములుఁ

శాంచాలియుఁ బరివారంబును నుచితప్రకారంబున నిజనివాసంబులకుం జనిరి; మఱునాఁ డరుణోదయంబునఁ గృష్ణుండు గాలోచిత కృత్యం బులు నిర్వర్తించి, సూర్యోపస్థి సేసి యగ్నిసమారాధనం శాచరించి, ధరణిసురులం బ్రణామ పూర్వకంబుగాఁ ప్రయాణదాన ప్రముఖ పూజా విశేషంబులం బ్రీతులం గావించి వారల యిచ్చు నాశీర్వాదంబులును సమంత్రాక్షతదూర్వాంకురాదులునుం గైకొని, యుచితప్రదేశంబున నుండి సాత్యకి రావించి. 130

క. "మనప్రజలోఁ గరిపురికిం
జనుదేరఁగ వలయువారి సవరణతో రం
డని యేర్పడ నియమింపు ప
యనమై యేతెమ్ము నీవు" నని తగ మటియున్. 131

వ. "దుర్యోధనుండు దుష్టాత్మకుం డతని మన్నించు మానుసులునుం గుటిల బుద్ధులు గావునఁ జక్రగదాద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు" నని చెప్పి పనిచి, సమయజ్ఞతం బొడసూపి నిలుచున్న దారుకుం జూచి తేరు పూన్ప నియోగించిన, నతండును మణిగణప్రభాపటలజటిలంబగు నరదంబు వన్ని. శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకంబు లనం బరగు తురంగంబులం బూన్చి, గరుడధ్వజం బెత్తి తెచ్చినం, దానునుం బయ నంపుఁ జందంబునఁ గట్టాయితంబై, జనంబుల చూడ్కులకుం బండు వగుచుఁ బుండరీకాతుండు మంగళతూర్యంబులు సెలంగఁ జామరంబు లుల్లసిల్ల రథం బెక్కిన యవసరంబున, యాదవపరివారంబుతో నరుగు దెంచిన సాత్యకిం దనరథం బెక్కించుకొని యాంగికంబులు గైకొనుచుఁ, బూర్ణకలశ పృషభాది భద్రపదార్థంబుల నవలోకించుచుఁ బుణ్యాంగనలు సేస లొలుకఁ జిత్తంబు ప్రసన్నతం బొంద వెడలునప్పుడు. 132

సీ. పాండవ యాదవ పాంచాల కేకయ
పాండ్య మాత్స్యాదులు భద్ర దంతి
హయ రథంబులతోడ నతి కుతూహలమున
వచ్చినఁ గనుఁగొని, వారి నెల్ల

సంభావనంబుల సంభాషణంబుల
నాదరించుచుఁ, దగ నల్లనల్ల
విభవంబు మెఱయంగ విడిదలపఱు పెల్లఁ
గడచిన యత్తటిఁ, గరము శుభము

ఆ. లైన శకునములకు నందఱుఁ బ్రియమంద
నరుగుచున్న యట్టి యవసరమున,
రథము రథముఁ గదియరా నిచ్చి ధర్మ నం
దనుఁడు నెమ్మి నిట్టు లనియె హరికి. 133

ఉ. "వచ్చె జనార్దనుం డనిన వార్తకుఁ బ్రాణము మేని కంతకున్
వచ్చిన, సేదఁ దేఱుఁ గురువంశపవిత్రచరిత్ర గొంతి; నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మా అని చెప్పి ప్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందినచిత్తము నొప్పి దీర్పుమీ! 134

చ. అడవికి నేఁగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన
ప్పుడు, దన మోము దైన్యమునఁ బొందెడు నశ్రులుఁ జూచి చూచి య
ట్లొడఁబడ డించి పోవలసె; నుమ్మలికమ్మున గొంతి యింతకుం
బడు గయి, పాలలోఁ బడిన బల్లి విధంబున నుండ కుండునే! 135

క. లక్కయిలు గాలినది మొద
లక్కట! మా తల్లి మాకునై నెవ్వగలోఁ
బెక్కడుమలఁ బడుచున్నది
దిక్కెవ్వరు లేనియట్లు దీనత్వమునన్. 136

క. ఏ ననుట గాఁగ, 'దుఃఖము
లైనవి దెగు సమయ మయ్యె' నని చెప్పుము; మీ
మేనత్త నూఱడింపుము; దా
నెప్పుడు నీవు గలవు తన కనుచుండున్." 137

ని చెప్పి వెండియు. 138

ఆ. "గురుఁడు బాహ్లికాది కురువృద్ధులును సుహృ
ద్బాంధవులు నశేషధరణి పతులుఁ
బ్రీతిఁ బొంద, నెవ్వరికి నేది దగుఁ-బ్రణా
మాది విధుల నడపు నాదు పలుకు. 139

క. పరమప్రియమున నాకై
పరిరంభణ సేసి గాఢబాంధవసాంద్రా
దరమున సంభావింపు వి
దురుతో మధ్యస్థుఁ డగు హితుం డతఁ డనఘా !"

వ. అనియెఁ దదనంతరంబ యర్జునుండు.

చ. "జనులు వినంగ రాజ్యమున సాము గొనం గలవార మన్న యీ
జనపతి కార్య నిశ్చయము సమ్మతి గైకొని చేసినఁ, బయో
ధనుఁడును దమ్ములుఁ సఖులు దానికి నేమును నియ్యకొందుఁ; మొం
డనిన సపుత్రమిత్రముగ నద్దెస నందఱ గ్రొచ్చి పాఁతుదున్." 142

మ. అవినఁ మెచ్చి వృకోదరుం, "డితఁడు కార్యం బింత దెల్లంబుగాఁ
బొనరం బల్కెనె" యంచుఁ బేరెలుఁగు సొంపుం బొంద, వక్త్రింబు పొ
ల్పున దర్పం బొలయంగ, నంగములునుం బొంగార, నుద్బృంహిత
ధ్వనిఁ బొల్చు మహోగ్ర సింధురముచందం బొంది యొప్పెం గడున్.

క. నకులసహదేవులును దా
నికి సంతసమంది "యిట్లు నెయ్యము కయ్యం
బొక తెఱఁగు సేసికొని తడ
యక ర" మ్మని పలికి రప్పు డచ్యుతుతోడన్. 144

-: శ్రీకృష్ణుఁడు నారదాది మహామునులం గని సంభాషించుట :-

సం. 5-81-58.

వ. ఇవ్విధంబునం బాండునందను లందఱును గోవిందునకు వలయు మాటలు
సెప్పి యతనిఁ గౌఁగిలించికొని యథోచితప్రకారంబుల వీడుకొని వల

గొని మగిడిరి, తక్కినవారలు నర్హాంబులగు తెఱంగుల నామంత్రితులై మరలిరి; మాధవుండును బ్రయాణసర్వసంభారనిర్వాహకులం గలయం గనుంగొని తగిన సల్లాపంబులు సేసి కరినగరంబు పెందెరువుఁ గైకొని దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంతసమీ చీనంబైన యానంబున మనం బలరం జనిచని, యొక్క యెడ నారద జమదగ్నికణ్వాదులగు మహామునులం గొందఱుం గని రథంబు డిగ్గి నమస్కరించి సభక్తితాత్పర్యంబునఁ గుశలం బడిగి "మీ రిక్కడకు విజయంచేయుటకుఁ గతం బేమి, సేయంగల పని యెయ్యది నా కానతిం" డనిన, నారాయణునకు నారదుం డిట్లనియె. 145

సీ "అనఘ పుణ్యాత్ముఁడ వగు నిన్నుఁ గనుగొనఁ,
గౌరవసభ నీవు గారవమునఁ
బలికెడి పలుకులభంగు లాకర్ణింప,
విదుర భీష్మాదులు విను తెఱంగు
నుత్తరం బిచ్చు కార్యోక్తులు నెఱుఁగంగ,
వేడుక వచ్చిరి వీర లెల్ల"
నని చెప్ప విని, "లెస్స యట్ల చేయుదురుగా"
కని హరి వల్కిన, నమ్మునీంద్రు

తే. లతని దీవించి "నీవు పొమ్మచటి, కేము
నరుగుదెంచెద" మని ప్రీతి ననుప నరిగి
యొక్క పుణ్యాశ్రమంబున నొద్ది యేట
విడిసి, దివసప్రవర్తనవిధుల నడిపి. 146

వ. కమలనాభుండు గదలిపోయి సూర్యాస్తమయ సమయంబునఁ గుశ స్థలంబు సేరం జను నప్పు, డందలివిప్రు లెదురు వచ్చి కాంచి నిజనివా సంబులకుం బిలిచినం, బ్రసన్నవదనుం డగుచు సమ్మర్దంబు వలవ దని పలికి, విశాలరమణీయంబైన బహిరంగణంబునం బటకుటీరప్రకరం బెత్తించి విడిసి, తగువారును దానును వారల గృహంబుల కరిగి యథ్యా

గతపూజలు గైకొని వారిని సంభావించి, విడిదలకుం జని సమయ
సముచితవృత్తిం బ్రవర్తిల్లుచుండె నంత నక్కడ. 147

తే. వార్త విని, యతుణమ కౌరవక్షితీశ్వ
రుండు గాంగేయ గురు విదురులను బుత్రు
సంజయునిఁ గర్ణ సైంధవ శకునిఁ బిలువఁ
బనిచి, తా నిట్టు లనియె నందనునితోడ. 118

వ. "కృష్ణుండు పాండవకార్యార్థంబుగా మనయొద్దకు వచ్చుచున్న
వాఁడు, నేఁడు కుశస్థలంబున విడిసె, రే పిందులకు వచ్చు నని వింటి,
మిట్టి యాశ్చర్యంబునుం గలదే! సర్వలోకాభిగమ్యుం డగు నమ్మహాను
భావునకు మన మభిగమ్యులమైతిమి! మన కింతకంటెను బెంపెయ్యది?
యతం డెవ్వరివలన సంతుష్టుండయ్యె వారికి శుభంబును, నెవ్వరిదెస
నాదరంబు సేసె వారికి నశుభంబు నగుట దప్పఁ; దతనికి వలయు పూజ
లాచరించుటకు సంవిధానంబు సేయుము; గృహాలంకరణాది మంగళ
ప్రకారంబు లనుష్ఠింప నియమింపుఁ; మతని చిత్తంబునకు నీవిభవంబును
దనమీఁది ప్రియంబునుం దోచునట్టి తెఱంగున సమస్తంబును సమ
కట్టుము." 149

క. అనిన ధృతరాష్ట్రి పలుకులు
గొనియాడిరి- సంతల్లి గురుఁడును భీష్మం
డును; నేఁగాకని దుర్యో
ధనుఁడుం బరిచారకప్రతతిఁ బిలిపించెన్. 150

వ. ఇట్లుచితపరివారంబు రావించి యతండు. 151

క. "అలుకుఁడు మృగమదమున, ప్రు
గ్గులు వెట్టుఁడు గప్పురమునఁ, గుంకుమమునఁ గో
డలు పూయుఁడు, మణిదామక
ములు గట్టుఁడు పెద్దకూటమున సొంపారన్.

వ. మఱియు నగరెల్లను శోభిల్ల నలంకారంబు సేయుండు. 153

క. పెనుపుం జతురత మెఱయఁగ
మనయింటను దుస్ససేను మందిరమున శో
భనశిల్పము లొనరింపుఁడు
చనుఁడు వృకస్థలమునందుఁ జప్పరము లిడన్. 154

[illegible]మప'' ట్టని పలికి, వాసుదేవుండు రేపకడయ
[illegible]యుంతయుం గావింపవలయు నని పనిచి, పురంబున
[illegible]ండని నియోగించి, వివిధగంధమహితమాల్యంబులు
మణిభూషణచిత్రాంబరంబులు సమకట్టను, సరసాన్న
స్వా [illegible] ద్రవ్యంబు లొడఁగూర్పను నేర్పరులగు తజ్ఞుల నియమించె;
నట్టియెడ నాంబికేయుండు విదురున కిట్లనియె 155

-: ధృతరాష్ట్రుండు విదురుతో శ్రీకృష్ణరాక నెప్పి సంతోషించుట :-

సం. 5-84-20.

క. ''వివిధ మణిమయ రథంబులు
జవనాశ్వంబులును భద్రసామజములు ర
త్నవిభూషణములు దాసీ
నివహంబులుఁ జాలఁ గృష్ణునికి నే నిత్తున్. 156

క. మనయింట సుయోధనుగృహ
మున దుశ్శాసను నికేతనమున- నెయ్యది యా
తని చూడ్కి- కించు- నది యె
ల్లను గౌరవ మొప్ప నీవలయు మన కనఘా!'' 157

[illegible]. అన విని యాతఁ డిట్లనియె, ''నంబుజనాభునిఁ బ్రీతుఁజేయు కం
[illegible]ను హితమైన కృత్య మొకటిం గలదే? యది మేలు; పాండునం
[illegible]లకు నైదయూళ్లు లుచితస్థితి నిచ్చట కోపమన్న యు
[illegible]యిటులోపు కల్మి ధరణీవర! యేమిట వచ్చెఁ జెప్పుమా. 153

ఉ. నీతలఁ పేను గంటి, నొకనేర్పున శౌరికి లంచ మిచ్చి సం
ప్రీతునిఁ జేసి కార్యగతి భేదము సేయఁగఁ జూచె; దింత బే
లై తి గదే! సుమేరుసదృశార్థముఁ జూచియుఁ బార్థుఁ బాయునే
యాతఁడు? క్రీడిభ క్తియును నచ్యుతుపెంపును నీ వెఱుంగవే! 159

తే. అర్జునుఁడు ప్రాణతుల్యుండు హరికి, నట్లు
గాన జలపూర్ణమంగళకలశమునకుఁ
బాద్యమునకును గుశలసంప్రశ్నమునకు
మిగుల నొండు జనార్దను మెచ్చుగాదు. 160

క. మనకడకు నేమికార్యం
బునకై యాతండు వచ్చెఁ, బూనికిమెయి నా
పని వంచింపక చేయుట
విను మతనికిఁ బ్రియము; దక్కు వేయును నేలా." 161

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె. 162

క. "అది విదురు చెప్పినట్టిద
తుదిఁ గృష్ణుఁడు పాండుసుతులతో వేఱుగునే!
పద నెఱుఁగ కీఁగి యిచ్చిన
బెదరి రనరె? యొచ్చె మైపఁ బిమ్మట ననరే? 163

ఆ. అతఁడు పూజనీయుఁ డగు నే నెఱుంగుదు;
నైన ధనము లీఁగి యనదతనము
వచ్చుఁ; బెచ్చుపెరిఁగి వైరులు గర్వింతు;
కేల పగ యడంగు నిట్టులైన;" 164

క. అనవుడు భీష్ముఁడు ధృతరా
ష్ట్రున కిట్లను "నీవునుం గొడుకు నేమే ని
చ్చిన నొకటి, యీఁగి లేకు
న్నను వేఱొక్కటి దలంచునా- కేశవుఁడున్?" 165

క. వినుమతఁడు సేయఁబూనిన
పని దప్పింపంగ రాదు, పాండవులం దే
ర్పను గృష్ణుఁడు వెరవుగఁ బో
చ్చిన మే; లాపురుషపనుపు సేయుము పుత్రా! 166

క. నారాయణుండు ధర్మా
ర్థారూఢము గాఁగఁ బలుకు; నది నీవును నీ
వారును గైకొని యెంతయు
గారవమునఁ జేయ నెల్ల కార్యంబు నగున్."" 167

క. అనుటయు సుయోధనుఁడు భీ
ష్మునఁ కిట్లనుఁ, బాండురాజసుతులకు నిమ్మే
దిని హరి సగపా లీఁ దగు
ననుఁ బో, యే నీను గాని యది యట్లుండెన్." 168

వ. వేఱొకకార్యంబు సేయం దలంచితి నది వినుము: పాండవులకు నేడు గడయు జనార్దనుం, డతనిం బట్టి బంధించిన ఱెక్కలు విఱిగిన పులుఁగులుంబోలె వారు నాకు విధేయు లగుదురు, పాంచాల యాదవాదులైన తదీయ బంధు మిత్రులు నా వశంబున వర్తిల్లుదురు, సమస్త దేశంబులు నేన యేలుదు, దీనికిం దగిన యుపాయ సహాయంబు లనువు సేసెద, నీ వింక నేమి సెప్పెదవు చెప్పు" మనిన విని యతిఘోరం బగు నవ్విచారంబునకు నమాత్యసహితంబుగా సంతప్తచిత్తుండై వైచిత్ర వీర్యుండు గొడుకున కిట్లనియె. 169

క. "ఓహో! యిట్లనుట జగ
ద్ద్రోహం: బిమ్మాట మఱువు; దూతత్వంబున్
మాహాత్మ్యంబును, ధర్మ్మ
త్వాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్! 170

క. ఈ కారణములు గల వను
నా కొలఁదియె వాసుదేవుఁ? డది గాకయుఁ, గీ
డే కురువంశమున కతని
రాక? యతం డేమి సేసెరా పాపాత్మా!" 171

వ. అని యదల్చె; నప్పుడు గాంగేయుం డాంబికేయున కిట్లను, "నీ కొడుకు ప్రాణగొడ్డం బైన కార్యంబు సేయం దలంచె, దా మోదరు నిట్లు సేయంజూచెనేనిం దానును దనవారును వినాశంబుఁ బొందుదు రింతియ; యిది సేసిరి సేయరైరి యమ్మహాత్మునెడ నీ యపరాధంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ములకాక" యని పలికి, యే నిట్టిదాని వినంజాల ననుచు మొగంబు గంటువెట్టుకొని దిగ్గన లేచిపోయె; ధృతరాష్ట్రుండును దుర్యోధనునితో "నిటువంటి కొఱగాములు మనంబునం దలంచినప్పుడు సేయం గలవాఁడవు గావున దీనం జేటు వచ్చు నుడుగు మయ్య" యని చెప్పి, యతనిం దక్కినవారినిం బోవం బనిచి తగిన వర్తనంబున నుండె; మఱునాఁడు. 172

సీ. కాలోచితము లగు కరణీయములు దీర్చి,
కమలనాభుఁడు రేపకడయ కదలి,
తనుఁ గుశస్థలవాసు లనుపరా, నందఱ
నాదరంబున నిల్పి యరుగునపుడు,
గజ్జంబులును బండ్లు గంధ మాల్యంబులు
ధృతరాష్ట్ర సుతుఁడు వుత్తేరఁ బ్రీతి
నెడ నెడఁ గొని వచ్చి యిచ్చిన, వాని నె
ల్లను వేడ్క ననుభవించిన విధంబు

తే. సలిపి, యనుభవ మొల్లక చనఁగ, నెదుర
బాహ్లిక ద్రోణ భీష్మాది బంధు మిత్ర
గణము సర్వభూపాలలోకంబుఁ గురుకు
మారవర్గంబుఁ బుత్తెంచె మనుజవిభుఁడు. 173

-: శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట :-

సం. 5-87-1.

వ. ఇట్లు దుర్యోధనుం డొక్కరుండు దక్క నెల్లవారిం దూర్యాదిశోభన పదార్థంబులు సమకట్టి ధృతరాష్ట్రుండు వనుప నెదుర్కొనిన, వాసుదేవుండు వారల నందఱ నయ్యెయ్యె తెఱంగుల సంభావించి, కృతవర్మ దమవాఁడు గావున నతనికి సవిశేషస్నేహంబు సేసి, యతండు నేరువ రా సమస్తజనంబులుం బరివేష్టింపం జని, తనరాకకు నలంకృతంబును ప్రమోద చాపల సుభగజనంబును నైనపురంబు సొచ్చి రాజమార్గంబున నరుగు నవసరంబున మౌక్తికమిళితంబులు బహుగంధలుళితంబులు నగు నటుత ప్రకరంబులును బుష్పనికరంబులునుం జల్లుచు సంతసిల్లుచు ప్రొక్కుచుఁ బొక్కుచు నిరుగెలంకుల రమ్యహర్మ్యంబులపై నిలిచి పొలిచి కనుంగొను నంగనాజనంబులు తమలోన 174

సీ. "ప్రాణంబుతోఁగూడ రక్కసిచన్నుల
పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె,
ప్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మె
చ్చించిన యాజగజెట్టి యితఁడె,
దుర్వృత్తుఁ డగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ
బట్టంబు గట్టిన ప్రభు వితండె,
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల
కోర్కి దీర్చిన రసికుం డితండె,

తే. వెన్నలును గోపికా చిత్తవృత్తములును
నరసి ముచ్చిల నేర్చిన హరి యితుండె,
శ్రుతిశిరోభాగములఁ దనసుభగచరణ
సరసిజామోదమును గూర్చు చతురుఁ డీతఁడె" 175

వ. అనుచు సతికుతూహలంబున నవలోకింప, నాబాలవృద్ధంబగు పౌరలోకం బాలోకనకౌతుకంబునఁ దనరథంబు గదిసిన జడియు వేత్రహస్తుల

వారించుచు నారాయణుండు సమ్మర్దమందగమనంబునం జని, మణి తోరణ సుందరంబగు రాజమందిర ద్వారంబు ప్రవేశించి, కక్ష్యాంతరం బులు గడచి యేనుంగుమొగసాలఁ జొచ్చి యరదంబు డిగ్గి యల్లన నడచునప్పు డంతకు మున్న యరిగి భీష్మద్రోణప్రముఖులగు తగువారలు ధృతరాష్ట్రునిం బొదువ నతండుఁ బ్రత్యుత్థానంబుసేసి, విదురసంజయ సహితంబుగా నెదురొక్కనం జేరి, 176

ఆ. అతనిఁ గౌఁగిలించి, యచ్చటఁ గల విదు
రాది శిష్టజనుల నాదరార్ద్ర
బంధుదృష్టిఁ జూచి, పరిరంభసంభావ
నము లొనర్చి శౌరి ప్రమద మెసఁగ 177

వ. వార లందఱుకును సాత్యకిని దగిన సమాచారంబులు నడపం బనిచె; నట మున్న ధృతరాష్ట్రుని పనువునం దెచ్చిపెట్టిన నచ్చోటన యున్న యున్నత కనకాసనంబున నతం డునుప నాసీనుం డయ్యె; నవ్వాసుదేవునకు విహి తానుష్ఠానపరాయణు లగు నగరిపురోహితులు రాజానుమతంబున నర్ఘ్యపాద్యమధుపర్కాద్యుపచారంబు లాచరించి, యతని తమ్మునిం నర్హాపీఠంబున నునిచి యర్చించిరి; నరనాథుండును దొరలును నిజోచితాస నంబుల నుండిరి; కొలువెల్లను సూర్యోదయ సనుయంబునఁ గమలాకరంబు విధంబున వికసించియుండె; నయ్యవసరంబునఁ గృష్ణుండు ధర్మనంద ను వచనంబులుగా నాంబికేయునకుం దగువారలకుం బ్రణామ పరిరంభణ ప్రముఖ సముచిత సంభావనంబులు వలికి సంభాషణంబులకుం జొచ్చి.

క. రాజునకుఁ దియ్య మెసఁగెడు
పూజావచనముల, నెయ్యపుంబలుకులఁ బే
రోజమెయి బంధుమిత్ర్తి స
మాజములకు, మేలములఁ గుమారులకుఁ దగన్. 179

వ. ఇంపు పుట్టించుచుఁ గొండొకసేపు నిలిచి పుండరీకాక్షుండు 'విదురు సద నంబునకుం జనియెద, మటియుఁ బోవలయు నెడలకుం బోయి వచ్చెద'

నని పలికి యాంబికేయు ననుమతి వడసి యరుగ, విదురుండు ససంభ్ర మంబునం గడచి చని మంగళోపచారసహితంబుగా నెదుర్కొని భక్తి వినయస్నేహానందంబులఁ గందళితుం డగుచు గోవిందునకు దేవోప చారంబుల ననేకప్రకారంబుల నర్చన లిచ్చి, కౌంతేయుల కుశలం బడిగిన, నతనికి వారలవృత్తాంతంబు సమస్తంబును సవిస్తరంబుగాఁ జెప్పిన యనంతరంబ. 180

క. ముదమునఁ గృష్ణుఁడు గుంతీ
సదనమునకుఁ జనియెఁ; నప్రడు సమ్మదమున న
వ్విదురుం డోగిర మొనరిం
చెద నని తన్నడుగ నట్ల చేయుం డనుచున్. 181

వ. చని కాంచిన, నద్దేవియు నతని తోడునీడయుంబోని తన కొడుకులం దలంచి యడలు పుట్టిన, నమ్మాధవు మెడ వట్టికొని యెలుంగెత్తి యేడ్చిన, నతండు సంబోధించి యూరార్పు నెట్టకేలకు నుడిగి, యాతనికి నాసనవిన్యాసనాద్యుపచారంబులు సేయించి, తత్సమీపంబున నుచిత పీఠంబునం గూర్చుండి గద్గదకంఠంబుతో నిట్లనియె. 182

సీ. "నీళిఁ బెరుగుఁట నీతిమంతులుఁ బుణ్య
పరులు శూరులు గదా పాండుసుతులు;
సుఖవృత్తిఁ బెక్కండ్రు సూరెలఁ గొలువ నుం
డెడువార, లిడుములఁ బడుచు నిర్జ
నంబైన కానలోనన యెట్లు నిలిచిరి;
ననుఁ బెట్టి నాయెద గొనుచుఁ జనిరి;
యేను వడ్డింపంగ నింపారఁ గుడిచి మె
త్తనిసెజ్జ నిద్రించి వినుతభద్ర

తే. గానకరిబృంహితముల మేల్కాంచునట్టి
వారు కందమూలంబు లాహారములుగఁ
బొదలఁ బుట్టలఁ బడియుండి పులుఁగు మెకము
లఱువ మేల్కను చుండిరే? యక్కటకట! 183

ఆ. తండ్రిలేని ప్రజలు, దల్లిని బాసి పె
ద్దయును గాల మివ్విధమునఁ బడిరి-
భంగపాటు దుఃఖపాటును సంకట
పాటు గలిగె విరటుపాలఁ బిదప!'' 184

వ. అని వెండియు. 185

ఉ. ''దానదయాపరుం డయిన ధర్మ్మతనూభవు నేమ మెట్లు? పం
చాననవిక్రముం డగు బకారికి భద్రమె? యస్త్రశస్త్రవి
ద్యానిపుణుండు క్రీడి సుఖియా? వినయాభరణుల్ గవల్ సమా
ధానసమేతులే? యకట! ద్రౌపది సాధ్వి సుఖంబె దానికిన్?. 186

చ. కొడుకులకంచె నయ్యనుఁగుఁగోడలి కెక్కుడు గూర్తుఁ; గోడలుం
గొడుకులు సేయుభక్తి కట కోటిమడుంగులు భక్తి నాకు నె
ప్పుడుఁ దగఁ జేయుచుండు; నది పుణ్యచరిత్ర కులాగ్రగణ్య క్రొ
త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్! 187

తే. నాఁడు ద్రౌపది పడిన బన్నముల సూడ
నోర్చినప్పుడ యెంతకు నోర్వఁ జెపుమ!
యంత గడచిన దుఃఖంబు లనుభవింపఁ
గలవె లోకంబు వారికిఁ గమలనాభ! 188

వ. అట్టియెడ. 189

క. విదురుం డొక్కఁడు దక్కఁగ
సదస్యు లెవ్వరును ధర్మసంక్షయ మిది గూ
డదు నార; యతని శీలమ
కుదు రీలోకమున కింతకుం దలఁపంగన్!'' 190

వ. అని యివ్విధంబునఁ గృష్ణతోడఁ దనయుమ్మలికంబు లన్నియుఁ ద్రవ్వి
కొని శోకంబు వెల్లిగొనఁ గొండొక దిగం బాఱెడు చిత్తంబుతో మటీయు
నిట్లనియె. 191

క. ఇది యెల్లను నొకతల, యీ
పదుమూఁడేఁడులును నాకు బావకొడుకుచే
నదయ మగు కూడు గుడుచుట
యది యొకతల యయ్యె; నేమి యనఁ గల దనఘా ! 192

క. తన్నుఁ దనతమ్ములను నా
కన్నగొడుకులట్ల తలఁతుఁ గాని, విభేదం
బెన్నఁడు నామది లేమికి
వెన్నుఁడ ! దైవంబు సాఁకి ! వినుము పలికెదన్. 193

క. ఇది నిక్కంబగు నేనియుఁ
దుది నీవుం బాండవులును దురితరహితులై
ముద మందఁ జూడఁ గనియెద;
నది దీనికి మందు సువ్వె యంబుజనాభా ! 194

సీ. బావ యొప్పం డను పలుకుల నే మగు,
నాతనికొడుకుఁ గీడాడ నేల,
కురువృద్ధుఁ డగు బాహ్లికుని దూఱ నేటికి,
భీష్మునివైఁ బ్రయి వెట్ట నగునె,
యిట్టిక్రూరుల యింటి కిచ్చిన మనవారి
నందుఁ గా, కట్లు దా ననుట మేలె
యర్జును పుట్టిన యప్పుడు "వీఁడు లో
కములెల్ల గెల్చు పొగ డ్తల మొగులు

తే. ముట్టునట్టిద యగు, రణమున జయించుఁ
గౌరవుల, సోదరులుఁ దాను భూరిరాజ్య
గౌరవముఁ బొందు" నని యశరీరవాణి
వలికె, నది దిట్టువడుఁ గాక వలయునేని. 195

వ. ధర్మంబు గలుగునే నది నిక్కం బయ్యెడు; దాని కెల్లను నిర్వాహకుం
డవు నీవు గలవు గాదె ! నీ మన్నించు నెచ్చెలులకుం జెప్పెడు మాటలు
గలవు విను, మయ్యుధిష్ఠిరునితో నిట్లనుము : 196

క. వేఁడికొని కృపణులై కను
పోడిమి యది యేల ? రాజపుత్రులు దమలై
వాఁడిమి దప్పిన, నిప్పులు
వేఁడిమి నెడినట్లు; జనులు విని యులుకుదు రే. 197

వ. భీమార్జునుల కిట్లని చెప్పుము. 198

ఆ. కొడుకుఁ గాంచు రాచకూఁతు రెద్దానికి
నట్టిపనికి నుచితమైన సమయ
మొదవెఁ; దడయు టింక నొప్పదు; జనములు
నట్లుగాని పురుషు లనరు మిమ్ము. 199

క, భుజబలమున జీవించుట
నిజధర్మము, మెత్తఁబడుట నింద్యము; మాద్రీ
ప్రజలకుఁ జెప్పుము; ద్రుపదా
త్మజఁ గార్యం బడుగు మనుము తగ నందఱితోన్. 200

చ. అలిగిన భీమఫల్గునుల కడ్డము లేమి యొఱుంగు; దంతలం
తలు వడి వాని నీఁగ వలదా ? విను మా పని కెల్లఁ బాండుపు
త్రులె కలవారు; నీ కెటులు దోఁచిన నట్లులు సేయువారు గా
కలఘువిచార ! నాయలఁత యార్పుము నఁ గడతేర్పు మెమ్మెయిన్"

వ. అనినఁ గృష్ణుండు గొంతి ననునయించి యిట్లనియె. 202

-: శ్రీ కృష్ణుఁడు గుంతీదేవి నూఱడించుట :-

సం. 5-88-89.

చ. "సుగుణపు, పుట్టినింటికిని చొచ్చినయింటికిఁ దేజ మెక్కఁగాఁ
దగు చరితంబునన్ నడచుధన్యవు, ధీరవు; దేవి నీ వెడ
న్వగ లడఁగింపకున్న భువనంబుల నింకిట నెవ్వ రోర్చువా
రు; గలఁక దక్కు, మీ హృదయరోగము లన్నియుఁ బుచ్చి వైచెదన్.

క. తనయులు గోడలు సేమం
బున నున్నా; రధికభక్తిపూర్వముగా దం
డనమస్కారంబులు నీ
కొనరించిరి, కౌఁగిలించి రుల్లములఁ దగన్. 204

క. నీ కొడుకు లొండుసుఖములు
సేకొన, రవ్వీరసుఖమ చిత్తములఁ గరం
బాకాంక్షింతు; రలంతులఁ
బోక గలుగు నెట్టు లల్పబుద్ధులె వారల్! 205

క. ఉత్సాహంబున శత్రుకు
లోత్సాదన విధి యొనర్చి, యున్నతసామ్రా
జ్యోత్సవము నొందుపుత్రుల
నుత్సుకతం జూచు గాక; యూఱడు మింకన్" 206

చ. అన విని మోము విచ్చుచు మురారికి నిట్లనుఁ గుంతి, పాండునం
దనులకుఁ దండ్రియుఁ గురువు దైవము నారయ నీవ కావె! నీ
మనమున ధర్మమున్ హితము మంచిగఁ జూచి విధించినట్ల చే
సి నెగడువారు గాక; నినుఁ జేరిన నాపద లొంద నేర్చునే! 207

క. వారలక యేల మాధవ!
కౌరవులకు మఱియు నీజగంబుల కెల్లం
జేరుగడ నీవ; నీపలు
కారయ వేదంబ కాదె యఖిలంబునకున్;" 208

వ. అనినం బ్రసన్నవదనుం డగుచు నద్దేవి గారవించి యామంత్రణంబు సేసి తదావాసంబు వెలువడి, తనరాకకు నలంకృతం బైన దుర్యోధను మందిరంబునకుఁ గృతవర్మ సాత్యకి సమేతుండయి పోవు గోవిందునిం గని, తదీయ ద్వారపాలకులు సంభ్రమంబునం బఱచి యతని కెఱిఁగించి తదనుమతంబునం బఱతెంచి యెదురొక్కని కక్ష్యాంతరంబుల సందడి నెడ

గలుగ జడియుచు వినయంబునం దోడ్కొని చనిరి. యమ్మనుజవిభుండు, కైలాసశిఖరాకారంబగు సౌధంబున శాఖ్లికభీష్మద్రోణ ప్రభృతులు గర్ణశకుని సైంధవాదులును దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును మఱియు ననేక దేశాధీశులునుం బరివేష్టింపఁ బేరోలగంబున సింహాస నాసీనుండై యున్నయెడకుం జనునప్పు, డాసుయోధనుండు సపరివా రంబుగాఁ బ్రత్యుత్థానంబు సేయం జేర నరిగి యతనికిం దగువారలకు నాలింగనాద్యుపచారంబులు దానుం దమ్ముండును నాచరించి, 209

క. అతఁ డునుపఁగ, గనకమయో
న్నతపర్యంకంబునందు నారాయణుఁ డూ
ర్జితమహిమనుండి యభ్య
ర్చితుఁ డయ్యెఁ- దగంగ నతనిచే సత్కృతులన్. 210

-: శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట :-

సం. 5-89-1.

వ. సాత్యకియును సముచితప్రకారంబునం బూజితుం డయ్యెఁ; దదనంత రంబు నిజాసవాసీను లయి తనమొగంబునం జూడ్కి నిలిపి యున్న దుర్యోధనాదులతో మాధవుండు మధురసంభాషణంబులు సేయుచుండె నట్టియెడ. 211

తే. సముచితంబుగఁ గూరలచంద ముగ్గ
డించి, కుడుపుతెఱంగు పుట్టించి పలుకు
నా సుయోధనుతోఁ, గృష్ణుఁ డచటఁ దాను
గుడువ నొల్లక యునికి యేర్పడఁగఁ జెప్పె. 212

వ. చెప్పిన విని, దుర్యోధనుండు సూర్యసూనువదనం బవలోకించి యల్లన యిట్లనియె. 213

క. "హరిపలికినవిధ మెంతయు
నెరవై యున్నయది; వించె- యిమ్మాటతెఱం
గరయుదము తొలుత, నీ పెను
పరిచందం బెల్ల నెఱుకపడియెడుఁ బిదపన్." 214

వ. అని పలికి యచ్యుతున కిట్లనియె. 215

తే. "వలయు నన్నపానంబులు పలుదెఱఁగుల
నేర్చు విధముల నే మొడఁగూర్చి వేడ్క
నున్న, నీ వుపయోగింప నొల్లకునికి
బాంధవమునకు నీతికి బాహిరంబు. 216

క. కౌరవులకుఁ బాండవులకు
నారయ నీ వొక్కరూప, యసదృశధర్మా
చారుండవు, రాజునకుం
గూరుతు; కతమేమి యిట్లగుటకుం జెపుమా." 217

క. అనుడు, నుపేంద్రుఁడు మనుజే
ంద్రుని కిట్లను, "దూత లెందుఁ దొలిదొలి గుడువం
గొనఁ గట్టఁ దొడఁగుదురె? వ
చ్చిన కార్యము దీర్చి పిదపఁ జేయుదు రెల్లన్." 218

వ. అనిన గాంధారీనందనుండు దేవకీనందనున కిట్లనియె. 219

ఆ. "వేగపడుట మేలె, వినుము కార్యము దీఱుఁ-
దీఱకుండు; దాని తెఱఁగు దగిన
యప్పు డాడ రాదె? యిప్పుడు ముకుఁద్రాటఁ
గాలు గ్రువ్వ నేల కమలనాభ! 220

వ. నీవు వచ్చినవాఁడవు మాయింటఁ గుడిచి కూర్చుండి యెల్లపనులుం
జెప్పుట యెప్పుఁగాక, కుడువ నొల్ల ననం దగునె? దీనికిం గారణంబు

నా యెఱింగిన యది లేదు, విచారింపక పలికి" తనిన, మందరధరుండు మందస్మితంబుతో నందఱం గలయం గనుంగొని, ధార్తరాష్ట్రికరంబు గజంబు పల్లవం బల్లన తెమల్చు లీలం గేల నమర్చి, "యిట్టిమాటలు తేట పఱుపవలయునేని విను" యతని కిట్లనియె. 221

చ. "ప్రియ మెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు; ద
ర్మ్యయ నయహీనతం, దమకు నాపదయైనెడ, నిట్టునట్టు నే
మియు ననలేని కూ డదియు మేవడియై చను; నీవు మాదెసం
బ్రియుఁడవు గావు మాకు ధృతి పెంపఱ నాపద లే దొకింతయున్. 222

వ. అట్లుంగాక. 223

క. పగవారియింటఁ గుడిచిన,
నగుఁ దమ కనుమాన; మమృత మైనను దారుం
బగతురకుఁ గుడువఁ బెట్టఁగఁ
దగ; దొడళుల కెప్పు డెవ్విధము వాటిలునో. 224

వ. ఏను బగతుండనె యంచేని. 225

క. అలుగుదు పాండవులకు, వా
రలు నాకుం బ్రాణములు; ధరావల్లభ! యి
ట్టలముగఁ దమ్ప్రాణములకు
నలుగు జనులు పగతు రగుట యనుమానంబే? 226

ఆ. కారణంబు లేక కౌంతేయులకు శాల్య
మాదిగాఁగఁ గీడె యాచరింతు;
పుణ్యపరులు దోడఁబుట్టువు లార్యులు;
వైర మెత్తఁ దగునె వారితోడ! 227

వ. ఇట్లున్న మీయందఱ యన్నంబులు దుష్టాన్నంబులు; విదురుం డొక్కని యన్నంబు భోక్తవ్యం బని నిశ్చయించితిఁ; గావున నందుఁ బోయెద"

నని చెప్పి యజ్ఞనపతి యనుమతి నేయఁ జనునప్పుడు, తోడిన బాహ్లిక భీష్మాది కారవులును గుంభసంభవ ప్రముఖులైన మాన్యులును జని మాధవుతోడ "మాయిండ్ల నెల్లను గానిక లాయితంబులు నేసికొని నీవు విజయంచేయుటకు నెదురుచూచుచున్నవార" మని పల్కి ప్రార్థించిన, 'నే నన్నిచోట్లకు వచ్చినవాఁడన, యందఱ యర్చనలుం గైకొంటిన, మీరు నిలువుం' డని వారల నిలిపి, విదురుగృహంబునకుం బోయిన, 228

సీ. సంభ్రమస్నేహనిశ్చలభక్తియుక్తిఁ బ
విత్రమజ్ఞనము గావించి, విదురుఁ
డెల్ల వంటకమును నేర్పడ బోనాలు
వేర్పింప, నెంతయుఁ బ్రీతి ముంద
రోజమై బ్రాహ్మణభోజనం బొనరించి,
సపరివారముగ విశాలరమ్య
పూతస్థలంబునఁ బుండరీకాంతుండు
దమ్ముండుఁ దాను నుత్సవ మెలర్ప,

తే. సరసరంజకమహనీయసంప్రయోగ
మగు చతుర్విధహృద్యాన్న మారగించె;
లలితసంభావనామంజులంబు లైన
పలుకు లెడనెడ విదురున కెలమి యొసఁగ. 229

వ అతండును. 230

క. "గోవింద ! సంభ్రమము సం
భావింపుము, మాకు నిదియ పరమధనం; బొం
డేనిధమున నీ కర్చన
గావింపం జాలువాఁడు గలఁడే యెందున్." 231

వ. అని మఱియు నత్యంతవినయవాక్యముల నారాధించు చుండె; నిట్లు కృతాహారుండైన హరికిఁ జందనచర్చాద్యుపచారంబు లాచరించి, యవ్వి

దురుండు కృతార్థుండై యుండఁ, గవి గాయక ప్రముఖ నిఖిల విద్వజ్జనం
బులు పాఠక వాంశిక వైణికాది వినోదపాత్రంబులు నప్పరమేశ్వరుం
గానవచ్చి ప్రొద్దు వుచ్చి యభిమతార్థంబు వడసి చనిరి; రాత్రి యగు
టయుం దగిన యభ్యంతరమందిరంబున హంసతూలికాతల్పంబున
భుజంగతల్పు నునిచి యతనికడ నుచితాసనంబున నుండి, 232

ఆ. విదురుఁ డిట్టు లనియె, "నిది యొక కార్యంబు
గాఁగఁ బూని యిందు రాఁగఁ దగునె!
దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ
మాట వినునె-దురభిమాన ఘనుఁడు; 233

క. వచ్చిన సైన్యంబులఁ గని
పెచ్చు వెరిఁగినాఁడు, ద్రోణభీష్ములలావుల్
నచ్చియుఁ, గర్ణుం డొక్కఁడ
యిచ్చుఁ దనకు విజయ మనియు నెంతయుఁ బొంగున్. 234

వ. నీ విట వచ్చుట వినినయప్పుడు ధార్తరాష్ట్రులందఱుం గూడం బాటి
తమలో నిశ్చయించిన తెఱంగు- నీ శాసనం బుల్లంఘింపం గలవారు,
పాండునందనులకు నేమియు నీ కుండువారు-దార యీధాత్రియంతయు
బీఱువోవకుండ నేలువారు; వారిం గూడినరాజు లెల్లను దిగ్విజయంబు
నాఁడు పాండవులచేత భంగపడినవారు గావునఁ 'గర్ణుతో నేకార్థులమై
చత్తము గెలుతు మింతియ కాని యొండు లే' దని నిశ్చయించుకొని
యున్నవా; రట్లగుటంజేసి దుర్యోధనుండు గండు మిగిలియున్నవాఁడు;
సంధి గానేరదు; వారల కందఱకు నిది ప్రాప్తకాలంబై యున్నయది;
యెట్లును నుడుగ నేర్చినవారు గా; రిట్లు ద మ్మెఱుంగని దుష్టాత్ముల
నడుమం గూర్చుండుటయు, నవ్వెంగలివిత్తు లఱచు వీఱీడియఱపులకు
వంక లొత్తి మాఱుసెప్పుటయు నొప్పక యుండు; వెడంగు లగుటం
గార్యవచనంబు లెఱుంగరు; మొఱకు లగుటం బ్రతాపభాషణంబులకు
వెఱవరు; వారల తలంపులు గీడు; నీమహనీయప్రభావ బుద్ధి పౌరుషంబు

లే నెఱుంగుదు; నయినను భాండవేయులపై స్నేహంబునను నీమీఁది భక్తినిం జెప్పెద; నందుఁ బోవలవ'' దనిన వాసుదేవుం డితని కిట్లనియె. 235

తే. ''నీవివేకంబు నాప్తియు నెఱపి తీవు-
తల్లిదండ్రుల మాడ్కి హితంబు సెప్పి,
తేను నారాక తెఱఁగెల్ల నేర్పరించి
చెప్ప విని, యేమి సెప్పినఁ జేయువాఁడ.'' 236

-: శ్రీకృష్ణుఁడు విదురుతో సంభాషించుట :-

సం. 5-91-3.

క. ఎఱుఁగుదు నేను సుయోధను
కొఱగామియు, నతనితోడఁ గూడిన నృపులం
దఱుఁ బగ మనమున నిడికొని
చెఱుమటయును, సంధి పొసఁగ దనియు, మహాత్మా ! 237

ఆ. పుడమి యెల్ల నొడ్డగెడ వయి, గజవాజి
యుతముగాఁ గడంగి యుగ్రమృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్చుట
యధిక మైనపుణ్య, మనఘచరిత ! 238

వ. మానుప వచ్చునే యంచేని, 239

క. దొరకొని పుణ్యముఁ బాపము
నరుఁ డర్థిం జేయుచుండ, నడుమ నొకట న
వ్వెర వెడలి తప్పినను, ద
ప్పరితిఫల మొందునంద్రు ధర్మవిధిజ్ఞుల్. 240

వ. అట్లుం గాక. 241

తే. చుట్టములలోన నొప్పమి వుట్టినప్పు
డడ్డపడి, వారితోడఁ గొట్లాడి యైన
దాని నుడువంగఁ జొరకున్న వానిఁ- గ్రూర
కర్ముఁ డని చెప్పుదురు కర్మకాండవిదులు. 242

వ. కావున, నీ రెండుదెఱంగులవారికి శాంతి గావింపం బ్రయత్నంబు సేసెద, ధర్మార్థ సహితంబైన తెఱంగుమాటలు మంత్రిజనసహితుండైన సుయోధనునకుం జెప్పెదఁ, దనకుం బాండునందనులకు లోకంబులకు హితంపయిన విధంబు పంచన లేక చెప్పెదునన్ను పాండవులవాఁ డని శంకించి యతండు నా మాట వినం డయ్యె నేనియు మేల కాక: యిట్లు సొచ్చి చెప్పకున్న, 'నన్నదమ్ములు దమలోనం బోరఁ గృష్ణుండు వారిం పక యుపేక్షించెఁ, దనచేతఁ జక్కంబడదా' యని యబ్బుటైన జనులాడుదు; రెల్లభంగులం గార్యం బార్యు లియ్యకొనం జెప్పుదు; ధార్తరాష్ట్రులుం దమకు బ్రదుకుతెరు వైన నా పలుకులు వట్టుదురు; పట్టక నీ తలంచిన చందమునం దులువలై కలగంబాఱిన, వారు నా ముందర నిలువంజాలుదురే" యని పలికిన, విదురుం 'డట్లకాక' యని సమ్మతించి యామంత్రణంబు సేసి నిజశయనస్థానంబునకుం జనియె ననంతరంబ. 243

ఆ. అతని వచనరచన యాత్మలోఁ దలపోసి
యిట్టివాఁడు గలఁడె యెందు ననుచుఁ,
బాలకడలి కడలి పాటియై యొప్పున
ప్పానప్పునందు శౌరి పవ్వళించె. 214

వ. ఇట్లు-సుఖనిద్ర సేసి వేగుం బోకట మాగధ మంగళ గానంబుల మేలుకాంచి, సమయ కర్తవ్యంబులు సలిపె; నట్టియెడఁ గృతవర్మయు సాత్యకియు వచ్చి పొడసూపినం బురుషోత్తముండు వారలు మొదలుగాఁ గల యిష్టజనంబులు పరివేష్టింప నుచితప్రదేశంబున నున్నంత. 245

ఈ. ఇనతనయ శకుని దుశ్శా
సనసహితముగాఁగ నెలమిఁ జనుదెంచి, సుయో

ధనుఁడు ప్రియోక్తులఁ దగువా
రును దానును వారిజోదరుం గొనియాడెన్. 246

వ. అతండును మధురసంభాషణంబులు సేయ, వార లతనికి ధృతరా
ష్ట్రుండు బంధుమిత్రాది సమస్తపరిజన సమన్వితుం డయి పేరోలగం
బున నునికి యెఱిఁగించినఁ, బ్రియంబునఁ గట్టాయితం బైన తే రెక్కి
భేరీశంఖచామర ప్రముఖ భద్రచిహ్నంబులతో వెడలి, గరుడధ్వజంబు
గ్రాలఁ, గృతవర్మసాత్యకు లొక్కరథంబునను దుర్యోధనాది దుష్టచతు
ష్టయం బొక్కరథంబునను భార్గ్వంబుల రాఁ, బౌరులకుఁ గన్నులపండు
వగుచు, రాజమందిరద్వారంబు సేర నరుగు నప్పటి యులివునకుఁ
గొలువువా రెల్ల నత్యుత్సుకులై యెదురుచూడ రథోత్తమంబు నవతరించి
యరవిందనాభుండు. 247

తే. ఎదురు వచ్చిన విదురుని యిచ్చుకరముఁ-
దమ్ము చేయును రెండు హస్తములఁ బట్టి
నడచె, ముందటఁ గదియు సందడిఁ గడంగి
కర్ణదుర్యోధనులు దొలఁగంగ జడియ. 248

వ. కృతవర్మాది యాదవులు లోనుగాఁగల యభ్యంతరు లైన బలుమాను
సులు పొదివికొని పోవఁ, దన సమీపంబునఁ గౌరవులు రవిసన్నిధి
తారాగ్రహంబుల చందం బగుచుండఁ, దేజోరాశియగు రాజీవాక్షుండు
సని, తనకుఁ బ్రత్యుత్థానంబు సేసిన కురురాజును దొరలను నభినం
దించుచు. 249

ఈ. తన కని పెట్టిన మణిమయ
కనకోన్నతపీఠమునఁ బ్రకాశంబున ని
ల్చిన యెడఁ, దోఁచిరి నారద
మునిప్రముఖు లంతరిక్షమున నుజ్జ్వలు లై. 250

వ. ఇవ్విధంబున సన్నిహితు లయిన యమ్మహామునులం గురుపితామహునకుం
జూపి నారాయణుం డిట్లనియె. 251

ఆ. "మనలఁ జూచువేడ్కఁ జనుదెంచినారు మ
హాత్ములైన నారదాదిమునులు;
వీరి కర్ఘ్య పాద్య విధు లొనరించి, యా
సనము లిడఁగఁ బనుపు సత్వరముగ. 252

వ. వీరలు సముచితాసనంబుల నుండక మనకుఁ గూర్చుండుట్ దగవు గా"
దనినం గొలువు వారెల్ల సంభ్రమాశ్చర్యంబులతో మునులవలను జూచు
చుండ భీష్ముండు పరిచారకులం బనిచి కనకమణిమయాసనంబు లనేకం
బులు దెప్పింప, వార లరుగుదెంచిన వారలకు నమస్కరించి యాస
నార్ఘ్యపాద్యాది విధులం బూజలు సేయించి కృష్ణుండు గూర్చున్న
యనంతరంబ ధృతరాష్ట్రుండునుం దక్కటివారును నుచితప్రకారంబుల
నమ్మునీంద్రులకు నభివందనంబులు సేసి నిజాసనాసీను లైరి. దుశ్శాస
నుండును వివింశతియును గద్దియ లిడ సాత్యకియుఁ గృతవర్మయుఁ
గృష్ణుం గదిసి యిరువంకలం గూర్చుండిరి; కర్ణ దుర్యోధనులుం జేరువ
నొక్కగద్దియ నుఁడిరి; విదురుండును మణిపీఠంబునఁ గృష్ణుని వెనుకదెసఁ
దదీయోన్నతపీఠంబునఁ గరంబ త్తమిల్లి యుండె; గాంధారరాజనిజ
పుత్రపరివృతుండై యొక్కదిక్కున నుచితపీఠాసీనుం డయ్యె; నట్టి
సమయంబున. 253

క. అంబుదశుభగాత్రుం, బీ
తాంబరధరుఁ, గమలదళనిభాక్షుఁ, హరిఁ జూ
డం బడసి లోచనము లమృ
తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్. 254

క. ఆకొలువువారు గర మచ
లాకృతి నొకపలుకు లేక, యందఱు వింజం
బాఁకిడినకరణి నవశ
దాకారితచిత్తవృత్తు లై యుండంగన్. 255

-: శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట :-

సం. 5-93-1.

క. జలదస్వనగంభీరత
నెలుఁ గొప్పఁగ, దంతదీప్తి లెసఁగ ముకుందుం
డలరుచు సభ నఖిలజనం
బులు విన, ధృతరాష్ట్రు భూవిభున కిట్లనియెన్. 256

క. "జననాథ! నీ యెఱుంగని
పనులు గలవె యైనఁ, దగవుఁ బరమహితంబుం
దనవారికిఁ జెప్పన తగు
నని, వచ్చితి భారతాన్వయము ప్రియ మొందన్. 257

క. క్షీరోదకగతిఁ బాండవ
కౌరవు లొడఁగూడి మనకి కార్యం; బది నీ
వారసి నడపుము; వా రన
వీ రనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే! 253

చ. భరతకులంబు- ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గియుండు ననఁగా- నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు- నీవు నీయనుఁగుఁదమ్ముఁడు; నీతనయుల్ యశోధురం
ధరశుభశీలు; రీసుచరితక్రమ మిప్పుడు దప్ప నేటికిన్. 259

శా. ఈ వంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారిచందంబు లై
వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం; గాన స
ద్భావం బారసి, లోని పొత్తు వెలివృత్తంబుఁ జనస్తుత్యముల్
గావింపం దగు నీక- యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ! 260

చ. వినుము. సుయోధనాదు లగువీరు సధర్మ్మలు గాక, కార్యము
ల్గొనక, మహోగ్రసిద్ధి యెడలుం దమ కిట్లన, కన్వయంబు వ

ర్తన మిది గాదు నాక, బెడిదంపుఁదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా, నవగుణంబులకుం బుయిలోడ రేమియున్. 261

ఉ. కౌరవపాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁ బొంది యున్కి మే-
లారయ నాకు నీకుఁ గులమంతకు నీన్యపకోటి కుర్వికిం;
బోరిత మైన నింతకును బుట్టు మనోపద; గావున ధరి
త్రీరమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే! 262

తే. నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు
నధిప! తెఱఁగు నీ వశమున యదియ కాన;
నీకు నీరలఁ దేర్చుట నెఱియ కాదె!
సిద్ధ మెన్వారిఁ దెలివొందఁ జేయ నేర్తు; 263

ఉ. అందు, వృకోదరార్జునుల నాహవరంగము నందు మీఱువా
రెందఱొ యెన్నుమా! యిచట నీ గురు భీష్ములఁ ద్రేణి సేయు వా
రెందఱొ! వారు వీరు నని నీల్గుటకంచె, భవద్బలంబులై
యందఱుఁ గూడు టొప్పదె! జనాధిప శాంతి యొనర్పు మెమ్మెయిన్.

తే. జగతిఁ గల జనపతులు నీ చరణపీఠ
మర్థిఁ గొలువ, సముద్రవేలావృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే! తల్లి ప్రజల
విరోధంబు వాటించు టెంత మేలు! 235

క. నరనాథ నీ వుపేక్షా
పరుఁడ వయినఁ, గౌరవులక పాండవులక కా,
దరయఁగ భూప్రజ కెల్లను
దురితం బొనరించినట్ల తుదిఁ గీడు సుమీ! 266

క. కౌరవపాండవులం దె
వ్వారలకుం జావు నొవ్వు వచ్చిన మే? లు
ర్వీరమణ! చిత్తమున నె
ట్లారయుమా! నీకు దుఃఖ మగు నెట్లయినన్. 267

ఉ. మీరును వారుఁ-బండితులు, విక్రమవంతులు, బాహుగర్వదు
ర్వారులు; పూని రిత్తబవరంబున నాఁఁడిఁ జావఁబోవ నె
ట్లూరక యుండవచ్చుఁగడునొప్పెడు మేనులు వాఁడికైదువుల్
గూరఁగ నాటినం; బుడమిఁ గూలుట కక్కట! యోర్వవచ్చునే! 268

ఆ. ఇట్లు గాకయుండ, నీరెండు దెఱఁగుల
వారిఁ గాచికొనుము, వసుమతీశ!
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు
నఖిలజనులుఁ బొగడునట్లు గాఁగ" 269

వ. అని చెప్పి వెండియు. 270

-: శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పినమాఁటలు ధృతరాష్ట్రునితోఁ
జెప్పుట :-

సం. 5-93-36.

తే. "పాండవులు దండ్రిసచ్చిన ప్రజలు, వారి
నరసి ప్రోచితి శైశవ మాదిగాఁగ,
నడుమ నిష్కారమ దిగవిడువఁ దగునె?
సార మొందంగ రక్షింపు గారవమున. 271

వ. పాండుకుమారులు నీకుం బరమభక్తిం బ్రణమిల్లి యందఱు నొక్క
మాటగా నీతోఁ జెప్పు మని నాకుం జెప్పినవిధంబు వినుము; తనపంపునం
బండ్రెండువత్సరంబులు వనంబున వసియించితిమి; పదుమూఁడగు
నేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబునుం జలిపితిమి; మాతండ్రి సమ
యంబు పరిపాలించి యే మర్ధరాజ్యం బెట్లనుం బడయుదు మని కృత
నిశ్చయులమై పడితిమి; తల్లియు దండ్రియు నెల్లచుట్టంబులు నేడుగడ
యును మాకుఁ దాన; మావలన నేరమి గల్గినం గినిసి, యిట్లు గా దట్లని
చక్కం బెట్టునది; తనగల పదివేలేండ్లకుం దన్నకాని మఱి యెఱుంగ;
మెట్టివార మైనను మమ్మును యుద్ధాదులనుం దలంపరు, తనయందుఁ

దెఱంగు గలిగిన నెవ్వరు గొఱగాకున్నను గులంబు పాడి నెడక చెల్లు
నని" రని పలికి, మటియు నిట్లనియె. 272

ఉ. "సారపుధర్మమున్ విమలసత్యము- బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁబాటిన దైన యవస్థ, దఱు లె
వ్వారలు లుపేక్ష నేసి రది వారలచే టగుఁ; గాని ధర్మ్మని
స్తారక మయ్యు, సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్!" 273

వ. అని యీసభ్యులకుం జెప్పు మనిరి: నీవును సభాసదులైన రాజులు నేమని
యెద రనుం, డేను ధర్మంబును నీతియుఁ జుట్టటీకంబును మున్నిడుకొని
మనోవాక్ప్రికారంబు లేక రూపంబైన సత్యంబ కాఁ జెప్పితి; నెత్తె
అంగు మీకు మేలు; క్రోధమాన మత్సరంబులు విడిచి యిట్లు సేయుండు.

ఆ. పాండవులకుఁ దగిన పాలు మేదినిఁ బంచి
యిచ్చుకంటెఁ గార్య మెద్ది గలదు?
ధర్మ్మ మెద్ది? సముచితం బగువిధ మెద్ది?
శక్య మెద్ది చెపుఁడ వాక్యవిదులు." 275

క. అని పలికి, "మహారాజా
విను" మని ధృతరాష్ట్రితోడ వెండియుఁ దా ని
ట్లని చెప్పె వాసుదేవుఁడు
తనమది నఱలేక కార్యదశ దెలియంగన్. 276

ఆ. "వారితండ్రిపాలు వారికి నిచ్చి, నీ
పాలు నీవుఁ బుత్రపౌత్రచయము
ననుభవించి సుఖులరై యుండుఁ; డిది బంధు
మిత్రిసుజనకోటి మెచ్చుతెఱఁగు 277

క. ఎఱుఁగవె యజాతశత్రుని
నెఱియును ధర్మ్మంబు సత్యనిష్ఠయు; మిము నె
త్తెఱఁగున ననువర్తించెనొ
యెఱుఁగవె? తగు చేవ గలుగు నెఱుఁగవె యధిపా! 278

వ. అదియెల్ల నీ వెఱుంగు దైనను దెలియఁ జెప్పెద వినుఁ, మింద్రప్రస్థపురం
బున నుండి పాండవాగ్రజుండు నీకుం బెంపునుం బేరునుం జేయం గోరి.

చ. మద మడఁగించి, భూపతిసమాజము నెల్లను నిన్ను గొల్వఁ జే
యుదు నని పూని, దిగ్విజయ మున్నతిఁ జేసి, మహావిభూతితో
మదిమది నుండ, నీసుతుఁడు మంత్రులు సౌబలు జూద మార్చి సం
పద గొని, యంతఁ బోవక సభఁ ద్రుపదాత్మజ భంగపెట్టరే? 280

ఉ. దానికి నీ వొడంబడితి; ధర్మజుఁ డంతయుఁ జూచి, సత్యముం
బూని, పృకోదరార్జునులు భగ్నులుగాఁ, బెడచేతఁ గన్ను నీ
రూనఁగ నొత్తుకొంచుఁ జని, యుగ్రవనంబున దుఃఖమగ్నుఁ డై
దీనత నుండి, పూన్కి- దగఁ దీర్చియుఁ, గూడి మనంగఁ గోరెడిన్. 281

క. తనుఁ దాన పోలుఁ గా, కే
మన వచ్చు నజాతశత్రు సతిశాంతతయున్
వినయము సత్యము ము న్నే
జనపతులకుఁ గలవు? సెపుమ సౌజన్యనిధీ! 282

క. ఏ నింతాడితి- నీసం
తానం బిరుదెఱుఁగునకు హితము గోరి; భవ
త్సానునిమతి యతిలోభము
మానిచి, పాండవులఁ దెమ్మ మనుజాధీశా! 283

ఉ. వారలు శాంతశూరులు; భవచ్చరణంబులు గొల్వఁ బూని యు
న్నారు; రటుఁగాక మీ కది మనంబున కప్రియమేని, నింతకుం
బోరికి వచ్చుచుండుదురు భూవర! రెండు దెఱంగులందు నీ
కారయఁ బథ్య మేది యగు, నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!" 284

చ. అనవుడు, రోమహర్షణము లంగములం బొడమఁ సదస్య లె
ల్లను బ్రియ మంది, నెమ్మనములం- "బురుషోత్తముఁ డింత యొప్పఁ బ
ల్కునె? మఱుమాట లాడ నయకోవిదుఁ డెవ్వఁడు? ధీరుఁ డెవ్వఁ? డిం
దనువరి యెవ్వఁ "డంచు, నచలాకృతు లై నెఱి నూరకుండఁగన్. 285

వ. జామదగ్నమహాముని సుయోధనునితో నిట్లనియె. 286

సీ. "వినుము దంభోద్భవుం డను రాజు దన
కెదు రెవ్వరు లే రంచుఁ గొవ్వి,
నరుఁడు నారాయణుం డనువారలు
గంధమాదన మనునగమునఁ దపము సేయ
వారిపైఁ జని, యాహవమునకుఁ బిలిచిన,
నమ్మునీంద్రులు వల దని యనేక
విధములఁ జెప్పంగ, వెండియుఁ బోకున్నఁ,
గుశముష్టి నుజ్జ్వలవిశిఖవృష్టి

ఆ. గురిసి, నరుఁడు నేనఁ గూల్చి యాతని భంగ
పెట్టి పట్టి విడిచె; నట్టి యమ్మ
హాత్ము లిపుడు పార్థుఁ డనఁ గృష్ణుఁ డనఁగ, లీ
లార్థకలితజన్మ లై రి సూవె. 287

వ. కావున నీ వాదంభోద్భవు చందంబున నుద్ధతి వాటించుటయు, నర
నారాయణులతోడఁ దొడరుటయు మీఁద మేలయి యుండదు; పాండ
వులతోడి పొందు మే" లనిన యనంతరంబ కణ్వుండు దుర్యోధనున
కిట్లనియె. 288

-: కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతుని వృత్తాంతంబు సెప్పుట :-

సం. 5-95-1.

క. "అది వోలుఁ; దన్ను నెదిరిని
మది నెఱుఁగక విగ్రహించి మద మెత్తుట యొ
ప్పఁ; దహంకారం బొనరిం
పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్. 289

వ. అది యెట్లనిన. 290

సీ. ఆమ రేంద్రరథసూతుఁ డైన మాతలి దన
సుత గుణకేళికిఁ బతిఁ దగంగ
నారసి, యార్యకుం డను భుజంగాధిపు
మనుమనిఁ- జికురుని తనయు- సుముఖు
నర్థిమైఁ గోరిన, నార్యకుం డుమ్మలి
కంబుతో నిట్లను, 'గరుడుఁ డితని
తండ్రి వధించి, యెంతయు నల్కమై వీని
నిం కిట నెల సమయించువాఁడు

ఆ. గాఁగఁ బూనిపోయెఁ గావున నే మియ్య
కొనఁగ నేర' మనిన, విని బలారి
నడిగి పడసి యిత్తు నాయువు రండని,
వారిఁ గొనుచు నరిగె సారథియును. 291

వ. వారల భాగ్యంబున నప్పు డింద్రుండును నుపేంద్రుండును నొక్కచో
నుండం గని, మాతలి యక్కార్యంబు విన్నవించినం గరుణించి, జిష్ణుండు
విష్ణునకుం జెప్పి చేయించువాఁడై, వైనతేయుదెసకుం దాన చాలి
సుముఖుం జిరాయురుపేతుం జేసిన. 292

క. మాతలి- పాణిగ్రహణం
భాతనిఁ జేయించి యున్న, నంతయు విని తా
నేతెంచి గరుడుఁ డతికో
పాతురుఁ డై రేఁగి పెలుచ నమరాధిపుతోన్. 293

వ. వ. వాసుదేవసన్నిధి నిట్లనియె. 294

క. విను నీ వదితిసుతుండవు
వినతకొడుక నేను, విజ్ఞవీఁగెడు మనకున్
జనకుఁడు గశ్యపుఁ డొక్కఁడ;
దనుజుల శోధించి చంపుదమ యిరువురమున్. 295

క. ఏమిట నీ కేఁ దక్కువ;
నామేరకు నడ్డపడితి; నావుడు నింద్రుం
డీమహనీయమహిమకును
ధామము విష్ణుండు గాక తక్కొరుఁ డగునే? 296

వ. అనిన, విని గటకటంబడి గరుత్మంతుం డిట్లనియె. 297

ఉ. "తమ్ముఁడ నీవు నాకొలఁది తథ్య మెఱుంగక, నాకు నీచభా
వ మ్మగు భంగిఁ జేసితివి; వాసవ! యియ్యదితిప్రసూతవం
శ మ్మఖిలమ్ము దాల్తు నొకసన్నపుటీఁకన; యిట్టినన్ను నీ
విమ్మెయిఁ దూలపు త్తె" యని యీషణరోచులఁ గెం పెలర్పఁగన్. 298

వ. ఉన్నం గనుంగొని కోపించి వాసుదేవుండు వెడనవ్వు నవ్వుచు. 299

క. "నీవేటి మోపుకాఁడవు?
నావెరవున నిన్ను నడిపినను గర్వం బే
లా వెడఁగ" యంచు దనముం
జే వీఁపున నిడ సురేంద్రజిత్తు వికలుఁ డై. 300

క. ఎఱుకలు విచ్చుచుఁ, దుండము
దెఱచుచు, ద్రావే గడరి సొగసి ద్రెళ్లి వివశుఁ డై
యఱచిన, నోడకు మని హరి
నెఱి సక్కఁగఁ ద్రోచి యెత్తె నెగయంగఁ గృపన్. 301

వ. ఇవ్విధంబున గేశవుండు గరుణించి గరుడని ననునయించి 'యింక నవు
దానికి నుద్ధతి మాని బుద్ధి గలిగి యుండు' మని వీడ్కొలిపి పుచ్చినం
బోయెం, గావున గర్వంబు గొఱగా, దింతయు నీమహానుభావుం
డెఱుంగు నని నారదుం జూపి, యితండు మాతలి కన్యాకార్యంబునకుఁ
దోడై నడచె నడుగు, మదియకాదు సర్వేశ్వరుండగు మాధవు
మాహాత్మ్యం బితనికిం గరతలామలకం బయి యుండుఁ, బ్రభవిష్ణుం డగు
నాదివిష్ణుఁడు గదా యీకృష్ణుం, డీతని సహాయత్వంబు గల కొంతేయుల

తోడం గూడి మనకి కార్యం" బనిన, నారదుండు ధార్తరాష్ట్రు
నాలోకించి, 302

క. "బలవంతులబలములు న
గ్గల మగుబల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు; నే
కొలఁదులవారికి గర్వము
నిలుచునె- నయమార్గవృత్తి నిలిచినభంగిన్." 303

వ. అని పలికి వెండియు నిట్లనియె. 304

ఆ. 'ఇదియ కాని చేయ నెద్ది యే' ననుచు, ని
ర్బంధవృత్తిఁ దలఁపు వట్టికొనిన,
నట్టివాని కెందు నలజడి వాటిల్లు;
గాలవుండు గుటీయకాఁడె మనకు. 305

వ. వినుము విశ్వామిత్రుపాల విద్యాభ్యాసంబు సేసి గాలవుం డను ముని
కుమారుండు గురుదక్షిణ యేమి సమర్పింతు నని యడిగిన, నతఁ
'డేమియు నేల' యని యుడిపిన నుడుగక, యెన్ని సెప్పిన నన్నింటికి
నన్ని సెప్పి నిర్బంధించినఁ, గటకటంబడి యత్తపోధనవర్యుం 'డట్లేని
శుద్ధధవళవర్ణంబులై యొక్కకర్ణంబు నీలంబైన యుత్తమాశ్వంబు
లెనమన్నూఱు దెచ్చి యి'మ్మని పలికినం, బోయి- 306

తే. గాలవుం డవ్విధము ఘోటకముల నెందుఁ
బడయలేక చింతాభరభ్రాంతుఁ డగుచు,
వెడలి యాహారనిద్రలు విడిచి, తా మ
హాపథముఁ బోదుఁ గా కని యరిగి యరిగి, 307

వ. ఒక్కచో గరుడునిం గని, బాలసఖుండు గావున నతనికిం దనవృత్తాం
తంబు సెప్పిన, నతండు గరుణాభరితుండై. 308

క. దేవతలు గాని యిట్టివి
గావింపం జాల; రీసకలదిక్కులలో

దేవేంద్రుదిక్కు బహుదివి
జావాసం, బందుఁ బోద మని మునిపుత్రున్. 309

క. అటుకడ నిడి, ప్రాఙ్ముఖుఁ డై
పటుచి, జలధిలోనఁ జదలఁ బాఁపెడునెడఁ, జె
య్యాటీ దప్పి నిలువఁజాలక
యొఱగిన గాలవుని డించె నొకగిరిమీఁదన్. 310

వ. ఇట్లు డించి డప్పి దేర్చి, యందుఁ గశ్యపనందనుండు శాండిలి యను నొక్కతపస్వికాపంబునఁ బఱుంబులు డుల్లి, యనుగ్రహంబునం గ్రమ్మఱ వచ్చిన విషాదమోదంబు లనుభవించి, యట సనుట సాలించి, మగుడ మహీతలంబునకు మునికుమారుం దెచ్చి, యయాతి తననెచ్చెలి యని ప్రతిష్ఠానపురనాథుం డగు నతనికడకు నాతనిం దోడ్కొని చని, యగ్గా లవు తెఱుం గెఱింగించిన, నతండు. 311

క. తన కట్టిగుఱ్ఱములు లే
కునికిని, మాధవి యనంగ నొప్పెడుపుత్రిన్
మని కొసఁగె, దీనికై యే
మనుజేశుఁడు నీఁడె హయసమాజము ననుచున్. 312

వ. ఇ ట్లొసంగినం దోడుకొని. 313

తే. 'ఇట్టి హయముల గలరాజు లెవ్వరొక్కొ'
యనుచుఁ దిరిగి, యయోధ్యకుఁ జని, తదీయ
నాథు నిష్ట్యాకుఁ గనిన, నన్నరవరుండు
దనకు నిన్నూఱు కాని లే వనియె హరులు. 314

క. అన విని మాధవి ఋషి కి
ట్లను, "నొక్కమహానుభావు నతులవరమునం
దనయవతి నయ్యు నేఁ గ
న్యన యగుదుం గాన నిమ్ము న న్నితనికిన్. 315

వ. ఒక్కసమయంబు సేసికొని యిచ్చి గుఱ్ఱంబులు వచ్చినవి యెల్ల రా బుచ్చికొ" మ్మనిన, గాలవుండు నవ్విధంబునకు సమ్మతించె; నపత్యార్థియై యిక్ష్వాకుండును సయ్యంకువునకు భార్య యగుట పుత్రజన్మావధిగా నొడివి యశ్వంబుల నొసంగి కన్యకం బరిగ్రహించి దానియందు వసు మనస్సం డనుకొడుకుం బడసి, గాలవునకు నమ్మగువను మగుడ సమ ర్పించినఁ జూచి, 'యబ్బంగిం గల చోట్ల నెల్ల నరసి తురంగంబులం గావించి కొ" మ్మని యతనికిం జెప్పి సుపర్ణుండు సనియె; మఱియు మహీతలంబునం గ్రుమ్మరి యమ్మునికుమారుండు గందువ లెఱింగి పోవంబోవ, 316

క ఆసమయంబునను దివో
దాసుఁడు నౌశీనరుండుఁ దరుణికి నిన్నా
ఱేసి హయంబుల నిచ్చి, మ
హాసత్త్వుల సుతులఁ బడసి రధికప్రీతిన్. 317

వ. ఇట్లు క్రమంబునఁ గాశీశ్వరునకుఁ బ్రత్యర్దనుని, భోజపుర నాథునకు శిబిం గనిన యక్కన్యకఁ గొని, వెండియు వసుంధరం దిరుగుచుండ, గరు త్మంతుండు గ్రమ్మఱి వచ్చి యమ్మునితో, "నీ వింక జాలిం బడవలవ, దొక్కకారణంబున నీరాజులు మువ్వురకు నివ్వాజులు గలిగె, నింతియ కాని యొండెడ నీచందంబున మొత్తంబులై దొరక నేర, వియ్యాఱు నూఱు గుఱ్ఱంబులను గురువునకు సమర్పింపు, మొక్కటి నెప్పెద వినుఁ" మని యిట్లనియె. 318

క. "ఈమువ్వుర తెఱఁగునఁ దగ
నామనియుం గొడుకుఁ బడయునట్లుగ ని మ్మీ
కోమలిని గొఱంతకు వి
శ్వామిత్రున కెట్టులైన సంప్రార్థనతోన్." 319

వ. అని తానునుఁ దోడు సని యత్తపస్వీపాలికిం బోయి యత్తెఱం గెఱిం గించి గాలవుం గానిపించి 'యీతండు బాలుండు, నీవు దయాళుండ,

వితనిం గృతార్థుం జేయవలయు' నని ప్రార్థించి పఱిరా జక్కార్యంబు
చక్కంజేసి పోయిన. 320

క. మునివరుఁ డష్టకుఁ డనియెడు
తనయుఁ బడసి, శిష్యునకు సుదతి నొప్పించెన్,
వనితయుఁ దపంబు సేయం
జనియెను గాలవున కిట్టిచరితము గలిగెన్. 321

వ. కావున నెట్టివారికి నిర్బంధము దగదు; దుర్మానంబు దుర్దశ నాపాదించు; నయ్యయాతి దుర్మానంబునం గాదె పుణ్యలోకపరిభ్రష్టుం డై మాధవీ పుత్రులగు నన్నలువురు దౌహిత్రుల కతంబున నూర్ధ్వగతిం గనియె; నట్లగుటం జేసి. 322

క. నిర్బంధము దుర్మానము
దుర్బుద్ధికిఁ గాక తగునె దుర్యోధన ! నీ
మూర్ఖులమె పాండవులకుఁ
దార్బల్యము వాపు, శుభము దలఁకొను సంధిన్. 323

వ. కృష్ణునిమాట విని నీ విక్కారవాన్వయంబు రక్షింపు" మనియె నివ్విధంబున నమ్మువ్వురు మునీంద్రులు సెప్పినహితోపదేశంబుల దెస ననాదరంబు సేసి గాంధారేయుండు రాధేయుం గనుంగొని చే యప్పళించి నవ్వి 'వీర లింత వెఱ్ఱు లగుదురే' యని పలికి వారల నవలోకించి. 324

-: దుర్యోధనుఁడు నారదాదిమునుల మాటల నిరాకరించుట :-

సం. 5-122-1.

క. "మునులార నన్ను విధి యే
మని మును పుట్టించె నట్టు లయ్యెడుఁ గా, కీ
వినఁ జవి గాని పలుకులకుఁ
బని గలదే; యుడుగుఁ డింక బహుభాషణముల్." 325

వ. అనిన విని ధృతరాష్ట్రుం డమ్మహామునులతో నిట్లనియె. 326

తే. "మీరు సెప్పినబుద్ధులు గారవమునఁ
జేయఁ గాంచినఁ బుణ్యంబు సేయ నెట్లు
నాముఖంబునఁ గార్యంబు నడవ, దేమి
సేయువాఁడ, నొం డెద్దియుఁ జెప్పలేదు." 327

క. అని యతఁడు శౌరితో ని
ట్లను నిహముం బరముఁ గలుగునట్టివిధము నీ
వనఘా చెప్పితి, నాకుం
జనవేదియు లేదు దీని సమ్మతి నడపన్. 328

ఆ. మందబుద్ధి నాదునందనుఁ; డీవు పో
రాని చూట్టమవు, మహానుభావుఁ
డవు, దయార్ద్రచిత్తుఁడవు; వీనిఁ దేర్చవే
యనునయించి యెట్ట లైనఁ గృష్ణ !" 329

క. అనిన ముకుందుఁడు దుర్యో
ధనుతో నిట్లనియె, "విమలతరవంశమునన్
జనియించి, తెల్లగుణముల
ననూఁడవు, నీకు నీదురాగ్రహ మేలా? 330

చ. తులువలు గాక, యిట్టిదొర దుర్జనవృత్తికిఁ జొచ్చునయ్య! పు
త్రుని ననుజన్ములుం బెలుచు దుష్టపథంబునఁ బోవకుండఁ, జు
ట్టలుఁ దగువారుఁ దండ్రియు నొడంబడఁ జేయుము కార్య మల్పబు
ద్ధుల వెడమాట లూఁకొనకు; దోసము సేగియు వచ్చు నమ్మెయిన్. 331

క. పాండిత్యశౌర్యనిత్యులు
పాండుసుతులు; వారిఁ గూడి బ్రదుకుట- ధృతరా
ష్ట్రుండును బాహ్లికుఁడును భీ
ష్ముండు గురుఁడు గోరుతెఱఁగు సూవె నరేంద్రా! 332

ఆ. వినుమసత్యలోభమున సిరి యగునె? యాఁ
కొని ముసిండి దిననఁ గ్రొవ్వులావుఁ
గలుగునయ్య? శకునికర్ణదుశ్శాసన
మంత్రితంబు గార్యతంత్ర మగునె? 333

శా. తోడంబుట్టిన భీమపార్థుల మహాదోద్ధర్షముల్ లాఁతు లై,
తో డంచుం బెఱవారి దుర్బలుల నెందుం జొచ్చి, దైన్యంబునం
గూడంబెట్టెదు; నీవ పాండుసుతులం గుందింపఁగా, సత్యముం
బాడిం దప్పఁ రొకప్పుడుం గినియ; రాబంధుత్వ మే లొల్లవో? 334

ఉ. వారును మీరుఁ బొంది. జనవల్లభు లెల్లను భృత్యభావనం
జేర, సమస్తవస్తువులుఁ జేకుఱఁగా, బ్రదు కొప్పుఁ గాక; నీ
కిరస మెత్తికోల్ గఱపి, యిప్పుడు కార్యము దప్పఁజూచు నీ
వారలు- ముట్టవచ్చిన నవశ్యము నంతకుఁ జాలరుంజుమీ! 335

ఆ. వీర కారు- పాండవేయులఁ బోర మా
ర్కొన్న సురాసురులకుఁ గొలఁది గాదు;
గాన వారితోడి కయ్యంబునకుఁ నిర్ణ
యింప వలదు, సంధి పెంపుఁ జేయు; 336

క. ఈ యున్నరాజు లందఱు
వాయుసుతున కొక్కయెత్తు; వాఁడలిగిన శూ
లాయుధుఁడు వడఁకు; నాకొం
తేయులతోఁ బెనగు టుడుగు ధీరవిచారా! 337

క. ఒకకార్యము సెప్పెద; మీ
సకలబలమునందు సవ్యసాచి కెదురుగా
నొకరుఁడు గలిగినఁ గయ్యము
నకుఁ బూనుఁడు; రిత్తబహుజనశ్రయ మేలా? 338

క. పెక్కండ్రు గోవులం గొని
యుక్కు మిగిలి నడవ, వెనుక నుద్ధవిడిం దా

నొక్కఁడ నరుఁ డేతెంచినఁ
జిక్కె సమస్తంబుఁ నది ప్రసిద్ధము కాదే ! 339

క. తోడు దొన లేని యప్పటి
క్రీడికొలఁది యట్టి, రధిప కినియక విను, మేఁ
దోడై రా నెదురుట గడుఁ
గీడు; వలవ దుడుగవయ్య; గెలు పరిది సుమీ ! 340

తే. అనుజతనుజులుఁ జెలులు వియ్యములు నడుగు
మాలి పోదురు– నీకుఁగా మనుజనాథ !
దొరకుఁ గులనాశనుం డనుదూలు మేలె !
పాండవులతోడ నొడఁగూడి బ్రదుకవయ్య ! 341

ఉ. రాజ్యముఁ ధార మెల్ల ధృతరాష్ట్రునియందు వెలుంగుచుండఁ, ద
త్పూజ్యకుమారపట్టమునఁ బొల్చి చరింపఁగ నీవు, పాండవుల్
సజ్యతఁ దండ్రిచిత్తము ప్రసన్నతఁ బొందఁగఁ గొల్చి యున్కి, సా
మ్రాజ్యముగాఁ దలంతు– రనురక్తమతిం దమకుఁ ధరాధిపా ! 342

క. కౌరవనాయక ! పాండుకు
మారులు నీతోడిపొత్తు మనియెద మనఁగా,
శ్రీ రా మోఁకా లొడ్డిన
వారివిధము కాదె– నీవు వలదను చెల్లన్."
343

-: భీష్మద్రోణులు దుర్యోధనునకు హితంబు చెప్పుట :-

సం. 5-123-1.

చ. అన విని భీష్ముఁ డిట్లనియె నాధృతరాష్ట్రితనూజుతోడ, "నీ
జనకునిమాట వట్టుము, ప్రసన్నమతిఁ మనవంశ మెల్లఁ బా
వనముగ నిందు వచ్చి బుధవత్సలుఁ డీహరి యిట్లు చెప్పఁగా
వినమిఁ గడుం జెడుం దెరువు; వీరలపం పొనరింపు పెంపుగన్. 344

క. మానక ధృతరాష్ట్రుఁడు ప్రా
ణానం గలుగంగ, బంధునాశము రాజ్య
శ్రీనాశము, నుద్దామయ
శోనాశముఁ జేయ, నేల చూచెదు చెపుమా ? 345

వ. కృష్ణార్జునులతోడి విరోధం బీబంధులోకంబునకఁ గాదు లోకంబున నెవ్వరి
కినిం జూడంబోలదు; లోకంబులు రెంటికిని హానిం జేయక, కూడి బ్రదు
కుట మే" లనినఁ, దదనంతరంబ ద్రోణాచార్యుండు దుర్యోధనున
కిట్లనియె. 346

తే. పితృపితామహగురులమై ప్రీతిఁ గోరు
చున్న యట్టి మాపరమహితోపదేశ
వాక్యములు విని, దుర్జనవచనరచనఁ
గొనక, బంధులతో నొడఁగూడి మనుము. 347

ఉ. వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన సవిస్తరవాక్ప్రచయంబుత్రోవఁ బో
వన్న ! కుమార ! యట్లయిన నాయువు శ్రీయును నీకుఁ గల్గు; మా
కన్నులు సల్లగా నకట గన్గొనుచుండుదు మేము; నట్లు గా
కున్నను నీవ నేర్తు- నిను నొండన నేరము నిండుకొల్వునన్." 348

చ. అనవుడు నాంబికేయుఁడు నిజాత్మజుదిక్కు మొగంబు చేసి యి
ట్లను "హరి నాశ్రయించి భవదగ్రజుఁ బుణ్య నజాతశత్రునిం
గను మట వోయి; దీన మనకార్యము లన్నియు సిద్ధిఁ బొందు; నీ
తనిపలు కాదరింపమిఁ బదంపడి పాటిలు నెల్లచేటులున్." 349

వ. అనియె నట్టియెడ గురుభీష్మ్ము లొత్తిచెప్పం దలంచి గాంధారేయున
కిట్లనిరి. 350

క. "ఈకృష్ణునిసారథ్యము
నాకృష్ణుని గాండివంబు నై తోఁపక ము,

నీ్నకొలఁదిఁ జక్కఁబడి, నీ
వీకురువంశంబు గావు మిభపురనాథా ! 351

వ. అని పలికి మరియు. 352

సీ. "ధర్మపుత్రుని పదద్వయమున కతిభ క్తి
నెఱఁగిన, నతఁడు ని న్నెత్తి గ్రుచ్చి
నిడుఁగేలఁ బెద్దయుఁ దడవుగాఁ గౌఁగిలిం
పఁగ, భీముఁడును నీవుఁ బరమహర్ష
మునఁ జారుతరవచనములు సంగతములుగాఁ
బరిరంభణం బొనర్పంగ, నరుఁడుఁ
గవలును ప్రొక్కినఁ గర మర్థిఁ దిగిచి నీ
వాలింగనంబు సేయంగ, నిట్లు

తే. వారు మీరును దగ బాంధవమునఁ బొదలి,
యింపు దళుకొత్తఁ దామరతంపరైనఁ,
జెలులుఁ జుట్టలుఁ గలిసి పే రెలమిఁ బొంది
యుల్లసిల్లంగఁ గుల మెంత యొప్పునొక్కొ ! 353

క. సమరమునకు వచ్చిన భూ
రమణు లుభయకటకములను ప్రమదం బెసఁగం,
దమతమ పురములకుం బో
వ మహీజను లెట్టి యుత్సవముఁ బొందుదురో !" 354

వ. అని వెండియు ననేకవిధంబులం జెప్ప "యీ రెండు దెఱంగులవారును బంచి కుడిచి సుఖంబున్న నఖిలభూప్రజకును ప్రమోదం బగుం గావున నట్లు సేసి యందఱచేత దీవనలు వడయవయ్య నీ" వని దుర్యోధనుం డప్పుండరీకాక్షు వీడ్కొంచి యిట్లనియె. 355

క. "గురుఁడును బితామహుఁడు నీ
నరనాథుఁడు నెల్ల ప్రొద్దు ననుఁ దూఱుదు; రి

పురుసున నీవును దామో
దర ! దూఱెదు గాని, తగవుఁ దలఁపవు కంటే ! 356

క. "వనితం బటీచి, రరణ్యం
బున నిడుములఁ బడితి" మనుచుఁ బోటరు లై చం
పను జెఱుపఁ దలఁచి మాదెసఁ
గనలుదు రప్పాండుసుతు- లకారణమ కడున్. 357

మ. అరయం దప్పాక యింత నావలన లే, దాధర్మపుత్త్రుండు జూ
దరి వెంటం దమకించి, సౌబలునిచేతఁ భూమి గోల్పోయి, ము
ప్పురుఁ డై వెండియు నొడ్డఁగా- నతఁడు నకుప్రౌఢిమై గెల్చె; నే
తెరు వై నం దనయిచ్చతోఁ బడియె, నింతే కాక యేఁ బూఁటయే ? 358

తే. మాత్స్యపాంచాలపాండ్యాదిమనుజపతుల
గూర్చికొని, తార కయ్యంబు గోరి యెత్తి
విడిసి; రింతియకాక, యివ్విధము నుగ్ర
కర్మమున కేము దొడఁగుట గలదె చెపుమ ! 359

క. ఉక్కఁటి సురపతి కైనను
గ్రొమొక్కము; నృపధర్మ మూఁది మొనతలఁ బడినన్
మిక్కిలి పేరును నిట, దివి
నక్కజముగఁ బెంపుఁ బడయ నగుట నుపేంద్రా ! 360

చ. చిఱుతఁదనంబునం దగవు చిత్తమునం దలపోయలేక, ముం
దఱి యటు వోవ నిచ్చితిఁ; బితామహుఁడుఁ జనకుండు నింకఁ గ్ర
చ్చఱ నిలఁ బంచి చక్కఁ సగ మక్కఁక నెవ్వరికేని మద్బలం
బెఱుఁగక యీ దలంచినను, నే నది యేటికి సమ్మతించెదన్ ! 361

తే. తోంటిచవి గని, యిప్పుడుఁ దోఁచి పాండు
సుతులు రాజ్యంబు సేయంగఁ జూచినారు;

నాకు నీఁ దీఱునే ? యింక నాఁటి చూఱ
లెక్కఁడివి ? ద్రోణభీష్మ లీదిక్కు సుమ్మ ! 362

ఉ. ఏమఁను వారుఁ బంచికొని యేలుట గల్గదు, పల్కకుండు మిం
కేమియు; వాఁడిసూదిమొన యించుక మోపిన యంతమాత్రయున్
భూమి యొనర్చి పాండునృపపుత్రుల కిత్తునె ? యెవ్వరైన సం
గ్రామమునన్ జయంబు గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్.'' 363

తే. అనిన విని, కిన్కఁ బూనిన యలఁతి నగవు
చెలువు మొగమున కొక క్రొత్తపొలు పొనర్పఁ,
బుండరీకాక్షుఁ డగు చెల్లఁ బోయి, యప్పు
డరుణకమలాక్షుఁ డగుచు మురాంతకుండు. 364

-: శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు సేసిన
దుర్ణయంబు సెప్పుట :-

సం. 5-126- .

క. ''మొనతలఁ బడియెదు, నీ చె
ప్పిన యట్టుల తడవు లేదు, బిరుదులరై నీ
వును వీరు నిలువుఁ; డిదె భం
డన మెల్లియ వచ్చెఁ; నూఱటలు గనుఁ డింకన్ 365

సీ. అరయంగఁ దప్పు లే దంటి నీవలనఁ, గీ
డొకనాఁడు సేసియు- నొక్కనాఁడు
నుడుగక పాండవేయులకుఁ జాల
నెగ్గు సేసితి- విష మిడి, వెనుఁబాముల
గఱపించి, నీరిలోఁ గట్టి ద్రోచి,
లక్కయిల్ గాలిచి; వెక్కుభంగులఁ జంపఁ
దలఁచినఁ జావక, ధర్మరతుఁ

ఆ. జేసి నెగడి, రాచసిరి నొందియున్నఁ జూ
పోప, కీవు తీవ్రపాపబుద్ధిఁ
గనలి, జూద మొకటి కల్పించి కపటంబు
సేయ, దాన నెల్ల చేటుఁ బుట్టె ! 366

తే. అన్నదమ్ముల నెత్తంబు లాడి, సతుల
తలలు వట్టి సభాస్థలంబులకు నీడ్చి,
చీర లొలిపింతురే? యిట్టివారి నెందుఁ
దడవుమా నీ వొకండవు దక్క నధిప ! 367

ఉ. అప్పుడు నీవుఁ గర్ణుఁడును నాడినమాటలు గొల్వులోపలం
జెప్పెదునట్టివే? కులము శీలముఁ గల్గినపుణ్యకాంత క
ట్లొప్పమి చేయు చెల్లఁ గని, యున్నజనంబులు వించునుండఁగాఁ,
ద ప్పొక యింతలే దనువిధం బది నీక చనున్ సుయోధనా ! 368

తే. 'ఎత్తి విడిసిన వా' రని యెల్లతప్పుఁ
బాండవుల మీఁదఁ బెట్టిన బ్రదుకు గలదె?
ద్రోణభీష్ములుఁ దండ్రియుఁ దోడుతోడఁ
జెప్పు తగుమాట లేమియుఁ జెవులు సొరవు. 369

క. శాంతిం బొందుట- నీకుం
గుంతీపుత్రులకు మే లగుఁ దానిక యే
నింతయు నాడెద; నది నీ
కెంతయు రుచియింపకునికి యెటీఁగి యెటీఁగియున్." 370

వ. అని యిట్లు నారాయణుండు నానాప్రకారంబులం జెప్పుటకుఁ గటకటం
బడియెడు దుర్యోధనునకు దుశ్శాసనుం డిట్లనియె: 371

మ. "జనకుండుఁ గురుభీష్ములుం దగినకర్జం బాప్తు లై నీకుఁ బ్రీ
తి నెటింగించుతెఱంగు గాదు, తమబుద్ధిం బోయి సంధాన మి
ట్లొనరం జేయక యున్నఁ గృష్ణునకు నిన్నొప్పించువా రింతవ
ట్టు నిజం; బిచ్చట నింక నీయునికి నెట్లుం గీడు వుట్టుం జుమీ !" 372

ఆ అనిన బాహ్లికాదు లగు కురువృద్ధుల
నాత్మజనకుఁ గృష్ణు నాదరింప,
కతఁడు రాజసమున నప్పుడు దిగ్గన
లేచిపోయె; సంచలించెఁ గొలువు. 373

తే. అతని వెనుకన కర్ణుండు ననుజగణము
శకునియును వారిపొం దైన జనపతులును
బోయి; రమ్మెయిఁ జని యొక్కప్రోవు గట్టి
వేఱు యంతంత నుండిరి గోఅడమున. 374

వ. ఇట్లున్నం గనుంగొని గాంగేయుండు. 375

చ. "ఇతఁ డిది యేల క్రొవ్వి ధరణీశుఁడ నంచు వృథాభిమాని యై,
మతి సెడి, లోభమోహమదమత్సరముల్ దనుఁ ద్రిప్ప, ని ట్లసం
గతమునఁ బోయె; వీని వెనుకం జని రేమి దలంచియో మహీ
పతులును; వీరు గొంద- అతిభారపుమానసు; లేమి సేయుదున్ !" 376

తే. అని జనార్ధనుఁ గనుఁగొని, "యకట ! కాల
పక్వ మయ్యె నీనరపతిప్రతతి యెల్ల"
ననుడుఁ, దగువారిదెసఁ గలయంగఁ జూచి
తగవు మెయి నిట్టు లనియె నన్నగధరుండు. 377

శా. "ఈదురోధ్యధనుఁ డింతగర్వి యగునే ! యీయున్న వా రెల్ల నా
చే దైన్యంబునఁ బొందు టొప్ప దని చర్చింపండ; యీభంగికిన్
లేదే యొండుదెఱంగు; సత్కులముఁ బాలింపంగ వర్జింప రా
దే దుష్టాత్మకు నీచు నొక్కరునిఁ; బోదే భేద మీజాతికిన్ ! 378

ఉ. కంసుఁడు నిట్ల తండ్రిమది గందెడు చంద మొనర్చి ధర్మవి
ధ్వంసము నేసినం, గులమువారలు నా కెఱిఁగింప, నేను దు
ర్మాంసము గోయు వైద్యునిక్రమంబున నాతనిఁ ద్రుంచి, యన్వయో
త్తంసముఁ జేయనే జనకుఁ ? దద్విధ మొప్పదె మీరుఁ జేసినన్ ? 379

ఆ. అంతతోడ నెల్ల యాపదలును తీఱు,
వంశ మధికగౌరవంబు నొందుఁ,
గూడి మనుట గలుగుఁ గురుపాండవులకు; ని
త్తెఱఁగు సూడ మీకు నుభవకా దె!" 380

వ. అనిన విని ధృతరాష్ట్రుం డదరిపడి విదురున కిట్లనియె. 381

ఆ. బుద్ధిమంతురాలు, పొందుగఁ బలుకంగ
నేర్చు; వచ్చి కొడుకుఁ దేర్చి పోవుఁ
గాన వేగ నీవు గాంధారిఁ దోడితె"
మ్మనుడు, నరిగి యతఁడు నట్ల చేసె. 382

వ. అద్దేవియు. 383

క. చనుదెంచి యుచితపీఠం
బున నున్నం గురువిభుండు పొలఁతుకతో ని
ట్లను, "నీతనూభవుఁడు దు
ర్వినయంబునఁ జనియె, నిట్టి వెంగలి గలఁడే? 384

క. నీవైనఁ జెప్పి శాంతుం
గావింపఁగ నోపుదేనిఁ, గౌరవకుల మీ
గోవిందుశాసనము సం
భావింపం గాంచి, చెడక బ్రదుకుంఁజుమ్మీ." 385

తే. అనుడు, "నీపుత్తుఁ డవినీతుఁ డగుట యెఱిఁగి
యెఱిఁగి వానివశంబున నేల పోయె;
దీవు పాండవులకు నేమి యిచ్చితేని,
నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప చెపుమ!" 386

క. అని గాంధారిపతియుఁ దా
నును విదురుం బనిచె నందనుం బిలువ నతం
డును మొగము జేవుఱింపఁగఁ
జనుదెంచెను సభకు విదురసంప్రార్థితుఁ డై. 387

వ. మున్ను దనతోడం జనినవార లందఱు నచ్చోటన నిలువ, నిట్లు వచ్చి సుయోధనుండు నిజాసనాసీనుం డై యున్నఁ జూచి, తల్లి చిత్తంబున గర్వించుచు, నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుఁదెరువును నిజశక్తియు సహాయంబుగొలఁదియుఁ గులజనచిత్తప్రకారంబును పాండుపుత్రులబలపరాక్రమంబులుఁ దెలియునట్లుగాఁ- దెఱంగుపడం జెప్పి, బుజ్జగించియుం గినిసియు ననేకవిధంబుల వాడిన, నమ్మాటలదెస ననాదరంబు సేసి, యుద్ధతిం గ్రమ్మం జని యతండు కర్ణాదులం గలసి, వారునుం దానును దుర్మంత్రంబునకుం జొచ్చి. 388

-: దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱం బెట్టఁ దలంచుట :-

సం. 5-128-1.

క. "హరితలఁ బొప్పదు. భీష్ముని
గురునిం గూర్చుకొని, మనలఁ గ్రొవ్వఱిఁ బట్టం
గరమున్సహించుచున్నాఁ
డరయ నతనివచనరచన నంతయుఁ దెలిసెన్. 389

క. మును దాఁ గంసునిఁ బరిమా
ర్చినచందము వారికెల్లఁ జెప్పెడుఁ; దనకున్
మును మనము గడఁగి వెసఁ బ
ట్టినఁ గార్యం బగుఁ జలంబు డింపకుఁ డింకన్. 390

తే. పట్టి యీతనిఁ జెఱఁ బెట్టి, పాండవులకు
దిగులు పుట్టింత; మంతటఁ దెగక యెత్తి
వచ్చి రేనియు నిర్జింపవచ్చు- గోఱ
లెల్లఁ బుచ్చిన నురగంబు లేమి సేయు?" 391

వ. అని విచారించె; నట్లు దుష్కార్యాలోచనంబు సేసి, దుర్యోధనదుశ్శాసన శకునికర్ణు లగు దుష్టచతుష్టయంబు మొదలుగాఁ గల యవినీతులు దై తేయమర్దను మర్దింప నిశ్చయించి; రయ్యవసరంబున. 392

చ. అడఁకువ లేమి, నల్క యురియాడుట, నొండొరుఁ గూడకుండుటన్,
బుడిబుడి మాటలాడుటను, బోవుచు వచ్చుచు గ్రందు గ్రమ్మలం
బడుటను దెల్ల మైన, మును పన్నుగఁ దాఁ బరికించి యున్కి, న
ప్పుడు వారిఁ బట్టుసంకులము పుట్టుట సాత్యకి నిశ్చయించుచున్. 393

తే. బఱటి కొనిపోయి కృతవర్మఁ బన్నఁ బనిచి
'నీవు బలమును వాకిఁట నిలుపు, మేను
లోపలికి నెల్ల జాలుదుఁ బాపబుద్ధు
లన్న దెసఁ దప్పి" రని నిర్భయమునఁ జెప్పె. 394

వ. ఇట్లు పరమాప్తుం డగు హార్దిక్య నటవుచ్చి సాత్యకి సత్వరంబుగాఁ జను
దెంచి జనార్దనునకు నత్తెఱం గెల్ల నెఱింగించి తదనుమతిం గౌరవేశ్వర
ప్రాహ్లికగురుభీష్మవిదురులతో నిట్లనియె. 395

మ. "అదె కౌరవ్య లశ్కదుర్జనత సేయం బూని పైఁ బాఱి జూ
చెద, రమ్మ్మె దమచేతఁ దీఱునె? జయశ్రీకాంతు దైత్యాంతకుం
బొదువం దారు దలంచు నెల్ల, ననలంబుం జీర బంధింపఁగా
మది నూహించిన యట్ల కాక, తమ దుర్మంత్రంబులం బోవునే?" 396

వ. అనిన విదురుం డదరిపడి వైచిత్రవీర్యున కిట్లనియె. 397

ఉ. "భూవరతనూభవులు- పుణ్య నగణ్యపరాక్రమున్ హరిం
గేవలమర్త్యఁగాఁ దలఁచి కిట్టినఁ బట్టినఁ, దారు మంటపై
వావిరిఁ గ్రమ్మ్మె నాళలభవర్గము చాడ్పున క్రుందిపోరె? కా
లావధి యయ్యుఁ గావలయు నక్కట! వారికి వారివారికిన్." 398

వ. అనుటయు, గోవిందుం డందఱు విన నంబికానందనున కిట్లనియె. 399

ఉ. "రోషము నాపయిం గలిగి క్రూరతఁ గౌరవు లింత సేఁత సం
తోషమ; నీవు ప్రాభవముతోఁ దగ నాకు ననుజ్ఞ యిమ్ము; ని
ర్దోషత నేను నోపుగతి దోర్బలదుర్జయు లైనవారివి
ద్వేషముఁ జక్కఁబెట్టి, జగతీవర! యింతకుఁ బోయి [illegible]దన్." 400

క. అనుడు, ససంభ్రమముగ న
జ్జనపతి దుశ్శాసనాది సకలపరిజనం
బును నాదుర్జనునిం దో
డ్కొని రమ్మని విదురుఁ బనుచుండుం; జని యతఁడున్. 401

వ. సపరివారంబుగా దుర్యోధనుం దోడ్తెచ్చినం జూచి యతనికి ధృతరాష్ట్రుం డిట్లనియె. 402

చ. "అలవి యెఱుంగ కిట్లు దనుజారికిఁ గీ డొనరింప, నీవు నీ
తులువలు నుత్సహించితిరి; దుర్మతులార ! సమీరు నీకుఁ జే
నలవడఁ బట్టవచ్చునె ? మహాద్రిఁ గదల్పఁగఁ బోలునే ? దవా
నలుఁ జమరంగ శక్యమె ? వినాశముఁ బొందెద రేమి సేయుదున్ !" 403

ఆ. అనిన విదురుఁ డిట్టులను; సుయో
ధనుతోడ, "బాలకేళిఁ దొడఁగి లీలఁ గృష్ణుఁ
డెచట నెచట నెవ్వ రెవ్వరి నేమేమి
నేసె వినవె ? యేల చెడియె దిట్లు ?" 404

వ. అనియె, నట్టియెడఁ గట్టెదుర నున్న యక్కురుపతికుమారుం జక్కం
జూచి, 'యే నొక్కరుండన యని తలంచియె దుర్మదంబునం బొదివిపట్ట
నుత్సాహంబు సేసి' తనుచు దరహాసంబు సేయు వాసుదేవునిఫాలప్రదే
శంబున బ్రహ్మయు, వక్షంబున విరూపాక్షుండును, వదనంబున
వహ్నియుఁ, బార్శ్వంబుల నింద్రయమవరుణకుబేరులు నాదిత్యమరు
ద్విశ్వేదేవాశ్వినులు నుద్భవించిరి; హలగాండీవమండితభాహు లగు బల
దేవార్జునులు సవ్యదక్షిణభుజంబులును, నిజాయుధహస్తు లగు యుధిష్ఠిర
భీమనకులసహదేవులు వీఁపునను, వివిధప్రహరణపాణు లగు యదువృష్ణి
భోజాంధకవీరు లూరులను బ్రభవించిరి; జనితనానాహస్తవిన్యస్తంబు
లయి శంఖచక్రగదాఖడ్గశక్తిశార్ఙ్గప్రముఖనిఖిలసాధనంబులు వెలిం గె;
నేత్రక్షోత్రనాసావివరంబుల సధూమధూమకేతుజ్వాలాజాలంబులు నిగిడె;
రోమకూపకలాపంబులం దరణికిరణనిభప్రభలు వెడలె; నిట్లు దుర్నిరీక్ష్యం
బగు నత్తేజోరాశిఁ గనుంగొనం గొలఁదిగాక, సకలజనంబులు నయ

నంబులు మొగిడ్చి యద్భుతభయానకరంబుల జొ త్తిల్లు చి త్తంబులతోడం
గదలకుండ నప్పుండరీకాక్షుండు నారదాదిమహామునులవలనను భీష్మ
విదురద్రోణసంజయులయందును గరుణాతరంగితం బగు కటాక్షవీక్షణం
బొలయ వారలకు దివ్యదృష్టి యొసంగిన, నావుణ్యపురుషులు సాంద్రా
నందంబునం దేలుచుండి; రయ్యవసరంబున. 405

తే దేవదుందుభిధ్వానంబు దివిరేఁ; గల్ప
వృక్షపుష్పధారామయవృష్టి గురిసె;
సిద్ధసాధ్యవిద్యాధరశ్రేణి భక్తి
నిచ్చు జయజయశబ్దంబు లెసఁగెఁ జదల; 406

వ. అప్పుడు ధృతరాష్ట్రుం డమ్మహాసంకులంబు విష్ణునిదివ్యవిజృంభణంబు
గావలయు నని యూహించి. 407

క. "కరుణింపుము సంశ్రితభయ
హరణధురీణా ! సహింపు మజ్ఞానంబున్ !
శరణంబు వేఁడెద ! భవ
చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁ గదే !" 408

చ. అనుడు, దయార్ద్రచిత్తుఁ డగు నప్పరమేశ్వరుఁ డిచ్చె దృష్టి య
జ్జనపతి; కద్భుతం బడర, సమ్మదపూరము గ్రమ్మ నాతఁడుం
గనుఁగొని భక్తి మ్రొక్కి, "నినుఁ గంటిఁ- గృతార్థుఁడ నైతి; నింక నొ
ల్ల నొరులఁ జూడ, లోచనములం బురుషోత్తమ సంహరింపవే !" 409

క. అనిన పలుకులకు, నచ్చటి
జనులెల్ల నృపాలుసితవిశాలాక్షుఁ గనుం
గొనుచుండి, రపుడు దమనె
మ్మనమ్ము లాశ్చర్యరసనిమగ్నంబులు గాన్. 410

వ. తదనంతరంబ, దా మోదరుండు ధృతరాష్ట్రునభిమతం బొడఁగూడ నతని
కన్ను లెప్పటియట్ల కావించి, నిజవిశ్వరూపప్రపంచంబు నుపసంహరించి,
మునీంద్రుల నామంత్రణంబు సేయ, నమ్మహాత్ము లంతర్ధానంబు సేసిరి;

దానును సముత్థానంబు సేసి, యంతకుమున్న సన్నిహితుఁ జై యున్న కృతవర్మకరంబును సాత్యకిహస్తంబును నవలంబించి యూరక వెడలె; నని చెప్పిన. 411

ఆ. ఇవ్విధమునఁ, గృష్ణుఁ డేఁగిన పిదపటి
కథ వినంగ నాకుఁ గౌతుకంబు
మనము నిండి గడలు కొనుచున్నయది; వివ
రించి చెప్పు మునివరేణ్య ? యనుఁడు. 412

ఉ. భక్తమనఃప్రమోదకరపాదసరోజవికాస ! చేతనా
శక్తిమయప్రభావ ! మునిసంస్తుత ! సాత్యవతేయభారతీ
ప్రోక్త ! నిగూఢసంప్రకటభూమసమాశ్రయ ! వత్సలత్వసు
వ్యక్త ! కృపాభిరామ ! గుణవర్జన ! నిత్యపుష్కలా ! 413

క. అవ్యయ నిర్మలవిభవా !
దివ్యప్రభవా ! సుఖైకదీప్తానుభవా !
నవ్యత్వనిత్య ! యతిసం
సేవ్యసుసాంగత్య ! లోకజీవనకృత్యా ! 414

మాలిని. రవిశశిమయనేత్రా ప్రస్ఫురత్కాంతిహృద్యా !
నవజరఠవికారన్యాసలీలానవద్యా !
వివృతనిగమశాఖావిశ్రుతాగ్ర్యైకవేద్యా !
వివిధనియతచర్యావిత్తచిత్తప్రసాద్యా ! 415

గద్యము :

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి
ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున
నుద్యోగపర్వంబునందుఁ
దృతీయాశ్వాసము.

శ్రీ మ దా ం ధ్ర మ హా భా ర త ము

ఉద్యోగపర్వము - చతుర్థాశ్వాసము

క. శ్రీమత్తులసీపల్లవ
దామచ్ఛవిలబ్ధమరకతప్రతిమతోవ్వి
ద్దామప్రభాస్థిమాలా
శ్యామాయితవిపులవక్ష ! హరిహరనాథా ! 1

-: కృష్ణుండు గుంతియింటికిఁ జని యాయమతో మాటలాడుట :-

సం. 5-1ఓ9-20.

వ. దేవా ! వైశంపాయనుండు జనమేజయున కిట్లనియెఁ; గృష్ణుం డత్తెఱుం గున వెడలిన, విస్మిత యై గాంధారి యభ్యంతరమందిరంబున కరుగం, గౌరవులెల్లను బంధుమిత్రసహాయసహితంబుగాఁ దనతోడన వెడల, మొగంబు గంటువెట్టికొని కక్ష్యాంతరంబులు గడచినప్పుడు, దారుకుండు తేరినొగలపై నుండి పొడసూపి కేలు మొగిడ్చి ఫాలభాగంబునం గదియించినం, దత్పరిదేశంబున నిలిచి వారలదెస మరలి చూచి, 'మీ రింక నిలువుం' డని పలికిన, నాంబికేయుండు పుండరీకాక్షుం జేరి నిజతనూజుల నుపలక్షించి. 2

ఉ. "వీరును బాండుపుత్రులును వేరము దక్కి పొనంగి మన్కికై
పోరితమాడి, యే నటులు బుద్ధులు సెప్పినభంగియుం, గులా
చారము నిర్వహింపఁ బలుచందములం దగ దుఃఖపాటు నీ
కారవజాతికిం దెలిసెఁ గాదె, గదాధర ! నీదు సన్నిధిన్." 3

4

వ. అని వెండియు.

తే. "నీకు శుద్ధుండ నగుటయ నిఖలబంధు
మిత్రగురుజనకోటికి ధాత్రి కెల్ల

నఁబుజాక్ష ! నిర్దోషుండ నగుట; గాన
నాతెఱంగు నీ వెఱుఁగుట నాకుఁ జాలు.'' 5

వ. అనిన విని యచ్యుతుండు బాహ్లికభీష్మద్రోణకృపప్రముఖనిఖిలవిశిష్టజనం
బుల నాలోకించి. 6

తే. ''ఇప్పు డీసభఁ బుట్టిన యింతవట్టు
మీకుఁ దెల్లంబు గాదె: యీమేదినీవి
భుండు 'దా నేమిటికిని ముఖ్యుండఁ గాను,
దప్పు దనదెస లే' దని చెప్పి విడిచె. 7

వ. కావున నాకు నియ్యెడం దడయం బని లేదు, పోయి వచ్చెద, ధర్మ
పుత్రునకు నింతవృత్తాంతం బెఱిఁగింపవలయు'' నని పలికి వారల
నామంత్రణంబు సేసినవాఁడై, రథారోహణంబు సేసి, ధృతరాష్ట్రుం
డును నచటిజనంబులును వెనుకం జనఁ జని, కుంతీగృహద్వారంబున
నరదంబు డిగ్గి. 8

క. వారందఱుఁ దనతోడన
గారవమున నరుగుదేరఁగాఁ జొచ్చి, మహో
దారుఁడు గుంతీచరణాం
భోరుహముల కెఱఁగి వినయభూషణుఁ డగుచున్. 9

క. కౌరవసభఁ దా నాడిన
గౌరవవాక్యములు, గార్యఖడ్గక్రమవా
క్ప్పారములు, సుయోధనుడు
ప్రారంభము నల్పవచనపద్ధతిఁ జెప్పెన్. 10

వ. ఇట్లు ధృతరాష్ట్రుకొలువుసం బుట్టినవిశేషంబులు పాండురాజమహిషి
కెఱిఁగించి మాధవుండు మఱియును. 11

తే. ''కురుకుమారులు దమయంతఁ గుడిచి క్రొవ్వి
మీఁ దెఱుంగరు, మా కేమి మేలకాక:

నాలుకలు గ్రోయు నర్జునానలము దగిన
యెర గొనం గని సంతృప్తి యెసక మెసఁగు. 12

వ. పాండుకుమారులపాలికిం బోయి వచ్చెద, వారికిం దగినబుద్ధు లాన తి"
మ్మనిన, నద్దేవి- విక్రమోపజీవు లయిన ముచుకుందుండును సృంజ
యుండును ననుతొంటినరపతులచరిత్రంబులు నెప్పి, యుధిష్ఠిరుండు
వీరిని వినండొ కాక యని పలికి, యెల్ల వారును వినుచుండ వెండియు
నిట్లనియె. 13

ఉ. "రాజుల కెందు నారయఁ బరాక్రమజీవనవృత్తి దక్క నొం
డోజ నిషిద్ధ మండ్రు మును; లుత్తమసత్త్వులు వంశధర్మముల్
పూజితభంగిఁ జేయుదురు; బుద్ధివిహీనులు వానిఁ దక్కి ని
స్తేజపుఁగూటి కియ్యకొని దీనతఁ బొందుదు, రంబుజోదరా! 14

క. నీవియ్యంబులు సంధియ
కావింపం బడిరి; వీరిఁ గలయుట కష్టం;
బావెరవు దప్పుటయ మే
లై వచ్చెం బొమ్ము; విడువు మనుమానంబున్. 15

మ. నిజవంశోచితవీరవృత్తమున కున్మేషంబుగా, నాకపి
ధ్వజుఁ డుత్సాహము సేయకున్న నకటా! ధైర్యంబు వాటిల్లదే!
భుజదర్పోద్ధతుఁ డైన భీమునకు నీపొం దొప్పునే! నీవు స
వ్యజగన్మాన్యుఁడ విందు రాఁదగునె! దైవం బిట్లు దప్పించునే." 16

వ. అని యంత నిలువక గొంతి యిట్లనియె. 17

క. "మఱచిరె కొలువున ద్రౌపదిఁ
బఱచినబన్నంబు! ధర్మపథము దొఱంగక
వెఱచుట కప్పటి కది దగుఁ;
జెఱచినచో వెదకవలదె చిరతరకీర్తిన్!" 18

-: శ్రీకృష్ణుఁడు కర్ణుని తనరథం బెక్కించుకొని కొన్నిరహస్యోక్తులు వలుకుట :-

సం. 5-138-1.

వ. అని పలికి పుండరీకాక్షుం గౌఁగిలించికొని యచ్యుతుండు మ్రొక్కిన దీవించి, "యేను సుఖం బున్నదాన" నని పాండవులకుం జెప్పుము, చేతులలావునం గనినజీవనంబున బ్రదుకుం డనుము, పోయి ర' మ్మని వీడుకొల్పిన, సింహగమనసుందరంబుగా వెడలి, తనతోడన గదలివచ్చిన ధృతరాష్ట్రాదుల నిలువం బనిచి, రథారోహణంబు సేసి గోవిందుండు కర్ణుదెసం గనుంగొని "న న్నినిచివత్తు గాని ర" మ్మని కరంబు సాఁచి చెయివట్టి తనయరదం బెక్కించికొని, సాత్యకి వేసరి నెక్కఁ కెలనం జనుదేరం గదలి చని, యనుపపచ్చిన కృతవర్మ నుచితప్రకారంబున సస్నేహంబుగా నిలిపి యరుగునవసరంబునఁ బౌరలోకంబు. 19

ఉ. "అక్కట వాసుదేవుపను పాదరణంబునఁ జేయరై రి, వీ
రెక్కడిబుద్ధిమంతు" లని నిందును నందును లోక మెల్ల బే
రుక్కున ప్రమగ్గుటం దలఁప నొల్ల, కపాయము సేసి రట్టె! యీ
యుక్కువు లెందునుం గలరె! యెప్పరువో ధృతరాష్ట్రనందనుల్." 20

వ. అని మఱియు ననేకు లనేకప్రకారంబులం బలుకుచు నిరుగెలంకులం జను చుండఁ, బుండరీకాక్షుండు పురంబు నిర్గమించె; నట ధృతరాష్ట్రుండును మగిడి కొలువుకూటంబునకు వచ్చి యెప్పటివారలు పరివేష్టింప నుండి కృష్ణునివలనిమాట లాడుచున్న సమయంబున సుయోధనుతో భీష్మ ద్రోణు లిట్లనిరి 21

చ. "పలుకునె యిట్లు గొంతి; విని బమ్మెరపోయితి, మింతబెట్టిదం
బు లగునె మాట: లయ్యమయుఁ బుణ్యుఁడు గృష్ణుఁడు గార్యవాదముల్
వలికెడువార లిట్లు దెగఁ బాటిరి; ధర్మజవారిరాళికిం
జెలియలికట్ట వాసె; మనచే నగుకర్జముచంద మెట్టిదో. 22

వ. అని పలికి వెండియు. 23

శా. "మాకుం జూడఁగఁ బోలు కార్య మిది, ధర్మప్రీతి నీ వేఁగి సు
శ్లోకుం డైన యుధిష్ఠిరుం గని జనస్తుత్యంబుగా శాంతివై
నీకారవ్యుల నెల్లఁ గాచికొనవే! యే పొప్ప దెందుం! దుదిన్
శోకం బొందక, వేగమైఁ గదలి కృష్ణుం గూడఁబోవే నృపా!" 24

వ. అనిన విని దుర్యోధనుండు మొగంబు రాఁజుచుండ నూరకుండె; గాంగే
యుండును గురుండును దిగ్గన లేచి యతని నవలోకించి. 25

క. "కురునృప విను: సంసారము
దరిద్రొక్కినవార, మింకఁ దలఁకెదమే సం
గరమునకు: నేము నీకై
పొరలితి మెల్లైన నగును బోయెద" మనుచున్. 26

క. అరిగిరి: రాజును నభ్యం
తరమునకుం జనియె; రాజతనయుండు బహిఃప
రివారముఁ బొమ్మని, మిత
పరిజనుఁడై యేఁగె నాత్మభవనంబునకున్. 27

తే. అంత నక్కడ నచ్యుతుఁ డరిగి యరిగి,
యధికసంప్రీతి దలకొన, నర్కతనయు
నాననంబు వీక్షించి యిట్లనియె- నెమ్మి
నన్యు లెవ్వరు వినకుండ నతనితోడ. 28

సీ. "నీవు వృద్ధజనోపసేవివి, ధర్మసం
వేదివి, తెలియంగ వినుము: సిద్ధ
మంత్రబలంబున మార్తాండువరమునఁ
గన్నియతటి గొంతి గన్నవాఁడ;
వగుటఁ బాండునృపాలునగ్రపుతుండవు;
ధర్మమార్గం బిది: ధర్మతనయుఁ

డాదిగాఁ గల తమ్ములందఱు నాచేత
నెటిఁగి, నీయడుగుల కెఱఁగి, సకల

ఆ. పుత్త్రమిత్త్రబంధుభూరిసేనాసమ
న్వితము గాఁగఁ గొలిచి, నిన్ను రాజ్య
భారవహనమునకుఁ బట్టంబు గట్ట, ను
జ్జ్వలుఁడ వగుదు; రమ్ము వారికడకు. 29

వ. ఏను నిన్ను సామ్రాజ్యంబునకు నభిషిక్తుం జేయుదు; నీవు దొలుత వెడలునప్పటిమహోత్సవంబునకు యువరాజై యుధిష్ఠిరుండు నీరథంబున నుండి నీకు ధవళచామరంబులు వైచు, వాయుపుత్త్రుండు సితచ్ఛత్రంబు వట్టు, సవ్యసాచి సారథ్యంబు సేయు, మటియుఁ బాంచాలయాదవపాండ్యమాత్స్యులు లోనుగాఁ గల రాజలోకంబుతోడఁ గవలు నభిమన్యుప్రభృతికుమారులు బెరయ నే మెల్లం బలసి పరివేష్టించి వత్తు; మిట్టిమ హేంద్రవిభవంబున మహనీయుండ వగుచు మహీచక్రం బేలు" మని మటియును. 30

క. "పాంచాలరాజపుత్రియు
నంచితముగ నిన్నుఁ బొందు నాఱవవరుస్ఁ,
సంచితపుణ్యుఁడ, వీ వొక
యించుకయును వేఱు సేయ కేతె మ్మెలమిన్. 31

వ. ఇట్లైనఁ గుంతికి సమస్తబంధుమిత్త్రులకుఁ బ్రియం బగు" ననిన, విని రహస్యంబుగా రాధేయుండు మాధవున కిట్లనియె. 32

-: కర్ణుఁడు శ్రీకృష్ణునకుఁ దగిన యుత్తరంబు లిచ్చుట :-

సం. 5-139-1.

చ. "వెడవెడ యేనుఁ దొల్లి యిది వింటి ననుం గని కుంతి నిర్దయన్
జెడ నది వైచి పోయెఁ, గృపఁ జేకొని సూతుఁడు దెచ్చి, తాను ము

కొడుకులఁ గాన కున్కిఁ బ్రియకుం దగ నిచ్చినఁ జేఁపెఁ జన్ను, ల
ప్పడఁతియు; నప్పు డాదిగ శుభస్థితిఁ బెంచెఁ బ్రయత్నశీలయై. 33

క. మూత్రపురీషాదులు దమ
గాత్రములం దింక, వారు గారవ మెసఁగం
బుత్త్రిం డని సంవర్ధిక
గాత్త్రినిఁగా జేసి- రింతకాలముఁ గూర్మిన్. 34

క. నేఁ డింక నెటీఁగి, యొరువుల
వాఁడఁ గదా' యనుచు నేను వారిఁ దొఱఁగినం
బోఁడిమి సెడదే! మదిఁ గడు
వాఁడి గలదె నాకు నకట వారిజనాభా! 35

వ. వృద్ధోపసేవనంబును ధర్మసంవేదనంబునుం గలవాఁడ వని నన్ను నీవ
చెప్పితివి; రాధయు నధిరథుండును నాకు జాతకర్మాదిసమస్తసంస్కారం
బులు నిజకులోచితంబుగా నాచరించి; రట్టి తల్లిదండ్రులకుఁ బుత్త్రి
కృత్యంబులు నిర్వర్తింపక వారలం బాసి యేను వచ్చుట ధర్మం
బగునే!" యని పలికి, నెండియు 36

క. "సోదరులుఁ బ్రియులు ననుజులు
నాదెసఁ బెక్కండ్రు; వారి నందఱి విడువం
గా దని యూహింపక దా
మోదర! న న్నిట్లు పిలుచు టుచితమె చెపుమా! 37

వ. అదియునుం గాక, 38

ఉ. సూతసుతుండు వీఁ డనక, సూనుల తమ్ములకంటె నాకు సం
ప్రీతి యొనర్చి, తేజమును బెంపును నాఁటికినాఁటి కగ్గలం
బై తనరార, నన్నుఁ దనయంతటిమానిసిఁ జేసి యుండ, నే
నేతగ వూఁది యాకురుకులేశ్వరుఁ బాయుదు- మట్ట వచ్చినన్; 39

క. నను నయ్యగ్నునకు నెదు
రని పెద్దయు నమ్మియుండు, నక్కట దుర్యో
ధనుఁ; డానమ్మిగ వమ్ముగఁ
జనునే పాండవులఁ గలయఁ జన, నా కనఘా ! 40

ఆ. ఏను నర్జునుండు నెక్కఁ బెక్కటి దల
పడకయున్న నగరె పుడమిజనము ?
లందు నాదువచ్చు టతనికి నపకీ ర్తి
యనిన నాకు వేఱె యడుగ నేల ? 41

క. హిత ముపదేశించితి వీ
వతినిర్మలబుద్ధి వగుట: నైనను నిది నా
మతి సొరదు: రహస్యము ర
హితముగఁ బాటింపు మయ్య ! చిత్తలోనన్. 42

వ. అది యేమిటికంటేని. 43

తే. ధర్మతనయుండు దాను నాతమ్ముఁ డగుట
యెటిఁగినేనియు, సామ్రాజ్య మేల పూను ?
నట్టిధార్మికుఁ డాధిపత్యంబుఁ జేయ
వలవదే శాశ్వతంబుగ వసుధ కెల్ల ! 44

క. అనుజులు ఋత్విజులుగ, నీ
పని యిటు సేయు మని నీ వుపద్రష్టవుగా,
విను, కురుకుమారపశువిశ
సనమున రణయజ్ఞ మతఁడు సమ్మతిఁ జేయున్ ! 45

వ దానం బుణ్యభూమి యగు కురుక్షేత్రంబున మముబోం టెల్లను సద్గతి వడయుదురు గాక" యనిన, విని వసుదేవనందనుండు సూతనందనున కిట్లనియె. 46

మ. "దయ నాయాడినమాట గై కొనవు, సంతాపంబుఁ దెచ్చుం జుమీ
స్మయ మెట్లుం దుది; నీకు నర్జునునితో మాత్సర్య మైనం బరా
జయ మొండెన్ మృతియొండెఁ గాక గెలువఁ శక్యంబె ? వెక్కండ్ర కిం
తియ కాలం బగునట్టె ! నీ మనము శాంతిం బొందఁగా నేర్చునే ! 47

క. గాండీవము, కవదొనలు, న
ఖండితదివ్యాస్త్రములు, నొగలపై నేనుం,
జండభుజబలమునై యు
ద్దండత నరుఁ డడర. నెదురఁ దరమే నీకున్ ? 48

వ. ఎల్లభంగులం బాండవుల గెల్తు రది యట్లుండెఁ; నీవు పొ, మ్మిప్పుడ పోయి
సుయోధనునకు గురుభీష్ములకును మీకుం దోడువచ్చినరాజుల కందఱకుం
జెప్పు: మిమ్మాసంబు సౌమ్యంబై సమశీతోష్ణంబై పుష్పఫలోపేతంబును
సమగ్రధాన్యంబును సులభయవసైంధవంబును నగుచు నొప్పియున్న
యది; యేడెనిమిదినంబులకు నమావాస్య వచ్చు; నది పుణ్యదినంబు;
నాఁడు భండనంబు గావలయు" ననినఁ గానీనుండు గమలనాభున
కిట్లనియెఁ 49

క. "కలవు నిమిత్తస్వప్నం
బులు, కౌరవ పాండవులకుఁ బోటగు; దానఁ
గెలు పయ్యుధిష్ఠిరునకును
గల- దెఱుఁగుదు; నీవు సెప్పఁగా నేమిటికిన్. 50

వ. అట్లు గానక దా యే నందు రా" నని పలికి మఱియును 51

క. "దీనికి మూలము శకునియు
నేనును దుశ్శాసనుండు నింతియ; కుంతీ
సూనుల వారలు గలసిన
రానేరఁగవచ్చు నాకు రాజీవాక్షా ! 52

వ. ఈ సమరసముద్రంబు గడవ నీఁది నిన్నుం గనియెదఁ, గాదేని నూర్ధ్వ
లోకంబునం గాంచెద : నీ వింక నేమియుం బలుకకుము; పనివినియెద"

నని కౌగిలించుకొనిన, "నట్లకాక పో" మ్మని విష్ణుండు వీడుకొలుప రాధేయుండు రథావతరణంబు సేసి గనకరత్నమయం బగు తన యరదం బెక్కి కరిపురంబున కరిగె; నచ్యుతుండును సాత్యకిం దనరథం బెక్కించు కొని దారుకుం జూచి 'పదపద, పోనిమ్ము పోని' మ్మని పలికి; లలితా టోపకలితుం డగుచుఁ జనియె; నట్టియెడ విదురుండు విషాదంబుతోఁ బాండురాజమహిషిపాలికిం జని యిట్లనియె. 53

ఉ. "అక్కట! కౌరవాన్వయమహార్ణవ మింకెడునట్లు పుట్టె; నిం
దొక్కరుఁడైనఁ గేశవుహితోక్తికి మేకొనఁ డయ్యె; నర్జునుం
డెక్కటి దాన చాలుఁ దము నిందఱఁ దీవ్రశరాగ్నిఁ గాల్పఁ; బెం
పెక్కినపాండునందనుల యేడ్తెఱఁ దొల్లియుఁ దా రెఱుంగరే! 54

తే. అన్నివడియును, బంధుక్షయంబు సేయ
నొల్ల, కెల్లవిధంబుల నుపశమంబ
కోరి రప్పాండవేయులు; వారి కిట్టి
దోసఁగు వచ్చునె తులువలతోడఁ బుట్టి." 55

వ. అని వెండియు నివ్విధంబుమాటలఁ బాండవులకుఁ గయ్యంపుటలజడి యైన వగపు దోఁప నాడుచుం గొండొకప్రొద్దు నిలిచి, నిజనివాసంబు నకుం బోయినయనంతరంబ, కుంతి యిట్లని వితర్కించె. 56

మ. "తపువారిన్ సిరికై వధించు టిది సద్ధర్మంబె? యక్లేశకృ
త్యమె తాఁ గయ్యము? ద్రోణభీష్మకృపకర్ణాటోపముల్ మాన్పుట
ల్పములం దీఱునె? యందు నర్కజునియుల్లం బెప్పుడుం గ్రోధదీ
ప్తము భీమాదులమీఁదఁ; దక్కొరుల కుత్సాహంబు తే దాజికిన్." 57

వ. అని యిట్తెఱంగునఁ బెక్కులు చింతించి తలంచుకొని, "కర్ణునకుం బుట్టువు దెలిపి సహోదరస్నేహం బావహించెద; నట్లయిన నాహవంబు వలని కడంక యుడుగకుండునె" యని విచారించి, యతని పాలికిం బోవ నిశ్చయించి యుచితప్రకారంబున వెడలి, యతం డనుష్ఠానార్థంబు భాగీరథికిం జనుట విని తత్పరిదేశంబున కరిగి యతనికి జపకాలంబయి యునికిం జూచి వెనుకవలనఁ గూర్చుండఁ, గొండొకసేపునకు జపంబు

దీఱి గలయంగనుంగొని యమ్మహాదేవిం గాంచి కానీనుండు సంభ్రమ
వినయంబులతోడం జేరి సూతగోత్రంబును రాధేయనామంబునుం జెప్పి
యభివాదనంబు సేసి, "నీవు విజయంచేసినకార్యం బేమి, నాకుం జేయం
గలపని యెయ్యది యానతి" మ్మనినఁ గుంతి యేకాంతంబుగా
నిటనియె. 58

-: కుంతీదేవి గర్ణునకు నతండు దనపుత్త్రుం డగుట దెలుపుట :-

సం. 5-143-1.

సీ. "వినుము, సూతాన్వయంబున నీవు పుట్టుట
బొం, కేను మాకుంతిభోజునింట
గన్నియనాఁడు భాస్కరుని రావించితి,
వరమంత్రబలమున వచ్చి యతండు
సంప్రీతి నొసగంగ జన్మించినాఁడవు
నాకుఁ, గావునఁ బాండునందనుండ
వగుదు ధర్మస్థితి; నట్టి నీ వితరులఁ
గొలువ నేటికిఁ గురుకులవ రేణ్య!

తే. ధర్మతనయాదు లైన నీతమ్ములకును
ధార్తరాష్ట్రులకును నీవ తగువిభుండ;
వేలు మీలోక మెల్ల : నీ కేల రాధ
కొడు కితం డనుతక్కువ, కొడుకుఁగుట్టి!" 59

క. అని పలికిన యవసరమున
నినబింబములోన నుండి 'యిది నిజ, మిబ్భం
గిన నెగడ వన్న, మేలగు'
ననువాక్యము వెడలెఁ గర్ణుఁ డాకర్ణింపన్. 60

తే. దాని వినియును, నపుడు రాధాసుతుండు
దిరుగఁబడని మనంబుతో ధీరవృత్తిఁ

దల్లి కిట్లను, "నీమాట తథ్య మగుచ
ట్లైన నొక్కటి చెప్పెద నవధరింపు. 61

క. ఋత్తియసంస్కారమునకుఁ
బాత్రిముగా నీవు నన్నుఁ బాటింప; విహా
ముత్రఫలములకు నీకేఁ
బుత్త్రిఁడ నని వచ్చు టింకఁ బోలునె చెపుమా! 62

వ. సూర్యానుగ్రహంబునం జేసి నింద్యంబు గాక తక్కినేనియు నా జన్మంబు పరమరహస్యంబునై యున్నయది; దీనిఁ బ్రకాశంబు సేయుట మన కెంతమే? లట్లుం గాక. 63

ఆ. విజయువిక్రమంబు విఖ్యాతమై యుండ,
నేను 'గుంతికొడుక ఖానుఁజుండ'
ననుచు నతనిఁ గూడ నరిగిన, నతనికి
వెఱచి పోయె ననరె వేయు నేల? 64

క. కడిఁదిపగఱ నేఁ దెప్పగఁ
నడవంగా నీఁదఁదలఁచు కౌరవనాథుం
జెడుఁగాక యంచు నిత్తటి
విడువదగునె- యతనివలన వెలసినవాఁడన్? 65

క. కౌరవులచేతఁ గుడిచిన
వారికి నిది సమయ; మెట్టివారును సంగ్రా
మారంభంబునఁ ఖాయుదు
రే? రాజులు మనలఁ దిట్టరే యట్లయినన్? 66

వ. నవశ్యంబును దుర్యోధనునకై నీకొడుకులతోడం బెనంగుదు. 67

ఉ. నీపలు కెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండు లే;
దీపనిమీఁదిఖారమున నీ విట వచ్చితి గాన, పాండవుల్
సేపడిరేనిఁ జంప; నటసేయక చెప్పెద- సవ్యసాచిపైఁ
గోపము పెద్ద; వాఁడు సమకూరిన బిట్టఱఁ జంపుదుంజుమీ! 68

ఆ. సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి
కరమ; యతఁడు లోనుగాఁగ నేవు,
రేను లోనుగాఁగ నేవురు గాని నీ
కొడుకు లార్వు రనుట విడువు మింక;" 69

చ. అనుటయు నప్డు గొంతిహృదయంబున శోకము నివ్వటిల్ల ని
ట్లను, "నిది దైవసంఘటన; మక్కట యెట్లును దప్ప నేర్చునే!
యనుపమసత్యవిస్ఫురణ నాడినమాట మఱాకు మన్న; నీ
యనుజుల నల్వురం గడుపు- మర్జునుఁ జేతకు సమ్మతించితిన్;" 70

ఆ. అనుచుఁ గౌఁగిలింప, నర్కజుం డట్లకా
కని ప్రియంబు మెఱయ వినతుఁడైన,
నరిగె సదనమునకు నద్దేవి; యతఁడును
జనియె నిజనివాసమునకుఁ బ్రీతి; 71

వ. అక్కడ వాసుదేవుం డుచితప్రయాణంబుల నుపప్లావ్యంబునకు జని,
ధర్మతనయుచేతం బూజితుం డయి, భీమసేనాదులు విరాటద్రుపద
ముఖ్యులగు తగువారలుఁ దన్నుం గాంచిన, వారి నెల్ల నభినందించి
కొలువున నుండి యుధిష్ఠిరుతో నిట్లనియె. 72

తే. ధార్తరాష్ట్రు లున్మత్తులు, దగినపలుకు
లేల విని సంధిసేయుట కిచ్చగింతు;
రెదిరిఁ దమ్మును నెఱిఁగిర యేని, వార
లంతలంతలు సేయుదు దయ్య నాఁడు?" 73

వ. అని యెల్లవారును వినఁ దన పోయివచ్చిన కార్యంబు తెఱం గెఱింగించి,
పథిశ్రమంబు వుచ్చువాఁ డయి పుండరీకాక్షుండు నిజమందిరంబున కరిగె;
నాఁటిరాత్రి ధర్మనందనుం డనుజసహితంబుగా నుచితప్రదేశంబున
నుండి గోవిందుని రావించి, 'నీవు సుయోధనుతోఁ బలికినచందం
బెయ్యది, యతం డేమివిధంబున నుత్తరం బిచ్చె' నని యడిగిన, నచ్యుతుఁ
డిట్లనియె. 74

-: శ్రీకృష్ణుఁడు ధర్మరాజునకుఁ గౌరవసభం బుట్టినవిశేషంబులు దెలుపుట :-

సం. 5-145-1.

క. "కయ్యము గాని తెఱంగున,
నెయ్యం బగునట్లు గాఁగ నెఱిఁ బలికితి నే;
నెయ్యది సుఖంబు, పథ్యం
బెయ్యది, యరయంగఁ దథ్య మెయ్యది దానిన్. 75

తే. బహువిధంబులఁ బలుకునాపలుకు లెల్ల,
జీఁదకన్నిడి, తనపెడచెవులఁ బెట్టి,
యీఅశాఅలు మఱుమాట లిచ్చి, యపహ
సించె దుర్యోధనుఁడు వేయుఁ జెప్పనేల?" 76

క. అనిన విని ధర్మజుం డి
ట్లను, "నప్పుడు దండ్రి యుచిత మాడఁడె? భీష్మం
డును గురుఁడు విదురుఁడుం ద
క్కిన పెద్దలుఁ బలుకరే తగినచందమునన్." 77

క. "నావుడు హరి యిట్లను, "స
ద్భావమున విచిత్రవీర్యతనయుఁడుఁ దగ నా
నావిధములఁ జెప్పిన సం
భావన వినఁ, డతఁడు వలుకుఁ బ్రతికూలంబుల్. 78

సీ. శంతనుపుణ్యావంశం బంకురించిన
చందంబు, నంబికానందనుండు
జాత్యంధుఁడై యుండ సామ్రాజ్యమంతయుఁ
బాలించి పాండునృపాలుఁ డతనిఁ
గొలిచి యుండుటయును, గురుకులంబున కెల్లఁ
దేజంబుగా మీరు దిగ్విజయము

నేసి కావించిన సిరి వారు వంచనఁ
గొనుటయు, సత్య మకుంఠితముగ

తే. నీవు సమయంబు నడపిన నెటియుఁ, దండ్రి
పాలు మీకు నీఁ దగుటయుఁ, బాడి లేమి
నరయఁ జెడుదురు కౌరవు లనియుఁ, బెద్ద
లెల్లఁ బెప్పిరి మొగమోట యింత లేక; 79

క. అలయక యందఱుఁ జెప్పం
గల యంతయుఁ జెప్పి; రతఁడు గటకటఁ బడి, య
క్కొలువు వెడలి పోయెం; ద
మ్ములుఁ గర్ణుఁడు రాజలోకముం దో నరుగన్." 80

వ. ఇట్లు గొడుకు ముష్కరుం డై యరిగిన, ధృతరాష్ట్రుండు గాంధారి రావించి. 81

క. తగ విదురుఁ బంచి యాతని
మగుడఁగఁ బిలిపించె; నాయమయుఁ దనయునకుఁ
వగయును గూర్మియు వెరవును
మిగిలిన వచనముల సంధి మెయికొనఁ జెప్పెన్; 82

వ. ఎవ్వ రెంత సెప్పినను గైకొనక కడంగి, దుర్యోధనుండు దనకుం గలవా రల నెల్లను గురుక్షేత్రంబునకు నడవుం డని చెప్పం బనిచె; భీష్ముని సేనాముఖంబు సేసికొని యెత్తి విడియం గలవాఁ; డిది ధార్తరాష్ట్రుల నిశ్చయం; నేనును నాయోపినంత సామవాదంబు లాడితి; నారదాది మహాములును సుయోధనునకు బుద్ధులు సెప్పినట్లు సేసితి; నేమి సెప్పినను నెంతటంబో కున్నం గినుక దెచ్చికొని, జంకించియు భంగించియు ధిక్కరించియుఁ దృణీకరించియుం జూచితిఁ; గార్యంబు భగ్నం బగుట కొల్లక వెండియు శాంతవచనంబులు వలికితి; నతం డశక్త దుర్జనత సేయం జూచిన నమానుషంబు లగువానిం గొన్ని వెడ మాయలం బన్ని పెక్కుపోకలం బోయితి; నెన్నిభంగుల సంధియ

కావలయు నని పౌరలం గలయంతయుం బొరలితి; నప్పాపాత్ముం డెట్లునుం జక్కంబడక, తనచలంబుతోన పొట్టుపొరలయ్యెఁ గయ్యంబు వొడచుం గాని యవశ్యంబును రాజ్యంబు పా లిచ్చువాఁడు గాఁడు; కౌరవులయెడ దండంబు దక్క నొండుపాయంబు లేదు; మీకుం బోలినతెఱంగు సేయుం'' డనిన, ధర్మతనయుండు దమ్ములం గనుంగొని యిట్లనియె. 83

క. ''కురుసభఁ బుట్టినచందము
హరి యంతయుఁ జెప్పె; నింక నను మానము లే;
దరిమర్దనమున కయ్యెడు
వెరవుం జేవయును మెఱయ వెడలుఁడు గడఁకన్.'' 84

వ. అని పలికి యజాతశత్రుండు కరుణాయత్తచిత్తుండై యచ్యుతు నాలోకించి. 85

క. ''కురువంశము ద్రుంచుటకుం
బొరఁజాలక నామనంబు సుడివడియెడు; నే
వెరవును దొరకొనదు గదే
సరసీరుహనాభ! పొందు సంపాదింపన్!'' 86

వ. నామనంబును దమ్ములతలంపును నీ వెఱుంగుదు, ధార్తరాష్ట్రుల చందంబును భీష్మద్రోణవిదురాదులచిత్తంబులు నెఱింగి వచ్చితి, మాకు ధర్మచ్యుతి లేకుండునట్టికార్యంబు నిశ్చయింపు'' మవిన, నారాయణుం డిట్లనియె. 87

ఉ. యుద్ధమ కాక కార్యమును నొండొక డెద్దియుఁ గల్గ నేర్చునే?
బుద్ధులు చెప్పువాక్యముల పోల వినం డన నేల? యట్టిచో
బద్ధునిఁ జేయఁ జూచె ననుఁ బట్టి సుయోధనుఁ; డింక నయ్యసం
బద్ధునితోడిసంధికి నుపాయము నామతిఁ దోఁప దెమ్మెయిన్.'' 88

వ. అని చెప్పి, విదురుం డేకాంతంబున నాడిన మాటలును, భీష్మద్రోణబాహ్లికాదు లగు పెద్దలకు ధార్తరాష్ట్రుల దెసం బుట్టిన మనఃక్షోభంబును,

గుంతి గౌరవులు వినం బలికినపలుకులుం బ్రకటించి, ధర్మపుత్రులపైఁ
బాపంబు లేకునికిఁ దెలిపి, సమరం బవశ్యకర్తవ్యంబుగా నిశ్చయించె;
నట్టియెడఁ దమ్ము లన్నమొగంబునం జూడ్కి నిలిపి యూరకుండి;
రతండు వారలం గలయం గనుంగొని యిట్లనియె. 89

ఉ. "కారవకోటిచేత మనకష్టపుఁబాటు దలంపు వచ్చినం
గ్రూరవిచేష్టితంబునకు గొంతి యొడంబడె; బంధువర్గమున్
ఘోరముగా వధించుటకుఁ గోల్కొన కున్నది బుద్ధి; మీరు ని
ర్ధారణ సేయుఁ డా హితము ధర్మము నయ్యెడు వృత్త మెట్టిదో." 90

వ. అనిన విని యర్జునుం డతని కిట్లనియె. 91

చ. "హితమును ధర్మముం దగవు నిట్టిది నా మన మేమి నేర్తు; మ
చ్యుతుఁడు సమస్తధర్మపరిశోధకుఁ; డావిదురుండుఁ బాండుభూ
పతిసతియుం దగం బలుకుపల్కుల సందియ మెల్లఁ బాసె; ని
ట్లితఁడు రణంబు సేయుఁ డన, నింక విచారము లెల్ల నేటికిన్?" 92

ఆ అనిన, "నట్లకాక, యఖిలధర్మజ్ఞాన
ఘనుఁడు, మనకు నేడుగడయుఁ దాన;
శౌరి నిశ్చయింప సంశయం బేటికి?
సంఘటింపుఁ డుగ్రసమరవిధము." 93

వ. అని యుధిష్ఠిరుండు దమ్ములతో నెట్టకేలకుం దెగువ నెప్పి. 94

క. "బాహాగర్వము వివిధ
వ్యూహవిధిజ్ఞతయుఁ గలిగి, యొకరుం డేడ
ద్రోహిణులు నడపి, భీష్మ్మ
త్సాహంబున కోర్చు చాపధరుఁ డెవ్వఁడొకో! 95

వ అట్టివానికి వాహినీనాయకత్వం బిచ్చి యభిషేకంబు సేయవలయు." 96

తే అనిన సవాచేవుఁ డిట్లను, "నధిప! పుత్ర
పౌత్రసోదరవంతుండు, బాహువీర్య

ఘనుఁడు, మన కాశ్రయం బయి మనిచె; మత్స్య
దేశపతి గాఁడె సేనాపతిత్వమునకు ?'' 97

వ. అనవుడు నకులుండు. 98

చ. ''బలఁగముఁ బెంపుఁ దేజమును బాహుబలంబును నగ్గలంబు, పె
క్కు లెఱుఁగుఁ గార్యఖడ్గములకుం దగు త్రోవలు, ద్రోణులందు భీ
ష్ముల దెసఁ గోపముం గలఁ, డమోఘపరాక్రమశాలి; నీబలం
బుల కధినాథుఁగా ద్రుపదభూపతిఁ బట్టముఁ గట్టు చెట్లొకో !'' 99

వ. అనుటయుం దదనంతరంబ ధనంజయుండు. 100

-: ధృష్టద్యుమ్నాదులకు సేనానాయకత్వంబు నిర్ణయించుట :-

సం. 5-149-18.

సీ. ''అగ్నికుండమున ద్రోణాచార్యునకు నాశ
మొనరించు దానికై యుద్భవించె,
రథరథ్యములు ధనుర్బాణంబులును దను
త్రాణఖడ్గములు నుద్దామలీలఁ
దనతోన జన్మించె, దహనశిఖామూర్తి
భుజవీర్యవిక్రమస్ఫూర్తిశాలి;
సైన్యనాథుండు ధృష్టద్యుమ్నుఁ డగు నని
తలఁచెద; నాతఁడు దక్క నొరులు

తే. భీష్ముతాఁ కోర్వ, రుగ్రంపుబిరుదు, ధైర్య
ధనఘనుండు; శిఖండి భీష్మునకు మృత్యు
వై జనించినవాఁడు మహాబలుండు,
దండనాయకుఁ జేయ నతండు దగును.'' 101

వ. అనవుడు ధర్మనందనుండు గోవిందుం జూపి, ''యితండు సకల
చరాచరతారతమ్యసంవేది; విశేషించి మనకు నితనిమాటయ విజయ

మూలంబు; గావున నిమ్మహాత్ముండు నిరూపించినవాఁడు వరూథినీ
ముఖ్యుండు.'' 102

క. అనుటయు దామోదరుఁ డి
ట్లను, ''ధృష్టద్యుమ్నుఁ డర్హుఁ డగు, నభిషేకం
బొనరింపుము- వేరోలగ
మున నఖోహిణుల కెల్ల ముఖ్యుఁడు గాఁగన్; 103

క. సురగంధర్వఖచరకిం
పురుషాది సమస్తదివ్యభూతంబుల బం
ధురభూరివ్యూహంబుల
విరచనముల నెఱుఁగు; నతఁడు వీరోత్తముఁడున్; 104

క. నీయొద్దిరాజు లందఱు
ధీయుక్తులు విక్రమప్రదీప్తుల యైనన్,
వేయేటికి ధృష్టద్యు
మ్నాయత్తము సేయు సైన్యమంతయు, నధిపా !'' 105

వ. అనిన విని యుధిష్ఠిరుం 'డఖోహిణులకుం బ్రత్యేకనాయకులను నీవ
నిర్దేశింపు' మనుటయు, నతండు. 106

తే. సేన దమకును గలవారు లేనివారు
ననక తగువారిఁ జెప్పెద; నఖలసమర
పండితుల నేరి వారి నీబలము లేఁడు
నడపఁ జాలించి యభిషేచనం బొనర్పు; 107

వ. అనిన, ''నట్ల చేయుదు, వా రెవ్వ రెవ్వరు నిరూపింపు'' మని యడిగినఁ,
గుంతీనందనునకు దేవకీనందనుం డి ట్లనియె. 108

సీ. ''పటుపరాక్రమనిధి పాంచాలపతియు, న
మానుషతేజుండు మత్స్యవిభుఁడు,

శత్రుభీకరమూర్తి సాత్యకియును జరా
సంధాగ్రతనయుండు శౌర్యఘనుఁడు
సహదేవుఁడును, ధైర్యశాలి యాదవశిరో
మణి చేకితానుండు, మహితవిభవ
ఖని యగు శిశుపాలతనయుండు దోర్దర్ప
ధుర్యుండు ధృష్టకేతుండు, సమర

తే. లంపటుండు శిఖండియు లావు వెరవుఁ
గలరు; నీయెడ ననురక్తి గలరు; సాలఁ
బెంపు గల; రుక్కుముట్టిన తెంపు గలరు;
కోరి పతులుగఁ జేయు మఖోహిణులకు." 109

వ. అని దండనాథుల నిశ్చయించి వెండియు. 110

క. "కురుసైన్యము నిస్సారం,
బరయఁగ మనబలము లెల్ల నతిదృఢములు; నీ
వరవాయి గొనక నడపుము
ధరణీశ్వర! సేన మొగము దైవము నీకున్! 111

క. నీయనుజులు దివిజులకు న
జేయులు; ధృతరాష్ట్రసుతులఁ జెఱుచుట వ్రేఁగే?
తోయజనాళము గజలీ
లాయత్తము గాదె; యెత్తు మాహవమునకున్!" 112

వ. అని నిర్ణయించి నారాయణుండు నిజనివాసంబునకుం జనియె; ధర్మ
తనయుండు దమ్ములుం దానును బ్రియం బంది యారాత్రి సుఖనిద్ర
సేసె; రేపకడయ పాండవాగ్రజుం డనుజతనుజదనుజాంతకసామంత
మంత్రిపురోహితసహితంబుగాఁ బేరోలగంబున నుండి సమస్తపరివారం
బును వినఁ గార్యంబు నిశ్చయంబుఁ దెలియం బలికి, తగువారలతో
సముచితసంభాషణంబులు సేసి, మహనీయమహిమ వెలయం, బుండరీకా
తుండు పనిచినట్ల పాంచాలనాథప్రముఖుల నఖోహిణులకు నధిపతులుగా

వేరువేర యభిషేకించి, శ్వేతవంశజాతుం డగుటంజేసి శ్వేతుం డనం
బ్రఖ్యాతుం డగు ధృష్టద్యుమ్ననకు నుత్కృష్టప్రకారంబున నభిషేకం
బొనర్చి, సర్వసేనాధిపత్యంబునకుం బట్టంబు గట్టి, యయ్యోనమంత్రను
దక్కటిదొరలను గనుంగొని మధురవాక్యంబుల నగ్గించి, కౌరవులతోడి
కయ్యంబునకుం గురుక్షేత్రంబునకు విడియం బోద మని చెప్పి, వారి నెల్ల
ధనంజయునకుం జూపి, 113

ఉ. "ఎప్పుడు నెయ్యడం బొదివి యిందఱుకుం దగ నీవు కంటికిన్
జెప్పయుఁ బోలె మా టయి, నెఱిం బను లారసి, యొజ్జచాడ్పునం
జెప్పుచు వీరిబుద్ధి గొని చేయుము కార్యము; నీకు రక్తుగా
నిప్పరమేశ్వరుండు గలఁ డిచ్చు శుభం" బని చూపెఁ గృష్ణునిన్. 114

వ. ఇట్లు గాంభీర్యమాధుర్యధుర్యం డైన యుధిష్ఠిరుండు వరిష్ఠప్రభువుల
చిత్తంబు లారాధించి సర్వజనసమ్మతంబుగా సమరోత్సాహంబు నేసి
మహోల్లాసంబునం బ్రస్థానభేరి సఱువం బంచిన. 115

సీ. బీఱెండతాఁకున బీటలు వాఱిన
పచ్చిగోడల మాడ్కిఁ బగిలె దిశలు,
కాఁగిన యెసరుల కరణిఁ బొరిందొరి
శరనిధు లుప్పొంగి పొరలఁ బడియెఁ,
గలముపైఁ గీలించి గాలి కెత్తినచాఁప
వోలె మిన్నంతయు బూరటిల్లెఁ,
గులపర్వతావలి గులిశభయంబున
బెదరి వాపోవు నక్లెదురు సెలఁగె,

తే. ధాత్రి కుమ్మరిసారె విధమునఁ దిరిగెఁ,
చిత్రరూపులభంగి నిశ్చేష్టితంబు
లయ్యె సర్వభూతములుఁ- బ్రయాణభేరి
భూరినిష్ఠురఘోరభాంకార మడర ! 116

-: పాండవులు గౌరవులతోడి యుద్ధంబునకు వెడలుట :-

సం. 5-139-49.

వ. ఇట్లు ప్రస్థానభేరి సెలంగిన సకలసైన్యంబులు దండనాథ సహితంబుగా సన్నద్ధంబు లయ్యె; మఱునాఁడు. 117

ఉ. భూరివిభూతిఁ బెండ్లికిని బోవుతెఱంగునఁ బాండునందనుల్
దారును బుత్రులున్ హరియుఁ దమ్ముఁడు నుజ్జ్వలచారులీలశృం
గారము సేసి, సమ్మదవికాస మెలర్పఁగ వీరసంభ్రమో
దార సముద్ధతిం జనిరి- ద్రౌపది యున్నెడ కందఱుం దగన్. 118

వ. ఇట్లు సని యమ్మహాదేవి నామంత్రణంబు సేసి, తత్పరిభృతి పుణ్యస్త్రీ కరకలితలలితాక్షతంబులు గైకొని, విప్రాశీర్వాదంబు లాదరించుచు, భద్రపాఠకశ్లోకంబు లాకర్ణించుచు, శోభనపదార్థంబులు గనుంగొనుచు, నాంగికమాంగల్యసూచకంబులు సేకొనుచు వెడలునప్పుడు. 119

క. తగ శంఖకాహళాదిక
మగు మంగళతూర్యసంచయము గంభీరం
బుగ ద్రోసె- జయముఁ దెలుపుచు
జగతీశ్వరుద్రోల నాకసము దీటుకొనన్. 120

క. మను మని జయప్రయాణం
బనుమోదింపంగ నాసుధాంశుఁడు సనుదెం
చినకరణి గొడుగు కుంతీ
తనయాగ్రజుద్రోల నతిసితప్రభ నొప్పెన్. 121

వ. అట్టియెడ నమ్మహీవల్లభుండు. 122

క. ఉచితగతిఁ జేరి వంది
ప్రచయము గీర్తింప నెక్కె రథమం దొనరన్

ఖచియించిన వజ్రంబుల
రుచులను బొలుపారు సీవిరులు బెరయంగన్. 123

వ. తదనంతరంబ. 124

సీ వక్షస్థలంబున వనమాల గ్రాలంగ,
వెలిమావుగెడల వాగెలు ధరించి,
నొగలపై హరి యొప్ప, నగచరకేతువు
మెఱయంగ నరదంబు మెఱుఁగు లడర,
దివ్యకిరీటంబు దీప్తులు భూనభో
తర మెల్లఁ గలయంగఁ బరగుచుండ,
గాండీవతూణయుగ్మములు పూర్వాపర
భాగంబులకు నవాభరణములుగఁ,

తే. దెలిమొగంబుతో నల్ల నేతెంచి, యొక్క-
పార్శ్వమునఁ బొడసూపి భూపతికి మ్రొక్కి,
దేవదత్తంబు పూరించె- దేవదేవు
పాంచజన్యంబునకు మున్న ఫల్గునుండు. 125

శా. భీముండుం గవలుం గుమారులును సంప్రీతిఁ గదాద్యాయుధో
ద్దామ స్ఫీతరుచుల్ వెలుంగ, రథసంతానంబు రమ్యోజ్జ్వల
శ్రీ మీఱం దగవచ్చి, శంఖములు గర్జిల్లంగఁ బూరించుచున్
భూమీశుం గని యగ్రభాగమున కొప్పుం బెంపునుం జేయుచున్. 126

క. నిలిచిరి; తక్కటిదొరలును
బలుమానులును మహోగ్రభంగి సవరణల్
సెలువొంద నధిపుచుట్టుల
నలంకరించిరి విభూషణాంశుచ్ఛటలన్. 127

వ. అప్పుడు పాండవాగ్రజున కభిముఖంబుగాఁ జనుదెంచి. 128

క. సాష్టాంగ మెఱఁగి, సమరా
నష్టంభం బొప్ప, దివ్యవాహనలీలో
త్కృష్టగతిన్ ముంగలియై
ధృష్టద్యుమ్నుండు వొలిచెఁ దేజోమహిమన్. 129

వ. ఇవ్విధంబునం జారుభీషణంగా సన్నద్ధంబై యుధిష్ఠిరుండు గదలి, శుభ శకునంబులు గైకొనుచు నడచె; నట్టిసమయంబున నెల్ల వారి పరిచారకులును శకటాదిసకలసాధనంబులును బటగృహంబులు మొదలుగా వలయు సమస్తవస్తువు లొడఁగూర్చి వెడలినదండు పఱపై సముద్రంబు గాఁపు వోవుచందం బయ్యె; నిట్లరిగి ధర్మపుత్త్రుండు కురుక్షేత్రంబు దటీయంబొచ్చి, ఋష్యాశ్రమంబులకు దేవతాయతనంబులకు నలజడి గాకుండ బరివారంబు సేయుచుం జని, తృణకాష్ఠజలసమృద్ధంబై తగియెడు సమస్థలంబున హిరణ్వతి యను పుణ్యనదిపొంత విడిదలగా నిరూపించి యచ్చో నిలిచెఁ; దదనంతరంబ, 130

తే. విడియుటకు సూచకంబుగ విష్ణుఁ డొత్తెఁ
బాంచజన్యంబు; ధర్మ్మజ పార్థు లాది
గాఁగఁ దమతమ వీరశంఖంబు లెల్ల
దొరలు నొత్తిరి- దివి మ్రోఁతఁ దూఁటు గట్ట; 131

వ. తదనంతరంబ, యొక్క రమ్యప్రదేశంబున రాజమందిరంబును- నుచిత స్థానంబుల సమస్తజననివాసంబులునై, రమణీయబంధురంబును సింధు రాశ్వశాలామాలికామనోహరంబునుం గా వీడెల్ల విడిసె; వీటిచుట్టునుం దిరిగి ధృష్టద్యుమ్నుండు సురక్షితంబు చేసి వచ్చె; రాజును దొరలును దమ్ములును సకలపరివారంబును దగినతెఱంగున నుండిరి; నానావస్తు బహుళసంభారంబులమహోదారం బగుచుఁ బాఁడవస్కంధావారంబు మహనీయాకారంబున నొప్పె; నంత నక్కడ. 132

క. చారులచే నంతయు విని,
కారవపతి విననియట్ల, కర్ణాదులతోఁ
బేరోలగమున విగతవి
కారుండై యిట్టు లనియె గర్వ మెలర్పన్. 133

క. "తన వచ్చిన కార్యము మన
మనుకూలతఁ జేయకున్న, హరి యలుక మెయిన్
జని, యప్పాండుతనూజులు
మనములఁ గిను కూనునట్టిమాటలు సెప్పున్. 134

చ. మును మనచేత భంగపడ, ముచ్చిరియుండుటఁ జేసి, పాండునం
దనులును నెత్తివత్తు- రుచితంబుగ సంగర మెట్లుఁ గల్గుఁ; బే
ర్చినబహుసైన్యముల్ బయలఁ జేరఁ దగఁ విడియింత మెల్లిదం
డని పురిఁ జాటఁ బంచి, దొర లందఱకున్ బడిసేయుఁ డేర్తెఱన్. 135

వ. మనకు విడిదల కురుక్షేత్రం" బని బలికి, దుశ్శాసనుం జూచి "నీవును
గర్ణుండును గాంధారపతియును సమస్తంబును సమకట్టుం" డనుటయు,
వారలు ప్రియంబునం బని వూని వెడలి, దండు సాటించి తగువారల
కెల్ల నెఱింగించి వుచ్చిన, సకలపరివారంబును బ్రమోదంబు నొందె;
భూవల్లభుండును గొలిచియున్నవారలం బోవంబంచి వలయునెడకుం
తగిన వర్తనంబున నుండె; నట్టిసమయంబునఁ బ్రయాణోచితంబు లగు
బహుప్రకారవ్యాపారంబులయందుఁ దత్పరు లయినదొరల నానాచేష్టి
తంబులను, గరితురగరథంబులకు సవరణలు సమకూర్చు చతురపరిచార
కుల సంభ్రమంబునను వివిధాయుధంబులు రవణంబులుగా నాయితంబులు
సేయఁ బ్రవర్తించు పదాతివర్గంబుల సంరంభంబునను, నయ్యె
సరకులు పయనంబున కనువు సేయు బలుమానుసుల తిరుగుడువడుటనుం
బురంబు సమరోత్సాహచంద్రోదయంబునకు మహార్ణవంబై ఘూర్ణిల్లు
చుండెఁ; నపరదిన ముఖంబున. 136

క. త్వరితగతి సమయ సముచిత
కరణీయము లాచరించి, కమనీయాలం
కరణోజ్జ్వలుఁడై, యెలమిం
గురురా జేతెంచెఁ గొలువుకూటంబునకున్. 137

వ. వచ్చి దుర్యోధనప్రముఖ నిఖిలసహోదర పరివృతుండై యుండి, 138

-: దుర్యోధనుఁడు ద్రోణప్రభృతుల సేనాపతులం జేయుట :-

సం. 5-152-27.

సీ. "అరిభయంకరుఁడు ద్రోణాచార్యుఁడును, రణో
త్సాహలంపటుఁడు రాధాసుతుండు,
శరతత్తవేది యశ్వత్థామయును, భూరి
బాహావిలాసుండు బాహ్లికుండు
శౌర్యవైభవశాలి శల్యుండు, ధైర్యసం
పన్నిధి గృపుఁడును, ప్రకటశక్తి
సారదుర్జయమూర్తి భూరిశ్రవుండును,
దరోన్నిజ్జ్వలుండు గాంధారపతియు,

తే. నుగ్రతేజుండు గృతవర్మయును, ప్రతాప
ఘనుఁడు గాంభోజుఁడును, బరాక్రమధనుండు
సింధురాజును, బతులుగాఁ జేయఁగోరి
కొనఁగఁ దగువార లగుదు రఖోహిణులకు." 139

చ. అని మది నిశ్చయించి తగ నందఱఁ బిల్వఁగఁ బంచి, వారితో
ననిపని మాటలాడి వినయంబునఁ ప్రార్థన సేసి, "మీర లీ
యెనరిన సైన్యముల్ పదునొకొంటికిఁ ప్రాభవ మాచరింపఁ జొ
చ్చినసకలంబు నొప్పు, నభిషేకము గైకొనుఁ డుత్సవంబునన్." 240

క. అనవుడు నందఱు 'నౌఁగా'
కని సంతస మంద, నధిపుఁ డభిషేకించెన్ -

జనులెల్ల సంప్రమోదం
బునఁ బొందఁగ నప్పు డతివిభూతి దలిర్పన్. 141

వ. ఇట్లు మహామహిమ వెలయ నక్షోహిణీవాయకుల సమకట్టి, రారాజు పితామహుపాలికి వారిం దోడ్కొని చని, సవినయంబుగా నతనికిఁ బ్రణామంబు సేసి వారలం జూపి, "వీరల మనయక్షోహిణులు పదునొకొంటికిం బతులఁ గావించి, నిన్ను సైన్యంబులు నొక్కలావున వర్తించు చందంబు సూచికొన వలయు" నని చెప్పుచుఁ జేతులు మొగిచి యిట్లనియె. 142

చ. "నెఱిఁబడి యాజి నీమొనలు నేరవు గూడి తగం జరింప, నిం
దఱమన సొక్కఁడై చనక తప్పుఁ గదా, బహుదేశవాసు లం
ద ఱొకటి సేయుచో వెరవు దప్పక చెల్లుట యెట్లు గల్గు; ని
త్తెఱఁ గొకచాలు వాని బలుతీర్పునఁ గాక పొసంగ నేర్చునే? 143

ఆ. అమరసేనలును దమంతన వర్తింప
నేరకునికి, వాకు మారుమొగము
గా నొనర్ప వలసెఁ గాదె: సమస్త సే
నలను నీవ యరసి నడపవలయు! 144

క. తారలకుం జంద్రునిగతిఁ
గౌరవులకు మేటి వీవ; కావున నీ వీ
భారంబు పూని మముఁ గడ
చేరుపఁ దగు నెమ్మెయిం, బ్రసిద్ధచరిత్రా! 145

తే. సర్వసేనాధిపత్యంబు నిర్వహింప
నీవు దక్క, నిం దొక్కరు నీవ యరసి
పంపుమా కలఁడేని; రక్షింపు మమ్ముఁ,
బూని పట్టంబు దాల్పుము, పొడిచి గెలుము!" 146

వ. అనిన విని గాంగేయుండు గాంధారేయున కిట్లనియె. 147

ఆ. మీరుఁ బాండుసుతులు నారయ నా కొక్క
రూప; కార్య మున్నరూపు వలుక
వలయుఁ; గయ్య మైన వత్తు; మీలోన నా
యునికిచందమునకు నుచిత మిదియ : 148

క. సేనాధిపత్యమును దగఁ
బూనెద; నను మార్కొనంగఁ బురుషుల నుర్విం
గానఁ; గిరీటికి నొక్కని
కే నోర్వ; నతండు శరము లెక్కఁ డెఱుంగున్; 149

క. పెఱవారి నెల్లఁ దరమిడి
నఱకుదుఁ; బాండుఖీతీశనందనులను రూ
పఱసేయం జేయాడదు;
దఱుమరు నామీఁద నత్యుదగ్రత వారున్; 150

వ. అప్పటికిఁ దగినభంగి యయ్యెడు నది యట్లుండని" పలికి మఱియు నిట్లనియె. 151

ఆ. "మున్ను కర్ణు నొండె సన్నొండెఁ గయ్యంబు
సేయఁ బనుపు; మిట్లు సేయువాఁడ
వైనఁ గాని సకలసేనాధిపత్యంబుఁ
బూనఁనేర ఁజుమ్ము భూపవర్య !" 152

వ. అనినం గర్ణుండు గారవపతితో నిట్లనియె. 153

క. "ఇప్పుడు గ్రొత్తగ దీనిం
జెప్పంగా నేల? మున్న చెప్పితిఁ గాదే?
యెప్పుడు భీష్ముఁడు వడు- నే
నప్పు డనికి వచ్చువాఁడ నని సభలోసన్." 154

ఆ. అనిన, నట్లకాక యని సర్వసేనాధి
పత్యభారపట్టబంధమునకు

నియ్యకొనియె భీష్ముఁ; డయ్యగ్గలికఁ గొని
యాఁడె విభుఁడు ప్రముదితాత్ముఁ డగుచు 155

క. భేరీమృదంగశంఖమ
హారవములు సెలఁగఁ జేయుఁ డని పనిచి, మహో
దారపతాకాద్యుత్సవ
గౌరవములు నడపె- నెల్లకడలం బురిలోన్. 156

వ. అట్లు పట్టణాలంకారంబు సంఘటించి, రత్నకాంచనకలధౌతమయంబు లగు కలశంబులఁ దీర్ణజలంబులు దెప్పించి, మణిప్రకరంబునఁ గుసుమనికరంబున మంగళతరుత్వక్పల్లవ ప్రచయంబున మహౌషధినిచయంబున విహితమంత్రంబుల నుచితతంత్రంబుల ఋత్విక్పురోహితసహితుండై తత్సంస్కారప్రకారం బాచరించి, 157

క. గురుఁడును గృపుఁడు లోనగు
గురు లనుమోదింప, బాహ్లికుండు మొదలుగాఁ
గురుజాతి యెలర్పఁగ, న
న్నరపతి భీష్మాభిషేచనం బొనరించెన్. 158

తే. ఇవ్విధంబున నభిషేక మెలమిఁ జేసి,
పరమభక్తి నఱోహిణీపతులఁ జూపి,
'వీరికిని సైన్యములకును మీర యొడయ'
లనుచుఁ బట్టంబు గట్టె శంతనతనూజు. 159

క. అ తఱిఁ బాషాణంబులు
నెత్తురు నెమ్ములను గురిసె నిష్ఠురనినదా
యత్త మయి నభము; పిడుగుల
మొత్తంబులు వడియె నగరమున నెల్లెడలన్. 160

క. దానికి జను లుత్పాత
హీనతఁ బొందంగఁ, గౌరవేంద్రుఁడు నానా

దానాదు లయిన శాంతివి
ధానము లొనరించి యానతత్పరమతివై. 161

క. తల్లియుఁ దండ్రియు వెఱఁగునఁ
బులవడన్, వారికడకుఁ బోయి తడయఁగా
నొల్లక, పయనపు విడ్కొ
లెల్లను దనయిచ్చి నడపి యేడ్తెఱ వెడలెన్. 162

తే. వెడలి తమ్ములుఁ దగువారు వివిధభృత్య
గణముఁ దానును నేల గ్రక్కదలఁ గదలి,
రాజరాజు గాంగేయుఁ బురస్కరించి
కొని సముద్ధతి నడచె దిక్కులు వడంక. 163

వ. నడచి కురుక్షేత్రంబు దటీయం బొచ్చి, యందొక్కరమణీయప్రదేశంబు విడిదలగా నిరూపించి నిలిచి, భానుసూనుండునుం దానును మెలంగి యెల్ల వారిని విడియించి, నడుమ నిజనివాసంబు గావించినఁ గౌరవేశ్వరుస్కంధావారంబు వారణపురంబున నెవ్వ రెయ్యెడ వసియింతు రాచందంబున నందంబై యొప్పె; నిట్లు రెండుపీళ్లును సన్నద్ధంబు లైనసమయంబున. 164

ఉ. సంధికి నేఁగి కార్యము పొసంగక కృష్ణుఁడు రాకయుఁ, సుహృ
ద్బాంధవసంఘయుక్తముగఁ బాండవకౌరవవీరు లష్టది
క్సింధురకంధరంబు లడఁగించు బలంబుల పెల్లుతోడ గ
ర్వాంధత నాజి కెత్తుటయు, నాబలభద్రు డెటింగి యార్తుఁడై. 165

-: బలరాముఁడు పాండవుల వీడ్కొని తీర్థయాత్ర వోవుట :-

సం. 5-154-15.

వ. కతిపయవారంబు పరిహేష్మింప రయంబునం జనుదెంచి, సముచితప్రకారంబున ధర్మనందనుం జేరోలగంబునం గని సంభ్రమాలింగనాసనార్ఘ్య

పాద్యంబుల నతనిచేత సంభావితుం డయి, దా మోదదభీమార్జుననకుల
సహదేవులయభివాదనంబు లాదరించి, పాంచాలవిరాట్ప్రముఖు లగు
తగువారల వినయంబుల నభినందించి, యాదొరలతోఁ దత్కాలయోగ్య
మితసంభాషణంబులు సేసి, యనంతరంబ వారల కిట్లనియె. 166

క. "కారణపాండవు లెంతయు
గ్రూరత వాటించి, బంధుకోటికి నిఖలో
ర్వీరమణులకుం జేటుగఁ
బోరికిఁ దెగి; రిట్టిఘోరపుంబని యగునే? 167

తే. ఇట్టిదానికి నోర్వక, యెన్నఁడేనిఁ
గృష్ణతోడ నేఁ జెప్పితిఁ- గినిసి యిరుదె
ఱంగువారికిఁ దగఁ జెప్పి సంగతంబు
సేయు మని- యెంత సెప్పినఁ జేయఁ డయ్యె! 168

క. పలుకులపొం దెఱుఁగనివా
రలఁ బూజావాక్యములఁ దిరంబై తనకుం
దెలుపం దగదే? యేమని
యలుకమెయిఁ సంధి సెఱిచి హరి యేతెంచెన్? 169

తే. వీరు వారును సంబంధవిషయబంధు
లగుట సరి గాదె హరికిఁ? దా నర్జునునకుఁ
బతుపాతంబు సేయుటఁ బాండవులను
బెట్టుచోటులు గానక, పట్టి క్రాలు. 170

ఉ. కావున వీరికిఁ జయము గల్గుట నిశ్చయ; మెల్లభంగులం
జూవు నిజంబు వారికి; నసంశయమై యిటు లుండ దీని నె
ట్లే వినఁ జూడ నేర్తుఁ? దగ నింతప్రవీణుల నేన చేసితిం
జూవె సుయోధనుం బవనసూనుని? నొఁ డొరుఁ జంపఁ జూతునే? 171

క. హరి యెఱుఁగని చక్కటియుం
బురుషార్థము నా కెఱుంగఁ బోలునె? యీని
ష్ఠురత వినఁ జూడఁ జాలక,
సరస్వతీతీర్థమునకుఁ జనియెఁబుద్ధిన్. 172

వ. మీకుం జెప్పి పోవచ్చితిఁ, బోయి వచ్చెద" నని పలికి, బలదేవుండు వాసుదేవ ధర్మపుత్త్రి లొడంబడి యనుపఁ, దీర్థయాత్ర వోయెఁ; దదనంతరంబ. 173

-: రుక్మి వృత్తాంతము :-

సం. 5-155-1.

సీ. కృష్ణునిదేవి రుక్మిణిసోదరుఁడు, రుక్మి
యనురాజు, బలవిక్రమాన్వితుండు
శార్ఙ్గ గాండీవ విజయములు నాఁ గల
దివ్యచాపములఁ దృతీయ మైన
చాపంబు గలవాఁడు, సైన్యసమేతుఁడై
చనుదెంచి ధర్మజుఁ గని, తదీయ
సత్కారములు గాంచి సముచితాసనమున
నుండి, యక్కొలువున నున్నవీరు

ఆ. లెల్ల వినఁ గిరీటి కిట్లను, "సమరంబు
సేయ వెఱచి తేనిఁ జెప్పు, నాకు
నెదురు లేరు జగతి నెవ్వరు, నీకుఁ ద్రో
డ్పడి జయింతు నెట్టి పగఱ నైన:" 174

వ. అని తన్ను నాక్రమించి తనతోఁబుట్టువు రుక్మిణిం గొనివచ్చిన యా కృష్ణుసన్నిధిన సిగ్గులేక యాడినమాటలు విని, చిఱునవ్వు నవ్వుచుం గవ్వడి యతనియాననం బాలోకించి. 175

తే. "చెనసి గంధర్వసేన నిర్జించునపుడు,
మత్స్యనాథు గోవర్గంబు మరలఁ దెచ్చు
నెడను దప్పె, నీకందువ యెఱుఁగ నైతి;
నింక నౌఁ గాని తోడు గ మ్మెచటికైన." 176

వ. అని యతనిఁయుత్తరమునకుఁ దగినయట్ల పలికి మఱియును. 177

క. "ము న్నే నసహాయుఁడ నై
చన్నగతిం జనఁగ నైనచందం బయ్యెన్;
వెన్నుఁడు దోడుగలఁడు; వెఱు
వెన్నఁడును వలవ దింక నేమిటి కైనన్; 178

చ. వెఱచితి రాఁగదే యనిన వెండి కదా పగఁ దీర్తు నీవు? నా
వెఱు పెటులున్న నీరథికవీరులు వాపెవ- రొల్ల నిన్ను; నీ
యుఱుకడ కేఁగి తోడుపడు మొడ్లకు నెవ్వరికేని" నన్న, నే
డైఱు నతఁ డేఁగి కౌరవపతిం గని యట్టుల బెట్టు వల్కినన్. 179

క. అతఁ, "డివి యేటిమాటలు
నీతోడగు టొల్లఁ బొ" మ్మనిన, రుక్మి వృథా
యాతాయాసవిషణ్ణుం
డై, తనపురమునకు మగుడ నరిగెం బెలుచన్. 180

తే. ఇట్లు బలదేవరుక్మిల కిద్దఱకును
గయ్యమునకు సన్నాహంబు గలుగ దయ్యెఁ;
గాని తక్కులోకంబునఁ గలుగు నృపతి
కోటి యిరువాగు- నందును గూడె ననికి. 181

వ. అట్టియెడ నిశాసమయంబున ధృతరాష్ట్రుండు సంజయు రావించి
యిట్లనియె. 182

క. "బవరము గీడని యెఱుఁగుదు:
నవినీతుం డైన కొడుకు నదలిచి యుడుపం
దివిరియు, నోరాడమి దై
వవశం; బప్పనికి మనకు వగ పిం కేలా? 183

క. ఎయ్యది గానున్నది యది
యయ్యెడుఁ- జేయునది గలదె? యవనీశులకుం
గయ్యానఁ జచ్చుటయు మే;
లయ్యెప్పుట లెస్స గాక, యది యట్లుండెన్: 184

వ. రెండుపిల్లును గురుక్షేత్రంబున విడిసినపిదపం బుట్టినవిశేషంబులు గలవేని నెఱింగింపుము." 185

-: సంజయుండు ధృతరాష్ట్రునికి కులూకుఁడు పాండవుల నాడిన మాటలు సెప్పుట :-

సం. 5- 57-1.

తే. అనిన సంజయుఁ డిట్లను, "నకట! కొడుకు
మీఁదఁ దప్పు వెట్టెదవు, నీమీఁదికొఱత
నీకుఁ గానంగ వచ్చునె? నీ వెఱుంగ
కుండఁ బఱచెనె యాతండు పాండుసుతుల? 186

వ. ఆపని గడవంబడియె; వార్తలు వినియెదవేని వినుము; దుర్యోధనుండు దుశ్శాసనశకునికర్ణులతో విచారించి యులూకుం బిలిపించి, 'నీవు వోయి పాండవులం గని వాసుదేవుసన్నిధిని భాంచాలవిరాటప్రముఖులు వినఁ బలుకు' మని పరుసనిమాటలు గఱపి పుచ్చిన, నతండును. 187

క. చని, కొలువున ధర్మసుతుం
గని, "దుర్యోధనుఁడు సెప్పఁగా ననుఁ నియమిం
చినమాటలు గొన్ని గలవు;
వినుమలుగక" యనిన, నతఁడు విని యిట్లనియెన్. 188

ఆ. "నీకు వెఱవ నేల? నిన్ను నాబుద్ధిమం
తుండు సెప్పు మనిన తులువమాట-
లెన్ని గలవు వాని నన్నింటి- ననుమాన
మింత లేక యాధు మెల్ల వినఁగ; 189

వ. అనిన నులూకుం డిట్లనియె. 190

సీ. "కయ్యంబునకుఁ బెద్దకాల మేనియుఁ బూఁచి
పట్టి వచ్చితి కడుబరవసమున,
సంజయుతో మీరు శంక లే కాడిన
యెక్కుడుమాటలు పెక్కు గలవు;
భూమిభాగము గోలుపోయిన యలుకకు,
ద్రౌపది బన్నంపుదైన్యమునకుఁ
దగ మంచి బంటపై తఱి యిది బాహుబ
లాస్త్రవిద్యలు సూప నని తలంచి.

ఆ. నిలువ వలయు; నీకుఁ గలవారి నెల్లను
గూర్చి మోహరించికొని కడంగి
నడవు సమరమునకు, వెడ జంకఁ బో, దింకఁ
దప్ప గ్రుంక లేదు; తఱికిఁ జొరుము; 191

క. ఆతతబలుఁ డగు భీష్ముని
చేతిబలువు, ద్రోణునంపెసెల లవియుటయుం
జూతు- రటు రండు; కృష్ణుని
చేతన సకలంబుఁ జక్కఁ జేసికొనుండీ. 192

క. వారిద్దఱ వాలమ్ముల
ధారిం బడి యర్జునునకు బ్రదుకవశమె? మీ
వారెల్ల నెఱుంగరె య
వ్వీరులదివ్యాస్త్రశస్త్రవిభవసమృద్ధుల్!" 193

వ. అని భీమసేనుం జూచి. 194

క. "ఈవాయుపుత్రుఁ- 'డాజిం
ద్రావుదు నే దుస్సనేనుర క్తం' బనియెం;
ద్రావఁగ శక్యంబేనిం
ద్రావు మనన్ రాదె? యింకఁ దడ వేమిటికిన్? 195

ఈ. విను, నూతికప్పవిధమున
నిను నీవ యెఱుంగు, దెఱుఁగనేరవు గర్వం
బున నావలికొలఁది; రణం
బున నొకమరి పెట్టువడక పో నేర్చెదవే?" 193

వ. అని పలికి సవ్యసాచిం జూచి. 197

తే. "వినుము, గాండీవ మనునొకవిల్లు తాటి
పొడవు గలిమియుఁ, గృష్ణుండు పూని తోడు
గూడుకొని వచ్చుటయు నెఱుంగుదుము: వీని
కెల్ల శంకించి భూమిపా లీము గాని? 198

క. పవనజుగదయును నీగాం
డివమును నెట వోయె నంగడికిఁ- బాంచాలిం
దివిచికొని వచ్చునెడఁ? బరి
భవ మెఱుఁగవె? బీర మేల పలుకుదు తోడ్తోన్? 199

చ. వలలుఁ డనన్ విరాటుకడ వంటలవాఁ డయి భీముఁడున్, బృహ
న్నల యన నాఁడు పేడి వయి, నాన యెకింతయు లేక నీవు, న
గ్గల మగుదైన్య మొంది కడుఁగాఱీయ వొందితి రుర్వి యేలు నా
సలఁ బడి; సవ్యసాచి! యిది శౌర్యమె బాహుబలంబొ చెప్పుమా? 200

ఉ. మాయలు నింద్రజాలములు మాధవుఁ డిందును గొన్ని వన్నినన్,
వాయుపు రజ్జు లెప్పుడు నవారణ నీవెటు లాడితేనియున్,

వేయును నేల పార్థులును విష్ణులు వేపదివేలు వచ్చినం,
జేయుదు మేము గయ్య; మొకచీరియు సంపదఁ బంచి యిత్తుమే?" 201

వ. అనిన విని, భీమార్జున నకులసహదేవు లొండొరులమొగంబులు సూచుచు,

నాననంబులు చలింప, మొగఁబులు జేవుటింపఁ, గ్రోధాయత్తచిత్తులై
యున్నం గనుంగొని నవ్వులు, నారాయణుం డులూకున కిట్లనియె,
"నీవు వోయి సుయోధనుతో నెల్ల వారును విని నిట్లనుము, 202

తే. బవర మెల్లియ, బిరుదవై బరవసంబు
గలిగి చావుము, చావక తొలఁగరాదు;
కృష్ణసారథికం బగు జిష్ణురథము
దొడరి నీ వెందుఁ జొచ్చినఁ దోన చొచ్చు 203

క. రిత్తలు రజ్జెడువాఁడే
మత్తగజాయుతబలుండు మారుతి? యని ను
ద్వృత్తుఁ డగు దుస్ససేనుని
నెత్తు రురము వ్రచ్చి వ్రావు- నీవుం జూడన్?" 204

వ. అని యిట్లు హరి పలికినయనంతరంబ యర్జునుం డులూకున కిట్లనియె.

క. "వారు గలరు వీరు గలరు
పోరికి నని చెప్పె దీవు పొంగారుచు, మీ
వారిని మిమ్మును రేపు గ
దా రూపేర్పడఁగఁ జూచెదం, గితవసుతా! 206

చ. తనభుజశక్తి లేక యొరుదర్పమ యూఁది పరాక్రమింప వ
చ్చిన- నది సెల్లునే? కులవిశిష్టుని సువ్రతు వృద్ధు నార్యు భీ
ష్ముని నెసకొల్పి, సేనలకు ముఖ్యుఁడ వీ వని యుబ్బఁ జేసి, యీ
సునఁ దలపెట్టి చంపికొనఁ జూచె సుయోధనుఁ; డింత నే మగున్? 207

చ. తనతలఁ పిట్లు- 'భీష్మభుజదర్పము లోకముకంటె నెక్కు, డీ
తని నొకభంగి నండగొని తప్పుదుఁ జూవున' కంచు నున్నవాఁ :
డనిఁ దొలుముద్ద గొందుము రయంబున నాతని; వెండి ద్రోణులం
దునుముదు; మపు సూతసుతుఁ దోలుదు; మంతట నాసమాలెడున్ : 208

క. అనుజుల తనుజుల చావులు
గనుఁగొని, మఱి తాను భీముగదచే నిలఁ గూ
లినయప్పు డైన, దుర్యో
ధనుఁడు మదిం దలఁచుఁగాక తన దుష్కృతముల్ ? 209

వ. అది యట్లుండె, నీవు వేగపోయి రేపకడయ మీరాజుం గలనికి నడిపింపు" మనియె. నప్పుడు ధర్మనందనుం డులూకునకుం దాంబూలాభరణంబు లిచ్చి వీడుకొలిపి, ధృష్టద్యుమ్ను నవలోకించి 'యెల్లి కయ్యం బని మన సైన్యంబుల కెల్ల నెఱింగించి, సర్వసమరసన్నాహంబులు సమకట్టు" మని పనిచి, కొలువు విరిసి చనియె; ధృష్టద్యుమ్నుండును ద్రోణులం దొడరం బడసితి నని యుబ్బుచు వెడలి, భీష్మం ద్రలపడఁ గంటి నని పొంగుశిఖండి దోఁడుగా రాజు శాసనంబు నిర్వర్తించె; నిట యులూకుండు వచ్చి దుర్యోధనుం బేరోలగంబునం గని యతనికిఁ గృష్ణార్జునపలుకు లున్న రూపు విన్నవించిన, నతండు కర్ణుదెసఁ గనుంగొని 'సమస్తసేనలకు రేపు బవరం బని చెప్పిపుచ్చుము, సకలసాధనంబులు నాయితంబులు సేయు' మని పనిచిన, నతండు నట్లచేసె; నిట్లుభయకటకంబులు రణంబునకు నుత్సహించి విజృంభించి యుల్లసిల్లె ననిన, ధృతరాష్ట్రుండు సంజయుస కిట్లనియె. 210

క. "వినుము, హరి తోడుగలయ
ర్జును గెలువ నదీసుతునకు జొప్పడునే ? యా
పని నిలుపు; ములూకునిచె
ప్పినమాటల కేమి యనిరి పిదపఁ గొలుపునన్." 211

వ. అనిన విని, యంబికానందననకు సూతనందనుం డిట్లనియె. 212

ఆ. "అయ్యులూకుపలుకు లన్నియు విని, భవ
త్తనయుతోడ నిట్టు లనియె భీష్ముఁ :
డేను గలుగ వెఱవ నేటికి ? సేనలఁ
గాతు నీవు మెచ్చఁ గౌరవేంద్ర ! 213

క. నడిపింపఁగఁ బొడిపింపఁగ,
నెడమడువై కలఁగి నప్పు డేర్పఱుపఁగ నేఁ
గడు నేర్తుఁ; బేర్చునా దగు
కడిమియ నీసైన్యమునకు గాసెన గాదే ?" 214

క. అనినం గురురా జిట్లను,
"వినుము పితామహ ! మహాస్త్రవిత్తము లనఁగాఁ
జను నీవును నాచార్యుం
డును గలుగఁగ, నాకు నెన్నఁడును వెఱపేలా ? 215

తే. ఏను- గంధర్వ కిన్నరదానవాది
దివ్యభూతంబులకును భీతిల్ల ననినఁ,
బాండుపుత్రుల మాత్రకు భయము నాకు
నెక్కడిది ? ప్రేల్మిడిన వారియుక్కు మడఁతు." 216

-: భీష్ముఁడు గౌరవసేనలో నతిరథమహారథాదుల
నిరూపణంబు సేయుట :-

సం. 5-162-15.

వ. అని పలికి మఱియు నిట్లనియె. 217

క. "నీయందు వారియందుం
జేయం గల మానుసులవిశేషంబులఁ జి
త్తాయత్తంబుగఁ జెప్పుము;
నీయెఱుఁగనియవియు లేవు నిక్కపుఁదరముల్." 218

క. అనవుడు, "నీ విట్లడిగిన
వి ని యూరక యుండఁ దగదు; విను, మేర్పడ నె
ల్లను నున్నరూపు నెప్పెద-
మనవారల వారివారిమానము లధిపా !" 219

వ. అని గాంగేయుం డిట్లనియె. 220

సీ. 'నీ వతిరథుఁడవు, నీతమ్ములందఱు
సమరథశ్రేష్ఠులు, సమరమునకుఁ
బరుసని వీరులు పాంచాలసేన ని
ర్జింతురు; నను నేన చెప్పికొనఁగ
నేర, నాయే డ్తెఱ మీ రెఱుంగుదురు; భో
జాగ్రణి కృతవర్మ యతిరథుండు,
దృఢవేధి; యీతండు దీర్ఘ నెంతటిపని
యైనఁ గైకొని; శల్యుఁ డతిరథుండు,

ఆ. వాసుదేవుతోడి యీసువాఁ- డల్లుర
విడిచె నిన్నుఁ గూడి; విక్రమమునఁ
బేరుకొనఁగఁ జాలు భూరిశ్రవుం డతి
రథుల మొదలి, యనికి రక్కసుండు; 221

క. విను, సైంధవుఁడు మహారథుఁ,
డనిఁ బోక పెనంగు; నతని నాద్రౌపదికై
పెనుపఱఁ బటిచిరి కుంతీ
తనయులు; వారల కెదుర్వఁ దపముం జేసెన్; 222

వ. కాంభోజరా జగు సుదక్షిణుండు సమరథుం, డితనిపాల రథబృందంబులు మేలుగలుగుఁ, బాండవబలంబులం గలంచు; మాహిష్మతీపతి యగునీలుం డర్ధరథుం, డితనికి సహదేవునకుఁ దెగనిపగయై యుండు, దానంజేసి యాలంబున నోల మాస గొనం; డవంతిదేశాధీశు లగు విందానువిందు లర్ధరథులు, పరస్పరస్నేహంబున సాహసికులై యొకళ్లొకళ్లం బెట్టి

పోవకపోరుదురు; త్రిగర్తపతులు దోడంబుట్టువు లేవురును మహారథులు, గోగ్రహణంబునం బడినబన్నంబు బాసికొనం గడంగుదురు. వీరికి భుజ బలం బగ్గలంబై యుండు, 223

క. సమరథుఁడు వీరుడు లక్షణ
కుమారకుం డేచి మొనలఁ గొల్ల నేయున్;
మిము నెల్ల మిగులుభుజగ
ర్వము మదముం గలఁడు, కొనఁ డరాతుల నధిపా ! 224

వ. బృహద్బలుండు సమరథుండు, గోసలబలంబుతోడం గడంగి చిచ్చునుం గరువలియునుం గొని తాఁకు; దండధారుం డర్ధరథుండు, సేనపఱపు గలండు, బెట్టిదంబుగాఁ గయ్యంబు సేయు; 225

తే. అతిరథోత్తముఁ, డివ్వీటియందు మేటి
కృపుఁడు; తనవెంపు వాటించి గెలుచుఁ జచ్చుఁ
గాని, నాలుగుదెఱఁగుల సేనలకును
దివియఁ డించుకయును నరదేవముఖ్య ! 226

క. శకుని విను సమరథుఁడు, పాం
డుకుమారులతోడ నెప్పుడుం బగగొని వా
రికిఁ గీడ రోయు, భృత్యులు
ప్రకటబలులు గలరు నేర్చు బవరంబునకున్; 227

మ. వరదివ్యాస్త్రవిదుండు, బాహుఘనుఁ డశ్వత్థామ గాండీవితోఁ
బురుడింపం దగువాఁడు; వీని కెన యీభూలోకసంచారు లె
వ్వరు లే; రీతఁడు బ్రాహ్మణుండ నని భావం బూనఁగా 'నోర్వమిం
దర మూహింపఁగ లేద కాని, జమచందం బయ్యెడుం బోరులన్; 228

సీ. అతిరథోత్తముఁడు ద్రోణాచార్యుఁ, డందలి
యిందలి విలుకాండ్ర కెల్ల గురుఁడు;

హితుఁడు నీ కెంతయు; నేర్చినమొన లితం
డడరినఁ జమరినయట్ల ప్రమందు;
వృద్ధని యితని భావింపరా- దనిలోన
నంగవిస్ఫురణంబు భంగి సూడ;
నర్జునుపైఁ గూర్మి నతని నో నేయఁడు;
సచరాచరం బైన జగము లెల్ల

తే. నొక్కమొగమై కడంగినఁ జిక్కువఱుచు
దివ్యబాణజాలంబుల దీటుకొలిపి;
ప్రాణములు డాఁపఁ; డీతనిపాటిదొరలఁ
గాన మేరాజ్యములయందుఁ గౌరవేంద్ర! 229

క. అతిరథుఁడు బాహ్లికుఁడు, వినుమతులితబలుఁ; డితనియట్ల యాత్మజుఁడును వి
శ్రుత శక్తి సోమదత్తుం;
డితనికి నీతనికి సమర మెన పెండిలికిన్; 230

క. అసురవరుఁ డీయలంబుషుఁ
డసమానబలుండు, సమరథాగ్రణి; వినుపాం
డుసుతులయెడ రోషము గలఁ,
డసంఖ్యమాయాబలమున నరులఁ గలంచున్; 231

తే. వినుము ప్రాగ్జ్యోతిషాధీశుఁ డనుపమాన
శక్తి, యీభగదత్తుండు సమరథుండు;
గజము నెక్కి తా నేనికకయ్య మైన
నేర్చు- నై రావణమువీఁది యింద్రుఁ బోలి; 232

-: భీష్ముండు గర్ణుని నర్ధరథుం డని చెప్పుట :-

సం. 5-165-3.

వ. గాంధారరాజు లగు వృషుండును నచలుండును సమరథులు, మానిసితనం
బును మానుసులుం గలవారు, వీరి సమరోత్సాహం బజేయంబై యుండు;

సీ. నీకుఁ బ్రెగ్గడయును, నెయ్యంపుఁజెలియు నై
కయ్యంబునకు నెప్డుఁ గాలుద్రవ్వుఁ,
బాండుపుత్త్రులతోడి పగకు ని న్నెసకొల్పుఁ,
గొలువున రజ్జులు వలుకునట్టి
రాధాసుతుం డర్ధరథుఁడు; గుండలములుఁ
గవచంబుఁ బోవుట కారణముగ
బీఱువాఱినవాఁడు, వీఱిఁడి; కృప పెద్ద;
పరశురాముండు శాపమున వీని

తే. యస్త్రవీర్యంబుఁ జెఱిచె, నట్లగుట వీఁడు
పార్థు మార్కొని మానంబుఁ ప్రాణములును
దనకు సొమ్ముగఁ దక్కించుకొనఁగలేమి
యెల్ల వారికి నెంతయుఁ దెల్ల మధిప!" 234

క. అనవుడు గురుఁ డిట్లనుఁ గ
ర్ణునిచందము, "మున్ను గడఁగు, రోయఁడు పాఱన్,
విను మేమరియుండుం, గా
వున నీతం డర్ధరథుఁ డవుం దలపోయన్." 235

వ. అనిన విని రాధేయుండు క్రోధతామ్రాక్షుం డగుచు గాంగేయున
కిట్లనియె. 236

క. ఒంటమిని లేనియొంటర
మింటరములు వల్క టుచితమే? యర్ధరథుం
డంటి ననుఁ; నేమి తక్కువ
గంటి చెపుమ? దీన నీవు గన్నది గలదే? 237

తే. నొవ్వఁ బలుకుదు సభలోనఁ, జివ్వ కొల్ల
కేను గురుపతిఁ జూచి సహించిపోదు,
సురనదీపుత్ర! విను, నాకుఁ జూడ నర్ధ
రథుఁడ వగు దీవు లావు బీరంబు నరయ:" 238

వ. అని పలికి కొలువుఁ గలయం గనుంగొని. 239

చ. "హితుఁ డని నమ్మఁగాఁ దగునె యీతనిఁ? గార్యపుమాట లిట్టివే?
పతిదెస కూర్మి వాపుటకుఁ బట్టుగ నెక్కువ తక్కు వంచు ను
న్నతు లగు మేదినీశులకు నానగఁ బల్కుట గాక? యిట్టివా
రితవులు తండ్రికిఁ సుతుల: కే మన నేర్తుము పెద్దరాజులన్. 240

వ. అని దుర్యోధనుం జూచి యిట్లనియె. 241

ఉ. "కర్జము దప్పె, నీయెదురఁ గష్టపుమాటల కేల యోర్తు? రి
దుర్జనుఁ డైన శాంతనవుదోర్బల మేటిది? యీతఁ డొక్కడున్
వర్జితుఁ డైన నేమి? నృపవర్గము గుందుట యొంటఁ బాయునే?
యర్జునపక్షపాతి యితఁ డాలము మేకొని చేయఁడుంజుమీ? 242

తే. చాలఁగాలంబు వోవక, చతురులైన
వృద్ధజనముల బుద్ధులు విండ్రుగాక,
ముదియ మతి దప్పి, నోరికి నొదవినట్లు
పలుకువెడఁగులమాటలు పాడి యగునె? 248

క. నేనమొగ మీతఁ డైనం,
బూని మహీశ్వరులు నీకు బొడిచెదరే? దు
ర్మానిని యని కాదె యీతని
తో నడచుట కొల్ల నైతి దురమున కధిపా!" 244

వ. అనిన భీష్ముండు సూతసూనున కిట్లనియె. 245

చ. "ముదుకఁడ నైన నాదుబలముం జలమున్ వివిధాస్త్రశస్త్రసం
పదయును బోయి నీగురుఁడు భార్గవుచే విను; మాజిభూమి నా
కెదిరినవారు పెక్కెడల నేమయిరో యొఱుఁగుఁ జగంబు; నా
ముదిమియు నీకుమారుతనముఁ వరుసఁ విజయుం డెటిం గెదున్; 243

క. అనుమానింపక సభలో
నను నేఁ జెప్పికొనవలసె నా కిమ్మొయి; దు
ర్జనితుఁడ వగు నీయెడ నీ
సున నా కిటు వలుకవలసె సూతతనూజా ! 247

తే. కార్యమును ఖడ్గమును నింత గలుగు నీవు
గలుగఁ జేటు వాటిల్లె నిక్కారవులకు;
దీని మముబోఁటు లెల్లను దీర్ప నెట్లు
సాలెదము? మంచిబంటవు సక్క నగుము; 248

చ. నెప మిడి యోహటించి యిటు నీవు దొలంగినఁ బోవవచ్చునే?
కుపితమనస్కుఁ డై నరుఁడు గూల్పఁ, గ్రమంబున దొడ్డలెల్ల ఁ జ
న్నపిదప నెట్లుఁ జొచ్చెదు రణంబున; నప్పుడు సావకున్న నై
న్యపుఁ బరివారముం బతియునై న నెఱింగెద రెల్ల చందముల్ ! 249

వ. అని పలికి దుర్యోధను నుపలఱించి కర్ణుతో వెండియు నిట్లనియె. 250

ఆ. "సూతపుత్ర ! యితఁడు నాతలఁ బెద్ద మో
పెత్తి నమ్మియున్న యట్టిచోటఁ,
గ్రందు సేయ నాకుఁ గాదని సైరించి
యున్న, బ్రదికి తింక నూరకుండు;" 251

వ. అని యూడి, మొగంబు గంటువెట్టికొనియున్న సురనదీసూనుదిక్కు మొగంబై, సుయోధనుండు, "నీకుం గోపింపనగునె? నన్నను గార్య భారంబునుం జూచి నాబ్రదుకునకై సర్వంబును సహింప వలయు" నని తేర్చి, యంగరాజుం గనుంగొని, 'మీరిద్దఱు నొక్కటియై భరంపడి యిప్పని సక్కంజేసి కాక, మీలోన నిట్టియెరవుమాట లేల" యని పొదివి పలికి, తదనంతరంబ పాండవపక్షంబువారల తారతమ్యంబులు వినువాఁడై యమ్మాట వుట్టించిన, నతనికి భీష్ముం డిట్లనియె. 252

తే. పాండుపుత్రుల యద్దెస దండిమగలఁ
గలనిజం బేను జెప్పినఁ, గర్ణుమనసు
నొచ్చు: నీచిత్త మెట్లగునో యెఱుంగ?
నాకు నిది యేమి పని రిత్త నడుమ నుండి; 253

వ. అనిన, మఱియు దుర్యోధనుండు దటీమి యడుగుటయు నిట్లనియె. 254

-: భీష్ముండు పాండవవీరులం దతిరథమహారథాదుల
నిరూపించి చెప్పుట :-
సం. 5-166-14.

తే. "అతిరథుండు యుధిష్ఠిరుం డగ్నికల్పుఁ;
డాహవంబున నప్రతిహతుఁడు భీముఁ
డతిరథశ్రేష్ఠుఁ; డతనిమహాబలం బ
మానుషము, విక్రమం బసమాన మధిప ! 255

క. సమరథులు గవలు; భుజగ
ర్వము పటువిక్రమము దుర్నివారంబులు; వా
రిమనంబులు నిర్భయములు;
దమ మొనలకు మించి బెట్టు దాఁకుదు రధిపా ! 256

సీ. వారందఱును- ధర్మవైభవంబునఁ దప
స్సంపద నెక్కుడుజనుల కెల్ల;
ధనువు నాఱంగంబులను బరిణతులు, దాఁ
కోర్తురు, పరులకు నోర్వ రాని
కోల్తల గలరు, వెక్కులు పరాక్రమములు
వేర్వేఱ చేసిన వీరు; లొక్క
మొగమయి తాఁకిన వెగడందకుండునే
మనసేన? మున్నవమానపాటు

ఆ. దుఃఖపాటు గలిగి తొడరంగ వచ్చిన
వారు గాన నలఁతి బోరు, ప్రాణ
మాసపడక యోపినంతయుఁ బెనఁగుదు;
రది సహించి నిలుచు టరిది మనకు; 257

మ. నరుఁ డీమానమువాఁ డనంగ వశమే నా; కంతవా రెందు నె
వ్వరు లే రింకను బుట్ట; రాపులికి దుర్వారోద్యముం డైన యా
హరియుం దోడఁ బె యేమి చెప్పుదు? నతం డాసేనలం గాచు, నొ
క్కరుఁడుం గీ టడఁగించు నీబలములఁ గాండీవదుర్దాంతుఁడై!" 258

వ. అనిన విని యక్కొలువున నున్న రాజులమనంబు లెల్లను జేవ నెడియె;
భీష్ముండు వెండియు నిట్లనియె. 259

సీ "ద్రౌపదేయులు మహారథు లేవురును, వారి
తరమ యుత్తరుఁడును ధరణినాథ!
యతిరథవర్యుఁ డయ్యభిమన్యుఁ- డర్జున
వాసుదేవుల కెనవచ్చువాఁడు,
లఘుచిత్రములు నేర్చు; లావును దాల్మియుఁ
గలఁడు; తండ్రులపాటు దలఁచుచుండుఁ
గావున బెడిదంబుగాఁ బోరు; సాత్యకి
యతిరథోత్తముఁడు, శౌర్యాన్వితుండు;

తే. పాండవస్నేహసక్తుఁడై యుండుఁ గాన
యలుక మనమీఁదఁ బెద్దయుఁ గలిగి పెనఁగు;
వీర లిరువురుఁ బరుసనివారు సమర
పరుల, నొప్పింతు రీయోధవరుల నెల్ల; 260

మ. అలతిం బోరు; మహారథుల్ ద్రుపదమత్స్యాధీశు లుద్యద్భుజా
బలశౌర్యాఢ్యులు; పాండురాజసుతసంబంధప్రియస్నేహముల్
గలిమిం జేసి తదీయసైన్యమునకుంగా నొచ్చియుం జచ్చియున్
గెలిపింపం దమకించి చొత్తు రని- కేకీభూతచేతస్కులై; 261

ఆ. వీరగుణము బలము వీఁకయుఁ గలఁడు, మ
హారథుఁడు శిఖండి, యతనితమ్ముఁ
డతిరథుండు దర్పయుతుఁడు ధృష్టద్యుమ్నుఁ,
డుగ్రతేజుఁ డనికి నుగ్రునట్లు; 262

క. అతనిసుతుఁ డర్ధరథుఁ, డా
ధృతవర్మ్మఁడు; పిన్ననాఁడు త్రిమ్మటకాఁడై,
మతిహీనత శస్త్రాస్త్ర
ప్రతతి పరిశ్రమము లేక పాలసుఁ డగుటన్: 263

ఆ. చేదిభూవిభుండు శిశుపాలతనయుండు
ధృష్టకేతుఁ డధికధీరమతి; మ
హారథుండు; భోజుఁ డజుఁ డనురాజులు
నట్టివార, తెంపు నలవుఁ గలరు; 264

వ. ఉత్తమౌజుండును యుధామన్యుండును క్షత్త్రిదేవుండును జయంతుం
డును నమితౌజుండును విరాటుండును సత్యజితుండును ననంబరగు
పాంచాలకులప్రదీపకులు మహారథులు; మత్తమాతంగబృందంబుచందం
బునం బ్రతిబలంబుపయిం గవిసి కోలాహలబహుళంబుగాఁ గలఁపం
జాలుదురు; కేకయపతు లేవురు సహోదరులు మహారథులు, గడింది
మగలు; గెంపురథంబులమొత్తంబులతోఁ గార్చిచ్చు పగిదిం బొదువు
దురు; కాశికుండు నీలుండు సూర్యదత్తుండు మదిరాక్షుండు శంఖుండు-
విరాటజ్ఞాతులు, మహారథులు; వివిధాయుధవిద్యావిశారదులు; వారిపోరు
భరంబై యుండు; 265

సీ. చిత్రాయుధుండును జేకితానుండు మ
హారథు లిద్దఱు, నర్జునునకుఁ
గూర్తురు, కయ్యాన కోర్తురు, నేర్తు రా
యుధముల కెల్ల; నత్యుగ్రు లవ్వి

ధమువార- చంద్రదత్తవ్యాఘ్రదత్తులు;
వినుము, సేనాబిందుఁ డనునృపాలుఁ
డతిరథోత్తముఁడు; మారుతపుత్రు నెనఁ యతం
డొక్కరుండును వారియుఱిది లావు;

ఆ. పాండ్యుఁ డతిరథుండు బలఁగంబు గలవాఁడు;
సమరథుండు గాళ్యుఁ డమితబలుఁడు;
కుంతిభోజుఁ డాజికోవిదుఁ డతిరథుం;
డతనియొద్ది జోదు లధికబలులు; 266

వ. రోచమానుండు మహారథుండు, దేవసమానుండు; 267

తే. అతిరథుల కెల్లఁ దల, దండ్రి యట్టివాఁడు,
యసురవిభుఁడు ఘటోత్కచుం; డాహిడింబ
కొడుకు, మాయాబలంబున నొడుచుఁ బగఱ;
నతనికడ దానవానీక మగ్గలంబు; 268

వ. నాకుం దోఁచినవారిం బేరుకొంటి, నింతియకాని రెండుపిళ్లను మంచి
మగలు వెక్కండ్రు గల" రని చెప్పి గాంగేయుండు 269

క. "పాండవుల దిక్కు రథికు ల
ఖండితబలు లైన, నామొగంబునఁ బడి యు
ద్దండత చూపఁగ లేరు; శి
ఖండిని నొక్కరునిఁ జంపఁగాని కుమారా!" 270

క. అనవుడు దుర్యోధనుఁ, "డా
తని మీరు వధింపమిఁ గతం బేమి యొకో
వినఁ దగునేనిం జెపుఁడా"
యనుటయు నిట్లనియె భీష్ముఁ డతనికి నెమ్మిన్. 271

వ. "ప నాశిఖండిని జంపమికి మూలంబు సాలం గలదు, తత్ప్రపంచం బంతయు
వివరించెద నాకర్ణింపుము. 272

-: భీష్ముఁడు దుర్యోధనున కంబోపాఖ్యానము సెప్పుట :-

సం. 5-170-1.

సీ. "శంతనుపిమ్మట సత్యవతీదేవి
యనుమతితోడఁ జిత్రాంగదునకు
సామ్రాజ్యపట్టంబు సమ్మతిఁ గట్టితి;
నల్పకాలంబున నతఁడు దీఱఁ;
దత్పరోక్షావస్థఁ దదనుసంభవుని వి
చిత్రవీర్యునిరాజుఁ జేసి, పెండ్లి
సేయంగఁ దివిరి, కాశీపతికూఁతులు
కన్యలు మువ్వురు గలుగుటయును,

తే. నాతఁ డర్థిఁ దదీయ స్వయంవరమున
కఖలనృపతులఁ బిలిపించె ననియు నెఱిఁగి,
తల్లి కెఱిఁగించి, యొంటిమైఁ దత్పురమున
కాయితం బయి పోయితి నరద మెక్కి; 273

వ. ఇవ్విధంబునం జని, యమ్మహోత్సవంబున నలంకృతలై యున్న యంబయు నంబికయు నంబాలికయు ననువ్వురం బట్టి రథంబుపయిఁ బెట్టుకొని రా, నచ్చటి రాజులెల్లను జతురంగబలంబులతో వచ్చి నన్నుం బొదివినఁ, బటువిశిఖానల శిఖాకలాపంబున వేఁడిమి సూపి వారి నిలువ రించి యరుగుదెంచి సత్యవతికి నప్పాలంతుల నొప్పించిన, నద్దేవి విచిత్ర వీర్యునకు వారల వివాహంబు సేయ నుద్యోగించె; నట్టియెడ నమ్ముివ్వుర యందుం బెద్దయదిరైన యంబ యను కన్యక నాతో నిట్లనియె, 274

తే. "సౌంభపుర వల్లభుండైన సాళ్వుమీఁదఁ
దలఁపు గలదు నా, కతఁడును దగులు గలిగి
యుండు నాదెస, నీవు ధర్మోత్తరుండ
వతనిపాలికిఁ దగ నన్ను నయపవయ్య?" 275

క. అన విని సత్యవతికిఁ జె
ప్పిన, నాయమ వనుప నంబఁ బెంపుగ వృద్ధాం
గనలం దోడుగ నప్పుడ
పనిచి యనిచితిని జనంబు ప్రస్తుతిసేయన్. 276

వ. ఇట్లు పనిచి తక్కిన కన్నెల నిరువురం పాణిగ్రహణంబు సేయించిరి. 277

క. అంబయు నట సాళ్వునికడ
కుం బోయిన, నతఁడు భీష్ము కొనిపోయిన దా
నిం బరచుం గైకొన ధ
ర్మంబే? కన్యాత్వ మెడలె మగువా నీకున్. 278

వ. ఇంక నిన్ను భార్యఁగా వరింయింపం దగునే" యనినఁ, గామశరపీడిత
యగుచు నక్కామిని యతని కిట్లనియె. 279

తే. 'తమ్మునికిఁ గాఁగ భీష్ముఁ డుద్రగవృత్తిఁ
గన్నియలఁ గొనిపోయెడుఁ గాన బలిమి
నన్నుఁ గొనిపోయె, నాచేత నిన్ను వినిన
యపుడె పుత్తెంచె దూషింప ననఘ! తగునె! 280

వ. మాతండ్రి యెఱుంగక స్వయంవరాలంకారంబు నాకుం జేయించిన కతం
బున నింతపుట్టె, భీష్ముండు నాచెలియండ్రం దనతమ్మున కిచ్చి నన్ను
నీకడకుం దగ ననిచె, దీన నేమి త"ప్పని మఱియు ననేకప్రకారంబులం
వినక, తన్నుం జేకొనక సాళ్వుండు. 281

క. కరుణంబుగ నేడ్చు తలో
దరిఁ 'బోపొమ్మిచట నింకఁ దడయకు' మని మం
దిరము వెడలంగ నడిచిన
నరిగె నదియు నార్తచిత్త యై వికలగతిన్. 282

వ. చనిచని యెవ్వెలంది యిట్లని వితర్కించు, 283

తే. 'సాళ్వునకుఁ గానియపుడ సంసారమునకుఁ
బాసితిన, యింక భీష్మునిపాలి కేల
యరుగ, నాతండు మూల మీహాని కెల్లఁ,
గాన యాతని సాధింతుఁ గాక యేను. 284

క. గాంగేయు గెల్వ నెవ్వరి
కిం గొలఁదియె? తపముపేర్మి గెలిచెదఁ గా' కం
చుం గాంత సనియె సంయమి
పుంగపు లోకకొంద ఱున్న పుణ్యస్థలికిన్. 285

వ. చని వారలకుం దనవృత్తాంతం బెఱింగించిన, వా 'రిది రాజులు సేసిన పని సాధులచేతఁ జక్కంబడునే' యనిన నవ్వనిత 'దపశ్చరణంబునకు వచ్చితి' ననుటయు, 'నీవు సుకుమారవు నీ కిది సొప్పడునే తండ్రిపాలికిం బొ మ్మిదియ పరమధర్మం' బని బలికిన, వారి కన్నారీరత్నం బిట్లనియె. 286

క. 'ఎవ్వరు నెఱుఁగక యుండఁగ
నివ్వనమునఁ దపము సేఁత యిది నిర్ణయ; మే
నెవ్వారికడకు నే మని
యెవ్విధిఁ బోనేర్చుదాస, నేటికి బంధుల్'. 287

వ. అని చెప్పునవసరంబున నయ్యాశ్రమంబునకు హోత్రవాహనుం డను రాజర్షి వచ్చిన, నమ్మును లభ్యాగతపూజలు సేసిన యనంతరంబ యంబం గనుంగొని, 'యిక్కన్నియ యెక్కడిది, దీని విషాదంబునకుం గారణం బే' మని యడిగి, వారివలన దానిజన్మప్రకారంబును దద్వృత్తాంతం బును విని, తన కూఁతుకూఁతు రగుట యెఱింగి, యయ్యంగన వినం దపస్విజనంబులకుం జెప్పి, యప్పాలంతిం దనయంకతలంబున నునిచి కొని, వెండియు నడుగ సవిస్తరంబుగా నచ్చెడియ సెప్పిన విని శోకించి, యవ్విషమప్రకారంబునకు విస్తారంబుఁ జింతించి. 288

ఉ. 'నీకిది యేటికిం దప, మనింద్యచరిత్రవు నీవు, నిన్ను నేఁ
జేకొని కాతు, నొక్కగతిఁ జెప్పెద, భార్గవరాము నాశ్రిత
శ్రీకరుఁ గాన్పు మాపదలు సెందఁగ నీ డతఁ డాశ్రయించినన్,
శోకము దక్కు' మన్న విని, సుందరి యల్లన యత్తపస్వితోన్. 289

ఆ. 'పరశురాముఁ గానఁ బడయుట యెక్కడఁ
గలుగు, నాతఁ డెట్లు కరుణసేయు'
ననఁ దపస్వి యిట్టు లను, మహేంద్రం బను
పర్వతమునఁ జేయుఁ బరమతపము. 290

వ. నన్ను మన్నించుం గావున, మదీయ దౌహిత్రి వగుట యెఱింగిన నిన్ను
రక్షించు, నందుఁ బో' మ్మనుసమయంబునం, బరశురామశిష్యుం డగు
నకృతవ్రణుం డను ముని వచ్చి యతిథిసత్కారంబులం బూజితుండై
యున్నఁ, బ్రియపూర్వకంబుగా నాహోత్రవాహనుండు 'భార్గవుం
డెయ్యెడ నున్నవాఁ' డని యడిగిన, నతం డిట్లనియె. 291

క. 'తనప్రియసఖుఁడవు నీ వని
మునిజనులకుఁ బెప్పుచుండు, ముదమున నిన్నుం
గనుఁగొనఁగ నెల్లి యిచటికిఁ
జనుదెంచు ననేకశిష్యసంఘముతోడన్." 292

తే. అనిన విని, యెల్లవారును నధికహర్ష
మెసఁగ నున్నంత, మఱునాఁడ యేఁగుదెంచె
భార్గవుం; డమ్మునీంద్రులు పరమభక్తి
నర్చ లిచ్చిరి, హోత్రవాహనుఁడుఁ గనియె. 293

వ. కని పరశురాముని సంభావనంబును సంభాషణంబును బడసి, కాశిరాజ
కన్యకం జూపి, యిది నాదౌహిత్రి, దీని వృత్తాంతం బంతయు విను'
మని యమ్మానినిం గానిపించిన, నదియును. 294

చ. కనుఁగవ నశ్రుధార లొలుకం జరణానత యైన, రాముఁ డి
ట్లను, 'విను, హోత్రవాహనుని యట్టుల యేనును నీకు, నీమనం
బునఁ గల చింత యంతయును బుచ్చెద, నాకడఁ జేరి తింక నీ
వనటఁ దొలంగఁబెట్టి గరువంబుగఁ జెప్పుము దీనిమూలమున్ ?' 295

వ. అనిన విని, యమ్మహాత్మునకు నంబ దనవృత్తాంతం బంతయు సవిస్తరం
బుగాఁ జెప్పి, నీ వార్తశరణ్యుండవు, నాపరిభవంబు దీర్చి నన్ను రక్షింపు
సునవుడు, నతం డిట్లనియె. 296

క. 'పరిభవము రెండు దెఱఁగులఁ
దరుణీ తోఁచినది, సాళ్వుఁ దగఁ దేర్తునొ;
యుద్ధుఁడగు భీష్మునిఁ దీర్తునొ,
కరము ప్రియం బెద్ది హృదయగతముం జెపుమా !' 297

చ. అనవుడు నింతి యిట్లను, మహాపురుషా ! నను సాళ్వుఁ డింకఁ గై
కొనఁ- డది సాలు; భీష్ముదెసఁ గోపము నామదిఁ గల్గియుండు, నా
తని వధియింపఁ బూని, యిట తాపసవృత్తికి వచ్చి, యిచ్చటన్
నినుఁ గని యీపరాభవము నీఁగఁగ నీశరణంబుఁ జొచ్చితిన్." 298

తే. అనిన, 'నాచెప్పినట్ల గంగాత్మజుండు
నేయుఁ, జేయక తక్కినశితశరముల
నతనిఁ బడవైతు నూఱఁడు; మబల ! నీకుఁ
దపము సేయంగ నేటికిఁ దనువు డయ్య.'' 299

-: పరశురాముఁ డంబం దోడుకొని భీష్మునియొద్దకు వచ్చుట :-

సం. 5-173-23.

క. అని పలికి, పరశురాముఁడు
సనుదెంచెను మునిజనంబు సమ్మోదమునఁ దో
జనుదేరఁ గురుక్షేత్రం
బున, కుద్ధతిఁ గాశిరాజపుత్రిం గొనుచున్. 300

వ. వచ్చి, సరస్వతీతీరంబున విడిసి, తనరాక నా కెటింగించి పుత్తెంచిన, నేను ఋత్విక్పురోహితప్రభృతివిశిష్టబ్రాహ్మణసమేతంబుగాఁ బూజాద్రవ్యంబులు గొని తత్పరిదేశంబున కరిగిన, నమ్మహాత్ముండును మదీయ భక్తివినయసంభ్రమంబులు సంప్రీతి నభినందించి యర్చనలు గైకొని, కాశిరాజకన్యకం జూపి నాతో నిట్లనియె, 301

తే. 'బలిమి మున్నేల తెచ్చి తిప్పడఁతి, మగుడఁ
ద్రోచిపుచ్చంగఁ దగునయ్య ! నీచవృత్తి
వచ్చె, దీనిఁ దమ్మునికి వివాహ మింక
నైనఁ జేయుము, చేయమి యనుచితంబు;'' 302

క. అనుటయు, 'ననఘా తెలియన్
విను, మిది నాతోడ సాళ్వవిభునకు నేఁ గూ
ర్చినదాన, నతనిపాలికి
ననుపుము న న్ననినఁ గాదె యనిచితి మగుడన్. 303

తే. ఇంక నాతమ్మునికి దీని నెట్లు పెండ్లి
సేయ నేరుతు' ననుడు, నాచెప్పినట్లు
సేయ వై తేని నిన్ను నీచెలులఁ జుట్ట
ములను జంపుదు' ననియె నమ్మునివరుండు. 304

వ. ఏను వినయంబు వదలక వినతుండ నగుచు, వివిధవాక్యంబులం దెలుప, నంతకు నతనికిఁ గోపం బగ్గలం బైన వెండియు. 305

ఆ. 'గురుండ వై సమగ్రకోదండవిద్యామ
హత్త్వ మిచ్చినాఁడ- వలుగఁ దగునె ?
కారణంబు లేక యీరసమెత్తి య్యి'
ట్లనినఁ, బరశురాముఁ డాగ్రహమున. 306

చ. గురుఁ డని న న్నెఱుంగు, దనఘుండవు; నావచనంబునం దనా
దరణము సేసి, తెన్నిదియొ విధంబులఁ బల్కెదు భక్తితోడ, నీ

వెరవులు దక్కు, మీయబల వేగమ పెండిలి సేయు; మంతతో
మరలు మదీయకోపశిఖి, మానదు వేఱొకవేయుఁ జేసినన్. 307

వ. అనిన విని, 'యధర్మాచరణంబున కింత వట్టి పెనంగ నగునె, పరానురక్త
చిత్త యగు మగువ నిల్లాలిం జేయువారుం గలరె? యిట్టి యసత్యం
బాచరించుకంటె నీచేత నెట్లయినను లెస్స, తొల్లి పెద్దలు సెప్పిన
చొప్పవధరింపు" మని యిట్లంటి. 308

తే. 'గర్వి యై, కార్య మిట్టి దకార్య మిట్టి
దని యెఱుంగక, లోకంబు చనుపథమునఁ
దిరుగ, కున్మదవృత్తి వర్తించునట్టి
వాని, గురు నైన దండింపవలయు నంద్రు.' 309

క. అనుమాటకుఁ గాలానల
మునుబోలెను మండి, కయ్యమున కాయితమై,
'మొన లేర్చి వేగ యిచటికిఁ
జనుదె' మ్మని భార్గవుండు సంరంభమునన్. 310

వ. పలికిన, నేనును. 311

క. 'చులుకఁదనంబున విప్రుల
కలుగంగాఁ దగదు, గురుఁడువై యున్నాఁడం
చలయక తలఁచితిఁ గా, కిటు
నిలుమీ నీరణముసేఁత నిజ మగునేనిన్. 312

క. క్షత్రియులఁ దొల్లి యలుకకుఁ
బాత్రము సేసితఁవె? నాఁడు బలియుఁడు గంగా
పుత్రుఁడు వుట్టమిఁ గా, కిది
యీత్రయి నింకేల చెల్లు నెఱుఁగవె నన్నున్. 313

క. ఏ నొకరుం డన వచ్చెదఁ
గాని బలము దేను, నీవు గఱపిన శస్త్రా
స్త్రానేకవిధవిలాసము
దాన వలయు సేనగాదె తథ్యం బరయన్.' 314

వ. అని పలికి, యతనికిఁ బ్రణమిల్లి చనుదెంచి, సత్యవతి కింతయు విన్న
వించి యద్దేవియనుమతి వడసి, సర్వసన్నాహసమేతం బగు రథం బెక్కి
విప్రాశీర్వాదంబులు సెలంగ వెడలి వచ్చి, కురుక్షేత్రంబు దటీయం
జనునెడ, భాగీరథి భామినీరూపంబున నరుగుదెంచి తన్నెఱింగించి మదీయ
భక్తి నభినందించి, యే నాయితంబై పోవుటకుఁ గారణం బడిగి నాచేత
నత్తెఱం గెఱింగినదియై, నన్నుం గినిసి భార్గవుపాలికిం జని, 'నీశిష్యుండు
నిరపరాధుండు, నాకొడుకున కలుగందగునే' యని చెప్పి, యతని
యందుఁ బిక్కగానక మగుడ నేతెంచి నావలనను మెత్తంబాటు
లేకున్నం జనియె; నప్పుడు సిద్ధవిద్యాధరమునిగణంబులు గౌతుకంబునం
గనుంగొనుచుండ, నేను జమదగ్నితనయున కనతిదూరంబునం దేరు డిగి
వినతుండనై నిలిచి, 'నీవు భూచారివై యున్నవాఁడవు, రథికుండ నైన
నాకు నీతోడ సమరంబు సేయనగునే' యనిన- యనంతరంబ, యతండు
దివ్యంబు లగు రథరథ్యంబులు శస్త్రాస్త్రంబులునుం గలిగి, యకృత
వ్రణుండు సారథిగా సమరసన్నద్ధుండై తోఁచినం జూచి, రథారోహ
ణంబు సేసి శంఖంబు పూరించి గుణంబు సారించి సూతు నగ్గించి తనకు
నమస్కరించి కడంగిన, నప్పరశురామదేవుండు. 315

-: భీష్ముఁడు పరశురాముని తో యుద్ధంబు సేయుట :-

సం. 5-180-18.

క. శరవర్షము నామీఁదం
గురిసిన, నే నాకసమునఁ గుదియించితి- నా
యరదంబు పొంతకును న
చ్చెరువుగ నొకబాణమైనఁ జేరకయుండన్. 316

క. ఒకమొగి నఱువదియమ్ములఁ
బ్రకటబలుం డైన పరశురాముఁడు నాయం
గకములు దాఁకఁగ, నశ్వ
ప్రకరము నోనాఁట, సూతుపైఁ బడ నేసెన్. 317

క. దానికి నవ్వుచు వేగం,
బే నొకభల్లంబు దొడిగి యేసిఁ- సాంద్ర
జ్యానాదభరితరోదసి
యైనతదీయోగ్రచాప మఱిమఱిఁ దునియన్. 318

ఉ. ఒండొకవిల్లు పుచ్చికొని. యుజ్జ్వలరోషమహోనలార్చ్చ లొం
డొండ మొగంబుపై నెగయ, నుర్వి చలింప, గుణధ్వనిన్ సము
ద్దండతఁ దీవ్రమార్గణశతంబున నాయరదంబు ముంచె రా
ముండు- వియచ్చరప్రకరముల్ వెఱఁగందుచుఁ బ్రస్తుతింపఁగన్. 319

క. ఉఱుక మదీయాంగంబులు
గిఱిగొన నక్లేయుటయును, గినుక గదిరినన్
మెఱుఁగారునారసమ్ములు
దఱచుగ నించింతిఁ గడంగి గడంగి తద్గాత్రమునన్. 320

తే. ఉచ్చిపోయిన యేటుల నొలుకు శోణి
తమున సర్వాంగకంబులుఁ దడసి యొప్పెఁ-
జిగురుఁదఱుచునఁ గెంజాయ మిగిలి, చెలువు
వడయు క్రొమ్మావిచాడ్పున భార్గవుండు. 321

క. నెత్తురు వడిసిన మూర్ఛా
యత్తుం డై సొగయుటయును, నాతనిఁ గని యు
ద్వృత్తక్షత్రియధర్మ్మో
పాత్తం బగు తేజ మొల్లఁబాఱై తోఁచెన్. 322

వ. అప్పుడు మనంబున నన్ను నేన గర్హించుకొనుచుండితి. 323

ఆ. అంతఁ దెలిసి రాముఁ డతికుపితాత్ముఁ డై,
యేఱువాలుతెంచు నెసక మెసఁగ
నప్రమేయశము లడరించె; నవి సత్వ
రముగ నేను బ్రతిహతములు నేసి. 324

క. మరుదస్త్ర మేయ, గుహ్యక
శరమున వారించె నతఁడు; సరభసముగ ను
ద్ధురశిఖిబాణం బేసిన,
గురుఁడు వరుణవిశిఖనిహతిఁ గుదియం జేసెన్. 325

క. ఇమ్మెయి నతఁడును దివ్యా
స్త్రమ్ములు నామీఁద నేయ, రయమునఁ బ్రతిఘా
త మ్మొనరించితి దివిజగ
ణ మ్మ్మంబరవీథిఁ గీర్తన మ్మొనరింపన్. 326

తే. రాముఁ డంత్యకాలానలోద్దామలీల
మండి, వాయురస్త్రంబు యొక్కమార్గణమున
నేసె, నంతంత నున్న మునీశ్వరులును
గాళిరాజకన్యకయును గడఁగి యార్వ. 327

క. అనిశితాస్త్రం బెయ్యది
యో నాకుం దెలియ, దది మహోగ్రత నాఁటం
గా నొచ్చి పడితి నదరము
వై; నప్పుడు సూతుఁ డచట వాపె రథంబున్. 328

తే. చేతనుండ నై యేను, మత్సూతుఁ గినిసి
రాముఁ డున్నెడ కప్పుడు గ్రమ్మఱంగ
రథముఁ దోలించి, బాణపరంపరాని
మగ్నుఁ జేసితి నంబనెమ్మనము దలఁక. 329

వ. ఇట్లు బహుప్రకారంబులం బోరుచుఁ, బ్రొద్దు గ్రుంకినప్పుడు రణం
బుపసంహరించుచు, రేపకడ దొడంగుచుం బెనంగ నిరువదిరెండుదివసం
బులు చెల్లిన, మఱునాఁటికయ్యంబున నేనునుం గడంగి. 330

క. కడుబెట్టిదముగఁ గదియం
బడి, హయములు నొవ్వ, ధనువు భగ్నంబుగఁ, జే
డ్పడి సారథి దెరలఁగఁ, దన
యొడలు సిరుఁగ నేసినను; మహోద్ధతి గురుఁడున్. 331

క. ఒకశక్తి వైవ నటికిఁ,
నకుటిలముగ శక్తిదళక మడరించిన స్రు
క్కక త్రుంచితి, బహుశక్తుల
నికరము వరగించినం దునిమితిం బెలుచన్. 332

క. విస్మయము నొందు భార్గవు-
నస్మత్కర మపుడు లాఘవారూఢముగా
సస్మితుఁడ నగుచుఁ- బటుదీ
ప్తి స్మేరాస్త్రముల నేసితిం బరవశుఁగన్. 333

వ. ఇట్లతండు మూర్ఛిల్లిన మునిజనంబులును నంబయు నధికశోకసమా కు
లత్వంబు నొంది హాహాకారంబులు సెలంగఁ బొదివి, రంత. 334

ఆ. తెలిసి భార్గవుండు దృఢతీవ్రనారాచ
పంక్తి గురిసి, నన్నుఁ బారవశ్య
మంది నేలకొఱగు నట్లుగాఁ జేసి, మ
త్స్నాతుమస్తకంబుఁ దునియ నేసె. 335

వ. అట్టియెడ నెనమండ్రువిప్రులు సమానవయోరూపంబుల నొప్పువారలు
నన్నెత్తి సేద దేర్చి రథంబుపయిం బెట్టి గగనగమనంబునం బోయి;
రంతకుమున్న మందాకిని మున్ను నాకన్న చందంబున నొగలపయినుండి

మదీయరథ్యంబుల పగ్గంబులు ధరియించి యున్న, నేనునుం గనుంగొని
నమస్కరించిన దీవించి చనియె; వెండియు. 336

క. సారథ్యంబును జేయుచు
ధీరత వాటించి రామదేవునితోడం
గ్రూరాస్త్రంబుల సమరవి
హారం బొనరించితిని సురావలి వొగడన్. 337

-: భీష్మునకు వసువులు స్వప్నసాక్షాత్కారంబున మోహనాస్త్రం బిచ్చుట :-

సం. 5-184-1.

వ. ఇవ్విధంబునం బోరి సూర్యాస్తమయం బగుటయు నెప్పటియట్ల చని, యే నారాత్రి యేకాంతంబున దుర్భళయనంబున నుండి, సురభూసుర వర్గంబులం దలంచి భక్తిం బ్రణామంబులు సేసి, 'పరశురాముని జయింప రాదయ్యెడు, దినంబులు పెక్కులు సనియె, నతని నాజి జయించుట గలుగునేని మీరు నాకుం దోఁచి యూఱడింపవలయు' నని ప్రార్థించి నిద్రించుచుండ, బవలు నన్నెత్తి రథంబుపయిం బెట్టిన యెనమండ్రునుం బ్రభాతసమయంబునం గలలోన వచ్చి, 338

తే. 'నీవు నేమును నొక్కటి, నీకు వెఱవ
నేల గాంగేయ! రాము జయించునట్టి
శరము సు' మ్మని మోహనాస్త్రంబు నాకు
నిచ్చిపోయిరి క్రమ్మఱ నెక్కడేని. 339

వ. ఏను మేలుకాంచి సంతోషించి తన్మంత్రస్వరూపంబును ప్రయోగోప సంహారప్రకారంబులును చిత్తంబున నిలిపికొనుచుఁ, గాలోచితకృత్యంబు లాచరించి యొక్కసారథి నంగీకరించి యరదంబు పూన్పించి సన్నద్ధుం డనై సత్వరంబుగా సమరంబున కరిగినం, బరశురామదేవుండు, 340

క. "నిన్న నఱ సచ్చిపోయితి,
వున్న యఱయు నేఁడు దీర్చి, యుడిపెద నీగ
ర్వోన్నతి, యింకెట వోయెదు
నన్ను నెఱుఁగ వెట్టు' లనుచు నావైఁ గవిసెన్. 341

క. కవిసినఁ గడంగి వెల్లుగ
గవియించితి నంపవెల్లిఁ, గడుఁ గ్రూరత భా
ర్గవుఁడును మద్గాత్రంబున
వివిధాస్త్రప్రతతి నించి వెగ డొందించెన్. 342

వ. ఏనుం గోపించి, 343

తే. రయము మెఱయంగ నొక్కనారసము ఫాల
దేశమునయందు నాఁటించి, తీవ్రశక్తి
నురము వైచినఁ, దూఁగాడి యొఱగ, నూఁది
పట్టి యకృతవ్రణుఁడు దేర్చెఁ బరశురాము. 344

క. అప్పుడు దెప్పిటి, కన్నుల
నిప్పులు రాలంగ నన్ను నిశ్చలదృష్టిం
దప్పక చూచి, యలఁతిన
వ్వొప్పఁగ బ్రహ్మాస్త్ర మాతఁ డుగ్రత నేసెన్. 345

క. తెగఁగొని బ్రహ్మాస్త్రము యేఁ
దగ నేసిన, నొకటి కొకటి దార్కొని రెండున్
గగనం బంతయుఁ దేజ
స్సగితముగాఁ జేసె సురలు దైత్యులు దలఁకన్. 346

తే. సకలభూతసంక్షోభసంజనక మైన
యట్టి యెడఁ గని, యిది దటి యని తలంచి
మోహనాస్త్రంబు నంచితావాహనంబు,
నేయుటయును, జరాచరశ్రేణి మ్రోసె. 347

వ. తదవసరంబున 348

క. 'ఉడుగుడుగు, మోహనాస్త్రము
విడువకు' మనునెలుఁగుతోడ, వేగంబున న
య్యెడ కేఁగుదెంచి నారదుఁ
డెడమడు గించుకయు లేక యిట్లను నాతోన్. 349

క. 'గురునకు నవమానము ని
ష్ఠురవృత్తి జేసె దీవు, సూచితిమే యి
ప్పురుసునఁ బరుసపు నడవడిఁ;
గురువంశప్రవర యిట్లు గూడునె చేయన్. 350

వ. అని సువ్యక్తంబుగాఁ జెప్పి, 351

క. వీరె వసువు లాకసమున
గారవమున బుద్ధి సెప్పఁగా, నీ కడకుం
దా రేఁగుదెంచి'రని క
న్నారంగాఁ జూపె నాకు నయ్యెనమండ్రన్. 352

వ. ఇవ్విధంబున నెప్పటివిప్రవరులు సన్నిధి సేసి నన్నుం జూచి నగు మొగం
బులతో నెఱుఁగనివార పోలె నిట్లనిరి. 353

క. 'నారదమునిత్రైలోక్యస
మారాధ్యుం, డితనిపలుకు లాగమవాక్యా
చారములు, వినుము వీనిం
గ్రూరత వాటింపఁ దగదు గురువిషయమునన్." 354

వ. అనిన విని యేను సమోహనాస్త్రం బేయుట యుడిగి, బ్రహ్మాస్త్రంబు
దీపింపఁ జేసితి; నప్పుడు జామదగ్న్యుం డది యెల్ల నెఱింగి యోటమి
యెక్కించుకొని, చలంబు మిగిలియున్నం, దజ్జనకుండు జమదగ్నియుఁ

దదీయపితృవర్గంబును నతనికి సన్నిధి సేసి వేఁడికొని శాంతవచనంబులం
దేర్చి యిట్లనిరి, 355

క. 'వినుము వసుమూర్తి యీతం
డనన్యసామాన్యతేజుఁ, డాహవభూమిన్
మనకు జయింపవశమె భీ
ష్ముని, విప్రున కగునె రోషమును మత్సరమున్. 356

తే. సమర ముడుగు, నారాయణసఖుఁడు నరుఁడు
సవ్యసాచి నా నింకొకజన్మ మొంది,
యితని వధియించుఁ గాని, తక్కితరజనము
లకు నసాధ్యుండు భీష్ముఁ డాలంబులోన.' 357

వ. అనిన, నతండు వెండియుం బోక పెనంగిన, ననేకప్రకారంబులం జెప్పి
యమ్మునులు నాకడకుం జనుదెంచి యుపశమనవాక్యంబులు వలికి, జామ
దగ్న్యతోడం దమయాడిన మాటలు దేటపఱచి, యప్పుడు పొడసూపిన
జాహ్నవియుం దారు బహువిధంబు నన్ను ననునయించి, భార్గవుపాలికి
నమ్మహాదేవిం దోడ్కొని యరిగియుం, గ్రమ్మఱ మత్సమీపంబునకు
వచ్చియు నెట్టకేలకుం జలం బుడిపిన, నే మిరువురమును దివ్యాస్త్రంబు
లుపసంహరించి సమరం బుడిగితి; మట్టియెడ నయ్యెనమండ్రువిప్రులుం
జేరి నాతో నిట్లనిరి. 358

ఆ. గురుఁడు, బ్రహ్మవిదుఁ, డకుంఠితతేజుండు
పరశురాముఁ; డతనిపాలి కీవు
భక్తి మెఱయ నేఁగి, ప్రణమిల్లి, తదనుగ్ర
హంబు వడయవలయు ననఘ ! యిపుడు." 359

వ. అని చెప్పి, యతనికడకుం దారును నారదమునీశ్వరుండును జమదగ్ని
ప్రముఖులును భాగీరథియును జని, 'నీశిష్యుండు దేవవ్రతుఁడు వాని
యెడ నలుగందగునె, వాఁడు దగవుమాలినపనిఁ జేయంజాలక పెనంగె,
నింతియ కాని విరోధి గాఁడు, వానిం గరుణింపు' మని తెలిపి, నన్నుం

బిలిచినం బోయి యే నమ్మహాత్మునకు సాష్టాంగదండప్రణామంబు సేసిన, నతఁడు దీవనతో గ్రుచ్చియెత్తి కౌఁగిలించికొని, 'గాంగేయా! నీశక్తికి భక్తికిం బ్రీతుండ నైతి' నని సస్నేహంబుగా సంభావించి, యంబ నవలోకించి 'నన్ను భీష్ముండు గెలిచె, నావలన నయ్యెడుపని యింతియ, నీ వింక నీకుం జూడం బోలినగతిం బో' మ్మనిన, నమ్మాలిని 'దేవా! యిది యిట్టిద, నీయోపినంతయుం జేసితి, నీచేతం బోకున్న నేమి సేయుదు? నేను దపంబు పెంపున భీష్ముని వధించెద, జన్మాంతరంబున నైననుం జలంబు సాధ్యంబు చేయుదు నటు సూడు' మని పలికి పోయెఁ; దదనంతరంబ యమ్మునిజనపితృదేవతాసమూహంబును భృగునందను నన్ను నామంత్రణంబు సేసి యంతర్ధానంబు సేసె, భార్గవుండును నన్ను వీడ్కొలిపి మున్ను దనతో వచ్చిన తపోధనవర్గముం దానును మహేంద్రశైలంబునకుం జనియె, నేను మగిడి యెడనెడ నుర్వీసురులయాశీర్వాదంబులు సంభావనవచనంబులుఁ బ్రస్తుతివాక్యంబులుఁ గర్ణంబుల కింపు సేయ నిట వచ్చి సత్యవతికి నమస్కారపూర్వకంబుగా నంతయు నెఱిం గించిన నద్దేవి యభినందించె: 360

-: నారదుఁడు భీష్మున కంబవృత్తాంతం బంతయుఁ జెప్పుట :-

సం. 5-187-16.

తే. అంబవృత్తాంత మరయంగ ననుదినంబుఁ
దగినవారలఁ బుచ్చుచుఁ దలఁకుచుందు;
నేను నది యాదిగాఁ జింత నేపు దక్కి
స్రుక్కి యుండియు రాజులనుక్కు మడఁతు. 361

వ. ఒక్కనాఁడు పారాశర్యనారదులం గని యక్కార్యంబు భయంబు దోఁప విన్నవించిన, వారలు 'దైవాధీనం బగుదాని మానుషంబున మానిపింప వశంబుగా- దాచింత విడువు' మని; రందు వారదుం డక్కాశీశ్వర కన్యకఁ దెమ్మంగు విను మని యిట్లనియె, 362

సీ. ఆతన్వి, యమునానదీతీరమున కేఁగి
యత్యుగ్రమగుతప మాచరించి,

యందుండి కౌశికునావాస మాదిగాఁ
గలుగు సిద్ధాశ్రమంబులకు నెల్లఁ
జని చని, తత్పదేశంబుల నిష్ఠుర
వ్రతములు సలుపంగ వచ్చి, నీదు
జనని జాహ్నవి 'యిట్లు వనితల కతిదుష్క-
రములగు బహునియమములు నీకు

తే. నడపఁ గత మేమి' యనుఁడు, నన్నాతి వలుకుఁ
దద్ధ యవమానపడితి శాంతనవుచేత,
నపరజన్మంబునం దైన నతనిఁ జంప
నేను జాలుటకై యిట్టిదాన నైతి.'' 363

వ. అనిన విని, భాగీరథి 'గుటిలప్రచార వగుట నీ వీతనువు విడిచి యేఱయి పాఱం గలదాన, వింతియ కాని యొండు గానేర' వనిన, నవ్వెలంది నవ్వుచు సరకుసేయక యరిగి తొంటికంచెను దీర్ఘం బగు తపశ్చరణంబునం బ్రవర్తిల్లుచు, మత్స్యదేశవాసినియై యుండి, యొక్కనాఁడు నిజవ్రతఫలంబులో సగంబున నంబ యను పేర నదియై యమ్మండలంబునం బరగి, యున్న సగంబునను దనరూపు సెడకుండ వహించికొని జాహ్నవీప్రభావంబు నాత్మీయప్రభావంబున గెలిచి వెండియు, 364

క. పుణ్యాశ్రమదేశముల న
గణ్యం బగు తపము సేయఁగా, రుద్రుఁడు గా
రుణ్యము వాత్సల్యము దా
క్షిణ్యము మెఱయంగ నింతికిం బొడసూపెన్. 365

క. మును లచ్చెరువంది కనుం
గొన శంభుఁడు నిల్చి, వరము గోరు మనుడు, 'భీ
ష్ముని నాకుఁ జంపఁగా దొర
కొనునట్లుగ నొసఁగు' మనియెఁ గోమలి యెలమిన్. 366

వ. అనవుడు నద్దేవుం డట్లకాక యని యనుగ్రహించిన, నంబ యెత్తెఱం గున నది యయ్యెడు నని యడిగిన. 367

సీ. 'ఈమేను విడిచి నీ వేఁగినయప్పుడు
ద్రుపదభూవిభునకుఁ దొల్ల పుత్రి
వై పుట్టి, పిదపఁ బుత్త్రీకృతిఁ గాంచి శి
ఖండి నామనమున, నుద్దండబాహు
బలమునఁ, గోదండపాండిత్యమును బటు
శౌర్యంబు నొప్పఁ బ్రశస్తి కెక్కి,
యనిఁ జంపఁ గలదాన వాతని, నామాట
దప్ప దూఱుడు' మని చెప్పి హరుఁడు

తే. సనియె; నాప్రొద్దు సమిధలు సాలఁ గూడ
వైచి యనలంబు గూర్చి యవ్వనిత క్రోధ
దీప్తమూర్తియై, 'భీష్ము వధించుదాన'
ననుచు సొద సొచ్చె మునులకు నద్భుతముగ. 368

వ. అట్టియెడ, ద్రుపదుం డనపత్య యగు తనమహిషివిషాదంబు దీర్పం
దివురుటను గాంగేయుతోడిరోషంబునను శివుని నుద్దేశించి తపంబు సేసిన,
నద్దేవుండు ప్రత్యక్షం బయి 'వరంబు వేఁడు' మనిన, 'భీష్ము వధియించు
నట్టివాని నొక్కపుత్రుని నొసంగవలయు' ననుడు, 369

తే. 'కూతు రై పుట్టి పదపడి కొడుకుఁదనము
గాంచి, భీష్ముని నాజిరంగమునఁ జంపు
నట్టి యుజ్జ్వలాపత్యంబు వుట్టు నీకుఁ,
దప్ప దిది' యని రుద్రుండు సెప్పి చనియె. 370

వ. ద్రుపదుండును ప్రీతుం డయి నిజప్రియకు నవ్విధం బెఱింగించెఁ, దదనంత
రంబ కాశీశ్వరకన్యకచైతన్యం బుదరంబు ప్రవేశించిన. 371

క. పాంచాలరాజభార్య స
మంచితగర్భంబుఁ దాల్చి మఱువడఁ గూఁతుం
గాంచి, నిజపతియుఁ దానును
వంచనఁ గొడు కనిరి యెల్లవారును వినఁగన్. 372

వ. ఇట్లు పుట్టినబిడ్డకుఁ బుత్రప్రకారంబున జాతకర్మాదికృత్యంబులు నిర్వర్తించి, శిఖండి యను పేరు వెట్టి, యతిప్రచ్ఛన్నంబుగాఁ బెనిచి, రహస్యంబుతెఱుం గాకన్నియకుం జెప్పి, యథురశిక్షాదు లాచరించి, ద్రోణాచార్యుకడ శస్త్రాస్త్రపరిశ్రమంబు నేయించుచుండ, జవ్వనంబు చేరువకుం దటియగుటయు, నమ్మగువం జూచి వగచి తల్లిదండ్రులు తమలో విచారించి 'వేగంబ వివాహంబు సేయవలయుఁ, బరమేశ్వరు వరంబు కొఱంత వడునె, తననెఱిసినప్పుడు నెఱయుం గాక' యని నిశ్చయించి, దశార్ణదేశాధీశుం డగు హేమవర్మ యను రాజుకన్యకం దగిన తెఱంగునఁ బాణిగ్రహణంబు సేయించి తెచ్చి యున్నంత, 373

ఆ. అక్కుమారి చతుర యగుట శిఖండివ
ర్తనము నెడఁ బ్రమాదమున నెఱింగి,
యుగ్గడింప నొల్ల కూరక యెఱుఁగని
యదియపోలె నుండె నాత్మ నొచ్చి. 374

వ. ఇట్లు దశార్ణవిభుపుత్రి యెఱింగి శిఖండి పురుషుండు గాని దనదాదికిం జెప్పిన, నదియు నప్పు డన్నరనాథున కెఱింగించి పుచ్చిన నతండు విషాదరోషంబుల నొంది దూతం బుత్తెంచిన వాఁడు వచ్చి పాంచాలపతిం గాంచి యిట్లనియె. 375

చ. "కొడు కని చెప్పి యిట్లగునె కూఁతు వివాహము సేయ, దీన నీ
పడసినలాభ మేమి ? నగుఁబా టగు; నింతయ కాక, యెల్ల నే
ర్పడ నెఱుఁగంగ వచ్చితి, నరాతిభయంకరు హేమవర్మ నా
గడమున గాసి చేసితి, మగంటిమి నీదెసనై నఁ జూపుమా ?" 376

ఆ. అనిన నగుచు వాని కను ద్రుపదుం "డివి
యేటిమాట, లిట్టు లేల చేయ
వచ్చు, నింత వెఱ్ఱివారును గలరె, యి
త్తెఁగు వొసఁగకునికి యెఱుఁగరాదె ?" 377

వ. అని, వెండియు నేర్పునం దీర్పుమాట లనేకంబు లాడి, నిక్కం బరయం
జూచిన వానికిం జొరవ యీక ప్రోపుసేసి వీడ్కొలిపి పుచ్చినం, బోయి
వాఁడును నిజనాథున కవ్విధంబున విన్నవించిన. 378

క. కోపోద్రేకంబున నతఁ
చాపాంచాలపతిమీఁద నతులిత సైన్యా
టోపమున వచ్చి, పురపరి
ఖాపరిసరతములచుట్టుఁ గైకొని విడిసెన్. 379

వ. ఇట్లు విడిసిన. 380

ఆ. పట్టువడ్డ ప్రముచ్చు పగిదిఁ బాంచాలభూ
నాయకుండు దనకు నానచేటు
రాక కుమ్మలించి, యేకాంతమునఁ బత్ని
యొక్కతియును గొల్వ నూరకుండె. 381

వ. తదీయచండనాథులు సమరోత్సాహంబునం బ్రవర్తిల్ల; రంత సూర్యాస్త
మయ సమయం బగుటయు రెండువీళ్లును ఖండనంబుతోడివేడుకం జేసి
వేగుటకు వేచియుండె, 382

క. అప్పుడు శిఖండిమరణము
దప్పఁగ సడికొండు ప్రతివిధానము సేయం
జొప్పడమిఁ దలఁచి, యొరులకుఁ
జెప్పక వెస నరిగెఁ బురముచెంత యడవికిన్. 383

-: శిఖండి యక్షనివలనఁ బురుషత్వంబు నొందినవృత్తాంతము :-

సం. 5-192-20.

వ అవ్విపినంబు స్థూలకర్ణుం డనునొక్కయక్షునికి నివాసంబై యునికిం జేసి
నిర్జరంబై యుండు; శిఖండియు నత్తెఱం గెఱుంగుం గావున, నతని
నుద్దేశించి యందుఁ జొచ్చి తత్ప్రదేశంబున మహనీయసుందరంబగు
దదీయమందిరంబున కరిగి, యచ్చటఁ బ్రాణవియోగం బగువిధం బాచ
రింపం బూనిన, 384

ఉ. యతుఁ డెటిఁగి వచ్చి "యిటు లాఁడి చావఁగ నేల చెప్పుమ మ
జ్జాఁతి ! భవన్మనోరుజకు నోషధ మే నొనరింతు" నన్న, "ఘా
లాతుఁడు దక్క నొడ్లకును నాపని సేయఁగ రాదు నాదు చి
త్తతతి, పుంస్త్వ మేను దగఁ దాల్పక మానదు గుహ్యకోత్తమా."

క. అని, తనవృత్తాంతం బా
ఖాతని కెటిఁగించుటయు, నతఁడు దనదగు చిత్తం
బునఁ గరుణ వుట్టి, "యెంతటి
పని యిది, యే నిత్తు సమయపరిపాలనతోన్. 386

క. నా పురుషత్వము గైకొని
వే పోయి దశార్ణపతికి వెలయించిన, మీ
యాపదలు దొలఁగి చనఁ, బొడ
సూపుము పదినాళ్లయంత సూనృత మొప్పన్. 387

క. అంతవునంతకు, నీదగు
కాంతారూపంబు నేను గైకొనియెద, ని
శ్చింతమున మగుడఁ జను" మని
యింతికిఁ బురుషత్వ మిచ్చె నెంతయు వేడ్కన్. 388

తే. ఇచ్చి, తాను భామాకృతి నెలమిఁ దాల్చి
వీడుకొల్ప, శిఖండియు వీటి కేఁగు
దెంచి నిజమందిరంబు సొత్తెంచి తల్లి
దండ్రులకు మ్రొక్కి నిలిచి ముదం బెలర్ప. 389

క. తనతెఱఁ గంతయు నెటిఁగిం
చిన, నద్భుతహర్షమగ్నచేతసులై త
జ్జననీజనకులు బహువిధ
వినుతులఁ గొనియాడి; రంత వేకువ యయ్యెన్; 390

వ. తదనంతరంబ సూర్యోదయం బగుటయుఁ గాలోచితకరణీయంబులు నిర్వర్తించి, పాంచాల విభుండు సంబంధితో వలయు మాటలాడం దగు వారలం బనిచి రావించి, సంభ్రమంబు లేక వేగిరపడక నాగరిక ప్రకా

రంబున శిఖండి పురుషత్వంబు దేటపఱిచి, యతనిమాట గీడ్వఱిచి, సపరివారంబుగా నద్దశార్ణపతికి విందువెట్టి కట్ట నిచ్చి యతని యనునయాలాపంబులు గైకొని యనిచి పుచ్చిన, నతండు తన్నుం దాన నిందించుకొనుచు నిజపురంబునకుం బోయె; నట్టియెడ నయ్యశువరుమందిరంబు చక్కటికిం గ్రీడార్థంబు గిన్నెరవిభుండు విమానారూఢుం డయి చని, దానియెప్పు గనుంగొని యగ్గించుచు నిల్చి యొక్కింతసేపునకుం జుట్లనున్న గుహ్యకులతో నిట్లనియె, 391

క. "మన మిచట నిలిచియుండఁగ,
మనమున శంకింప కిట్లు మసలినవాఁ; డీ
తనిగర్వ మేల? యిక్కడఁ
జనుదేరక నిల్చు చెట్లు సైఁపఁగవచ్చున్?" 392

వ. అని పలికి యలుక మొగంబున ముడివడ నున్నంతఁ, గిన్నరు లాగుహ్యకునరసి తద్వృత్తాంతం బంతయు నెఱింగించి, "దేవా! సిగ్గుపెంపున రానేరకున్నవాఁ" డని విన్నవించిన, 393

ఆ. 'అయిన నేమి పిలువుఁ' డని పిలిపించిన
వచ్చి ప్రొక్కుటయును, వనిత యైన
యతనిఁ జూచి, 'యింక నవుదాని కిట్టుల
యుండుఁ గాక' యని విభుండు పలికె. 394

-: స్థూలకర్ణునకుఁ గుబేరునివలన స్త్రీత్వము కలుగుట :-
సం. 5-194-39.

వ. స్థూలకర్ణుండును దలరి దండప్రణామంబు నేసి యుండె, నప్పుడు గొలిచియున్నసురలు ధనదునకుం గృపవుట్ట నల్లన తెలిపిన, 'నట్లేని వీఁడు శిఖండియాయువు గలంతకాలంబును గాంతాకృతియై యుండి, పదంపడి నిజరూపంబు దాల్చుంగాక' యని యనుగ్రహించి యరిగిన, 395

తే. గుహ్యకుండు విషాదంబు గూరియుండ,
నచ్చటికిఁ గొన్నిదినముల కరుగుదెంచెఁ-
దల్లిదండ్రుల కెఱిఁగించి తగవు మెఱయ
సమయనిష్ఠ వాటించి పాంచాలసుతుఁడు 396

క. వచ్చినఁ గనుఁగొని, 'నీదెసఁ
బొచ్చెము లే, 'దిట్ల మగిడి పొ, మ్మిది విధి నీ
కిచ్చిన రూ" పని గుహ్యకుఁ
డచ్చుపడం బలికి యెల్ల నతనికిఁ జెప్పెన్. 397

వ. చెప్పి వీడుకొలిపిన, శిఖండి యత్యంతప్రమోదంబునం దండ్రికడకు వచ్చి యత్తెఱం గెఱింగించిన, నాతండు ప్రీతుం డయి దేవగురుద్విజ పూజనంబు లాచరించి, ద్రోణాచార్యుపాల సవిశేషంబుగా శిష్యభావంబు ప్రతిష్ఠించె." 398

క. అని చెప్పి నారదుఁడుఁ దా
నును సత్యవతీసుతుఁడుఁనుం దమయిచ్చం
జనిరి; శిఖండిచరిత్రము
జన కర్ణపరంపరం బ్రశస్తం బయ్యెన్. 399

వ. ఇవ్విధంబునఁ గాశీపతికన్యక సిద్ధమూర్తి యయి నెగడె, నేను నంగనల, నంగనాపూర్వుల, నంగనాభిధానుల, నంగనాకారులను వధియింపకుండ వ్రతంబు పూనినవాఁడ గావున, నంగనాపూర్వుం డగు శిఖండి నాకు భండనంబునం గోదండపాండిత్యంబు నెఱపి ననుఁ జంపను నొంపను గడంగితిన యేని నింతకంఱె దుర్యశంబు గలదె? యెట్లయిన నగుదుం గాని భగ్నవ్రతుండ నగుట కోర్వనిది నాతెఱంగు." 400

క. అని చెప్పిన దేవవ్రతు
వినుతవచనములు విభుండు విని, తనచిత్తం
బున నొక్కింత వగచి, 'యీ
తనికి మగతనంబుపూన్కి తగు' నని పలికెన్. 401

వ. తదనంతరంబ కొలువునం గలయ సమరవిషయంబు లయిన సల్లాపంబులు సెల్లుచుండఁ గొండొకసేపు వినుచుండి సుయోధనుండు సురనదీసూనున కిట్లనియె. 402

ఆ. "పాండవులకుఁ గలుగుబలము లన్నియు సమ
యింప నీకు దినము లెన్ని వట్టు?
గురుఁడుఁ గృపుఁడు గురునికొడుకుఁ గర్ణుండు నెం
తెంత మానమున వధింతు రనఘ?" 403

వ. అనిన విని గాంగేయుం డతని కి ట్లనియె. 404

క. "అనిఁ బాండవసేనలఁ జం
పను జెఱుపను నేము సాలుభంగుల నీ కి
ట్లనుమానము వాయఁగ నడు
గన తగుఁ; గడు లెస్స; విందు గాక నరేంద్రా! 405

వ. ఏను నాసాలెడుకొలంది సెప్పెదఁ; దక్కటివారుఁ దమతమచాలుటలు
దార చెప్పెద; రది యెల్ల ను బిదప విందు గాని, మున్ను నీ కొక్కఁ డాస
యిచ్చెద నాకర్ణింపుము, 406

క. మీఁటు గల రాజరథికుల
నాఁటికి వేవుర వధింతు; నరుశరములు నో
నాఁటి పడవై చునంతకు
వేఁటాడెదఁ బ్రతిబలంబు వీరులనెల్లన్. 407

వ. అట్లు గాక నాకయ్యంబు సేయు దివసంబులలోన. 408

క. పదివేలఁ జంపఁగా నో
పుదు నే నను నెత్తికోలు వుట్టిన యది; నీ
పదునొకఁడఱోహిణులను
జదురున నడపింతు నెదిరిసైన్యము గలఁతున్." 409

వ. అని పలికి వెండియు. 410

క. "నీ వడిగినపని యేర్పఁడఁ
గా విను, మే నొక్కనెలఁ దెగం జేయుదు నా
నావిధదివ్యాస్త్రంబుల
లావున నప్పాండవులబలంబుల నెల్లన్." 411

వ. అనవుడు గురుకృపాశ్వత్థామకర్ణులం గలయంగనుంగొని గాంధారీనంద
నుండు మీమీచందంబు లె" ట్లనిన, నాచార్యుండు మందస్మితాననుం
డగుచు నిట్లనియె. 412

తే. "ఏను ముదిసినవాఁడ మహీశ! యెట్టు
లయిన నోపినభంగి నీయనుఁగుఁదాత

సాలిననన్నిదినంబులఁ జాలవచ్చు
నబ్బలంబుల నని సమయంగఁ జేయ." 413

క. అనిఁ గృపాచార్యుం "డీ
యినుమడిదివసములఁ దీర్ప నే నోపుదు" నా
విని గురుతనూభవుఁడు "పది
దినములఁ గడతేర్తు" ననియె ధీరవిచారా! 414

వ. అందఱుపలుకు లాకర్ణించి కర్ణుండు. 415

క. "నానాస్త్రశస్త్రచయబడ
బానలముం గవియఁ జేసి, యత్యుగ్రత నే
నేనాళ్ళన యప్పాండవ
సేనాసాగరము నివుర్ఁ జేయుదు నధిపా!" 416

వ. అని ప్రతిన సేసినఁ, గలకల నవ్వి గాంగేయుండు. 417

చ. "పలికిన నేమి- యన్నియును బల్కనగున్ మనరాజు నొద్ద? మా
ర్పలికెడువారు లేరు; వినుఁ, పాండవమధ్యముగాండివంబు దీ
ప్తుల మిఱుమిట్లుగొన్న కనుదోయి, గుణధ్వని ప్రయ్యలై న వీ
నులు నయినన్, బలే! పలుకు నూల్కొనకుండుదు సూతనందనా!" 418

వ. అనియె, నివ్విధంబున నీకొడుకుకడం బుట్టినవిశేషంబులు ధర్మతన
యుండు చారులవలన విని తమ్ముల రాఁబనిచి వారలతో నిట్లనియె,

సీ. "మనచారు లిప్పుడు సనుదెంచి రావీట
నుండి, దుర్బుద్ధి సుయోధనుండు
గొలువున గాంగేయకుంభసంభవకృపా
శ్వత్థామకర్ణులవలను సూచి,
యనిఁ బాండవులబలమంతయు సమయింపఁ
జాలుదు రెంతేసికాలమాన
మున నన్న, భీష్ముండు దన కొక్కనెల వట్టు
నని యాడె, ద్రోణుండు నట్ల పలికెఁ,

ఆ. గృపుఁడు రెట్టి సెప్పెఁ, గృపికొడు కోపుదుఁ
బదిదినముల ననియె; బాహువీర్య
ఘనుఁడు గాన సూతతనయుఁ డేనాళ్లన
తీర్ప నేర్తు నని ప్రతిజ్ఞ నేసె." 420

వ. అని చెప్పి యర్జునుం గనుంగొని 'వారు దమతమ యోపినచందంబులు సెప్పిరి, నీచేతం గౌరవబలంబు లెంతదడవునకుం దెగు నాకుం జెప్పు' మనిన, నతం డిట్లనియె. 421

తే. "వార లంతకుఁ జాలనివారె? నీబ
లముల సమయింపఁజాలెడులావు వెరవుఁ
గలర కాక; యారాజుతోఁ బలికి బాస
దప్ప వచ్చునె వారికి ధరణినాథ!" 422

వ. అని దరహాసోల్లాసభాసితవదనుండై. 423

మ. "అనుమానం బది యేల నీమది మదీయస్ఫారబాహాబలం
బు నిరూపింపఁ దలంచితేని విను, మేపుం జేవయుం జూపి, కృ
ష్ణునితోడ్పాటునఁ బేర్చి, యేఁ గడఁగినం జూర్ణంబు గావింతు నొ
క్కొ నిమేషంబున దేవదానవులతోఁ గూడం ద్రిలోకంబునున్." 424

వ. అది యెట్లంచేనిఁ, గృత్రిమకిరాతుం డైనపశుపతి మెచ్చి జగత్సంహార సమయంబునం దాను ప్రయోగించునట్టి పాశుపతమహాస్త్రంబు నాకిచ్చె; నది నాయందు సన్నిహితంబయి యున్నది గావున శత్రునిరాసం బనాయాసంబై యుండు; నప్పాశుపతమహనీయప్రభావంబు భీష్ముండున్నరూ పెఱుంగఁడు, ద్రోణకృపాశ్వత్థామలు నెఱుంగరు, కర్ణునకెఱుంగనెంతద? వ్యష్టిఘోరసాధనంబున సమస్తంబును సమయించుటయుక్తంబు గాదు, తక్కినయాయుధంబులం బోరి వైరులం బరిమార్చినం బౌరుషంబు దీపించు నని తలంచెద; నప్పటికి వలయువిధం బయ్యెడు నది యట్లుండె; నీవారక్కడివారికిం దక్కువవారె? భీమసేనుండు గవ లభిమన్యుండు ద్రౌపదేయులు సాత్యకివిరాటద్రుపదులు ధృష్టద్యుమ్నుండు శిఖండి యుత్తమౌజుండు యుధామన్యుండు ఘటోత్కచుండు మొదలైన జగజెట్లున్నవారు; మఱియు ననేకులు వీరలయట్టివారలు కలరు; వారల నందఱం జెప్పనేల యేనుంగువోలె నీలావు నెఱుంగవు; దివిజులకు నజేయుండవు; నీయొక్కనికిఁ ద్రిభువనంబు నెదురె? నీవు నిక్కం బలుగవు గాక నీవలిగిన నెవ్వ రెట్లయ్యెదరో యటు సూడుము;

నీసైన్యంబుల నెవ్వరికి నేమి సేయవచ్చు? మనకు విజయానందంబు సులభంబ" యని పలికె నని, సంజయుండు ధృతరాష్ట్రున కెఱింగించె నని వైశంపాయనుండు జనమేజయునకుం జెప్పుటయు. 425

చ. కమలభవాది దైవతముఖస్ఫుటనిర్గళితప్రశస్తవా
గమృతరసప్రసారకలితాంచితసేకవిధిప్రకర్షసం
గమసముదీరితోల్లసనకందళితప్రహసద్దయాలతా
సుమవాదుపాశ్రయప్రమదశోభితవిశ్వజగన్మధుప్రతా! 426

క. సమయ బహుత్వారణ్య
భ్రమణ పరిశ్రామ్య దంతరంగ నితాంతో
త్తమ సరళమార్గదర్శన
సమర్థపుణ్యాభిధాన సకృదుచ్చరణా! 427

మాలిని. అవగమిత రహస్యాష్టాంగ సమ్యక్ప్రకారో
త్సవ గురుకరుణావిస్తార గాఢప్రశాంతి
ప్రవణ హృదయ పద్మోద్భాసి విజ్ఞానసారా
వ్యవహిత పరమానందానుభూత్యేకరూపా! 428

గద్యము:

ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర
బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి
ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున
నుద్యోగపర్వంబునందు సర్వంబును
జతుర్థాశ్వాసము.

శ్రీ మ దా ం ధ్ర మ హా భా ర త ము
ద్యో గ ప ర్వ ము స మా ప్త ము.
ఆదిపంచకము సంపూర్ణము.

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

١٢٤٤

AQUA102B154

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనావల్లిక

పుస్తకం సంఖ్య	AOUA102B154
పుస్తకం పేరు	శ్రీమత్ ఆంధ్రమహాభారతము ఉద్యోగపర్వము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	321
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	1-5, 24
లేని పేజీలు	
తయారు చేసినది	M. Raji
పేజీలు విడదీసినది	M. Raji
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good